
ఆంధ్ర సచిత్ర వారపత్రిక
6-12, డిసెంబర్, '85
రు. 2-50
బాక్టీరియా వల్ల సంక్రమించే వ్యాధులు
భర్తల్ని తన్నే భార్యలున్నారు జాగ్రత్త!!

అన్నిచోట్లా కనిపిస్తున్న మానవహక్కుల ఉల్లంఘన!

"గత కొద్ది సంవత్సరాలుగా నిర్బంధంలో ఉన్న అణుశక్తి సంఘం మాజీ అధ్యక్షుడు హోమీ సేత్నా కొంత కాలంగా అస్వస్థురాలిగా ఉన్న తమ సతీమణిని శస్త్రచికిత్స నిమిత్తం, విదేశాలకి వెళ్ళడానికి అనుమతించవలసిందిగా కోరుతూ నిరాహారదీక్ష ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన వ్యతిరేకత కారణంగా ఆమెకి అనుమతి ఇవ్వడానికి కేంద్రం నిరాకరించింది. అంతే కాకుండా ఆమెకి కచ్ బాడవలో అయిదు సంవత్సరాల ప్రవాసం విధించబడింది..."

ఇలాంటి వార్త మీకు పత్రికలలో కనిపిస్తే మీరు ఒక్కసారి కళ్ళు నులుముకుని మళ్ళీ చూస్తారు. ఎందుకంటే ఒక ప్రభుత్వం, అందులోనూ నాగరిక ప్రభుత్వం, ఇలా ప్రవర్తించడం అన్నది మీ ఊహకి రాని విషయం కాబట్టి. కొద్దిలో చెప్పాలంటే సోవియట్‌లు తమ శాస్త్రవేత్తలు, రచయితలు, ఆ మాటకి వస్తే తమ ఆగ్రహానికి గురి అయిన ఎవరి విషయంలో అయినా ఇలాగే ప్రవర్తిస్తారు. అమ్నెస్టీ ఇంటర్ నేషనల్ వారి 1984 వ సంవత్సరం నివేదికని బట్టి "మే నెలలో సఖరోవ్ జైలులో నిరాహారదీక్ష చేసారు. ఆయన తమ సతీమణి ఎలెనా బోన్నర్ వైద్య చికిత్స నిమిత్తం ఆమె విదేశాలకి వెళ్ళడానికి అనుమతిని కోరుతూ ఆయన ఆ నిరాహారదీక్ష ప్రారంభించారు. కానీ అనుమతి నిరాకరించబడింది. సఖరోవ్‌ని ఆసుపత్రిలో చేర్చి ఆయన చేత బలవంతంగా ఆహారం తినిపించి తిరిగి ప్రవాసానికి పంపి వేసారు..."

అయినప్పటికీ నాకు తెలిసినంత వరకూ నస్సావ్‌కి రాజీవ్‌గాంధీ వెంట వెళ్ళిన ఆయన భజనపరులు కానీ, మరొకరు కానీ ఈ విషయాన్ని ఆయన తమ క్రెమ్లిన్ మిత్రులతో ప్రస్తావనకి తీసుకు వచ్చేలా చెయ్యలేకపోయారు. మానవ హక్కుల విషయంలో సోవియట్ రష్యా కన్నా భయంకరమైన చరిత్ర గల దేశాలు చాలా కొద్దిగా ఉంటాయి. శక్తివంతమైన ఈ దేశం నలుమూలల నించి నిరసనలు వ్యక్తమైనా ఒక చిన్నదేశాన్ని ఆక్రమించుకుని కొన్ని సంవత్సరాలుగా అక్కడే తిష్ట వేసింది. ఈ విషయం రాజీవ్‌గాంధీని అడిగితే అది వారి అంతరంగిక సమస్య అనీ అక్కడ ముజాహిదీన్‌ల జోక్యం ఉన్నంత వరకూ ఏమీ చెయ్యడానికి వీలులేదని నసుగుతారు. కానీ ముజాహిదీన్‌లే అసలు సిసలైన ఆఫ్ఘన్ పౌరులు. అసలు జోక్యం చేసుకుంటున్నది అవతలి వైపు వాళ్ళే, అంటే గోర్బచేవ్ అండ్‌కో అన్నమాట. పశ్చిమ దేశాలతో ఎలాంటి గొడవ వచ్చినా వారి దగ్గరికే పరుగులు తీస్తారు మన ప్రధానమంత్రి.

తాజాగా వచ్చిన అమ్నెస్టీ ఇంటర్ నేషనల్ నివేదికని నేను చూడలేదు. కానీ దాని మీద శ్రీ కె. ఎస్. వెంకటేశ్వరన్ రాసిన అద్భుతమైన సమీక్ష ఇటీవల బొంబాయి నించి వెలువడే సన్‌డే అబ్జర్వర్‌లో పడింది. ఆ నివేదికలో సోవియట్ రష్యాలోని భయంకరమైన సంఘటనలే కాకుండా మానవహక్కుల కోసం ధర్మయుద్ధం చేస్తున్నామని గొప్పలు చెప్పే దేశాలైన రాబర్ట్ ముగాబే యొక్క జింబాబ్వే, డాక్టర్ బోధా యొక్క దక్షిణ ఆఫ్రికా గురించే కాక రాజీవ్‌గాంధీ భారతదేశానికి కూడా సంబంధించిన విషయాలూ ఉన్నాయి. ఇక్కడ జరుగుతున్న దేమిటో మనందరికీ తెలుసు. కానీ ఒక అంతర్జాతీయ సంస్థ, అదేమీ చెయ్యలేకపోయినా, ఏమి రాసిందన్నది గమనించదగిన అంశం. సోవియట్‌రష్యాలో అసమ్మతి వర్గం వారిని బలవంతంగా మానసిక వైద్య చికిత్సా కేంద్రాలకి పంపిస్తూ ఉండటం అన్నది అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంది. "వాలెంటిన్ సఖరోవ్ ఒక రష్యన్ కవి. 24 సంవత్సరాలకి పైగా ఆయన మానసికంగా కృంగిపోయి చివరికి 1984

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

సెప్టెంబరులో ఛెమ్యాఖోవ్స్కలోని ప్రత్యేక మానసిక వైద్య కేంద్రంలో మరణించారు." తమ కవులని జైళ్లలో నిర్బంధించడం, చిత్రవధ చెయ్యడం, చంపడం వంటి దురాగతాలు చేసే దేశాలపై నాకు చాలా తక్కువ అభిప్రాయం ఉన్నది. అంతర్జాతీయ వేదికలపై గొంతు చించుకుని జాతి విచక్షణ, మానవహక్కుల ఉల్లంఘన వంటి వాటిపై గోర్బచేవ్ వంటి వాళ్ళు ఎన్ని గంభీరోపన్యాసాలు చేసినా నా అభిప్రాయం మారదు.

అయిక్యరాజ్య సమితికి చెందిన మానవహక్కుల సంఘం ఆఫ్ఘనిస్తాన్‌లో పరిస్థితిని పరిశీలించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపాలని నిర్ణయించింది. బబ్రక్ కర్మాల్ కీలుబొమ్మ ప్రభుత్వ ప్రతినిధులు ఆ బృందం తమ దేశంలో ప్రవేశించడానికి నిరాకరించారు. ఈలోగా ఆ ప్రభుత్వానికి నిజంగా వ్యతిరేకులుగా ఉన్నవారిని, వ్యతిరేకులని అది అనుకున్న వారినీ విచక్షణా రహితంగా జైళ్ళలో పెట్టటం, చిత్రవధ చెయ్యటం, మరణశిక్షలు విధించడం జరుగుతున్నది. తమ దేశంలోని ప్రాసిక్యూటర్‌లకి, విచారణ సంఘం సభ్యులకి తిరుగుబాటుదారుల విషయంలో మానవత ప్రదర్శించ వద్దని ఆదేశాలు ఇచ్చే స్థాయికి వెళ్ళారు కర్మాల్. అంటే వారి పట్ల కఠినంగా వ్యవహరించి, వాళ్ళని అంతం చెయ్యమని దాని అర్థం. ఇటువంటి దురాగతాల గురించి మనం ఎప్పుడైనా నిరసన వ్యక్తం చేసామా? బోధా యొక్క దక్షిణ ఆఫ్రికాకీ, కర్మాల్ ఆఫ్ఘనిస్తాన్‌కి తేడా ఏముంది? రాజకీయమైన ఈ రకం విచక్షణ ఎందుకు, కమ్యూనిస్టులు ప్రపంచ వ్యాప్తంగా చేస్తున్న ఈ పని జాతి విచక్షణకంటే ఏవిధంగా తక్కువ దారుణమైనటువంటిది?

లెసోథో ఉదంతాన్ని గుర్తు చేస్తాను. లెసోథోలో కొందరు సాయుధులు ఒక చర్చి వార్తాపత్రిక సంపాదకుడైన ఎడ్గార్ మొటూబాని ఆయనని ఇంట్లోనించి తీసుకు వెళ్ళారు. మొటూబాతో పాటు ఆయనకి తోడుగా వెళ్ళిన మరో ఇద్దరు కూడా కాల్చి చంపబడ్డారు. ప్రిటోరియా అధికారాన్ని వ్యతిరేకించడమే ఆయన చేసిన తప్పు. దాని పై జరిగిన విచారణలో ఆ హత్యకి కారకులు ఎవరో బయటపడలేదు కానీ వాళ్ళు ముగ్గురూ పోలీసులు.

సైనికులు మాత్రమే ఉపయోగించే ఆయుధాల వల్లనే కాల్చి చంపబడ్డారని తేలింది. విచారణ లేకుండా రాజకీయ నిర్బంధం, నిర్బంధంలో మరణించడం, అధికారంలో ఉన్న వారి పాశవిక ప్రవృత్తి ఇప్పుడు వామపక్ష దేశాలలోనే కాక అన్ని చోట్లా కనిపిస్తూ ఉన్నాయి. కానీ వామపక్ష దేశాలలో జరుగుతున్న వాటిని విస్మరించి మిగిలిన చోట్ల జరుగుతున్న వాటినే మనం పట్టించుకుంటున్నాము. ఇంతకంటే కపటం మరొకటి ఉండదు. అంతర్జాతీయ వ్యవహారాలలో దీనిని నెహ్రూ ప్రవేశపెట్టారు. ఫలితంగా మనపై నమ్మకం తగ్గిపోయింది. తమ తండ్రి ద్వారా శ్రీమతి గాంధీ దానిని సంక్రమింప చేసుకున్నారు. ఇప్పుడు ఆమె కుమారుడు కూడా ఆ దారిలోనే వెళుతున్నారు. దీన్ని ఇలాగే కొనసాగిస్తే మాత్రం చివరికి ఏమీ మిగలదనటంలో సందేహం లేదు.

భారతదేశం ఈ విధంగా ప్రవర్తించడం ఎందుకో నాకు అర్థంకాదు. కొన్ని సంవత్సరాలుగా మనం సాంకేతిక విజ్ఞానాన్ని పాశ్చాత్య దేశాలనించి, నీతులని మాత్రం రష్యన్‌ల నించి అరువు తెచ్చుకుంటున్నాము. అలా రెండు విధాలా మనం నష్టపోతున్నాము. పాశ్చాత్య దేశాలనించి మనం అరువు తెచ్చుకున్న లేదా కొనుక్కున్న సాంకేతిక విజ్ఞానం వాస్తవంగా మనకి కావలసినటువంటిది కానీ, మన పరిస్థితులకి అనువైనది కానీ కాదు. అయినప్పటికీ ఆర్థికంగా, సామాజికంగా దాని కోసం మనం శక్తికి మించి ఖర్చుపెట్టాము. కానీ చైనావారు మాత్రం అలా చెయ్యలేదు. నీతుల విషయంలో కూడా మనం చాలా నష్టపోయాము. మనమీద నమ్మకం లేకపోవడం వల్ల మనం బాగా దెబ్బతినవలసి వచ్చింది. ఎందుకంటే సాంకేతిక విజ్ఞానం విషయంలో మనం పాశ్చాత్య దేశాలపై ఆధారపడి ఉన్నాము. కాబట్టి మనం అంతవరకే వెళ్ళగలం కానీ దానికి మించి పోలేము. ఈ విషయాన్ని శ్రీమతి థాచర్ నస్సావ్‌లో స్పష్టం చేశారు. ఆమె రంగంలోకి రాగానే మనం తప్పుకోవాల్సిన స్థితి ఏర్పడింది. రష్యన్‌లపై మనం రక్షణ, తదితర విషయాలపై ఆధారపడి వున్నాము కాబట్టి మనం వాళ్ళ దగ్గరికే పరిగెత్తాలి. గత నెలలో రాజీవ్‌గాంధి అదే చేశారు. పాశ్చాత్యదేశాలకి, వాటి చేతిలో కీలుబొమ్మలుగా ఉన్న పాకిస్తాన్‌లాంటి దేశాలకి మనం వ్యతిరేకంగా ప్రవర్తించినప్పుడు రష్యా వైపు పరుగులు పెట్టడం తప్ప మనకి మరో మార్గంలేదు. వాల్‌దోర్ఫ్ - ఆస్టోరియాలో ఎన్ని విందులు చేసినా, నస్సావ్‌లో ఎన్ని ముసాయిదాలు రూపొందించినా అలాంటి పరిస్థితి మాత్రం మెచ్చుదగినటువంటిది కాదు. చివరికి జరగవలసినదేదో అదే జరుగుతుంది. □

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు . (1938-1972)

6-12, డిసెంబరు, 1985
శ్రీ క్రోధన నామ సం. కార్తీక. బ. నవమి
సంపుటము 78 : సంచిక 13
సంపాదకుడు .
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-50
పోస్టులో 6 నెలల చందా	రు. 71-50
పోస్టులో 12 నెలల చందా	రు. 143-00

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి : "రమ్యకృష్ణ"

(ఫొటో : కాజాన్)



ఉత్తరాలు

ముఖచిత్రం

నా అభిమాన నటుడు "కమల్‌హాసన్" ముఖచిత్రంతో వెలువడిన ఈ వారం పత్రిక చాలా బాగుంది.

పక్కి మధుసూదనరావు, విజయనగరం

ఆకర్షణీయం

1-7 నవంబరు '85' ప్రముఖ నటుడు "కమలహాసన్" ముఖచిత్రంతో వెలువడిన "ఆంధ్రసచిత్ర వారపత్రిక" నందు "శ్రీమతి ఇందిరా గాంధీ" ఫోటో చాల ఆకర్షణీయముగా ఉన్నది.

వలప్పల శ్రీనివాసరావు, ఇచ్ఛాపురం

పెద్దకథ

"మలుపు" ఆదూరి సావిత్రిగారి పెద్ద కథ చాల బాగుంది. భర్తకు దూరమైన స్త్రీ పడే ఆవేదనను చాలా బాగా చిత్రీకరించారు.

యం.వి.జి. క్రిష్ణ, గూడూరు

కథలు

1-11-85 తేది సంచికలో తెన్నేటి సుధగారి కలం ఖరీదు కథ కొత్త సీసాలో పాత సారా మాదిరి ఉంది ఇందులో మగవాళ్ళు త్యాగధనుల్లైనట్లు, వారి ఉదారబుద్ధిని అర్థం చేసుకోకుండా స్త్రీలు తొందరపడి అఘాయిత్యాలకి పాలుపడ్డా ్టట్లు చిత్రింప బడింది. ఈ మధ్యనే వచ్చిన ఖుర్" సినిమాలో ఇదే విషయం తీసుకొని చిత్రింపబడింది. పరిష్కారం మాత్రం ఈ కథలో మాదిరి కాకుండా సుఖాంతం చేయబడ్డది. అలాంటి పరిష్కారం సూచించే కథలే మార్గదర్శకంగా ఉంటాయి. లేకపోతే మనమే ఇలాంటి అఘాయిత్యాలను ప్రోత్సహించిన వారం అవుతాము.

కె. రామారావ్, హైదరాబాద్

* * *

కమలహాసన్ 'ముఖచిత్రంతో వెలువడిన 1-11-1985 పత్రిక ఎక్సలెంట్‌గా వుంది. ఈ వారం గీతా సుబ్బారావుగారి "సెన్మా నవ్వులు" మళ్ళీ మళ్ళీ చదివింప జేశాయి. "కన్నెకల' కథ టీనేజ్‌లో వున్న అమ్మాయిలకు కనువిప్పు కలిగించేదిగా వుంది.

పంగళి భాగ్యలక్ష్మి, విజయవాడ

సీరియల్స్

దూరి వెంకటరావు గారి కలం నుంచి జాలువారుతున్న "త్రివేణీ సంగమం" సీరియల్ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది.

పి. రాము, ఎ. పద్మ, గుంటూరు

(66 వపేజీ చూడండి)

సీరియల్

కాంచన సౌధం

రావినూతల సువర్ణాకన్నన్

(గత సంచిక తరువాయి)

నాకప్పుడు పదేళ్ళనుకుంటాను. మనం ఇద్దరం ఎన్నో రకాల ఆటలు ఆడుకునే వాళ్ళం

ఓ రోజు మీ ఇంట్లో బొమ్మలాట ఆడుకుంటుండగా మీ అత్త, బావ వచ్చారు.

వాళ్ళని అది వరకు చూసినా, మీ అత్తతో కబుర్లు చెప్పినా ఎందుకో అప్పుడు కలిగినంత ఆనందం అంతకు ముందెప్పుడూ కలగలేదు. నాకింకా బాగా గుర్తు మీ బావ మన దగ్గరికొచ్చి నవ్వుతూ-

"ఏం చేస్తున్నారు?" అన్నాడు.

"బొమ్మలాట ఆడుకుంటున్నాం!" గర్వంగా అన్నావు నువ్వు.

"నన్నూ ఆడనిస్తారా?..." అన్నాడతను.

"ఛీ!... ఇంత పెద్దాడివి!... బొమ్మలాటాడుతావా?..." అన్నావు.

"ఏం?... పెద్దాళ్ళు ఆడకూడదా! ఏం కల్పనా!... పోనీ... నన్ను నీ జట్టులో కలుపుకుంటావా?" అన్నాడతను నాతో.

నేను సంతోషంగా ఒప్పుకున్నాను. అప్పట్నించి, సరదాగా మన ఆటల్లో అతనూ పాల్గొనేవాడు. ఎన్నో కథలు, కబుర్లు చెప్పేవాడు.

చిత్రంగా అతనంటే ఒక రకమైన ఇష్టం ఏర్పడింది. వయసుతో పాటు ఆ ఇష్టం పెరిగి ఆరాధనగా మారింది.

"ఎలాగైనా విశ్వాన్ని పెళ్ళి చేసుకోవాలి! విశ్వం నావాడు!" అనుకునేదాన్ని!... అతని పేరు వస్తేనే నా చెంపలు కందిపోయేవి. అతను కూడా నాతో ఎంతో సరదాగా మాట్లాడేవాడు. అరమరికల్లేకుండా ప్రవర్తించేవాడు.

అతని ప్రమేయం లేకుండానే, నేను పూర్తిగా అతని ఆరాధనలో పడిపోయాను. వీలు చూసుకుని నాన్నతో చెప్పాలనుకున్నాను. అప్పుడే నిన్ను అతనికిచ్చి పెళ్ళి చెయ్యబోతున్నారని విన్నాను...

అంతే! కుప్ప కూలిపోయాను.

జరిగిన కథ-10: మమత తన పుట్టిన రోజునాడు సరదాగా పట్నం వెళ్ళి రావాలని ప్లాను వేస్తుంది. విశ్వం అందుకు ఒప్పుకుంటాడు కానీ హాస్పిటల్‌లో కల్పనతో మాటల్లో పడి ఆ మాట మరిచిపోతాడు. మమతకి బావపై కోపం వస్తుంది. విశ్వం కల్పన ప్రేమించుకున్నారని, పెళ్ళికూడా చేసుకోవాలనుకుంటున్నారని దాసు మమతతో చెబుతాడు. ఆమె అతడి మాటలు నమ్మింది. విశ్వం దగ్గర కల్పన ఫోటో, కల్పన దగ్గర విశ్వం ఫోటో ఉండటంతో మమత వాళ్ళని నిలదీసి అడుగుతుంది. చౌదరి విశ్వాన్ని శత్రువులా చూస్తున్నాడు. విశ్వం రాయుడి గారింట్లో భోజనం చేస్తున్నాడు. ఎలక్షన్‌లలో రాయుడు నెగ్గాడు. చౌదరి ఓడాడు. మమతకు విశ్వం మీద పగ రెట్టింపయ్యింది. మమతకి టైఫాయిడ్ వస్తే పట్నంలో నర్సింగ్‌హోమ్‌లో చేరుస్తాడు చౌదరి. విశ్వం జరిగిన విషయాలన్నీ మనసు విప్పి మాట్లాడాలని మమత దగ్గరకి వెళితే మమత అతనితో మాట్లాడను నిరాకరించింది. కల్పన మంగిని తీసుకుని మమతను చూడటానికి వెళ్ళింది. కల్పనతో మనసు విప్పి మాట్లాడను మమత అంగికరించింది. కల్పన చెప్పసాగింది.

కుళ్ళి కుళ్ళి ఏడ్చాను.

జీవితమే పోయిందని బాధ పడ్డాను.

ఒక రోజు చచ్చిపోవాలని కూడా అనుకున్నాను. కానీ .. ధైర్యం చాల్లేదు! .. అకారణంగా నిన్ను తిట్టుకున్నాను.

తరవాత శాంతంగా ఆలోచించాను.

విశ్వం మీ అత్త కొడుకు!... అదీగాక అతని చదువు సంధ్యలన్నీ మీ నాన్నే చూసుకుంటున్నారు. ఒకే కూతురైన నిన్ను అతని చేతుల్లో పెట్టాలనుకున్నారు. ఇవన్నీ అటుంచి విశ్వానికి నువ్వంటే ప్రేమాభిమానాలున్నాయి!

అందుకే, నా ఆరాధనని నా మనసులోనే దాచుకున్నాను. నా ప్రేమని నాలోనే సమాధి చేసుకున్నాను. నా మనసుని అదుపులో పెట్టుకోవడం కోసం మీ ఇంటికి రావడమే తగ్గించేశాను.

మీ బావ వచ్చినప్పుడు అసలు వచ్చేదాన్ని కాదు. అతను అడిగేవాడు కూడా. ఎక్కడైనా కనిపిస్తే-

"ఏమిటి కల్పనా, అదోలా వున్నావ్? మా ఇంటికి రావడం లేదేం?" అంటూ.

నేను తడబడుతూ ఏదో చెప్పేదాన్ని.

"బొమ్మలాటలు ఆడుకోవడం లేదా?", నా మనసులోని సంఘర్షణ తెలియని విశ్వం నవ్వుతూ అడిగేవాడు.

"పెద్దవాళ్ళం అయిపోయాంగా?" నిర్వికారంగా అనేదాన్ని.

అతనోసారి వచ్చి వెళ్తే నాలో సముద్రాలు పొంగేవి. తుఫాన్ చెలరేగేది. మళ్ళీ ఆ తుఫాన్‌నుంచి బైట పడటానికి దాదాపు పదిహేను రోజులు పట్టేది.

వయసు మరి కాస్త ఎదిగింది.

ఈ లోగా మన కుటుంబాల మధ్య విరోధం వచ్చింది. మనం కూడా దూరం అయ్యాం.

నిజం చెప్పాలంటే ఒకందుకు నేను సంతోషించాను. ఈ రూపేణా అయినా మీ ఇంటికి దూరంగా ఉండాలనీ, తద్వారా విశ్వాన్ని మనసులోంచి తుడిచెయ్యాలనీ... ఆశించాను. అయితే... అది ఎంత కష్టమో త్వరలోనే తెలిసిపోయింది.

అయినా అతి కష్టం మీద అతన్ని మర్చిపోవడానికి ప్రయత్నించి కొంత వరకు కృతకృత్యురాలయ్యాను. మెడిసెన్‌లో చేరాను.

మరి కొన్నాళ్ళకి మీ బావకి చదువైపోయింది. ప్రాక్టీసు మన ఊళ్ళోనే పెడతాడని విన్న నా గుండె వేగంగా కొట్టుకుంది. చచ్చినా అతని కంట పడకూడదని మరోసారి నిర్ణయించుకున్నాను. కానీ అనుకోకుండా ఓ రోజు మీ బావ కనిపించాడు.

అంతే అదుపులో ఉన్న మనసు కళ్ళెం తెంచుకుంది. మనసంతా అల్లకల్లోలం అయిపోయింది.

ఆ వెంటనే సంఘర్షణ ప్రారంభమయింది.

అతడితోనే జీవితం! అనిపించింది.

అలా అని నీకు ద్రోహం చేసే బుద్ధి నాకేనాడూ లేదు. కేవలం అతని సాన్నిధ్యంలోనే జీవితం వెళ్ళబుచ్చాలని నిర్ణయించుకున్నాను. అందుకే చదువైన వెంటనే పని నేర్చుకోవాలనే వంకతో అతని దగ్గర చేరాను. ఒక రకంగా తృప్తి పడ్డాను.

అతన్ని చూడగానే నాహృదయం పురి విప్పిన నెమలిలా అయిపోయేది! ఆనందం అంచులు దాటేది.

ఇదేమి తెలియని విశ్వం నాతో మామూలుగా చనువుగానే ఉండేవాడు

ఓ రోజు అతను మీ ఆల్బం తెచ్చాడు. అది చూస్తూనే అతని ఫోటో ఒకటి అతనికి తెలియకుండా తీసి దాచుకున్నాను. ఆ తరవాత దాన్ని లాకెట్‌లో పెట్టుకుని ఒంటరిగా ఉన్నప్పుడు చూసుకుని మురిసిపోయేదాన్ని.

నాకు ఎంతో శాంతిగా ఉండేది. "ఈ జీవితానికిది చాలు!" అనుకునేదాన్ని.

అలాంటి సమయంలో ఓ. రోజు ఆయా మా ఇంటికొచ్చింది. తను ఆ ఫోటో చూసిందని నా అనుమానం!. . ఆమె దాసుకు చెప్పి ఉండాలి...! ఇది అసలు కథ!

*   *   *   *   *

కల్పన చెప్పిన కథ విని నిర్ఘాంతపోయింది మమత. కళ్ళల్లో నీళ్ళూరాయి.

"మమతా!... నీకా ఫోటో సంగతి దాసేనా చెప్పింది!" సూటిగా చూస్తూ అంది కల్పన.

"అవును!" అన్నట్టు తల వూపింది మమత.

"కానీ మమతా! ప్రమాణం చేసి చెప్తున్నాను... ఆ నా ఫోటో సంగతి నాకు తెలియదు!... మీ బావకంతకన్నా తెలియదు!..

ఇదంతా చూస్తుంటే ఇది కూడా ఆ దాసుగాడి పనే అనిపిస్తోంది." కల్పన గొంతు దుఃఖంతో గరగరలాడింది.

మమత ప్రతిమలా చూస్తూండిపోయింది.

"నన్ను నమ్ము మమతా! నేను విశ్వాన్ని ప్రేమించిన మాట నిజమే!... కానీ... అతను మాత్రం నన్ను ప్రేమించనే లేదు!... ఆ అదృష్టవంతురాలివి నువ్వే మమతా!" ఆమె కళ్ళ నించి నీటి చుక్కలు టప టపమంటూ రాలాయి.

"కల్పనా!... నేను... నేనెంత దుర్మార్గురాల్ని!" అర చేతుల్లో ముఖం దాచుకుని భోరుమంది మమత

"ఛ! ఛ! ఇదేవిఁటి చిన్న పిల్లలా!. ముందు కళ్ళు తుడుచుకో! జరిగిందేదో జరిగిపోయింది!" చనువుగా పైటతో ఆమె కళ్ళు వత్తింది కల్పన

"లేదు! కల్పనా!. . బావ నన్ను క్షమించడు! నన్ను చూడాలని కొండంత ప్రేమతో వస్తే... మూర్ఖంగా అవమానించి పంపేశాను!..." వెక్కి వెక్కి ఏడ్చింది మమత.

"బావుంది!..!. ఏవిఁటి ఏడుపు! భలేదానివే! డాక్టరొస్తే నన్ను తిడతాడు! అయినా విశ్వం సంగతి నాకు బాగా తెలుసు! నీ మీద అతనికేనాడూ కోపం రాదు!" అనునయంగా అంది కల్పన.

"కల్పనా!" గభాల్న లేచి కళ్ళు తుడుచుకుంది మమత.

"ఏవిఁటి?"

"నేను పల్లెకొచ్చేస్తాను! . నన్ను తీసికెళ్ళవూ?" గబగబా అంది మమత.

"ఇప్పుడా?" నవ్వింది కల్పన.

"అవును...! ఇప్పుడెళ్తేనే బావ నన్ను క్షమిస్తాడు!". . బ్రతిమాలుతున్నట్టు అంది

"ఇప్పుడు నూట నాలుగు జ్వరం వుంది! కాస్త తగ్గనీ తీసికెళ్తాను!" అంది కల్పన.



కాంచనసౌధం

* * * * *

మమతకి జ్వరం తగ్గు ముఖం పట్టింది. ఇలాంటి పరిస్థితిలో పల్లెకి వెళ్ళడం అంత మంచిది కాదని కల్పన కూడా అనడం మూలంగా అక్కడే వుండిపోయింది. కల్పన చేత, తండ్రి చేత కబురంపింది విశ్వానికి. అయినా అతను రాలేదు!

"బావకి నామీద చాలా కోపం వచ్చింది. నన్నింక జన్మలో క్షమించడు!" అంటూ కుళ్ళి కుళ్ళి ఏడ్చింది మమత.

"ఛ!... అదేం కాదు. విశ్వం రాకపోవడానికేదో కారణం వుంటుంది." అంది కల్పన ఏదో ఆలోచిస్తూ. ఈ మధ్య అతని ప్రవర్తన కూడా చిత్రంగా ఉన్నట్టు గమనించిందామె.

మామూలుగా తను వెళ్తే-

"దయచేసి ఓ పదిహేను రోజులపాటు మీరు రావద్దు!" నిర్మొహమాటంగా అన్నాడు. నర్సుని, కాంపౌండర్‌నీ కూడా పెంద్రాళే పంపేస్తున్నాడు. సీరియస్ కేసులు తీసుకోవడం లేదు. పట్నం పంపేస్తున్నాడు. ఎంతసేపూ హాస్పటల్లోనే గడిపేస్తున్నాడు. కారణం అడగబోతే కసిరి కొట్టాడు.

కల్పన అలా అయోమయావస్థలో వుండగానే మంగి వచ్చింది.

"మంగి! డాక్టర్‌గారెలా వున్నారు?" అంది మమత ఆతృతగా.

"ఏమిటో నమ్మా... ఆరి పద్ధతి సిత్రంగా వుంది!..." అంటూ అది కొన్ని వివరాలు చెప్పింది. మమత భయంగా చూసింది.

"నేనో సంగతి సెప్తాను... మనసులోనే ఎట్టుకోండి.." రహస్యంగా అంది మంగి.

"ఏవిఁటి?" ఆదుర్దాగా అడిగారిద్దరూ. మంగి అటు, ఇటు చూసి మొదలు పెట్టింది.

* * * * *

రాత్రి పది దాటింది.

ఊరంతా మంచి నిద్రలో ఉంది.

హటాత్తుగా పోలిగాడు కడుపులో నెప్పితో గిలగిల్లాడిపోయాడు.

సమయానికి వీరడు ఇంట్లో లేడు. తప్పనిసరిగా, ఏదో ఓ మాత్ర తెద్దామని.. హాస్పటల్‌కి బయల్దేరింది మంగి.

లోపల అడుగు పెడ్తూనే అక్కడి దృశ్యం చూసి నిర్ఘాంతపోయింది. చిరు వెలుతురులో విశ్వం వరండా కడుగుతున్నాడు. చేతిలో చీపురు, పక్కనే బక్కెట్లో నీళ్ళు వున్నాయి. అక్కడంతా ఒకటే నీచు వాసనేస్తోంది.

"ఇదేటి బాబూ?" తేరుకున్న మంగి అతని చేతిలోని చీపురు తీసుకుంటూ అంది.

ఆమెని చూసిన విశ్వం తాచును చూసినంతగా త్రుళ్ళి పడ్డాడు.

"ఏటి బాబూ!. మీరు కడుగుతున్నారేటి?" అంది ఆశ్చర్యంగా చూస్తూ.

విశ్వం మొహం పాలిపోయింది.

"ఏం లేదు. . వాంతి చేసుకున్నాను అందుకే...." అన్నాడు తడబడుతూ.

"అయ్యో! ఏవైంది బాబూ?" ఆదుర్దాగా అంది మంగి.

"ఏం లేదు... ఏదో నూనె వస్తువు తిన్నాను. అందుకే... కాస్త... కడుపులో తిప్పింది... ఆఁ!... ఏవిఁటిలా వచ్చావ్?" అన్నాడు విశ్వం.

మంగి చెప్పింది.

విశ్వం వెంటనే రెండు టాబ్లెట్స్ ఇచ్చి- 'ఇవి వెంటనే వెయ్యి!" అన్నాడు.

ఎందుకో అతను కంగారు పడుతున్నాడని గ్రహించింది మంగి. కారణం బోధపడలేదు.

"నేను కడుగుతానుండండి!" అంటూ నడుం బిగించబోయిన మంగినాపేశాడతను.

"కడిగేశాను!" అంటూ.

గది కూడా కడిగుండటం గమనించిందామె. వాంతైతే... రెండు గదులు కడగటం ఎందుకు?... ఒక వేళ గదిలోనూ వరండాలోనూ కూడా అయిందా? ఏమో! అంతా అయోమయంగా ఉంది!...

"మావయ్యగారికి సెప్తా బాబూ!" అంది మంగి వెళ్ళబోతూ.

"ఒద్దొద్దు!" కంగారుగా అన్నాడతను.

వింతగా చూసింది మంగి.

"మంగీ!" రెండు నిమిషాల తర్వాత మెల్లగా అన్నాడు విశ్వం.

"ఏటి బాబూ?"

"నాకో సాయం చేసి పెడతావా?"

"సాయవాఁ? నేనా?..."

"అవును మంగీ!... నువ్వే!... నువ్వు మాత్రమే ఈ సాయం చెయ్యగలవు!" అర్థింపుగా అన్నాడు.


"సెప్పండి బాబూ! మీకు సాయఁపడగల జన్మా నాది? సెప్పండి! ఏం సెయ్యమంటారు? నా శర్మంతో సెప్పులు కట్టించిచ్చినా తమ రునం తీరదు!" మనస్పూర్తిగా అంది మంగి.

"అంత మాటలెందుగ్గానీ... కొన్నాళ్ళపాటు అంటే సుమారు ఓ వారం రోజులపాటు నాకు నువ్వు అన్నం, కాఫీ పంపాలి!"

"అన్నవాఁ! నేనా!..." బిత్తరపోయింది మంగి.

"అవును మంగీ!... ప్లీజ్! ఈ సాయం చెయ్యి! వంటక్కావల్సిన డబ్బు నేనిస్తాను!" అన్నాడతను.

"అయ్యో!. . దానిక్కాదు బాబూ!.. ఇప్పుడు మేం తినేది మీ తిండే బాబూ!.. కానీ.. నేనొండిన అన్నం... తవఁరు తింటే. "



"ఏవీ అవదు!... ఆకలి తీరుతుంది!" గంభీరంగా అన్నాడు విశ్వం.

"బాబూ!" మెల్లగా అంది మంగి.

"ఏమిటి?" అన్నట్టు చూశాడతను.

"డాక్టరమ్మగారికి, తమకీ ఏదైనా తగూ వొచ్చిందా?" అనునయంగా అంది.

"ఉఁహూఁ"

"కేరియర్ పంపడానికి ఒప్పుకోరదన్నారా?"

"ఉఁహూఁ!... వాళ్ళూ పంపుతారు!... నువ్వూ పంపాలి.!"

"బాబూ!" మరీ బిత్తరపోయింది మంగి.

"ప్లీజ్! మంగి!... నాకీ సాయం చెయ్యి! నీ మేలు ఈ జన్మలో మర్చిపోను!"

"అలాగే బాబూ!"

"కానీ... ఓ మాట!..."

"సెప్పండి!"

"నాకు కేరియర్ పంపుతున్నట్టు ఎవరికీ తెలియనియ్యకూడదు!... కనీసం నీ భర్తక్కూడా!"

ఈసారి మంగి కాస్త ఆలోచనలో పడింది.

"ఆడికి తెలపకుండా ఎలా బాబూ!... మీకు తెల్సుగందా.... ఆడసలే అనుమానపుగొడ్డు!"

"ఫరవాలేదు మంగి!... తరవాత వాడికి నేను సర్ది చెప్తాను!"

"కానీ... ఇదంతా..."

"ప్లీజ్, మంగి! సమయం వచ్చినప్పుడు నేనంతా చెప్తాను! అంత వరకు నన్నేం అడగద్దు!" అన్నాడు విశ్వం వేడికోలుగా.

"అలాగే బాబూ!" వెను తిరిగింది మంగి.

"జాగ్రత్త! ఇక్కడ చూసింది, కేరియర్ సంగతి పూర్తిగా మర్చిపో!..." మరోసారి హెచ్చరించాడతను.

"అలాగే బాబూ!" అంటూ వెళ్ళిపోయింది మంగి.

*   *   *   *   *

మంగి చెప్పిందంతా విని నిర్ఘాంతపోయారు కల్పన, మమత.

"మరి నువ్వు భోజనం పట్టుకెళ్తున్నావా?" అంది కల్పన.

"ఆ!.."

"మేమూ పంపుతున్నాం!... రెండు కేరియర్ల అన్నం అతనే ఎలా తింటున్నాడు?... మంగి!... అక్కడ ఇంకెవరైనా వున్నట్టు అనిపించిందా?" ఏదో ఆలోచిస్తూ అంది కల్పన.

"అలాంటి ఛాయలు నాక్కాపడనేదమ్మా!"

"పోన్లే! ఈ సంగతింకెక్కడా అనకు! బాప ఎందుకు చెప్పద్దన్నాడో!" మెల్లగా అంది మమత.

"సెప్పనమ్మా!.. మీరిద్దరూ ఆరిక్కావల్సినవారనీ, ఆరి పెవర్తనకి... అనుమానపడతన్నారనీ... మీకైనా సెప్పింది!" అంది మంగి.

"ఊఁ! సరే!" భారంగా నిట్టూర్చింది కల్పన. మర్నాడే మమతని పల్లెకి తీసికెళ్ళిపోతామనీ, మిగతా ట్రీట్మెంట్ అక్కడే ఇస్తామనీ చెప్పారు డాక్టర్‌కి.

*   *   *   *   *

రాత్రి ఒంటి గంట కావొచ్చింది.

అంతా కటిక చీకటి! కీచురాళ్ళ ధ్వని తప్ప ఇతర శబ్దాలేం లేవు.

రచ్చబండ దగ్గర మర్రి చెట్టు మీద రకరకాల పక్షులు మధ్య మధ్య చిత్రంగా అరుస్తున్నాయి.

అప్పుడే అయా రమ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. ఆమె ఇల్లు, దాసు ఇల్లు పక్క పక్కనే ఉన్నాయి. వారి మధ్య వున్న సంబంధం గురించి కూడా ఊరంతా తెలుసు.

ఆయా విధవ!

దాసు పెళ్ళి కాని వాడు!

అందకే మనకెందుకులే! అన్నట్టు మౌనంగా ఉండిపోయారు.

దాసు తలలు మార్చి సంపాదిస్తే, రమ పక్క పక్క పల్లెటూళ్ళల్లో పురుళ్ళు పోస్తూనో, అబార్షన్ చేస్తూనో పొట్ట పోసుకుంటోంది.

అయితే ఆమెకిగానీ, దాసుగ్గానీ విశ్వం మీదున్న కోపం పోలేదు సరి కదా పగ పెరిగి పోయింది. సమయం కోసం కాసుక్కూర్చున్నారు.

రమ బైటికొచ్చి తలుపుకి తాళం వేసింది. ఓ సారి అటు, ఇటు చూసింది. ఎక్కడా ఎలాంటి శబ్దమూ లేదు. దాసు గుమ్మంకేసి చూసింది. అక్కడా నిశ్శబ్దమే! తేలిగ్గా నిట్టూర్చి, ఆపై గబగబ అడుగులు వెయ్యసాగింది.

సాధారణంగా అర్ధ రాత్రి ఏ కాన్పు కేసో వస్తే దాసుని తోడు తీసికెళ్తుంది రమ. కానీ.. ఇప్పుడామె ఒంటరిగానే బయల్దేరింది.

ఎక్కడో ఓ ఊర కుక్క భయంకరంగా అరిచింది. ఉలిక్కిపడిన రమ కొంగు తల నిండా కప్పుకుని హాస్పటల్‌కేసి నడిచింది.

మెల్లగా గేటు తీసింది.

ఆ చిన్న శబ్దానికే ఉలిక్కిపడిన విశ్వం-

"ఎవరు?" అన్నాడు.

రమ మాట్లాడలేదు. వరండాలోకొచ్చింది.

"ఎవరది?" లైట్ వేసి బైటికొచ్చాడు విశ్వం.

ఎదురుగా తెల్లని బట్టలతో రమ!

ఆమెని చూసి ముఖం చిట్లించాడు.

"నమస్తే!... బావున్నారా?" తల మీది చెంగు తీస్తూ అంది రమ.

"ఏమిటి విషయం?" కఠినంగా అన్నాడు విశ్వం,

"ఏం లేదు!... చాలా రోజులైంది మిమ్మల్ని చూసి... అందుకే ఓసారి చూసిపోదామని వచ్చాను!" నవ్వింది రమ.

పరువాల దరువులు

లజ్జ నయగారంపు లలి తళుకులే
ఎగిసి పడు చిందులో ఎదయాడగా
విరహార్త నెరజాణ వేసారుటల్
పొరదాలులో పొంగి పొస గొన్నవి
వలకాని పిలుపుకై
చెలిచూపులే
ఎదురు చూచిన తీరు ఎద మెదలగా
కనిపించు మనట్లు రసి కదిలింది భద్ర

కొస జారుతో వలపు వాకవ్వగా
రసగీతమై కదిలి జాలవ్వగా
అడవిసాగిన భద్ర నడకలో విరుపు
పడతికులుకుల పట్టు పసలన్ని చూపు
బరువు ఊహల మేను
బాగిలించిన బటువు
అదటుతో అలలలో కనిపించగా
పొదరింటి వైపుగా కదిలిందిగా...

ఎంత మోహపు తీరు అలకట్టినో
ఎంత తొందరతనము ఎదపుట్టినో
తన వలపు చెలికాని గుదిగుచ్చగా
తన మేను మేనులో అరవిచ్చగా
నిలువెల్ల పులకించి
నిట్టూర్పు నిగడించి
పాలపాన పొరతేలి పనవాలగా
పరువంపు దరువులే మొర వైచెను...

—సౌంధ్యశ్రీ

కాంచనసౌధం

"చూసిపోవడానికిదా సమయం?" చిరాగ్గా అన్నాడతను

"నాకు ఇప్పుడేవీలయింది!"

"చాలా సంతోషం. చూశావ్‌గా, ఇంక వెళ్ళు!" తలుపు వెయ్యబోతూ అన్నాడు విశ్వం.

"ఎందుకంత కంగారు పడిపోతారు? మిమ్మల్ని నేనేం కొరుక్కు తిన్ను!" అదోలా నవ్వింది రమ.

"ఛ!... నిన్ను చూసి నాక్కంగారేవిటి?... నీతో మాట్లాడ్డం ఇష్టం లేదంతే!"

"కానీ తప్పదు!" గంభీరంగా అంది రమ.

"ఏవిటి తప్పదు?"

"నాతో కొంతసేపు మాట్లాడటం!"

"సారీ!..."

"డాక్టర్! టైమ్ వేస్ట్ చెయ్యకండి! మీతో కాస్త పర్సనల్‌గా మాట్లాడాలి!. అందుకే ఈ సమయంలో వచ్చాను!" తాపీగా అంది.

"నాతో నీకు పర్సనల్ విషయాలేం వున్నాయి మాట్లాడ్డానికి!... అయినా ఇప్పుడు నేనేం వినదల్చుకోలేదు! వెళ్ళు!" నిక్కచ్చిగా అన్నాడు విశ్వం.

"సారీ! మీరు వింటేనేగాని వెళ్ళను?" అంటూ అతన్ని తోసుకుని హాల్లోకి నడిచింది రమ.

ఆమె చొరవకి నిర్ఘాంతపోయాడు విశ్వం. అతనికేం చెయ్యాలో తోచలేదు

"తనతో మాట్లాడేంతటి రహస్యాలేం వుంటాయామెకి? . వుద్యోగం కావాలని గొడవ పెడుతుందా! అలా అయితే ఇంత దర్పంగా అడుగుతుందా? మరింకేమై వుంటుంది!"

ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరైపోయాడు.

"జాగ్రత్తగా వింటే... అయిదు నిముషాల్లో చెప్పేసి వెళ్ళిపోతాను!" మళ్ళీ అందామె.

"చెప్పు!" అన్నాడు విశ్వం విధి లేక. ఆ సమయంలో ఎవరైనా చూస్తే ఎంత అసహ్యంగా అనుకుంటారో అని కంగారుగా ఉందతనికి.

"కూర్చోండి!" తను ఓ కుర్చీలో కూర్చుంటూ అంది రమ. కోపంగా చూస్తూ కూర్చున్నాడతను.

రెండు నిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి.

"త్వరగా చెప్పు!" సహనాన్ని కొని తెచ్చుకుంటూ అన్నాడు విశ్వం.

"మీరు నా తినే తినే కూట్లో నీళ్ళు పోశారు!" ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండానే అంది రమ.

"నేను పోశానా?.. లేదు! మీకు మీరే పోసుకున్నారు."

"మా వ్యక్తిగత విషయాలు మీ కనవసరం!... మీ దగ్గర పని బాగా చేస్తున్నామా లేదా అన్నదే మీకు ముఖ్యం! కాదంటారా!" గంభీరంగా అంది.

"కావచ్చు!... బైట మీరెలా చచ్చినా... నాకనవసరం!.. కానీ.. పది మందికి ప్రాణ దానం చేసే .. దేవాలయంలాంటి ఈ చోట!... ఒళ్ళు పై తెలియకుండా... ఛ!" అసహ్యంగా చూస్తూ అన్నాడు విశ్వం.

"దేవాలయంలాంటి! ... అంతేగా? నిజంగా దేవాలయం లేదుగా... అయినా దేవాలయాలకే దిక్కు లేదు!.. ఇంక హాస్పటల్‌కొచ్చిందా" పెద్దగా నవ్వింది రమ.

"ఇంతకీ నువ్వనేదేవిటి?"

"దాసూ, నేనూ పెళ్ళి చేసుకోవాలనుకున్నాం!"

"బావుంది!"

"అతనికప్పుడు ఓ ఇల్లంటూ లేదు."

"అయితే?" చిరాగ్గా అన్నాడు విశ్వం.

"అతను మీ హాస్పటల్లోనే ఉండేవాడు!"

"ఊఁ!"

"అందుకే.. మేం అలా ప్రవర్తించాం "

"ఏవిటి నీ వాదంతా?..." విసుక్కున్నాడు విశ్వం.

"వాద కాదు డాక్టర్! చాలా ముఖ్యమైన విషయం!... చెప్పానుగా మేం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం.!"

"అయితే ఇన్నాళ్ళూ ఎందుకూరుకున్నారు?" వ్యగ్యంగా అన్నాడు విశ్వం.

"దేనికైనా సమయం రావాలిగా డాక్టర్!" వంకరగా నవ్విందామె

"ఊఁ! సరే! చెప్పేదేదో తొందరగా చెప్పెయ్యి!.. మనం ఇలా మాట్లాడుకోవడం ఎవరైనా చూస్తే బావుండదు!"

"పేషెంట్‌గా వచ్చానని చెప్పండి!"


"అలాగే!... దాసు చెప్పాడుగా! నేనూ చెప్పినా బ్రతుకు బజారుపాలు చేసుకుంటాను. ఇంతకీ విషయం ఏమిటో చెప్తావా నన్ను పొమ్మంటావా?" తొందర పెట్టాడు విశ్వం.


"చెప్తాను!" గొంతు సవరించుకుంది రమ.


ఆతృతగా ఆమె కళ్ళల్లోకి చూస్తున్నాడతను.

అతని మొహంలోని చిరుకు చూసి మనసులోనే నవ్వుకుంది రమ.

(ఇంకా ఉంది)







బినాకా ఫ్లోరైడ్
ఇచ్చింది ఈ ఫ్లోరైడ్ రక్షణ



జీవితాంతం నిలిచి
వుండాలంటే మీ పళ్ళు
పిప్పి పళ్ళు కాకుండా ఉండేలా రక్షించుకో
వాలి. మరి బినాకా ఫ్లోరైడ్ యిస్తుంది కీలకమైన
ఆ రక్షణని— ఫ్లోరైడ్‌తో. ఎందుకంటే, హానిచేసే అమ్లాలు
పళ్ళ పైపొరను ఎదుర్కొన్నప్పుడు, పళ్ళలోకి ఫ్లోరైడ్ పీల్చుకోబడి.
తద్వారా పళ్ళ ఎనామెల్‌ని పిప్పి పళ్ళు కాకుండా నిరోధించేలా చేస్తుంది.
ప్రథమ దశల్లోనే పళ్ళు పిప్పిపళ్ళు కాకుండా చేసేది యిదే మరి.
పళ్ళను పిప్పిపళ్ళు కానివ్వకండి, బినాకా ఫ్లోరైడ్‌తో వాటిని అరికట్టండి.

జవజీవాలొలికే పళ్ళిక మీవి

బినాకా ఫ్లోరైడ్
టూత్‌పేస్ట్

అగ్రశ్రేణికి చెందిన భారతదేశపు ప్రభావంగల మొట్టమొదటి ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్

ULKA-HCG-BF-12-85-TEL

బ్యాక్టీరియా వల్ల సంక్రమించే వ్యాధులు

బ్యాక్టీరియాలలో ఉపకారం చేసేవి, అపకారం చేసేవి రెండూ ఉన్నాయి. పాలలో మజ్జిగ వేస్తే పెరుగు కావడానికి బ్యాక్టీరియాలే కారణం! సేంద్రియ పదార్థాలని కుళ్లింప జేసి భూమిని సారవంతం చేసే ప్రక్రియలోనూ తోడు పడేవి బ్యాక్టీరియాలే! మనిషి దేహంలోపల కొన్ని రసాయనిక చర్యలు నిరాటంకంగా కొనసాగాలంటే బ్యాక్టీరియాలు తప్పనిసరిగా ఉండవలసిందే! ఇంతెందుకు ప్రకృతిలో సమతుల్యతని కాపాడుతున్నవి బ్యాక్టీరియాలేనని ఎవరైనా ఒప్పుకోక తప్పదు. వీటన్నింటినీ పరిశీలిస్తే మనం బ్యాక్టీరియాలకి రుణపడి ఉన్నామా అనిపిస్తుంది. అయితే అవి మనకి సంక్రమింప జేస్తున్న వ్యాధులని తలచుకొంటే మాత్రం అవి సృష్టిస్తున్న భీభత్సం ఏపాటిదో తెలుస్తుంది.

బ్యాక్టీరియాలవల్ల కలిగే వ్యాధులు సామాన్యమైనవి కావు. క్షయ, టైఫాయిడ్, ధనుర్వాతము (టిటానస్) డిఫ్తీరియా (కంఠసర్పి) , కలరా, ప్లేగు, కుష్ఠు, కోరింత దగ్గు, న్యుమోనియా వంటి ప్రమాదకరమైన వ్యాధులన్నింటికీ బ్యాక్టీరియాలే దోహదకారులు. ఈ వ్యాధులని రూపు మాపడానికి నేటి "సైన్స్" ఎంతగా శ్రమపడుతోందో అందరికీ తెలిసిన విషయమే!

క్షయ "మైకోబాక్టీరియమ్ టూబర్‌కులోసిస్" అనే బ్యాక్టీరియమ్ వల్ల వస్తుంది. క్షయ వచ్చినప్పుడు ఊపిరి తిత్తులు బాగా దెబ్బతింటాయి. వ్యాధి ముదిరిన పక్షమైతే మూత్ర పిండాలు, లింఫ్ నాళాలు, లింఫ్ గ్రంథులు, ఎముకలు సయితం పాడవుతాయి. రాబర్ట్ కోక్ అనే శాస్త్రవేత్త (1882లో!) పది మైక్రాన్‌ల పరిమాణంలో ఉండే క్షయ బ్యాక్టీరియమ్‌ని తొలిసారిగా గుర్తించాడు. ఒక సెంటీమిటర్‌ని వందమిలియన్‌ల భాగాలుగా విడగొడితే, అందులోని ప్రతిభాగమూ ఒక మైక్రాన్ అవుతుంది! ఈ బ్యాక్టీరియాలు రోగి దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు వేరేవారిని చేరుకోగలుగుతాయి. క్షయ మనుష్యులకే కాదు, ఆవులు, గేదెలు మొదలైన పాడిపశువులకి కూడా వస్తుంది. క్షయఉన్న ఆవు నించి పాలు పితికితే ప్రతి మిల్లీ లీటరుకి 10 లక్షల బ్యాక్టీరియాలు ఉంటాయి. క్షయని నివారించడానికి బి. సి. జి. టీకాలు వేస్తు ఉంటారు. ప్రారంభదశలలోనే క్షయని గుర్తించి చికిత్స పొందితే ప్రమాదం నించి తప్పించుకో వచ్చును.


బ్యాక్టీరియాలు కలుగ జేసే వ్యాధులలో టైఫాయిడ్ జ్వరం చాలతీవ్రమైనది. శరీర ఉష్ణోగ్రత చాల ఎక్కువ అవుతుంది. ఉదరభాగం పుండులా మంట పుడుతుంది. రోగి మలమూత్రాలలో బ్యాక్టీరియాలు వందల సంఖ్యలో ఉంటాయి. ఈ బ్యాక్టీరియాలని "సాల్మొనెల్లా టైఫోజా" అని పిలుస్తారు. ఈ సూక్ష్మ జీవులు ఒకరి నించి ఒకరికి సులభంగా చేరుకొంటాయి. అందుకే టైఫాయిడ్‌ని వైద్యులు అంటువ్యాధిగా పరిగణిస్తారు. ఇది పిల్లలకి పెద్దలకి అందరికీ వస్తుంది. ఒక్కొసారి ప్రాణాంతకం కూడా కాగలదు.

టిటానస్ లేదా ధనుర్వాతం అనే వ్యాధి "క్లోస్ట్రిడియమ్ టిటానై" అనే బ్యాక్టీరియమ్ వల్ల వస్తుంది. గాయాలు, దెబ్బలు తగిలినప్పుడు ఈ "క్లోస్ట్రిడియమ్" సూక్ష్మ జీవులు శరీరంలోపలికి ప్రవేశిస్తాయి. ఈ బ్యాక్టీరియమ్ కేంద్ర నాడి వ్యవస్థ పైన బలంగా పని చేస్తుంది. అపస్మారక పరిస్థితి తారసిల్లుతుంది. దవడలు నొక్కుకొని పోవడం, అవయవాలు మెలి తిరగడం, మూర్ఛ రావడం ఇలాంటివి ధనుర్వాతం వచ్చినప్పుడు మామూలే! ఈ వాతం బారి నించి తప్పించుకోవాలంటే "టిటానస్ సిరమ్ ఇనాకులేషన్" వేయించుకోక తప్పదు.

డిఫ్తీరియా లేక కంఠసర్పి పసిపిల్లలని పొట్టన పెట్టుకొనే అపాయకరమైన వ్యాధి. పెద్దలు కూడా ఈ వ్యాధి వాత పడవచ్చును! "కొరినె బ్యాక్టీరియమ్ డిఫ్తీరియే" అనే సూక్ష్మ జీవివల్ల ఈ వ్యాధి వస్తుంది. బ్యాక్టీరియమ్ దేహంలోపలకి ప్రవేశించిన రెండు, మూడు రోజులలోపే కంఠసర్పి తీవ్రరూపం దాలుస్తుంది. విపరీత మైన జ్వరం, కళ్లమంట, గొంతువాపు, ఊపిరి స్తంభించి పోవడం ఈ వ్యాధి లక్షణాలు! ఈ వ్యాధిని తట్టుకొని బయటపడటం చాల అరుదు. ఈ కంఠ సర్పికి డిఫ్తీరియా వ్యాక్సిన్ చేస్తారు!

కలరా వయోభేదం లేకుండా ఎంతో మందిని పొట్టన పెట్టుకొనే ప్రమాదకరమైన వ్యాధి. ఎంతో హాని కరమైన కలరాకి మూలం "విబ్రియో కామా" అనే బ్యాక్టీరియమ్ ! (బొమ్మని చూడండి!) ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం మామూలుగానే వస్తుంది నీళ్ల విరేచనాలు, వాంతులు మరి ఎక్కువగా అవుతాయి. మనిషి శరీరంలోపల నీటిశాతం పూర్తిగా పడిపోతుంది. ఈ విధమైన నిర్జలీకరణని గనుక సకాలంలో ఆపలేక పోయినట్లయితే మరణం కూడా సంభవిస్తుంది. ఈ కలరా అంటువ్యాధి ఇది అతి త్వరగా ఒకరి నించి ఒకరికి వ్యాప్తి చెందడానికి ఈగలు ప్రముఖపాత్ర వహిస్తున్నాయి "మస్కా డొమెస్టికా" అని శాస్త్రీయ పరిభాషలో పిలువబడే ఈగలవల్ల టైఫాయిడ్, అమీబిక్ విరేచనాలు, కలరా, క్షయ వంటివి బహు విస్తృతంగా

కలరాని కలిగించే విబ్రియో కామా!




వ్యాప్తి నొందుతాయి నల్లులు కూడా వ్యాధులనందించే రాయభారులుగా పని చేస్తూ ఉంటాయి. ప్లేగు, టైఫాయిడ్, క్షయ అతి వేగంగా వ్యాప్తి చెందడానికి ఈగలతో పాటు , నల్లులు కూడా కారణమని చెప్పక తప్పదు. డి. డి. టి., కరోసిన్, బెంజీన్ మొదలైనవి వాడి నల్లులని దూరం చేయవచ్చు. ఈగలని దరి చేరనీయకుండా క్రిమి సంహారక పదార్థాలని విరివిగా ఉపయోగించడం నేర్చుకోవాలి.

ప్లేగు కొన్నేళ్ల క్రితం మానవజాతిని పట్టి పీడించిన సంగతి ఇంకా గుర్తు ఉండే ఉంటుంది."పాశ్చురెల్లా పెర్టిస్' అనే బ్యాక్టీరియమ్ వల్ల ఈ వ్యాధి వస్తుంది ఈ వ్యాధి ప్రబలంగా సోకడానికి ఈగలు, ఎలుకలు కారణాలని చెప్పక తప్పదు. ఎలుకలని నిర్మూలించడం వల్ల ప్లేగు వ్యాధి నియంత్రించ బడుతుందని ఎంతో మంది అభిప్రాయ పడుతారు అయితే ఈ వ్యాధి ప్రస్తుతం గణించదగ్గ స్థాయిలో లేదని ప్రజారోగ్య నిపుణులు అంటున్నారు!

బ్యాక్టీరియాల ద్వారా సంక్రమించే కుష్ఠు వ్యాధి ఎంతో ఆందోళనని కలిగిస్తోంది. దీనినే "హాన్సెన్స్ వ్యాధి" అని కూడా పిలుస్తారు ఈ వ్యాధి మొదట మొదట చర్మము, నాడులు, శ్లేష్మస్తరాలు– వగైరా ఉపరితల కణజాలాలకి సంబంధించిన దేహభాగాలకి సోకి– క్రమేపి అంతర్గతంగా కూడా వ్యాపిస్తుంది. "మైకో బ్యాక్టీరియమ్ లెప్రే" లేదా "హాన్సెన్స బాసిలస్ బ్యాక్టీరియమ్" వల్ల కుష్ఠు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధిలో రెండు రకాలు ఉన్నాయి. ఒక రకం వ్యాధి అంటువ్యాధి. 5 నించి 10 శాతం వరకు ఈ వ్యాధి అంటుకొంటుంది ఇదే వ్యాధి 30 నించి 50 శాతం వరకు వంశ పారంపర్యంగా కూడా వస్తుంది. ఇంకొక రకం వ్యాధి అంటువ్యాధి కాదు బ్యాక్టీరియాలు దేహంలోపలకి ప్రవేశించిన 3–5 సంవత్సరాల తరువాతే వ్యాధి లక్షణాలు బయటపడుతాయి ఒక్కోసారి ఆరు నెలల్లో కూడా వ్యాధి లక్షణాలు కనిపించవచ్చు. మరో మారు రెండు దశాబ్దాలు గడిచినా వ్యాధి అంతర్గతంగానే ఉంటుంది తప్పనిస్తే బయటపడదు. అందువల్లనే కుష్ఠు వ్యాధిని నిర్ధారించడం ఒక పెద్ద సమస్యగా ఉంది వ్యాధి సోకిన తొలి దశలలో అయితే దానిని నయం చేయడం చాల సులభం. అట్లు కాక వ్యాధి ముదిరిపోతే మాత్రం నయం చేయడం కష్ట సాధ్యమే! ప్రస్తుతం మన దేశంలో 32 లక్షల మంది కుష్ఠు రోగులు ఉన్నారని వింటుంటే ఎంతో బాధ కలుగుతుంది అందులో ఇరవై శాతం మంది పిల్లలు కావడం మరింతగా విచారాన్ని కలిగించే అంశం!

చిన్న పిల్లలకి ఎక్కువగా వచ్చి యమ యాతన పెట్టే కోరింత దగ్గు కూడా బ్యాక్టీరియాల ప్రభావమే. ఈ దగ్గు సాధారణంగా 6 నెలల పసికందులు మొదలు కొని 12 సంవత్సరాల బాలల వరకు వస్తుంది పసి పిల్లలకి రోగ నిరోధక శక్తి బాగా తక్కువగా ఉంటుంది కాబట్టి ఈ వ్యాధి త్వరగా అంటుకొంటుంది. "హిమోఫిలస్ పెర్టూసిస్" అని పిలువబడే బాసిల్లస్ బ్యాక్టీరియమ్ వల్ల ఈ కోరింత దగ్గు వస్తుంది. వాయునాళం వాచి బాగా నెప్పి పెడుతుంది దీంతో గాలి పీల్చినప్పుడెల్లా దగ్గు విపరీతంగా వస్తుంది. ఒక్కో మారు రక్త వాంతులు కూడా అవుతాయి! గుక్క తిప్పుకో లేనంతగా ఆయాసం రావడం వల్ల ఈ వ్యాధిగ్రస్తులు తొందరగా నీరసపడి పోతారు. మరి పసి పిల్లలైతే పూర్తిగా దెబ్బతిని పోతారు. ఫలితంగా వారు మరణించనూ వచ్చు! ఈ దగ్గుకి "ట్రిపిల్ అంటిజెన్"ని ఇస్తారు. డెఫ్తీరియా, టిటానస్, కోరింత దగ్గు మూడింటికీ కలిపి ఇచ్చే "అంటి బయాటిక్ అంటిజెన్" ఇది!

బ్యాక్టీరియాల జీవన వ్యవస్థ మానవుని జీర్ణవ్యవస్థ !



ఇలాగ ఎన్నో వ్యాధులకి బ్యాక్టీరియాలు ఊపిరి పోస్తున్నాయి బ్యాక్టీరియాలతో వైరస్‌లు కూడా చేరుకొని వ్యాధులని మరింత బలం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. న్యుమోనియా అలాంటి వ్యాధే! బ్యాక్టీరియా వల్ల ప్రారంభమయ్యే ఈ వ్యాధి వైరస్‌లు చేరుకోవడంతో ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అయితే ఈ అంశం ఇంకా స్పష్టంగా నిర్ధారించ బడలేదు పరిశోధనలు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి!

మేలు చేసే బ్యాక్టీరియాలకి కృతజ్ఞతలు చెప్పుకొంటూనే కీడు చేసే వాటిని అంత మొందించడానికి తగిన చర్యలని ఏర్పరచుకొని వాటిని కట్టుదిట్టంగా అమలు పరచేలా శ్రద్ధవహించడం జాతి క్షేమాన్ని కోరేవారి ప్రథమ కర్తవ్యం! ఇలాంటి అంశాలపై నిర్ణయాలు తీసుకొనేటప్పుడు అన్ని దేశాలవారూ ఒక చోట చేరి చర్చా వేదికలని ఏర్పాటు చేసుకొని రాజకీయాలకి అతీతంగా విశ్వమానవ భాగ్యోదయం కోసం పాటు పడాలి.

– డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

వర్ణమాల

రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు

సాంబమూర్తి గారు నించున్న క్యూ ఏమాత్రం తరగలేదు ఎందుకొచ్చినట్టు ఇక్కడికి? అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

ఎక్కడికి బయల్దేరాడు? ఎక్కడ చిక్కడ్డాడు?

"దీం దుంపతెగ. ఈ జీవితం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. ఏదో చూపించి మరేదో చేతిలో పెడుతుంది, మన ఇష్టాయిష్టాల ప్రసక్తి లేకుండా" విసుక్కున్నాడు సుబ్రహ్మణ్యం

★ ★ ★ ★ ★

ఎడారిలాగా అసంతంగా పరుచుకున్న నిస్సారమైన జీవితంలో ఇరవై తొమ్మిదేళ్ళుగా ప్రయాణిస్తున్న సుబ్రహ్మణ్యం ఒక రకమైన విరక్తి పెంచుకుంటున్న రోజుల్లో నీటితావులాగా ఒక అవకాశం తారసిల్లింది.

ఉత్సాహం మొలకెత్తింది.

ఏ పుట్టలో ఏ పాముందో?

ప్రయత్నించి చూడాలి. ఏమో ఒక్కమాట చెబితే, నా రోజు బాగుంటే, ఈ ఉద్యోగం నాకే రావచ్చు.

ఎంత చిన్నదయినా, ఎంత తాత్కాలికమైనా ఒక ఉద్యోగం అవసరం అతని కిప్పుడు.

జీవితంలో పచ్చదనం కొంచెమైనా కనబడాలిప్పుడు. అంచేత తారసపడింది నీటితావో ఎండమావో తేలకపోయినా గుండెనిండా ఆశ నింపుకున్నాడు సుబ్రహ్మణ్యం.

మొలకెత్తిన ఉత్సాహం మానయ్యింది

'ఈవేళ సాయంత్రంలోగా గురుమూర్తి గారిని కలిసి తీరాలని సైకిలు తీశాడు.

"ఎక్కడికోయ్.... ఉహుఁ నేనూ టౌనుకేలే. పద ... మంచి కంపెని దొరికంది దూరం తెలియకుండా...." అంటూ అరుగుమీద నించి సైకిలు దించుకున్నారు ఎదురింటి సాంబమూర్తి గారు.

★ ★ ★ ★ ★

"ఊఁ ఏవిఁట్రా విశేషాలు?" అన్నాడు సుబ్రహ్మణ్యం సత్యనారాయణతో. అప్పటికా ప్రశ్న మూడో సారి

అడక్కంచేస్తాడు? ఏమి కాలక్షేపం కావటంలేదు. కరెంటు పోయిందేమో ఒకటే ఉక్కపోత.' ఊరికే నించుంటే విసుగు. అక్కడికీ తన ముందు కౌంటర్లో కూచున్న నీలంచొక్కా "బొద్దుబాబు" పనిచేసే తీరుని పది నిముషాలపాటు పరిశీలించి చూశాడు. బేంకు అంతా సర్వే చేయడం అయిపోయింది ఉన్నచోటునే ఉండి.

ఏవున్నాయి? నువ్వే చెప్పాలి?" అన్నాడు సత్యనారాయణ రెండో సారి.

ఇద్దరిపి 'ఏవీఁ తోచని కబుర్లే కాబట్టి ఎవరూ నోరు విప్పలేదు.

"బొద్దుబాబు బావున్నాడు" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. "ఎలాగైనా బేంకువాళ్ళు బావుంటారు. వైటు కాల రుద్యోగాలు" అనుకున్నాడు మళ్ళీ.

కరెంటు వచ్చింది. ఫేన్లు పని మొదలెట్టాయి

"మహ చురుగ్గా పనిచేస్తున్నాడు వీడు. వంచిన తలెత్తకుండా మంచి ముండా వాళ్లా ఉన్నాడే" అనుకుంటున్న సుబ్రహ్మణ్యానికి బొద్దుబాబు టేబిలుమీదున్న కాగితం ఒకటి గాలికి ఎగిరి కిందపడటం కనిపించింది. అది పక్కనున్న సత్యనారాయణ చూశాడు

ఇలాంటివి చూసినప్పుడు సాధారణంగా నోరూరుకోదు. సత్యనారాయణ నోరు ఊరుకోలేదు.

"కాయితం ఒకటి ఎగిరి కింద పడిందండీ" అన్నాడు.

బొద్దుబాబులో చలనంలేదు. విన్నాడో లేదో కూడాను. రాస్తూనే ఉన్నాడు.

సుబ్రహ్మణ్యం సాంబమూర్తిగారి కేసి చూశాడు క్యూ తరుగుతోంది. ఇంక ముగ్గురు.... ఇద్దరు.... ఒక్కరే....

బొద్దుబాబు చేస్తున్న పని ముగిసినట్టుంది. కాగితాలు దొంతరచేస్తూ అటూ ఇటూ వెతుకుతున్నాడు టేబిలుమీద.

"నాకేం సంబంధం? ఏమాత్రం లేదుగాక లేదు" అనుకోలేకపోయాడు సుబ్రహ్మణ్యం ఆ జాతి మనుష్యులు అలా అనుకోరు.

"కాయితం కోసమేనా? అది ఇందాక ఎగిరి కింద పడిందండీ" అన్నాడు.

బొద్దుబాబు తలెత్తాడు. బాబు మొహం చిరాగ్గా ఉంది. పదిమంది ముందు పైవాడిచేత అడ్డమైన చివాట్లు తిన్న ఆఫీసరు ఫ్యూన్‌ని చూసినట్టు చూసి....

"డోన్టాక్. మైండ్ యువర్ బిజినెస్" అన్నాడు చిరాగ్గా! బిగ్గరగా.

సుబ్రహ్మణ్యం ఆశ్చర్యపోయాడు.

"డోన్టాక్ మైండ్ యువర్ బిజినెస్" అనే అన్నాడా? ఇంత గట్టిగానూ!

ఇటు క్యూలో ఉన్నవాళ్ళూ, సత్యనారాయణా, పక్కనేఉన్న సుబ్రహ్మణ్యానికి తెలిసిన ఒక షావుకారూ ఏవిఁటేవిటన్నట్టు చూశారు.

ఆశ్చర్యం రంగుమారి కోపం అయింది

ఛర్రున మండింది సుబ్రహ్మణ్యానికి. పుణ్యానికి చెబితే డోన్టాక్ అంటాడా? మేనర్లెస్ ఫెలో.

పొగరన్నమాట వీడికి.

"నామీద వీడి అథార్టీ ఏమిటి? బోడి వెధవ" అనుకున్నాడు. తిక్క కోపం రేగింది. "తుక్కు రేగ్గొట్టాలి రాస్కెల్‌ని!"

అనుకోవడానికి పట్టిన సమయం తక్కువేగాని ఇవన్నీ అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. ఇవేకాదు అంతకన్న తీవ్రమైనవి మరికొన్ని కూడా క్షణంలో సగంలో అనేసుకున్నాడు. కంపించిపోయాడు.

"ఐనో వాట్ మై బిజినెస్ ఈజ్. సాటి మనిషిగా ఊరుకోలేక చెప్పాను... బుద్ధి గడ్డి తిని. నీ కాయితంపోతే ఎవడికి నీ ఉద్యోగం ఊడితే ఎవరికిరా...."

"రా" అన్నాడు. అనేశాడు. నోరు జారింది మాట.

బొద్దుబాబు మొహం కందగడ్డ అయిపోయింది,

"వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్.... రా ఏవిఁట్రా? మర్యాదిచ్చి మర్యాద పుచ్చుకో" అన్నాడు. కాదు అరిచాడు.

"నీకా మర్యాద? మేనర్లెస్ స్టుపిడ్" సుబ్రహ్మణ్యం.

"యూ... సనాఫే బిచ్ ఘెటౌట్" ఉగ్రుడైపోయాడు బొద్దుబాబు.

మనిషి ఊగిపోతూ కుర్చీని కాలితో వెనక్కు తన్నాడు.

"గెటవుటా? ఘెటౌక్!!! ఒళ్ళు వేడెక్కిపోయింది సుబ్రహ్మణ్యానికి.

"గెటౌటా? బేంకు నీ తాతగారి సొమ్మనుకున్నావురా? నీ బతుకమ్మేస్తే నా ఎడంకాలి చెప్పు విలువ చెయ్యదోరేయ్! కస్టమర్‌కే సర్వెంటువిరా నువ్వు.... నే తల్చుకుంటే... "

బొద్దుబాబు సుబ్రహ్మణ్యాన్ని ఏవీఁ అట్టేపెట్టలేదు. పొద్దుట ఇంటి దగ్గరైన ఘర్షణా, గంట ముందు మేనేజర్ పెట్టిన చివాట్లూ ఒక్కసారి భగ్గుమన్నాయి లోపల.

ఇద్దరూ అరుచుకున్నారు. చెడీ అంటే ఫెడీ అనుకున్నారు. భాష సభ్యస్థాయినించి దిగజారింది. ఒళ్ళు మరిచి మాటలే ఈటెలుగా విసిరేసుకుంటున్నారు.

క్షణాలమీద తుఫానులా రేగిపోయింది వాగ్వివాదం.

బేంకులో పనంతా స్తంభించిపోయింది. కొందరు నిర్ఘాంతపోయారు. కొందరు ముచ్చటగా ఒళ్లంతా కళ్ళు చేసుకుని, మెదడంతా చెవులు చేసుకుని వింటున్నారు. కొందరు ఏవైందేవైందని పక్కవాళ్ల భౌతిక చెవులు తినేస్తున్నారు, ఒక చెవి ఇటే ఉంచి.

సాంబమూర్తిగారు సుబ్రహ్మణ్యం దగ్గర కొచ్చారు, హడావిడిగా. సత్యనారాయణకీ, తదితర ప్రేక్షకులికీ ఈ సంఘటన కలేమో అన్పించింది. ఎలా మొదలై ఎలా పరిణమించిందని నిశ్చేష్టులయ్యారు.

ఏవిఁటేవిఁటని బేంకు వాళ్ళు బొద్దుబాబును చుట్టేశారు.

అద్దాలకు ఇవతలున్నవాళ్ళు సుబ్రహ్మణ్యాన్ని

చుట్టుముట్టేశారు. "ఏవిఁటేవైందెలాఐంది మేష్టారూ?" అని.

చెవుల్లోంచి పొగలొస్తుంటే మాటలు వినబడవు.

ఊరుకోండి. ఊరుకోండి అన్నారు వాళ్ళూ వీళ్ళూ, అతన్నీ ఇతన్నీను.

గుండె దహించుకుపోతుంటే హితబోధలు పని చెయ్యవు.

లాభంలేదని దూరంగా లాగి పారేశారు ఇద్దర్నీను.

బేంకు మేనేజరొచ్చి "ఏమిటి .మేష్టారూ?" అనడిగాడు పెద్దమనిషి తరహాలో.

సుబ్రహ్మణ్యం చెప్పాడు. మేనేజరు మాట్లాడలేదు. దాంతో మళ్ళీ చిర్రెత్తింది సుబ్రహ్మణ్యానికి.

"వాళ్ళూ.... వాళ్ళూ ఒకటంది తప్పూ ఒప్పూ ఎవరిక్కావాలి? నాకుపట్టుకున్నదేవిఁటంటే...."

వాక్ప్రవాహం మళ్ళీ కట్టలు తెంచుకుంటోంది.

అంతవరకూ శ్రోతలా నించున్న సత్యనారాయణ "ఊరుకోరా సుబ్రహ్మణ్యం" అన్నాడు.

"ఏవిఁట్రా ఊరుకొనేది? నేనన్న మాటలో తప్పేవిఁట్రా? ముందునించీ అంతా చూసిన వాడివి మావాడి మాటలో తప్పేవిఁటని ఒక్క మాటనలేకపోయావు. యూసలెస్‌ఫెలో."

కోపానికి అర్థం ఉండదు.

సాంబమూర్తిగారు ఇది పనికాదని సుబ్రహ్మణ్యాన్ని బయటకు లాక్కుపోయారు. "కాఫీ తాగుదాం" అని హోటలుకి దారి తీశారు.

బొద్దుబాబు ఆయాసపడుతూ మళ్ళీ వీరుళ్ళా ఏవో ప్రగల్భాలు పలుకుతూనే ఉన్నాడు అక్కించి.

సాంబమూర్తిగారు చెప్పిన మాటలన్నీ విన్నాడు సుబ్రహ్మణ్యం. చాలా మాటలు మెదడు కెక్కలేదు. ఓ పావుగంటయ్యాక సుబ్రహ్మణ్యాన్ని వల్ల బరిమానుకొని వెళ్ళిపోయారు సాంబమూర్తిగారు.

* * * * *

సైకిలెక్కి ముందుకు కదిలాడు సుబ్రహ్మణ్యం. గురుమూర్తిగారిని కలిసే మూడ్ లేదిప్పుడు. ఆయన్ను కలవడంకన్నా ముఖ్య విషయం అయి కూర్చుంది బొద్దుబాబుతో ఘర్షణ.

మాటిమాటికి జరిగిపోయిన ఆశ్చర్యకర సంఘటనే గుర్తొస్తోంది.


దుర్మార్గుడు. ఎంత పొగరుగా మాట్లాడాడు! కావరం!! కళ్ళు మూసుకుపోయి ఏడుస్తున్నాడు ఎన్నెన్ని కూతలు కూశాడు!!

లాగి లెంపకాయ కొట్టాల్సింది. గూబ గుయ్యిమనేటట్టు. ఎంతమందెంత మంది చూశారు! ఎంత అవమానం!!

జుట్టు పట్టుకుని ముక్కుమీద గుద్దాల్సింది రక్తం కారేటట్టు. నేనన్న మాటలో తప్పేవిఁటి? ఎక్కడ తప్పు? ఏమిటి తప్పు??

కాయితం పడిపోయిందండీ అన్నాడు.

అంతే "దోన్నాక్" అని మొదలెడతాడా? ఇంత



ఈ పరిణామానికి సత్యనారాయణ అవాక్కయిపోయాడు. ఆ మాటకొస్తే తన మాటలికి తనే నిర్ఘాంతపోయిఉండాలి సుబ్రహ్మణ్యం.

వాళిద్దరి పరిచయం అంతంత మాత్రమే. ఒకప్పుడెప్పుడో క్లాసుమేటు. అంతస్తులమధ్య అనంతదూరం ఉంది.

ఒళ్ళు కొవ్వెక్కినవాడిని క్షమించకూడదు. అది మానవజాతికే ద్రోహం చెయ్యడం. కాలో చెయ్యో తీసెయ్యాలి.

తీసితీరాలి.

"ఘుతౌర్.... సనాఫేబిచ్.... ఈడ్చి తంతే దిక్కులేదురా...." బొద్దుబాబు మాటలన్నీ చెవుల్లో మార్మోగుతున్నాయి.

పీక్కి కొట్టాలి ఇవ్వాళ.

బాంబినో ఉప్మా

2 కప్పుల బాంబినో వెర్మిసెల్లి
2 చెంచాల నూనె
1 తరిగిన పచ్చిమిరపకాయ
1/4 చెంచా ఆవాలు
నిమ్మరసం
4 కప్పుల నీళ్ళు
1 కొత్తిమీరి కట్ట

ముందుగా బాంబినోను నూనెలో వేయించి వేరె పెట్టాలి. ఆ వేయించిన మూకుడులో నే ఆవాలు వేసి చిట్లే వరకు చూసి, మిరపకాయలు, ఉల్లిపాయ ముక్కలు వదేయాలి. 2 నిమిషాలు వేగిన తర్వాత నీళ్ళు కలపాలి. నీళ్ళు మరగ్గానే వేరె ఉంచిన బాంబినోను మూకుడులో వెయ్యాలి. నిమ్మ రసం పోసి, కొత్తిమీరి కట్టను ముక్కలుగా తుంపి తయారయిన ఉప్మా మీద అందంగా చల్లాలి.



వర్ణమాల

ఏదో చెయ్యనిదానికి పైగా సహాయం చెయ్యబోయిన దానికి ఇదా సత్కారం?

కొట్టితీర్తాను ఏమైనా సరే!

ఆ నిర్ణయం తీసుకున్నాక వేడెక్కిన ఒళ్ళు చెమటలు కక్కటం మొదలుపెట్టింది.

సైకిలు చాలా జోరుగా పోతోంది.. ఎటో..... ఏమో.... దారి పట్టలేదు సుబ్రహ్మణ్యానికి. కసి. అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలి. ఆ తలపొగరుకి దెబ్బకొట్టాలి. కొట్టి తీరాలి. అంతే.

దెబ్బ కొట్టడం ఏమిటి? ప్రాణం తీసెయ్యాలి. ఓ రాయి తీసుకుంటే చాలు. చుట్టూ చూశాడు. సగం విరిగిపడిన మైలు రాయి కనిపించింది అంత దూరాన....

రైట్.... ఇదిచాలు. ఇలాటిది చాలు. ఒకే దెబ్బ. తర్వాతేమయినా సరే.జైలుకి పోయినా, యావజ్జీవం పడిపోయినా సరే.

ఇలాంటి దుర్మార్గుణ్ణి వదిలి లోకద్రోహం చెయ్య కూడదు. ఉరి తీసినాసరే.... ఉరి.... ఒక్క క్షణంలో దిగులు కమ్మింది గుండెల్లో. తనను ఉరితీసే దృశ్యం ఊహల్లో కదిలింది. గొంతు చుట్టూ-నల్లని గుడ్డమీద బిగుసుకుంటున్న తాడు.... కళ్ళు చెమ్మగిల్లాయి.

తన భార్యా బిడ్డలూ....

ఏమైనాసరే. వాళ్ళని వదలకూడదు.

కోపానికి కళ్ళు లేవు. మనసులేదు. మెదడులేదు. అదంతే. ఇదంతా ఎందుకు జరిగింది అన్న ప్రశ్న మెదడు లో లోపలి పొరల్లోనే ఉండిపోయింది. చిన్న విషయానికి ఇంత రాద్ధాంతం ఎలా అయ్యింది అన్న ప్రశ్నని కోపం కమ్మేసింది. ఫలితాలూ పర్యవసానాలూ తుది మొదలూ ఏవీ వద్దు దెబ్బకొట్టాలి.

ఇప్పుడే కొడితే.:.. యస్! ఎందుకొట్టరాదు! అంతమంది ముందూ.... తనని అవమానించగా చూసిన వాళ్ళందరిముందూ.... చాచి ఒక చెంపదెబ్బ.... చాలు.

సైకిలు గిర్రున వెనక్కి తిరిగింది. వేగం పెరిగింది. మనస్సూ, దేహం, సర్వం ఆయత్తమై ఉరకలేస్తూ బెంకు చేరాయి.

స్టాండు వేసి.... కోపం రూపంలా బెంకులో అడుగుపెట్టాడు.

బొద్దుబాబున్న కౌంటర్‌కి ఎదురుగా బెంచిమీద కూర్చున్నాడు.

అటో... యిటో ... చెటాపట్....

ఏదైనా ఒక వంక కావాలి. ఒక వంక.

క్షణాలు నిమిషాలయ్యాయి. నిమిషాలు పదిహేను గడిచాయి.

బొద్దుబాబు కళ్ళూ సుబ్రహ్మణ్యం కళ్ళూ రెండు కలిశాయి.

ఆ వేగం! స్పందన!!

బొద్దుబాబు తల దించేశాడు. మళ్ళీ తలెత్తలేదు.

కూర్చుని కూర్చుని విసుగెత్తింది సుబ్రహ్మణ్యానికి.

సరే! ఇంక దొరకడా? బైటికిరాడా?

పిరికి వెధవ!

సైకిలు దగ్గరికి నడిచాడు.

* * * * *

రాత్రి తొమ్మిది దాటింది.

మసక వెన్నెల్లో నెమ్మదిగా సాగిపోతోంది సుబ్రహ్మణ్యం వాహనం. వెళ్ళిన పని కాలేదు. తను వెళ్ళడానికి అరగంట ముందు తనకి కావాల్సిన వ్యక్తి ఊరెళ్ళిపోయాడు.

వేరే ఏవో ప్రయత్నాలుచేసి చేసి అలసిపోయాడతను. అవి ఫలించేటట్టూ లేవు. ఫలించినట్టూ లేవు.

ఉండుండి బొద్దుబాబుమీద కోపంతో మనసు మరిగిపోయేది. "వీడిమూలానేకదా అరగంట ఆలీసం అయింది" పళ్ళు కొరుక్కున్నాడు సుబ్రహ్మణ్యం.

"నేనుట్టి సన్యాసిని" అనుకున్నాడు.

మరే. కాకపోతే ఏవిటిది? సాంబమూర్తిగారు రమ్మన్నంతమాత్రాన నా పని వదిలిపెట్టి అటే పోవడమేవిటి? ఒక్కమాట అడ్డు వేస్తే ఇంత రభస కాకపోను. ఇటు పనీ అయిపోను.

ఆ వెధవని తన్నలేకపోయాను. ఒక్కదెబ్బ.... ఒక్కటయినా కొట్టలేకపోయాను.

వెళ్ళిన పని చేసుకురాలేకపోయాను. ఎంత ముఖ్యమైన పని! ఉద్యోగ సమస్య! జీవితంలో అతి ముఖ్యమైన పనుల్లో ఒకటి. రెండు రోజులే గడువుందిట. అటు కావలసినవాడు చెజారిపోయాడు.

మళ్ళీ ఎన్నాళ్ళకో.... ఇంకో ఛాన్సు.

సుబ్రహ్మణ్యానికి తన వైఫల్యాలు.... ఎప్పటెప్పటివో ... అనేకానేకాలు గుర్తుకు రాసాగాయి. అతనికి గుండెల్లో దిగులు పుట్టింది. గుండెకాయని ఎవరో చేత్తో కదిపినట్టయ్యింది.

ఉద్యోగంలేని, ఇల్లు సౌకర్యంగా ఉంచలేని, ఎవర్ని సంతోష పెట్టలేని, వెనక ఏమీ ఆధారంలేని అతి సామాన్యుడు తను.

చుట్టూ పరుచుకున్న మసక చీకటిలో, తోడెవ్వరూ లేని సుబ్రహ్మణ్యం, జీవితంలో కూడా ఒకషికాకిగా ఫీలయ్యాడు, ఆక్షణాన.

ఒంటరి! నిస్సహాయుడు!! అనాథ!!!

ఇరవై తొమ్మిదేళ్ళ జీవితంలో ఏమి సాధించలేకపోయిన అ...స...మ...ర్థు...డు.

మొహాన్ని విషాదం ఆవరించుకుంది. కళ్ళు ఆర్ద్రాలయ్యాయి. అంత చల్లటి వాతావరణంలోనూ ఉక్కపోసినట్టయిందతనికి.

ఒకడికి 'చేతనైనంతవరకూ మంచే చేశానుగాని అపకారం చెయ్యలేదే? నా కెందుకు ఇలా ఉంది బ్రతుకు... వెలిసిపోయిన బట్టలా.... చివికిపోయిన తోలులా...

అలాంటి నన్ను ఒక బోడివెధవ అకారణంగా తిట్టాడు. పదిమంది ముందు.

ఒక్కడూ ఇది తప్పన్న పాపాన పోలేదు. ఆ షావుకారు చూశాడు మొదట్నించీ, చెప్పొచ్చుకదూ? పైగా ఒకే ఊరివాళ్లం. వాడు ఆ నల్ల కళ్లద్దాలవాడూ చూశాడు. సత్యనారాయణమటుకు!

జనాభా సమస్యతో తల్లకిందులైపోతున్న ఈ భూమ్మీద నిజమైన మనిషి ఒక్కడూ లేడు. ఔదాసీన్యం, సాటివాడికి అన్యాయం జరిగినా పట్టదు. ఎవడిదారి వాడిదే. వీళ్లంతా ఎవరూ ఎవరికి ఏమీ కారు.

మనుష్యుల్లా ఉంటారు అంతే.

ఏం చేసినా మనమే చేసుకోవాలి. అందుకే.... బొద్దుబాబుని నేనే... స్వయంగా ఒక్క దెబ్బ కొట్టాలి. ఒక్క తన్ను...

నిస్సహాయతలోంచి, బాధలోంచి, దిగుల్లోంచి, బెంగలోంచి తృప్తి కోసం పుట్టిన ప్రతీకారవాంఛ అది.

సాయంత్రంఅంతా అతన్ని మండించి మండించి శక్తి అంతా పీల్చి పిప్పిచేసి క్రోధం ఒక కెరటంలా పొంగింది గుండెల్లో.

కీ....కీ.. . స్కూటరు హారన్!.... వెనక.

డాష్ ...డిం ..క్రిం...కిర్....

ఏక్సిడెంటు!!!

వెనక్కి తిరిగిచూశాడు సుబ్రహ్మణ్యం. ఒక సైకిలుని గుద్దుకొంది స్కూటర్. సైకిలు చర్మని రోడ్డుమీద ఒరిగిపోయి ఒక పక్కకు ఈడ్చుకుపోయింది. సైకిలుమీద ఉన్న వ్యక్తి రోడ్డు పక్క నున్న మైలురాయిమీద పడ్డాడు.

"అహ్....మ్మా" గుండె పిండే మూలుగులాంటి కేక అది. దెబ్బ తిన్న అభాగ్యుడి ఆర్తనాదం.

స్కూటర్‌వాలాకి దెబ్బ తగిలినట్టు లేదు. అసలు బేలన్సే తప్పలేదు. అయోమయస్థితి నుంచి ఒక్క క్షణంలో తేరుకున్నాడు అతను. సర్రున దూసుకుపోయాడు ముందుకు

"మనిషి ఎంత స్వార్థపరుడు!!" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. స్కూటర్‌వాడిమీద పట్టరానంత కోపం వచ్చింది. ఏక్సిడెంటు కావడం పొరపాటు కావచ్చు. దెబ్బతిన్న సాటి మనిషిని వదిలిపెట్టిపోవడం నీచం.

సైకిలుస్టాండు వేసి, దెబ్బతిన్న వ్యక్తిని లేవదీయడానికి వెనక్కు పరుగెత్తాడు.


"చెయ్యి.... చెయ్యి...." అని మూలిగాడతను.

చక్రంలో ఇరుక్కుపోయిన చేతిని చూశాడు సుబ్రహ్మణ్యం. నెమ్మదిగా విడిపించాడు. అవతల వ్యక్తి సంగతేమోగానీ సుబ్రహ్మణ్యం ప్రాణం గిలగిలలాడిపోయింది. ఎక్కడ నొప్పి కలుగుతుందో అని.... విడిపించే సమయాన.

అతని మోకాలిమీద పడింది సుబ్రహ్మణ్యం దృష్టి. మైలు రాయి దెబ్బకి కాలు చిట్లింది. ఆ మసక చీకట్లో రక్తపు చుక్కలు నల్లగా.... నల్లని రక్తం.... రోడ్డుమీద, కాలిమీద.

"అరరే.... ఎముక చిట్లిందో ఏమో...' అని

ఈ వేమన పద్యాలు



మాటలాడు టొకటి మనసులో నొక్కటి
యొడలి గుణము వేఱె యోజవేఱె
యెట్లుగలుగు ముక్తి యీలాగుగా నుండ
విశ్వదాభిరామ వినురవేమ.

అనుకుంటూ, పైకంటూ... తొందరగా జేబురుమాలు తీసి కట్టు కట్టాడు.

అవతలి వ్యక్తి కింకా తిమ్మిరి వదిలినట్టు లేదు. మూలుగు అయోమయంగా సుబ్రహ్మణ్యం కదలికలు చూస్తున్నాయి. మోకాళ్లూ వీపూ.... చేతులూ పరిశీలించాడు సుబ్రహ్మణ్యం. ఇంక దెబ్బలేమీ ఉన్నట్టులేవు.

ఏవేవో ప్రశ్నలూ.... జవాబులూ....

సైకిలు నిలబెట్టాడు. 'ఒక్క క్షణం కుదురుకోండి' అని అతన్ని మైలు రాయికి చేర్చి కూర్చోబెట్టాడు.

'అలవాటుందా?' అని అడుగుతూ సిగరెట్టొకటి యిచ్చి వెలిగించాడు, తనొకటి ముట్టించుకొని.

ఉదయపు ఉత్సాహంగానీ, మధ్యాహ్నపు కోపంగానీ, సాయంత్రపు దిగులు కానీ లేవిప్పుడు అతని మనస్సులో. భిన్న భిన్న వర్ణాల ఉద్వేగాలు కరిగి, కలిసి, తెల్లగా, అఖండంగా, శాంతంగా వెలిగే మానవత తలెత్తింది.

అతని మనసునిండా ఆర్ద్రత పొంగి పొరలుతోంది. మానవుణ్ని. మానవుణ్ని దగ్గర చేర్చి బంధించిఉంటే మానవతా గుణం ఆ క్షణాన సుబ్రహ్మణ్యం గుండెల్ని కదిలించి వేసింది.

శరీరం తూలికలా తేలికైపోయింది.

తన సైకిలు అడ్డుకర్రమీద ఆ వ్యక్తిని కూర్చోబెట్టుకుని, ఒక చేత్తో అతని సైకిలు పట్టుకుని, రెండో చేత తన సైకిలు అదుపులో పెడుతున్నాడు సుబ్రహ్మణ్యం.

సైకిళ్ళు భారంగా కదులుతున్నాయి.

సుబ్రహ్మణ్యం మనసు మూలల్లో ఉదయించిన కరుణ ఇంతై ఇంతింతై గుండెనిండి, గొంతును గద్గదికం చేసి, కళ్లలోకి పొంగింది.

జీవితం అంటే ఏమిటో దాని నడక ~ ఉంటుందో దాని హాయి ఏమిటో అర్థమయినట్టు అనిపించింది అతనికి.

ముందు కూర్చున్న బొద్దుబాబు కళ్ల వెంట ధారాపాతంగా కారే అశ్రువుల్ని చూడలేదతను.

చూస్తే, అవి గాయాలవల్ల జారిన బాష్పకణాలని అపోహ పడతాడో.... ఏమో.... □

వ్యక్తిగతం



ఈ ఏడు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన క్లాస్ వాన్ క్లిట్జింగ్ వయసు 42 సంవత్సరాలు. గత 20 ఏళ్లలో జర్మనీలో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్న తొలి వ్యక్తి ఈయన. ఈ అత్యున్నత పురస్కారం ఆయన అపార కృషి ఫలితం అయితే దానికి అదృష్టం కూడా కొంత తోడ్పడి ఈ బహుమతి మరొకరితో పంచుకోకుండా ఆయన ఒక్కరికే వచ్చింది. 1980 ఫిబ్రవరి 4వ తేదీన ఆయన కనిపెట్టిన "క్వాంటమ్ హాల్ ఎఫెక్ట్"కి ఇప్పుడు ఈ బహుమతి లభించింది. అప్పుడే ఆయన తాను కనిపెట్టిన విషయాలని వివరిస్తూ ఒక వ్యాసాన్ని ప్రచురించాలని అనుకున్నారు. ప్రత్యేకంగా భౌతిక శాస్త్ర విషయాలని ప్రచురించే ప్రతిష్ఠాత్మకమైన పత్రిక ఆయన రాసిన ఆ నాలుగు పేజీల వ్యాసాన్ని మొదట తిరస్కరించి తర్వాత 1980 ఆగస్టు 11వ తేదీన ప్రచురించింది. అది చదివిన వెంటనే నిపుణులు దానిపై దృష్టిని కేంద్రీకరించారు. ఈ బహుమతి ప్రకటించడానికి స్వీడిష్ అకాడెమీకి అయిదేళ్లు పట్టిందేమిటని క్లిట్జింగ్‌ని అడిగితే ఆయన నవ్వుతూ '42 ఏళ్ల వ్యక్తికి నోబెల్ బహుమతి రావటం అన్నది అసాధారణమైన విషయం. దాని కోసం మరో 20 ఏళ్లు వృద్ధాప్యం వచ్చి తల నెరిసేదాకా ఆగాల్సి ఉంటుంది కదా' అన్నారు. భౌతిక శాస్త్రంలో "క్లిట్జింగ్ ఎఫెక్ట్" అద్భుతమైన కొత్త మలుపుగా భావించ బడుతున్నది...



ప్రొఫెసర్ హెయింజ్ కమిన్‌స్కీ (64) పశ్చిమ జర్మనీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త. అయితే ఇతని సహాధ్యాయులు ఇతని "జ్యోతిష శాస్త్రవేత్త"గా పిలుస్తూ ఉంటారు. అందుకు కారణం లేకపోలేదు. టెలిస్కోప్ అబ్జర్వేటరీకి డైరెక్టర్‌గా ఉంటున్న కమిన్‌స్కీ కొన్ని ఖగోళ వింతలను ఊహించి ముందే చెబుతూ ఉంటారు. 1973లో కొహూటెక్ తోకచుక్కకు సంబంధించిన రంగుల బొమ్మలను పత్రికల వారికి అందిస్తానని చెప్పారు. అయితే ఆ తోకచుక్క ఆ ప్రాంతంలో కనిపించలేదు. ఇకపోతే 1980 నాటికి శుక్రగ్రహంపై మనిషి పాదం మోపుతాడని సెలవిచ్చారు. అది కూడా వాస్తవం కాలేదు. ఈ అంశం నేటికి ప్రయత్న దశలోనే ఉంది. ఇకపోతే ఇప్పుడు 1986 ఫిబ్రవరిలో ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో మామూలు కంటికే బాగా కనిపిస్తుందని చెప్పబడుతున్న హేలీ తోకచుక్క సహారా ఎడారి ప్రాంతంలో అంత స్పష్టంగా కనిపించక పోవచ్చునని శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. కాని అక్కడకూడా స్పష్టంగా కనిపించగలుగుతుందని కమిన్‌స్కీ చెబుతున్నారు. ఎంతవరకూ నిజమవుతుందో వేచి చూడాలి.

వారఫలం

6–12–1985 శుక్రవారం మొదలు 12–12–1985 గురువారం వరకు

★ **మేషం:** ఏకానేక వ్యవహారంలో మీకు అనుకూలమే. ఆశకు మేరలేదు. నూతన వ్యాపారం ప్రారంభించాలని ఉబలాటం పడటం అనవసరం. రచనా ప్రావీణ్యం, పత్రికా వ్యాసంగం గల వారికి అనుకూల వారం. స్త్రీలకు: వృత్తియందు పెంపు, ఉత్సాహం.

★ **వృషభం:** మిత్రులతో బంధువులతో ఇంటికి రాగల సమయం. కొందరు అత్యవసరంగా దూర ప్రాంతాలకు పోవలసిన సమయం. అలవాటుగా చేసే వ్యాపారమందు పెంపు లభించే వారం. చేసిన పనినే మరలా చేయవలసి రావటంతో కొందరకు విసుగు జనించటం సహజం. స్త్రీలకు: అనవసర కలహాలు, ఆదాయ లోపం.

★ **మిథునం:** పత్రికా ప్రకటన కర్తలకు, పుస్తక విక్రేతలకు అనుకూల సమయం. రచనా ప్రావీణ్యత ప్రకాశింప గలదని గ్రహించాలి. అనుకూల వార్తా శ్రవణం. అతి శ్రమమీద రావలసిన డబ్బు వసూలు చేసికో గలుగుతారు. స్త్రీలకు: అప్రయత్న ధనరాబడి, ఉద్యోగరీత్యా అనుకూలతకు ఈ వారం సర్వ విధాలా మేలైనదే.

★ **కర్కాటకం:** ఏదో విధంగా బంధుమిత్రులతో మనస్పర్థలు రావచ్చు. అలాంటి గ్రహస్థితి మీ రాశికి ఉన్నది, గ్రహించాలి. ఓర్మితో సంచరించాలి. కళా సాహితీ మార్గాన కొందరకు మేలుండుట, ధన ప్రాప్తికి అవకాశమున్నది. రాజకీయంగా సర్వానుకూలత చేకూరుట కొందర విషయంలో చెప్పదగిన అంశం. స్త్రీలకు: బంధువర్గంలో ఆదరణ. ఉద్యోగ రీత్యా అనుకూలం.

★ **సింహం:** మీ మనోభీష్టం నెరవేరుతుంది. వ్యాపారాన మీ అంచనా సఫలీకృతం. 'జాయింటు' వ్యాపారం చేసేలాగైతే ముందు వెనుకలు ఆలోచించుట న్యాయం. కొందరకు అప్రయత్నంగా ధనలబ్ధి. అత్యవసర ప్రయాణం చేయవలసి రావచ్చు. స్త్రీలకు: అధికారం అభివృద్ధి అయ్యే సూచనలున్న సమయం.

★ **కన్య:** శుభ ప్రస్తావనలకు అవకాశం, ఒకటి రెండు మార్గాలలో ధనప్రాప్తి. నూతన వస్తు సేకరణకు అవకాశం. చేసే ఉద్యోగంలో అనుకూల మార్పు సంభవం. అనుకోకుండా కొందరు ఇల్లు మారుట కూడా సంభవమే. స్త్రీలకు: ఆశించినంత డబ్బు అందకపోవటంతో మానసికంగా చికాకు చెప్పదగిన ముఖ్యాంశం.

★ **తుల:** అధికార ప్రాబల్యానికి ప్రాకులాడి భంగపడుతారేమో గ్రహించండి. వృత్తియందు కూడ పెద్దగా వికాసముండదు. మానసికంగా మీకు ఇబ్బంది కలిగించాలని కొందరు యత్నిస్తారు. మీ రహస్యాలు మిత్రులతో కూడా చెప్పటం శ్రేయస్కరంగాదు. స్త్రీలకు: ఉద్యోగ వృత్తులందు చికాకులు ఏర్పడవచ్చు. ఆశించిన 'ప్రమోషన్' విలంబన అయ్యే సూచన గలదు.

★ **వృశ్చికం:** వ్యాపార రీత్యా గాని, వ్యవహార రీత్యాగాని, ఎవరు మిత్రులో ఎవరు కారో తెలుసుకోలేక తికమక పడుతారు. అందువలన ఒకటి రెండు వ్యవహారాలలో కొంత ఆలస్యం జరుగనున్నది. ఏ పని ఎటూ తేలక ఇబ్బంది పడుతారు. స్త్రీలకు: ఆరోగ్య లోపం, అర్ధాష్టమ 'శని' బాధ. గ్రహించి 'శనిస్తోత్రం' పఠించటం శ్రేయం.


★ **ధనుస్సు:** నూతన వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది. చాల మందికి కళా రంగానుభవం గల వారికి సదవకాశాలు లభ్యమయి ధనప్రాప్తికి అవకాశమున్నది. అయినా అంతకు అంత వ్యయం కూడా వ్యవహార రంగాన చెప్పదగిన అంశం. బంధువులకో మిత్రులకో మంచి చేయబోయి చెడు కొనుక్కుంటారు. స్త్రీలకు: మీరు చేసికొన్న ప్రణాళిక తారుమారయిందని బాధపడుతారు. ఓర్పుతో సంచరించదగిన వారం.

★ **మకరం:** పదిమందిలో ప్రతిష్ఠ తెచ్చుకొంటారు. నూతన వ్యాపారం పెట్టాలని కొందరి ఆకాంక్ష. వయోవృద్ధులు ఆరోగ్య విషయంగా జాగ్రత్త పడాలి. క్రితం చేసిన పొరపాట్లు సరిదిద్దుకోవలసిన అగత్యం ఎంతైనా ఉన్నది. కళాకారులకు ఇదియొక ఉత్తమ వారంగా భావించాలి. స్త్రీలకు: మనోవికాసం, ఆనందం, గౌరవం.

★ **కుంభం:** నూతన మార్గాన ధనం ఆపేక్షించవచ్చు. మీరు తిరిగే పదిమందిలో ఎవరు మిత్రులో, ఎవరు కాని వారో గ్రహించలేక-పోతారు. ధనం అధికంగా వ్యయం చేయవలసిన పరిస్థితులు ఏర్పడుతాయి. స్త్రీలకు: భిన్నమార్గాలలో ఆదాయానికి ప్రాకులాట, నిరుత్సాహత.

★ **మీనం:** ఈ వారమంతా మీకు ఆనందోత్సాహాలుంటాయి. అనవసరమయిన ఖర్చులు తగిలే అవకాశమున్నది. రాజకీయంగా మీకు అనుకూలంగాదు. రచన, నటన, నాట్యాదులందు ప్రావీణ్యం గల వారికి చక్కని అవకాశాలు లభ్యం కాగలవు. ఆరోగ్య రీత్యా అభివృద్ధికరమైన వారంగా భావించాలి. స్త్రీలకు: బంధుమిత్రుల రాక, పనుల హడావుడి.

—విద్వాన్ కోట సత్య రంగయ్య శాస్త్రి


ప్రేమపెళ్ళి...!
-శేఖర..
BANNU*
ఈ హోటల్ బిల్లులు నే భరించలేను గానీ ఇక త్వరగా పెళ్ళి చేసేసుకుందాం రాణీ...!!!
A.C. HOTEL
నేనొకమ్మాయిని... ప్రేమించాను నాన్నా!!
కట్ - కట్ !!
సెన్సార్ఆఫీసర్
పెళ్ళి చేసుకునే ముందు కరాటే రాదని చెప్పి మోసం చేస్తావా? ఆఁయ్!!
ఆ అమ్మాయి నన్ను తప్పకుండా పెళ్ళి చేసుకుంటుందా? ఎలా చెప్పగలుగుతున్నారు...?
BUS STOP
ఆ అమ్మాయి మా అమ్మాయే గనుక!!
హమ్మయ్య కట్నం బాధ తప్పింది
నువ్వేం చేసినా నిన్ను ప్రేమించనంటే...!?!
PARK
నా ప్రేమలేఖని ఆమెకివ్వమంటే... అది నా ప్రేమలేఖని చెప్పి నువ్వు వల్లో వేసుకుంటావా? మిత్రద్రోహి!!
PARK
BANNU*

సీరియల్

నీడలు-నిజాలు

విన్నకోట సుశీలాదేవి

(గత సంచిక తరువాయి)

మర్నాడు రవిని ఇంటికి తీసుకొచ్చారు.

లక్ష్మీదేవి డాక్టరుకైతే తేలిగ్గా మాటిచ్చింది కానీ - రవి చేత మందులు వేయించడం అంత సులభం కాదన్పించింది

రవి మందు వేసుకోడానికి ఏమాత్రం ఇష్టపడటంలేదు.

"అమ్మా! నాకిక కళ్ళు రావు. ఈ మందులు కూడా ఎందుకు? దండుగ. నేను వేసుకోను." అని మొండికెత్తేవాడు. లక్ష్మీదేవి బ్రతిమిలాడేది.

"బాబూ? నీకు తప్పకుండా కళ్ళు వస్తాయి. డాక్టరుగారు ఆపరేషను చేస్తానన్నారు. నా కోసమైనా వేసుకోరా రవి."

ఇలా బ్రతిమిలాడుతూ అతని చేత మందు తాగించేటప్పటికి విసుగొచ్చేదావిడకి

"అమ్మా ఆపరేషను ఎప్పుడు చేస్తారు?" ఒక రోజు రవి అడిగాడు.

"నువ్వు చాలా బలహీనంగా ఉన్నావుట బాబూ. బలం పట్టగానే చేస్తారట!" అంది

ఆ మాటలు విని నవ్వాడు రవి. తను బలహీనుడా! కాలేజీలో తను ఛాంపియన్. తన శరీర సౌష్ఠవాన్ని చూసి మగపిల్లలే ఈర్ష్యపడేవారు. అటువంటిది తనిప్పుడు బలహీనంగా వున్నాడా? కన్నుమూసి తెరిచేటంతలో ఎంత మార్పు వచ్చింది?

ఈ స్థితిలో తన స్నేహితులు వచ్చి చూస్తే ఏమనుకుంటారో ... ముఖ్యంగా సునీత ...

సునీత గుర్తుకు రాగానే అతని మనస్సులో - ఆనందపు కెరటాలు పువ్వెత్తున ఎగసిపడ్డాయి.

సునీత ఎలా వుందో? ఆమెని చూసి ఎన్నో యుగాలయినట్లు వుంది

"అమ్మా! నా కోసం మా ఫ్రెండ్సు ఎవరైనా వచ్చారా?" తల్లిని అడిగాడు.

"ఆ! నువ్వు హాస్పిటల్లో వుండగా వచ్చారు."

'వాళ్లల్లో అమ్మాయి వుందా!' అని అడగాలనుకున్నాడు. కానీ సిగ్గుపడి మానేశాడు.

"మళ్లీ రాలేదామ్మా "

"రాలేదురా."

వాళ్లల్లో సునీత వుండే వుంటుంది మళ్లా ఎందుకు రాలేదో? తన ఇంటికి రావడానికి బిడియపడిందేమో! అంతే అయివుంటుంది. లేకపోతే ప్రతి రోజూ వచ్చేది. సునీత తనని చూడకుండా ఒక్క క్షణం వుండలేదు. తామిద్దరూ మనసులు విప్పుకుని మాట్లాడుకోలేక పోయినా ఒకరి మనసు - మరొకరికి తెలుసు. వీలైనంత త్వరలో తమ అనుబంధాన్ని శాశ్వతం చేసుకోవాలనుకున్నాడు. ఇంతలో - ఇలా జరిగింది.

సునీతని మళ్లీ ఈ కళ్లతో చూడగలడా? తటిల్లతలా తళుక్కుమనే - ఆ అద్భుత సౌందర్యాన్ని చూసే అదృష్టం ఎన్నటికో!

సునీత - నా వూర్వశి. నా వీనస్ ...

"రవీ! శారద వచ్చిందిరా."

తల్లి మాటలకు వులిక్కిపడ్డాడు. తటిల్లత మాయమై - అంధకారం వ్యాపించినట్లయింది.

లక్ష్మీదేవి బత్తాయి తొనలు వలిచి పెడ్తూ అంది "బాబూ! శారదని ఒకసారి పలకరించరా. నీకు యాక్సిడెంటు అయిందని తెలీగానే కంగారుపడుతూ వచ్చింది."

రవి మాట్లాడలేదు.

అతడి మనసులో శారద వికృతరూపం ... మెదిలింది. శారదని పలకరించడమా! వుహు ... తన వల్ల కాదు!

సునీతతో పరిచయం అయ్యాక శారదని చూస్తేనే చాలు ఒంటిమీద తేళ్లు - జెర్రులు పాకుతున్నట్టుండేది.

ఈనాడు తనకు కళ్ళు లేకపోయినా - శారద వునికినే భరించలేని స్థితిలో వున్నాడు. తన అణువణువూ సునీత నిండిపోయింది. ఆమెని తప్ప మరొకరితో మాట్లాడటం కానీ - తలుచుకోవడం కానీ తన కసాధ్యం ...

ఇంతలో - "అత్తయ్యా! నీ కోసం ఎవరో వచ్చారు" అంటూ శారద పైకి వచ్చింది.

లక్ష్మీదేవి కుర్చీలోంచి లేచి -

"ఇప్పుడే వస్తాను రవీ" అంటూ క్రిందికి వచ్చింది.

శారద అక్కడే నిలబడి క్షణకాలం రవి వైపు చూసింది. ఎప్పుడూ ట్రిమ్‌గా తయారయి క్షణం కూడా ఇంట్లో వుండకుండా తిరిగే బావ - ఇప్పుడు యుద్ధంలో ఓడిపోయిన వీరుడిలా మంచంమీద పడివున్నాడు. ప్చ్! విధి ఎంత బలీయమైంది. అనుకుంది.

కళ్లకు బాండేజీతో దిగులుగా పడుకున్న బావ దగ్గరకు వెళ్లి 'బావా విచారించకు! నేనున్నాను. నీకు కళ్ళు రాకపోతే - నా కళ్ళు నీకిస్తాను." అని చెప్పాలనిపించింది.

కానీ ఒక్కడుగు కూడా ముందుకు వెయ్యలేకపోయింది ఇప్పటి పరిస్థితి వేరు. ఒకప్పుడైతే అలాగే చెప్పేది. కానీ ఈనాడు తమ మధ్య ఆ సాన్నిహిత్యం లేదు తామింత దగ్గరగా వున్నా - తమ మధ్య కొన్ని వేల మైళ్లదూరం వుంది. తాము బావామరదళ్లయినా ఆగర్భ శత్రువుల్లా వున్నారు

శారద బాధపడుతూ - ఆలోచిస్తూ క్రిందికి వెళ్లింది!

★ ★ ★ ★ ★

చీకటి ...

కారు చీకటి ...

లోకంలో చీకటి తప్ప వెలుగు లేనట్లు కన్పించసాగింది రవికి ... ఇరవై నాలుగ్గంటలూ తను మంచానికే అంకితమైపోయాడు. తన వూహ తెలిశాక తనిలా

జరిగిన కథ-2: వెంకట్రామయ్య కూతురు శారద. తల్లి లేని శారదను తండ్రి అల్లారుముద్దుగా పెంచుతాడు. వెంకట్రామయ్య చెల్లెలు లక్ష్మీదేవి కుమారుడు రవి. రవికి ఏక్సిడెంటు అయ్యిందని తెలిసి చూసి రాను హైదరాబాదు వెళతానని పట్టుపట్టింది శారద. శారదను రైలెక్కిస్తాడు వెంకట్రామయ్య. రైల్లో శారదకి గతం అంతా కళ్ల ముందు కదలాడింది. శారదకి, రవికి పెళ్లిచేయాలనుకుంటారు పెద్దలు. రవి దుడుకుతనం వల్ల కాగే కాగే నూనె శారద ముఖంపై, చేతులపై చింది ఆమె శరీరం అందవికారమయిపోతుంది. అయినా రవికి శారదపై ప్రేమ తగ్గలేదు. రవి యూనివర్సిటీలో ఎం. కామ్.లో చేరతాడు. అక్కడ జరిగిన ఒక సంఘటన అతని జీవితాన్ని ఒక కొత్త మలుపు తిప్పింది. రవికి సునీత పరిచయం అయ్యింది. అతను శారదను వివాహం చేసుకోనని ఇంట్లో చెప్పేస్తాడు. శారదను పెళ్లి చేసుకోలేనని మేనల్లుడు చెప్పగా విన్న వెంకట్రామయ్య దీనికి తలదన్నే సంబంధం తెచ్చి శారదకు పెళ్లి చేయాలని దేశమంతా గాలించడం మొదలుపెట్టాడు - మేనకోడల్ని చూచిన లక్ష్మీదేవికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. రవికి కంటిచూపు పోయింది. అతను పూర్తి ఆరోగ్యవంతుడయిన తర్వాత ఆపరేషన్‌చేస్తే చూపు వచ్చే అవకాశం ఉందని డాక్టరు చెపుతాడు.

ఒంటరిగా ఎప్పుడూ లేడు. తన చుట్టూ ఎల్లవేళలా పదిమందికి తక్కువ కాకుండా స్నేహితులు వుండేవారు. సందడికి - సరదాకి మారు పేరుగా వుండేవాడు. తనే పాపం చేశాడో ఈనాడీ దుస్థితి వచ్చింది.

ఈ ఒంటరితనం పిచ్చెక్కిస్తోంది. గుండెలో ఏదో ఆవేదన ... ఏదో దిగులు ... నిలువునా క్రుంగదీస్తున్నాయి. దుఃఖం వుప్పెనలా వస్తోంది. తనకెందుకీ శిక్ష ... కాళ్ళూ చేతులూ కట్టేసినట్టు ఈ మంచంలో ఇలా పడుకోవటం ఎంతో దుర్భరంగా వుంది.

తనకెందుకీ శిక్ష. కనీసం మనస్సు విప్పి మాట్లాడేవారు కూడా లేరు. తనని ఓదార్చి తన ఈ ఒంటరితనాన్ని పోగొట్టేవారు ఎవరూ లేరు.

తండ్రికెప్పుడూ బిజినెస్ వ్యవహారాలు. ... తల్లి తన దగ్గర కూర్చున్నా ... ఏవేవో జాగ్రత్తలు - మందులు - వీటి గురించి చెప్తుంది. ఇక తనతో మాట్లాడే వారెవరున్నారు?

తను యూనివర్సిటీలో వుండగా - క్షణం కూడా తనని వదలకుండా తిరిగే స్నేహితులిప్పుడు ఈ ఇంటి ఛాయలక్కూడా రావటంలేదు. ఇప్పుడు తను మంచంలో పడ్డాడు. పైగా గ్రుడ్డివాడయ్యాడు. ఇక తన అవసరం వాళ్ళకేముంది. ఈ గ్రుడ్డివాడితో మాట్లాడటం వాళ్ళకిప్పుడు అపహాస్యంగా కూడా వుండొచ్చు. ఛ!స్నేహం అంటే ఇదేనా ... తన కళ్ళు రానీ వాళ్ళ పని చెప్తాడు. వెధవలు ... ఒక్కొక్కడినీ నడి రోడ్డుమీద నిలబెట్టి దులిపేస్తాడు.

పోనీ ... వాళ్ళు రాకపోయినా సునీత రావచ్చు కదా ... సునీత కూడా వాళ్ళలాగే స్వార్ధపరురాలా ? ... తన మీద ఎంత ప్రేమ చూపింది?

"రవీ! నిన్ను ఒక రోజు చూడకపోతే .. పిచ్చెక్కినట్టు వుంటుంది!" అనేది.

కానీ ఇప్పుడు - ముఖమన్నా చూపించడంలేదు! సునీత ... ఇంత మోసగత్తె అనుకోలేదు. లోకంలోని మనుషులందరూ ఒక్కటే ... స్వార్ధపరులు ... అవకాశవాదులు ... తమకు అవసరం వుంటే మనుషులమీద ప్రేమ నటిస్తారు. అవసరం తీరాక కన్నెత్తి కూడా చూడరు.

లోకంలో వున్నదంతా మోసం ... దగా ... ఈ ప్రేమలు - అభిమానాలు అన్నీ బూటకం.

తన కళ్ళు వచ్చాక ... వీళ్ళని నరికి పోగులు పెట్టాలి. కసిగా అనుకున్నాడు



నీడలు - నిజాలు

రవి.

కానీ వెంటనే ... తనకసలు కళ్లే రాక పోతే ... అనిపించింది.

ఆ ఆలోచనతో గుండె ఝల్లుమంది. తనకసలు కళ్ళు రాకపోతే జీవితమంతా ఇలా గ్రుడ్డివాడుగానే వుండిపోవాలా?

తను జీవితంలో ఎన్నో సాధించాలనుకున్నాడు. తనకెన్నో ఆశలు, కోరికలు వున్నాయి. ఈ ప్రపంచంలో వున్న సౌందర్యాన్నంత తనివితీరా చూడాలనుకున్నాడు. కాని ఏది తీరలేదు. ఇక తీరవు కూడా! అంతేకాదు ... చచ్చే వరకూ ఇలా మంచంలోనే పడి వుండాలి. ఈ గ్రుడ్డివాడికి ఎల్లవేళలా సేవలు ఎవరు చేస్తారు!

ఎప్పుడో ఒకప్పుడు బయటకు నెట్టేస్తారు. అప్పుడు తను ... రోడ్డు మీద దీనంగా పడుకొని అందర్నీ ముష్టెత్తుతాడేమో ....

రవికి హఠాత్తుగా చాలా రోజుల క్రితం చూసిన దృశ్యమొకటి మనోఫలకం మీద మెదిలింది.

ఒకసారి - బజార్లో - తను స్కూటర్‌మీద వెడుతోంటే గ్రుడ్డివాడొకడు తనకు అడ్డం వచ్చాడు. తను సడన్‌బ్రేకు వేసి ... వాడిని నానా తిట్లు తిట్టాడు.

"గ్రుడ్డి వెధవ! ఒక చోట పడి వుండలేవూ. కాస్తయితే స్కూటర్ క్రింద పడి చచ్చేవాడివి. కోర్టు చుట్టూ తిరగలేక నేను చచ్చేవాడిని."విసుక్కున్నాడు.

అలాగే తననీ - రేపు అందరూ విసుక్కుంటారు. తిడతారు. అసహ్యించుకుంటారు. ... ఇక తన బ్రతుకు అలాగే అంతమవుతుంది.

ఆలోచిస్తున్నకొద్దీ రవికి దుఃఖం ఆగడంలేదు. ఆ విధంగా తను బ్రతకలేడు ... తనకు ఆదరణ - ఆప్యాయత కావాలి ... ప్రేమ - అభిమానం కావాలి. ఎల్లవేళలా తన ప్రక్కనే కూర్చుని - తనతో సరదాగా మాట్లాడుతూ తన ఒంటరితనాన్ని పోగొట్టే వ్యక్తి కావాలి.

కానీ ... ఎవరొస్తారు తన దగ్గరకు! ఎవరిస్తారు తనకు ఆ ఆప్యాయత. ఆదరణ ...

రవి కన్నీటితో దిండు తడిసిపోతోంది. వెక్కి వెక్కి చిన్నపిల్లవాడిలా ఏడుస్తున్నాడు.

అలా ఎంతసేపు వున్నాడో -

ఇంతలో క్రింద నుండి ఒక పాట విన్పించింది.

నల్లనివాడా
నే గొల్ల కన్నెనోయి
పిల్లనగ్రోవూదుమోయి
నా యుల్లము రంజిల్లగా.

పాట గాలిలో తేలి - తేలి ... మృదు మధురంగా చెవికి సోకుతోంది.

ఎంత చక్కని కంఠం. ఎవరో చక్కగా పాడుతున్నారు. ఆ పాట మనసుని ఎక్కడెక్కడికో తీసుకెడుతోంది. ఏవేవో సుందర దృశ్యాల్ని చూపిస్తోంది. జీవిత తియ్యదనమే! చేదు లేదు అని చెప్తోంది! మనస్సుని, శరీరాన్ని మత్తెక్కిస్తోంది. ఆ పాట పాడేది ఎవరు? మనుషులా? లేక దేవతలా?

ఇన్నాళ్ళూ తనకు శరీరాన్ని ఉద్రేకపరిచే సంగీతమే తెలుసు. మనస్సుని సుఖింపజేసే సంగీతాన్ని మొదటిసారిగా వింటున్నాడు. ఎంత హాయిగా వుంది. ఈ పాట వింటూవుంటే చాలు. జీవితంలో ఇంకేమి అక్కర్లేదనిపిస్తోంది!

రవి పరిసరాలు మరిచిపోయి పాటలో పూర్తిగా లీనమైనాడు.

కొద్దిసేపటికి పాట ఆగింది. కానీ పాటలోని మాధుర్యం అతడి మనసుని ఇంకా ఆవరించే వుంది. ఆ పాటని తలుచుకున్నాడు. ఆ రసజగత్తులో ఓలలాడుతున్నాడు.

"చిన్న బాబుగారూ!"

ఆ పిలుపుతో రవి ఈ లోకంలోకి వచ్చాడు!

"ఎవరూ."

"కాఫీ తెచ్చానండి" పనిమనిషి చెప్పింది. రవి లేచి కూర్చున్నాడు! "ఇటివ్వు" కప్పు అందుకున్నాడు!

కాఫీ త్రాగుతూ అడిగాడు "ఇంతకుముందు పాట వచ్చిందే! క్రింద ఎవరైనా రేడియో పెట్టారా?"

"లేదండీ! అమ్మాయిగారు పాడారు!" అంది పనిమనిషి.

"అమ్మాయిగారా! మనింటికి ఎవరైనా బంధువులు వచ్చారా?"

"లేదండీ! శారదమ్మగారు పాడారు."

రవి వులిక్కిపడ్డాడు. అతడి చేతిలోని కప్పు వణికింది.

"నిజంగానా! శారద పాడిందా! నువ్వు సరిగ్గా చూశావా"

"అవునండీ! నేనక్కడే వున్నా! పెద్దమ్మగారు అడిగితే పాడారు, అమ్మాయిగారు!"

రవి కప్పు ఇచ్చేశాడు!


"పూర్తిగా తాగనే లేదండి" అంది.


"వద్దు తీసుకెళ్ళు!"

పనిమనిషి వెళ్ళిపోయింది.

రవి వెనక్కి - దిండ్లకి ఆనుకుని కూర్చున్నాడు. పనిపిల్ల చెప్పిన మాటల్ని ఇంకా నమ్మలేక పోతున్నాడు.

శారద ... పాడిందా! శారద ఇంత చక్కగా పాడుతుందా. శారద సంగీతం





మొదలెట్టండి యివాళే– 6 వారాల్లో చూడండిక–

వంటిచాయను మెరుగుపరిచే క్రీమ్

క్లియర్•టోన్

మీ రంగురూపాల్ని కొత్తదనంతో రూపొందిస్తుందిక

1వ వారం



కోమలమైన చర్మం కేవలం మూడు రోజుల్లో !

2వ వారం




మొటిమల గుర్తులు పోతున్నాయి...
అబ్బ ఎంత హాయి !

3వ వారం




చూసావా, మోచేతులు నిగనిగలాడుతున్నాయి అప్పుడే.

4వ వారం



"నీ ముఖానికి చాయవచ్చి మెరుస్తోంది."
అంది ఓ మిత్రురాలు.

5వ వారం



ఎండలోకెళ్ళినా, వాడదిక చర్మం.

6వ వారం




ఇప్పుడు నేనున్నా క్లియర్•టోన్ బృందంలో !

క్లియర్•టోన్‌లోని అద్వితీయ సూత్రీకరణ. మీ చర్మానికి మరింత మెరుపునిస్తూ మరింత మెరుగైన చాయతో రూపొందిస్తుంది. సున్నితంగా. అంతేకాదు. క్లియర్•టోన్‌లో గల ఒక ప్రత్యేకమైన పదార్థం. అసహ్యమైన ఆ మచ్చల్ని పోగొడుతుంది. దీనిలోగల ప్రభావమైన 'మాయిశ్చరైజర్' మీ చాయను యితరులు మెచ్చుకునేటంతగా మెరుపునూ, మృదుత్వాన్నీ యిస్తుంది. ఇదంతా కేవలం 6 వారాల్లో !

చక్కని ఆ ఫలితాలు అలాగే వుండటానికోసం క్లియర్•టోన్‌ని రోజుకు రెండుసార్లు రాసుకుంటూ వుండండి. యింట్లోనూ, ఎండలో బయిటికి వెళ్ళినప్పుడూను.

మెరుగైన ఫార్ములా
తిరుగులేని ఫలితం



క్లియర్•టోన్

మెరుగైన వంటిచాయలోని రహస్యం – సహజమైన రీతిలో

లండన్ • పారిస్ • న్యూయార్క్

daCunha/NICL/76/85-TL-R

నీడలు – నిజాలు

ఎప్పుడు నేర్చుకుంది.

ఇదివరకెప్పుడూ ఆమె పాడగా వినలేదు. ఎంత హాయిగా వుంది ఆమె కంఠం.

రవి మనస్సులో ఆ గానం మెదిలింది. మనస్సు ఆ గాన మాధుర్యంలో లీనమవసాగింది. ఆ పాటని గూర్చి ఆలోచిస్తోంటే ... శారద రూపం గుర్తుకు రావడంలేదు. గానమే నిలిచిపోతోంది.

శారద గానమై ... ఆ పాటలోని భావమై .. భావంలోని మాధుర్యమై హృదయాన్ని కదిలిస్తోంది.

వికృతమైన ఆమె రూపం ... మనో యవనిక మీద నుండి తొలగింది. కమ్మని ఆ పాట మాత్రం స్థిరత్వాన్ని సంపాదించుకుంది!

*   *   *   *   *

వర్షపుజల్లు మీద పడటంతో రవికి మెలకువ వచ్చింది.

బయట జోరున వర్షం కురుస్తోంది. మధ్య మధ్య వురుములు చెవులను బద్దలు చేస్తున్నాయి. గాలికి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకొంటున్నాయి.

వర్షపుజల్లు కిటికీలో నుండి మీద పడి రవి ఒళ్లంతా తడిసి ముద్దవుతోంది.

పైన ఫ్యాను తిరుగుతున్నట్లనిపించడం లేదు. అంటే కరంటు కూడా పోయిందన్న మాట అనుకున్నాడు రవి.

మళ్లీ ఒక్కసారి జల్లు వచ్చి నిలువునా తడిపేసింది. ఎవరైనా కిటికీ రెక్కలు వేస్తే బాగుణ్ణు అనుకున్నాడు ముఖం తుడుచుకుంటూ.

"అమ్మా" అని పిల్చాడు.

కానీ ఏ విధమైన అలికిడీ విన్పించలేదు. అమ్మ రోజూ తన మంచం ప్రక్కనే పడుకొని - తను ఏమాత్రం కదలినా ఎలా తెలుస్తుందో ఏమో గానీ - వెంటనే లేచి తన దగ్గరికి వచ్చేది

ఇవాళ పిలిచినా రావడం లేదే. ఏమైంది అనుకుంటూ మళ్లీ 'అమ్మా' అని పిలవబోయి ఆగాడు - అప్పుడు జ్ఞాపకం వచ్చింది రవికి -

తల్లీ - తండ్రీ ప్రొద్దున్నే వూరు వెళ్లారు. పనిమనిషిని తనకు సహాయంగా వుంచారు. అది సినిమాకు వెడతానని గొడవ చేస్తే తనే కదా పంపించాడు. అదంతా మర్చిపోయి ఎవ్వరూ రావడంలేదని బాధపడిపోతున్నాడు.

భయంకరంగా శబ్దం చేస్తూ పిడుగుపడింది.

ఆ శబ్దానికి రవి వణికిపోయాడు.

మళ్లీ జల్లు వచ్చి ముఖాన కొట్టింది.

ఎలా ఇప్పుడు? ఇంట్లో ఎవ్వరు లేరు. తను మంచంలో నుండి లేవలేడు. ఒకవేళ లేచినా ఏది ఎక్కడుందో తెలుసుకోలేడు. గ్రుడ్డివాడి బ్రతుకు ఎంత దుర్భరం.

ఇప్పుడింక తన దగ్గరకు వచ్చేవాళ్లెవరున్నారు? తనిలా వర్షంలో తడిసిపోవలసిందేనా! చలికి శరీరం గజగజా వణికిపోతోంది.

మనిషికి తిండీ - సుఖాలు కంటే ఆప్యాయత - ఆదరణ ముఖ్యం. నాకూ ఆప్యాయత కావాలి! ఆదరణ కావాలి. ఈ ఒంటరితనాన్ని దూరం చేసే తోడు కావాలి.

ఎవరొస్తారు? ఎవరాదరిస్తారు?

ఈ వర్షపు బాధకన్నా, ఒంటరితనపు బాధే రవినెక్కువ బాధిస్తోంది. దుఃఖం కట్టలు తెంచుకు వస్తోంది. తనకి బ్రతుకు వద్దు. ఇలా బ్రతకలేడు. ఇంతకన్నా చావడం నయం.

అవును! తను చావాలి. చావాలి. చస్తాడు!

"బావా!"

మృదువైన స్వరం విన్పించింది.

"బావా! నీ మీద వర్షం పడుతోందా?"

"ఎవరూ?"

"నేను బావా! శారదని"

శారద వచ్చి కిటికీ మూసింది.

"బావా నీ మీద వర్షం పడిందా?" రవి దగ్గరికొచ్చి మీద చెయ్యి వేసింది.

రవి శరీరం నీళ్లల్లో ముంచినట్లుగా వుంది.

"అయ్యో! పూర్తిగా తడిసిపోయావే?"

శారద చేతిలోని కొవ్వొత్తి ఆరిపోయింది. శారద మళ్లీ వెలిగించి టేబిల్ మీద పెట్టింది.

"బావా దుప్పటి మారుస్తాను లేస్తావా?" సన్నటి గొంతు వింటుంటే రవికి తను విన్న శారద పాట గుర్తుకు వస్తోంది.

శారద దుప్పటి మార్చింది!

"నీకు బట్టలు తెస్తానుండు!"


రవికి శారద మాటలు విన్పించడం లేదు. శారద పాటే మనసులో మెదుల్తోంది.


రవి శారద సహాయంతో బట్టలు మార్చుకున్నాడు.

"టవల్‌తో తల తుడుస్తానుండు బావా!"అంటూ శారద తల తుడవ సాగింది.

"ఎంత తడిసిపోయావ్ బావా! చల్లగాలికి నిద్రపట్టేసింది. తీరా మెలకువ వచ్చి చూసేసరికి వర్షం పడుతోంది. కరెంటు పోయింది. ఇంతలో నువ్వు జ్ఞాపకం వచ్చి ఇలా పరిగెట్టుకు వచ్చాను."

శారద ఏదేదో మాట్లాడుతూ రవి తల తుడిచింది. ఫ్లాస్కులో వున్న పాలు





గ్లాసులో పోసి రవి కిచ్చింది. రవి త్రాగాడు. వేడి పాలతో శరీరం వెచ్చబడసాగింది!

"బావా! పడుకుందువుగాని లే" అని రవిని కుర్చీలో నుండి లేపింది.

రవి లేచి అడుగేయబోయి తూలాడు. శారద చటుక్కున రవి బుజాల చుట్టూ చేతులు వేసింది. ఆమె మెత్తని స్పర్శకి రవి శరీరం ఝల్లుమంది. శారద తన బుజాల్ని పట్టుకుని నడిపిస్తోంటే రవి కెంతో తృప్తిగా వుంది.

మనిషికి ఇంతకన్నా ఏం కావాలి? తను కోరుకున్న ఆదరణ – ఆప్యాయత ఇదే..... ఇన్నాళ్ళూ తనని చూసేవాళ్ళెవరూ లేరని బాధపడ్డాడు. కాని తనకు శారద వుంది. శారద అభిమానం వుంది! అది చాలు.

శారద రవిని మంచం మీద పడుకోబెట్టింది. బుజం మీద నుండి, చెయ్యి తీయబోతుంటే ఆ చేతిమీద చెయ్యి వేశాడు అప్రయత్నంగా.

"శారదా" అన్నాడు మెల్లగా.

శారద ఆశ్చర్యంగా చూసింది.

బావ నోటి నుండి తన పేరు ఎన్నాళ్లకు వింది. ఎన్నో యుగాలైనట్లుగా వుంది.

"శారదా" రవి మళ్ళీ పిలిచాడు. శారద మనస్సు పులకించి పోయింది!

కళ్లల్లో నీళ్ళు తిరుగుతుండగా–

"ఏమిటి బావా!" అంది.

"ఇప్పుడు టైమెంతయింది శారదా!"

"ఎందుకు బావా!"

"ఇప్పుడు రేడియోలో పాటలేవన్నా వస్తాయా శారదా!"

"టైమెంతయిందో తెలీదుగానీ– ట్రాన్సిస్టర్ ఇక్కడేవుంది ఆన్ చేస్తానుండు!" అని ప్రక్కనే వున్న ట్రాన్సిస్టర్ తీసి ట్యూన్ చేసింది. రేడియో బరబరలాడింది.

"రేడియోలో ఏమి రావటం లేదు బావా!" అంటూ రేడియో కట్టేసింది శారద.

"అలాగా" అన్నాడు రవి నిరాశగా!

"బావా! నీకు పాటలంటే ఇష్టమా!"

"అవును శారదా! నాకు పాటలంటే చాలా ఇష్టం! ఈ వర్షంలో ఈ చల్లని రాత్రి వేళ-- చక్కటి పాట వింటో ంటే ఎంతో బాగుంటుంది!"

"పోనీ! నేను పాడనా బావా?"

రవి వుత్సాహంగా అన్నాడు.

"పాడు శారదా! మొన్న నువ్వు పాడావే! నల్లనివాడా అంటూ ఆ పాట పాడు".

శారద ఆశ్చర్యంగా చూసింది.

"బావా! ఆ పాట నువ్వు విన్నావా! నీకు నచ్చిందా"!

"ఆ! విన్నాను ఆ పాట నాకు చాలా బాగా నచ్చింది అది పాడు." అనడిగాడు!

రవి అలా అంటో ంటే శారద మనస్సు ఆనందంతో నిండిపోయింది.

తన పాటని ఇంతవరకూ ఎందరో – ఎన్నో విధాలుగా మెచ్చుకున్నారు. కానీ ఆ మెప్పుదలలేమీ తనకు ఆనందాన్ని కలిగించలేదు.

ఇప్పుడు తన బావ తన పాటని మెచ్చుకుని– తన పాట వినాలని కోరుతూంటే తన మనస్సు వుప్పొంగి పోతోంది! ఎంతో వుత్సాహంగా గొంతెత్తి పాడాలని వుంది! పాడటంలో తనకున్న నేర్పంతా చూపాలని వుంది.

ఇంతకాలం అపశ్రుతులతో మూగవోయిన కంఠాన్ని శ్రుతిచేసుకుని పాడుతుంది.

బావని మైమరపిస్తుంది".

అనుకుంటూ పాడటానికి వుపక్రమించింది శారద!

* * * * *

ఉదయిస్తున్న సూర్యుడిని చూస్తూ కూర్చుంది శారద! తూర్పు కాంత ఎర్రచీర వదిలి పసుపుచీర ధరిస్తోంది. మంచు మేలిముసుగుల్ని ధరించిన మందారాలు– సూర్యకిరణాలు ఆ ముసుగుల్ని తొలగిస్తోంటే సిగ్గు-పడుతున్నాయి. చల్లగాలికి చెట్ల ఆకులు గజగజ వణికిపోతున్నాయి.

రోజూ వుదయాన్నే లేచి అందమైన ఉషోదయాన్ని చూస్తూ కూర్చోడం శారదకి అలవాటు : ఆ వాతావరణం ఆహ్లాదాన్ని కలిగించేది కానీ ఆనందాన్ని కలిగించేది కాదు!

'కానీ ఆ రాత్రి.... వర్షపు రాత్రి – బావ తనతో మాట్లాడిన తర్వాత ఉదయపు వాతావరణం ఎంతో ఆనందం కలిగిస్తోంది. అసలీ ప్రపంచమే సౌందర్య మయంగా, సంతోష భరితంగా భాసిల్లుతోంది! ఎందుకీ మార్పు!

"స్వర్గం– నరకం వేరే ఎక్కడో లేవు! మన మనసులో నే వుంటాయి" అన్నాడొక కవి! అది నూటికి నూరు పాళ్ళూ నిజం!

ఇప్పుడు తన మనస్సు ఎన్నడూ లేనంత సంతోషంగావుంది. అందుకే రోజూ చూసే ప్రకృతే అందంగా ఆహ్లాదకరంగా కనబడుతోంది. అసలిటువంటి రోజు జీవితంలో మళ్ళా వస్తుందనుకోలేదు.

ఇక మళ్ళీ జీవితంలో నా వేపు కన్నెత్తి చూడదనుకున్న బావ నాతో ప్రేమగా మాట్లాడుతున్నాడు. నన్ను పాడమని అడుగుతున్నాడు! ఇంతకంటె ఏం కావాలి?"

ఆలోచిస్తున్న శారద మనస్సు వుప్పొంగిపోతోంది!

"శారదమ్మగారూ మీ రిక్కడ వున్నారా? ఇదిగోనండి కాఫీ."

వంటావిడ వచ్చి కాఫీ ఇచ్చింది!

శారద కప్పు అందుకుంది!

"బావకి కాఫీ ఫ్లాస్కులో పోయండి."

"అలాగే" అంటూ ఆవిడ వెళ్ళిపోయింది.

శారద తను కాఫీ తాగి – ఫ్లాస్కు తీసుకుని మేడ మీదికి వెళ్ళింది

అప్పటికే రవి నిద్ర లేచి – దిండు కానుకుని కూర్చున్నాడు

అడుగుల చప్పుడు విని "శారదా" . అని పిలిచాడు.

శారద ఆశ్చర్యపడింది "ఎలా తెలుసుకున్నావ్ బావా" అంది

"నీ అడుగుల చప్పుడు ఆ మాత్రం గ్రహించలేనా శారదా. నేల మీద గట్టిగా నడిస్తే నేల ఎక్కడ అరిగిపోతుందో అన్నట్లు మెల్లగా– మెత్తగా పడతాయి నీ అడుగులు!"

రవి మాటలకు శారద నవ్వింది.

నీడలు – నిజాలు

"దొరగారికి కవిత్వం కూడా వస్తోందే!"

"నీ సాహచర్య ప్రభావం. మరి"

శారద తన చేతిలోని ఫ్లాస్కు టేబిల్పైన పెట్టింది!

"బావా! త్వరగానే లేచావే! నీకింకా ఎలా మేలుకొలుపు పాడాలా అని ఆలోచిస్తూ వస్తున్నాను" అంది శారద.

"ఉదయాన్నే లేస్తే ఆరోగ్యమూ–– ఆనందమూ కలుగుతాయని నువ్వే కదా చెప్పావ్! అందుకే లేచాను! ఆరోగ్యమూ–– ఆనందమూ తెలీడం లేదుగానీ చాలా ఫ్రెష్‌గా మాత్రం వుంది."

"ముఖం కడుక్కో బావా! వేడి వేడి కాఫీ త్రాగితే ఇంకా బాగుంటుంది!"

రవి శారద సహాయంతో ముఖం కడుకున్నాడు! శారద కాఫీ కప్పులో పోసి ఇచ్చింది.

"శారదా ! కళ్ళు వచ్చాక ముందుగా ఏం చూస్తానో తెలుసా! నువ్వెంతో అందంగా వర్ణించిన సూర్యోదయాన్ని – నువ్వు నాప్రక్కనే వుండి చూపించాలి.!"

"అలాగే బావా! తప్పకుండా!"

"శారదా! నిలబడే వున్నట్టున్నావ్. కూర్చోకూడదూ?" అన్నాడు. రవి మాటలకు శారద ఆశ్చర్యపడింది. రవికి కళ్ళు లేకపోయినా చూసినట్లే మాట్లాడుతున్నాడు. ఇంతటి శక్తి ఎలా వచ్చిందో?" అనుకుంటూ మంచం దగ్గరగా కుర్చీ జరుపుకుని కూర్చుంది.

రవి శారద చెయ్యి పట్టుకున్నాడు.

"శారదా! నిన్నూ, మావయ్యని అనరాని మాటలన్నాను! నన్ను క్షమిస్తావా?"

శారద నొచ్చుకుంది!

"ఛ! అదేమిటి బావా! మనలో మనకి క్షమాపణలెందుకు? అయినా ఆ గడచిపోయిన రోజుల్ని నేనేనాడో మర్చిపోయాను! నువ్వు కూడా మర్చిపో! బావా," అంది.

రవి మనస్సు ఆర్ద్రమైంది.

"శారదా! నువ్వు అందరిలాటి దానివి కాదు! నువ్వు దేవతవి! నీకింత అన్యాయం చేసినా నన్ను చూడటానికి వచ్చావు! నాకు సేవ చేస్తున్నావు! శారదా! నేనిప్పుడు గ్రుడ్డివాడిని కాదు. నాకళ్ళు ఇప్పుడే తెరుచుకున్నాయి! ఇన్నాళ్ళూ కళ్ళుండీ గ్రుడ్డివాడి నయ్యాను. ఏది రాయో! ఏది రత్నమో తెలుసుకోలేకపోయాను! ఈ రోజు నా గ్రుడ్డితనం పోయింది. నిజానిజాలు తెలుసుకున్నాను! నిన్ను వదులుకోను శారదా! నాకు కళ్ళు రాగానే మనం పెళ్ళి చేసుకుందాం!" అన్నాడు ఉద్వేగంగా!

'పెళ్ళి' మాట ఎత్తగానే శారద మనస్సు ఝల్లుమంది! సిగ్గు– ఆనందంతో నోరు పెగల్లేదు!

"శారదా! మాట్లాడవే! నన్ను పెళ్ళి చేసుకోవడం నీకిష్టం లేదా' ఇంకా నన్ను క్షమించలేదు కదూ," దీనంగా అన్నాడు రవి!

శారద నొచ్చుకుంది.

"అదేం కాదుబావా! నా కంత అదృష్టమా అని ఆశ్చర్యపడుతున్నాను."

"శారదా! అదృష్టం నీది కాదు. నాది. కీడెంచి మేలెంచమంటారు. శారదా! ఒకవేళ నాకు కళ్ళు రాకపోతే....... " రవి మాటలు పూర్తి కాకుండానే శారద అందుకుంది.

"బావా! నీకు కళ్ళు తప్పకుండా వస్తాయి. నా మాట మీద నమ్మకం లేదా?"

"అదికాదు శారదా! ఒకవేళ నాకు కళ్ళు రాకపోతే ఈ గుడ్డివాడిని వదిలేస్తావా!" రవి గొంతు గద్గదమైంది!

శారద రవి చేతిని తన చేతిలోకి తీసుకుంది "బావా! నీకు కళ్ళు రాకపోతే ఏమయింది! నాకు రెండు కళ్ళున్నాయి మనిద్దరం పంచుకోడానికి!"

ఆ మాటలకు రవి చలించిపోయాడు.

"శారదా.. . నువ్వు నిజంగా దేవతవి" శారద రెండు చేతుల్ని పట్టుకుని తన గుండెల మీద పెట్టుకున్నాడు. ఇప్పుడు అతని మనస్సు నిండా శారదే నిండివుంది!

(ఇంకా ఉంది)

టి. ఎమ్. హెచ్. ఎ. మండపేట

★ ఈ సమాజం మారదంటారా? కట్నాలు తెలెని అమాయకురాలను మగవారు అగ్నికి ఆహుతి చేస్తున్నారు. దీనిపై మీ అభిప్రాయం?

● ఎందుకు మారదు? మారిన వాళ్లని మీరు చూడడం లేదనుకోవాలి. ఆడపిల్లని 'పెళ్లి' కోసమే అన్నట్టు పెంచడం మానితే గాని యీ అఘాయిత్యాలు ఆగవు. చదువుకుని తన కాళ్ల మీద తాను నిల్వగల్గిన ఆడపిల్లలని కూడా అర్థం లేకుండా తల వంచేలా చేసే తల్లితండ్రులు మారాలి ముందు. చిన్నతనం నుండి అణిగిమణిగి వుండడం, పిరికి మందు పోయడం ఎంతో కష్టం మీద పెళ్లి జరిపించామనడం – యివన్నీ పోవాలి. ఇంత కష్ట పెట్టి ఈ తల్లితండ్రుల సహాయం మళ్లీ కోరనా అని బిడియపడి ఆడకూతుళ్ళు చావడానికి సిద్ధపడుతున్నారు. అదే- తల్లితండ్రుల అండ వుంటుంది అన్న నమ్మకం వుంటే ప్రాణాలు రక్షించుకునే ప్రయత్నం చెయ్యరా? చచ్చే దాకా చూసి చూడనట్టు పూరుకున్న వాళ్లే చచ్చాక బాధపడి పోతున్నారు... ఇదంతా ఒక విషచక్రం దీన్ని ఛేదించకల్గిన వాళ్ళు తల్లితండ్రులు, అమ్మాయిలు, అబ్బాయిలు. కాని ఏం లాభం? లాభసాటి బేరం వదులుకోలేరు. అవ్వా కావాలి బువ్వా కావాలనే టి అబ్బాయిలకి చదువు ఉద్యోగం వుండాలి చచ్చినట్టు పడి వుండాలి! కట్నం చావులు విన్నప్పుడల్లా నాకు రక్తం ఉడుకెత్తుతుంది – యింత కసాయితనం ఈ మనుషుల కెలా వచ్చిందా అని. ఛ!

వి.బి.ఎస్.పి. నెల్లూరు

★ మి సమాధానాలు లేడిస్‌నే సపోర్టు చేస్తున్నా నాకూ ఇష్టమే... నాకు కట్న కానుకలు తీసుకోవాలనిలేదు. నేను ఒకమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆమె నా చాయకూడ చూడదు.

● ఏం చేస్తారు? మీరూ దృష్టి మార్చండి. మి ముఖం మీద రాసిలేదు కదా– కట్నం తీసుకోనని... దానికేధైనా చూడండి.

ఎన్.వి.డి. ధేనువుకొండ

★ దెయ్యంలేదు దేవుడున్నాడని నేను. కాదు దీనికి విరుద్ధం నా ఫ్రెండ్. "పక్కింటావిడకి పట్టింది చూశాను" అంటుంది.

● దెయ్యం పట్టినావిడని చూసిందేగాని– దెయ్యాన్నెక్కడ చూశావని అడక్క పోయారా?

(నాకూ ఒకొక్కప్పుడు దెయ్యం పట్టినట్టుంటుంది!)

కె. బి. ఆర్. టాటానగర్

★ ఒకప్పుడు తినడానికి లేక బాధపడి అదృష్టం కొద్దీ లక్షాధికారులై కన్నుమిన్ను కానక వెర్రి వేషాలు వేసే వారినేమనాలి.

● ఏమీ అనక్కర లేదు సార్, వాళ్లే మామూలు దారికి వస్తారు– లక్షలు పోగానే!



జి. ఆర్. ఎన్. ఆర్. మచిలీపట్నం

★ సంసారంలో ఎంతో సుఖశాంతులతో గడపాలని స్త్రీ కోరుకుంటుంది. కాని అది జరిగే మార్గం లేదు. అందులో నాలాంటి స్త్రీకి అసలుండదు ఎందుకంటారు?

● ఇందులో మీ ప్రత్యేకత లేదు. సుఖశాంతులు యింట్లో ఎండమావులు! ఎవరికేనా అంతే. అందుకే – ఆడది సర్దుకుపోవడం అనే –మధ్యేమార్గం కనిపెట్టి వయనిస్తూంది.

ఆర్. హెచ్. ఎల్. ఆర్. చినవంక

★ స్త్రీని ఎందుకు దేవతగా భావిస్తారు? ఆ స్త్రీ జాతినే అవమానాల కెందుకు గురి చేస్తారు?

● దేవతగా చేస్తే పోటీకి రాదనుకున్నారు కాని మనిషిగా సమ ఉజ్జీనంటూందినాడు. అది భరించడం కష్టం కదా– అందుకే చేతకాని పౌరుషాలతో, చిన్నచూపుతో బాధపడే వాళ్ళు –యీ మెనవమానాల పాలు చేస్తూ లోలోపల సంతోషిస్తున్నారు. అప్పుడూ ఇప్పుడూ కూడా ఆడది కోరేది తనని మనిషిగా చూడమనే– దేవతనూ చేయవద్దు. దెయ్యాన్నీ చేయవద్దు. కాలరాయావద్దు.

జి. ఆర్. డి. భువనేశ్వర్

★ కాలగమనాన్ని గుర్తించకుండా సనాతన మూఢ ధర్మాన్ని సమర్థించే సైంటిస్టులున్నారు. చదువుకి విలువ లేదా?

● ఉంది –కట్నం మార్కెట్‌లో. ఇక సైన్సు–మూఢ నమ్మకాలు–నాణేనికి రెండు పక్కల్లా తయారు చేయాలనే కదా పెద్దల తాపత్రయం?

బి. ఎస్. ఆర్. ఇచ్ఛాపురం

★ పాఠకుల ప్రశ్నలకి మీరిచ్చే సమాధానాలు సంతృప్తికరంగా లేవనే నా అభిప్రాయం. ఎందుకంటే....

● అదే నేనూ అనుకుంటున్నానయ్యా సత్యవంతా! మీకు సమాధానం నచ్చలేదు కనుక: మిమ్మల్ని మించిన ఘనులు లేరు కనుక- మీ అసంతృప్తి అందరి అసంతృప్తే అని -మీ నమ్మకం!!

ఎ. సి హెచ్. ఎస్. ఖుర్దారోడ్డు


★ నేనొక అమ్మాయిని ప్రేమించాను ఆమె నన్ను ప్రేమించింది. మేం పెళ్లి చేసుకోదలచాము నా వయస్సు 16. ఆమె వయస్సు 13 మాకు ప్రభుత్వం వల్ల గాని యితరంగా గాని ప్రమాదమా?

● పెళ్లంటే ఏమిటని మీ ఉద్దేశ్యం? సీతాకోక చిలుక సినిమా అనా?! ఇద్దరూ పిచ్చి వూహలు మాని బుద్ధిగా చదువుకోండి. ఏ వయస్సులో ఆ పన్లు చెయ్యాలి. లేకపోతే తరవాత బాధపడతారు

పి. ఆర్. గుంటూరు

★ నేడు వస్తూన్న సెక్సు సాహిత్యంపై మీ అభిప్రాయం?

● నేను చదవడం లేదు! అవే జనం చదువుతున్నారని – రాసేవాళ్ళు, అచ్చేసేవాళ్ళు అంటున్నారు! □



టుర్యుటుర్యు, టుర్ర్ర్ర్ర్యు

గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు

బెజవాడకి ప్రయాణమై నేను ఏలూరు స్టేషను కెళ్ళాను. ప్లాట్‌ఫారం మీద "మేస్టారూ, మేస్టారూ" అన్న పిలుపు విని వెనక్కి చూసాను. సుమారు పాతికేళ్ళ యువకుడొకడు నావైపొస్తున్నాడు. దగ్గరకొచ్చి నమస్కారం పెడుతూ అన్నాడు. "నేను మేస్టారూ, అయిదేళ్ళకిందట పచ్చగళ్ళ చొక్కాతో మి కాలేజీలో పరీక్షరాసినవాణ్ని. శ్యాంని, రండి కాఫీ తాగుదాం."

అతనో నడుస్తున్నానేగాని, నా మనస్సుమాత్రం జ్ఞాపకాల పొరల్లోకి తొంగిచూస్తోంది. చటుక్కున స్ఫురించింది. ఆ నాటి ఆ అందమైన అనుభవం !

★ ★ ★ ★

ఏప్రియల్ నెల. మా కాలేజీలో పరీక్షలు జరుగుతున్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫీసరుగా వెళ్ళవలసినవాణ్ని వెళ్ళకుండా కొన్ని కారణాలవల్ల మా కాలేజీలో నే వాచర్‌గా పనిచేస్తున్నాను.

మా కాలేజీ పెద్దదిబ్బ మీదుంది. ('కోటదిబ్బ' అంటారు). ఈ దిబ్బలో ఒక అంచు పొడుగునా తరగతులుండే రెండు షెడ్లున్నాయి. ఈ షెడ్లకి పది పన్నెండు గజాలదూరంలో ఈ 'కోటదిబ్బ' అంచు స్పష్టంగా కనిపిస్తుంది. అక్కణ్నించి మూడు నిలువుల లోతులో ఊళ్లో వాళ్ళ ఇళ్ళు మొదలవుతాయి. వాటి ప్రహరీగోడల్లో. ప్రహరీగోడలికీ దిబ్బ అంచుకీ మధ్య మనిషి నడిచేటంత వెడల్పు సందుంది. ఈ షెడ్ల దగ్గర్నించి దిబ్బ అంచుదాకా ఉన్న ఆ పదిహేనూ ఇరవై గజాల దూరంలో నూ షెడ్లున్నంత పొడుగునా చాలా రకాల మొక్కలూ చెట్లూ స్వేచ్ఛగా ఎదిగిపోయి ఒక చిన్నసైజు అడివిని జ్ఞాపకం చేస్తున్నాయి. ఓ రెండు డజన్లపైగా పక్షులికి ఈ 'అడివి' విహారస్థలమని ఇంతకు మునుపెప్పుడూ గమనించకపోవటం నా దురదృష్టం! అయితే ఇప్పుడు గమనించాక మాత్రం, "సృష్టిలో ఇంతటి అద్భుతమైన అందమూ స్పందనా ఉన్నాయి గదా!' అని ఆనందించకపోవటం ఇంకో దురదృష్ట మవుతుంది. కనక, ఈ రెండో దురదృష్టాన్ని నా చాయలకి రానివ్వకూడదని నిర్ణయించుకున్నాను, మొదటి పరీక్షరోజునే- సృష్టిలోని సూత్రబద్ధతను గమనించిన ఆ మొదటిరోజునే.

జవాబు పుస్తకాలు పంచి పెడుతూనే కుర్రాళ్ళకి హెచ్చరిక చేసేసాను. "మీరు దొంగలుకారు, నేను పోలీసునుకాను. వీలైనంతబాగా మీరు పరీక్ష రాసేందుకు సహకరించేందుకే నేనిక్కడున్నాను. కాపీ స్లిప్పులు- 'పొరపాటున' మీ తమ్ముళ్లో మీ చెల్లాయిలో మీ జేబుల్లోపెట్టినవి- ఉంటే ఇప్పుడే వెళ్లి చెత్త బుట్టలో పారేసిరండి ఆ తర్వాత కాని పని చేసి మీరు నాకు దొరికిపోతే మాత్రం నా విధిని నేను నిర్వహించటానికి ఏ మాత్రమూ వెనకాడను." నిజానికి ఈ మాటలు చెప్పటం అనవసరం. కొన్నేళ్ళుగా నన్ను శోధన చేస్తున్న కుర్రాళ్ళకి నేను నాకు నేను తెలిసిందానికంటే, బాగా తెలుసు- అని నాకు తెలుసు. అయినా నా విధిని నేను నిర్వహించాలి గదా!

పరీక్ష మొదలైంది. పావుగంట గడిచింది. గదిలో కుర్రాళ్ళంతా శ్రద్ధగా రాసుకుంటున్నారు. కానీ కందకం వైపున్న వరసలో మొదటివాడుగా, మూలగా కూర్చున్న పచ్చగళ్ళ చొక్కావాడు మాత్రం మధ్య మధ్య తలెత్తి నావైపు దీనంగా చూస్తున్నాడు. నేను మొహం బిగించి తీక్షణంగా చూసాను. వాడు కంగారుపడి తలవంచేసుకున్నాడు.

★ ★ ★ ★

'క్కి క్కొ క్కు యీ... క్కి క్కొ క్కు యీ.... క్కి క్కొ క్కు యీ...'

-హఠాత్తుగా వినిపించిన ఈ శబ్దానికి "అడవి" వైపు చూసాను. సీమ తుమ్మ చెట్టుమీద పక్షొకటి, కొమ్మ చివర కొచ్చి కూర్చుని కూస్తోంది! దాని తలంతా నలుపూ, మిగిలిన శరీరం బూడిద రంగూ, ఆ తలమీద నల్ల ఈకలపాగా, పొడుగాటి తోకా, ఆ తోక కింద ఎరుపూ- ఈవిధంగా ఉన్న ఆ పక్షికి, అది కూసినప్పుడల్లా తోక పైకి లేస్తోంది. "ప్రతి పక్షికీ, అది కూసినప్పుడు తోకపైకి లేస్తుందా?" అనేది నా కొచ్చిన మొదటాలోచన! ఎందుకు లేస్తుందనేది రెండో ఆలోచన! అసలు పక్షు లెందు కూస్తాయనేది మూడో ఆలోచన!

"క్రిట్యీవ్, క్రిట్యీవ్, క్రిట్యీవ్, క్రిట్యీవ్, క్రిట్యీవ్, ..."

-హడావిడిగా వినిపించిన ఈ గోల శబ్దానికి రెండోవైపు, కాలేజీ లోతట్టు వైపు, చూసాను. నా

షెడ్డు పక్కనే ఉన్న బ్రహ్మాండమైన మర్రి చెట్టు మీదున్న ఒక రామచిలుక అదేపనిగా అరుస్తోంది. రెండు నిముషాలయ్యే సరికి ఎవరో పిలిచినట్టుగా రెండు చిలకలు ఎక్కణ్ణుంచో వచ్చి దాని పక్కనే వాలాయి. ఇప్పుడు ఆ మూడూ అరవటం మొదలెట్టాయి. ఇంకో రెండు నిముషాలకి ఓ పాతిక చిలకలు గోలగోలగా వచ్చి కొమ్మల మీద వాలాయి. జంటలుగా విడిపోయాయి.

"గ్రి–జ్ఞ–వ్, గ్రి–జ్ఞ–వ్, గ్రి–జ్ఞ–వ్, ..."

అంటూ సన్నని గురక వంటి కూతలో ఒకదాన్నొకటి ముక్కుల్తో పొడుచు కుంటున్నాయి. అది వాటి సరసంగా నా కర్థమైంది. మరి, ఆమని ఆగమనం పక్షుల్లో సరసానికి దోహదం కదా! రెండు మూడు నిముషాల తర్వాత వేగంగా ఎక్కణ్ణుంచో ....

"గ్రిఈక్జ్ఞ, గ్రిఈక్జ్ఞ, గ్రిఈక్జ్ఞ, గ్రిఈక్జ్ఞ,, గ్రిఈక్జ్ఞ, ..."

అని వినిపించ సాగింది. అంతే, ఈ చిలకల్లో ఒక రెండు చిలకలు పై కొమ్మల మీది కెగిరాయి. ఇవ్వికూడా అట్లాగే పంతంగా అరవసాగాయి. అరిచరిచి ఒక్కసారిగా పై కెగిరాయి. అంతే అన్నీ ఎగిరి చక్కా పోయాయి!

గంట గడిచింది.

"రప్చ్, రప్చ్, రప్చ్, రప్చ్, ..."

– ఓ వందొచ్చి నట్టొచ్చి కందకం వైపున్న సీమ చింత చెట్టు మీద వాలాయి పిచ్చికలు.


"ప్లిచ్చివ్, ప్లిచ్చివ్, ప్లిచ్చివ్, ..."

అంటూ ఇంకో పాతికొచ్చి వాలాయి గోరువంకలు. అంతవరకూ ఆ కొమ్మల మీదనే ఉన్నాయి కాబోలు రామచిలకలు, నాక్కనబడనే లేదు, వీటినన్నింటినీ ఆహ్వానిస్తున్నయ్యా అన్నట్టు ఒక్కసారిగా గోల-గోలగా అరుస్తూ గాల్లో కెగిరి టపటపా రెక్క లాడించి వెంటనే విరగ పండిన సీమ చింతకాయల మీద స్థిరపడి పోయాయి. ఆ ఆకుల రంగులో కలిసి పోయాయి.

ఇంకో కొత్త సందేహం నా బుర్రని తొలవటం మొదలెట్టింది. "మనుషుల కున్నట్టే పక్షులక్కూడా ఒక్కో ఇంగితానికి ఒక్కో భాషా, ఆ భాషకి తగిన చర్యా ఉంటాయా?"

నా అదృష్టమా అన్నట్టు నా తోటి లెక్చరర్లు గదుల్ని పర్యవేక్షిస్తూ నా గది దగ్గర కొచ్చారు. నా గది లోపలికి రానవసరం లేదను కున్నారు, అట్నుంచటే పక్క గది కెడుతున్నారు. వాళ్లల్లో





న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన విశ్వ అహింసా సమ్మేళనలో జంతు సంక్షేమానికి గణనీయంగా పాటుపడుతున్నందుకు గుర్తింపుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ సి. ఆర్. కృష్ణఅయ్యర్ నుంచి మెమెంటో ని అందుకుంటున్న శ్రీ పీలా రామకృష్ణ. ఈ ప్రపంచ సమ్మేళనలో ఒక సదస్సుకు అధ్యక్షత వహించి ఇచ్చిన ప్రసంగానికి ద్వితీయ అత్యుత్తమ ఉపన్యాసకుడుగా శ్రీ పీలా రామకృష్ణ ఎంపిక కాబడ్డారు. వీరు ఆంధ్రప్రదేశ్ జీవరక్షా సంఘానికి కార్యదర్శిగా, జీవబంధు మాసపత్రికకు సంపాదకులుగా ఉన్నారు. గత 30 సంవత్సరాల నుండి రాష్ట్రంలోను, రాష్ట్రేతర ప్రాంతాలలోను జంతు సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారు.

ఉన్న జూవాలజీ లెక్చరర్ హైమవతిని పిలిచాను. "పక్షులకూ్కడా మూడ్‌ను బట్టి భాష మారుతుందా?" అనామె నడిగాను.

ఆమె ఆలోచించింది. "పక్షుల భాషని గురించి.... మేం ... చదువుకో లేదే! అయినా, భాష.... అదే, మనకి లేదూ, కోపంలో ఒకరకంగానూ, ఏడుపులో ఒకరకం గానూ, ఇంకో సమయంలో ఇంకో రకంగానూ– అట్లాగే 'వాటికినూ! ఏవన్నా చెప్పారేమో... జ్ఞాపకం లేదు. అయినా, లెక్కల వారు మీ కి గోలెందు కిప్పుడు!" అని సాగదీసింది. మిస్ హైమవతి వెళ్ళిపోయింది నేను హతాశు డ్నయ్యాను!

కుర్రాళ్ళందర్నీ ఓమాటు నిశితంగా చూసాను. మూలనున్న పచ్చగళ్ల చొక్కావాడు కొంచెం పక్కకి తిరిగి అడ్డంగా కూర్చునున్నాడు. కాలేజీలో చాలినన్ని బెంచీల్లేక మా వైపు గదుల్లో కుర్రాళ్ళని కిందే కూర్చోబెట్టారు. కనక పక్కకి తిరిగినవాణ్ని అదరగొట్టలేం. అదరగొట్టాలని ప్రయత్నిస్తే వాడు, "పొంటుగదా పక్కకి తిరిగి గోక్కొన్నాను, తప్పా?" అని మన్ని అదరగొడతాడు. కనక అదిలించగలం. అంతే. నా ప్రవృత్తినిబట్టి అంత పని గూడా నేను చెయ్యలేదు. సూక్ష్మంగా, "సరిగ్గా కూర్చోవోయ్, లేకపోతే నీలాంటి మంచివాణ్ని అనుమానించా-ల్సొస్తుంది" అన్నాను. వాడు బేలమొహం వేసేసి టక్కున సరిగ్గాకూర్చున్నాడు.

దూరంనించి అంటే 'అడివి' చివర, కాలేజీ మూలమీద, నా గదికి వెనకవైపుగా ఉన్న వేపచెట్టుమీంచి

'ట్వొన్క్....ట్వొన్క్.... ట్వొన్క్.... ట్వొన్క్.. .' అనే లోతు

టుర్‌య టుర్‌య .....

గొంతు కూత వినిపించసాగింది. ఇది, బీడు భూముల్లో సర్వసాధారణంగా వినిపించే పిట్ట కూతే. నా చిన్నప్పుడు నేను లాగూ ఎగలాక్కుంటూ కృష్ణ ఒడ్డునున్న నూతక్కి పొలంగట్లమీద తిరుగుతూ విన్నదే. కాని ఆ పక్షి ఏదో మర్చిపోయాను. కనక ఇప్పుడొచ్చిన అవకాశం ఉపయోగించుకుందామని గది బయటికి తొంగిచూసాను.

నా వెనకాల్నించి పచ్చగళ్ల చొక్కావా డన్నాడు: "అది గద్దపిల్లసార్. మా పెదవేగి తుమ్మలచెట్లో నేనెప్పుడూ వింటూంటా న్సార్!"

వెనక్కి తిరిగాను. "నాకు తెల్సులే, నువ్వు రాసుకో!" అన్నాను. వాడు బిక్క మొహం వేసేసాడు. ఆతర్వాత నేను జవాబు పుస్తకాలు అందుకోటంలో పడిపోయాను.

* * * *

నాకు కిందటిరోజు మొదటి గది పడితే, మర్నాడు రెండో గది పడింది. కిందటిరోజు మొదటి గదిలో కుర్రాళ్ళు కొంతమందివ్వాళ నా గదిలో కొచ్చారు. వాళ్లల్లో పచ్చగళ్ల చొక్కా వాడు కూడా ఉన్నాడు! అయితే వాడిస్థానం ఈసారి గది మధ్యలో కొచ్చింది.

పరీక్ష మొదలైంది. ఎనిమిదిన్నర దాటింది. ఎండ, వేసవి వేడినందుకొంటోంది.

నా దృష్టి హఠాత్తుగా నా గదికి ఆనుకొనున్న సీమ తుమ్మ చెట్టుకింద చెలరేగిన కదలికమీద పడింది. కాకి పరిమాణంలో ఉండి, సుమారు తొమ్మిదంగు-ళాల తోకుండి, బూడిద రంగు చుక్కలూ, నీలం కంఠమూ, కళ్ల చుట్టూ ఎరుపూ ఉన్న ఒక పక్షి, అట్లాంటిదే ఇంకో పక్షిని తన ముక్కుతో పొడుస్తూ, రెక్కల్తో కొడుతూ మీది కెడుతోంది. నా కదేదో విచిత్రంగా అనిపించి అట్లా చూస్తూ నుంచుండిపోయాను, గది మధ్యలో నే.

పచ్చగళ్ల చొక్కావాడు, "అయ్యో గువ్వలండి మాస్టారూ, ఆ గువ్వ తన రాజ్యంలో కొచ్చిన ఇంకో గువ్వని తరిమేస్తా ఉంది" అన్నాడు.

"నిన్నెవడడిగాడు, నీ పన్చూసుకో!" అన్నాను. నిజంగానే కళ్ళెర్ర చేసాను. కాని, లోలోపల వాడి విజ్ఞానానికి మాత్రం ముచ్చట పడ్డాను.

'కుళొకు.... కుళొకు.... ళొకు ళొకు.... కుళొకుళొకు.... కుళొకు.... కుళొకుళొకుళొకు....'

–ఈ చిత్రమైన శబ్దానికి నేను గది చివరికెళ్ళి దిబ్బ మూలమీదున్న వేపచెట్టును పరిశీలించాను. అది కోకిల. అదట్లా రెండు మూడు నిముషాలపాటు నిర్విరామంగా కూసి కూసి ఆగింది. ఎక్కణ్నుంచొచ్చిందో ఇంకో కోకిల రయ్యున ఎగురుకుంటూ వచ్చేసి దీని పక్కన వాలింది. మొదటిది దీన్ని.

'కువ్వ, కు(వ్వ, కు(వ్వ, కు(వ్వ....'

అంటూ గోముగా ముక్కుతో పొడవసాగింది. ఇంతలో ఎక్కడో దూరంనించి ఇంకో కోకిల తాలూకు వసంతరాగం వినిపించసాగింది. అంతే, మొదటి కోకిల సర్రున ఎగిరి వేపచెట్టు పైకొమ్మల్లోకి దూరి, దూరి పోయి దాక్కొని కూర్చుంది. ఇహ నిర్విరామంగా తన రాగం మొదలెట్టింది.

'క్కుడ్‌ఊ(ఉ, క్కుడ్‌ఊ(ఉ....' ఆ కోకిల రెట్టించింది. ఇది రెట్టించింది. రెట్టించి రెట్టించి మహా తీవ్రస్థాయి కెళ్ళిపోయింది.

'క్కు(డ్‌ఊ(ఆ(, క్కు(డ్‌ఊ(ఆ(, క్కు(డ్‌ఊ(ఆ(....' ఏం వచ్చిందో, అంత తీవ్ర స్థాయిలోనూ టక్కున తన రాగం ఆపేసింది. 'కుళొకుళొకు.... కుళొకుళొకు.... కుళొకుళొకు' అంది. కింది కొమ్మమీదున్న దాని ఆడ జోడు సర్రున ఎగిరొచ్చి దీన్ని కలిసింది. (అవును ఆడజోడే!– రాగం పాడేది మగ కోకిలే!) రెండూ కలిసి తుర్రుమని ఎటో ఎగిరిపోయాయి!

'యురేకా, తెలిసిపోయింది!'– నాలో నేనే అరుచుకున్నాను! పక్షులెందుకూ్కస్తాయో తెలిసిపోయింది! ఒకటి తమ వాటిని పిలుచుకోటానికీ, రెండు తమ పౌరుషాన్ని ప్రకటించుకోటానికి! తమ వాళ్ళని పిలవటానికి పొట్టివైన, అందంలేని కూత కూస్తాయి. ఒక పక్షి తాలూకు పిలుపు కూతలో నే 'మూడ్'నుబట్టి తేడాలుండొచ్చు. (అయితే–ఈ లెక్కన ప్రతి పక్షికీ తనదైన స్వరం దాని కూతలో ప్రత్యేకంగా ఉండాలిగదా, అది తన జంటను మాత్రమే పిలవగలిగేట్టు. అట్లా ఉంటుందా?.... ఏమో!) ఇంక తమ పౌరుషాన్ని ప్రకటించుకోవలసొచ్చినప్పుడు, ఉద్రేకంతో, లోలోతు గొంతుతో, పొడవైన కూత– పాట– పాడతాయి. అన్ని పక్షుల్లోకి కోకిలే అందమైన పాటగాడు. కోకిల తాలూకు ఆ లోలోతు గొంతు పాటను ఏడు

స్వరాల్లోని పంచమ స్వరంగా వర్గీకరించారు పెద్దలు.

ఇంతలో హఠాత్తుగా ప్రత్యక్షమయిందొక ఉడత మద్దిచెట్టు కింద. ఎటో చూస్తూ అది పొట్టి కూతలు కూస్తూ అటూ ఇటూ తిరుగుతోంది.

'క్చ్రర్రప్.... క్చ్రర్రప్.... క్చ్రర్రప్'

హఠాత్తుగా పిల్లి ఒకటి కందకం పక్కనున్న ఇళ్లల్లోంచి ఇవతలికి దూకి మద్దిచెట్టు కిందగా వచ్చింది. అంతే, ఈ ఉడత యింగున చెట్టు కొమ్మమీదికి దూసుకెళ్లిపోయి అక్కడ్నించి అదేపనిగా అరవటం మొదలుపెట్టింది.

'క్చ్రర్రర్ర్ ర్రర్రర్రర్రర్రప్, క్చ్రర్రర్ర్ ర్ర్ ర్ర్ ర్ర్ ర్రర్రర్రప్....'

ఇది పొడుగు కూత. ఇది దాని ఆపత్కాలపు పాట. ఇది ఇతర ఉడతలకూ పక్షులకూ ప్రమాదం హెచ్చరిక!

నా సిద్ధాంతం–అదే, పక్షులు వేరు వేరు సందర్భాల్లో వేరు వేరు భాషలుపయోగించును–– అనేది ఉడతల్లో కూడా ఋజువైంది! 'హోఁహోఁహోఁ'– నాలో నేనే వీపు చరుచుకున్నాను.

టైము పదయింది. పచ్చగళ్ల చొక్కావాడు హడావిడేం చెయ్యటంలేదు. అసలు గదంతా ప్రశాంతంగానే ఉంది. ఇతర కుర్రాళ్లకి అదనం పుస్తకాలిచ్చాను, దారం ముక్కలిచ్చాను. కాళ్లు లాగుతూంటే వెళ్లి కుర్చీలో కూర్చోబోయాను.

'గ్చువా, గ్చువా, గ్చువా, గ్చువా....'

–ఈ కూతకి నేను లేచి నా పక్కనున్న మూడో నెంబరు గది గోడ దగ్గరకొచ్చి చెట్లకేసి చూసాను. పిచ్చికల్లాంటి, వాటికన్న కొంచెం పెద్దవైన రెండు పిట్టలు! ఎప్పుడొచ్చివాలాయో! ముందర అరిచిన పిట్ట తన అరుపాపింది. వెంటనే రెండో పిట్ట అదే అరుపునందుకొంది. అది ఆపింది. ఆ తర్వాత రెండూ కలిసి జంటగా పాట నందుకొన్నాయి. అయిదారు నిముషాలు అట్లా పాడి పాడి ఎగిరెళ్లిపోయాయి. అవ్వి ఎంత జంటగా పాడాయంటే, ఆ దృశ్యం చూడనివాళ్లకి అది ఒక్కపిట్ట పాడిన పాటలాగే అనిపిస్తుంది ఖచ్చితంగా!

నా మనస్సు ఆనందంతో ఊగిపోయింది! ఇంకో కొత్త విషయం, అదే, 'పిట్టలు డ్యూయెట్లు కూడా పాడును' అనే దాన్ని కనుక్కొన్నా నివ్వాళ! 'వెల్ మై బాయ్, యూ హేవ్ గాన్ ఏ లాంగ్ వే ఇన్ బర్డ్ రిసెర్చ్! ముందు ముందుఇంకెన్ని కనుక్కుంటావో! విష్ యూ ఏ హేపీ పీరియడ్ ఎహెడ్!' ఆనందం ఆపుకోలేక నాలో నేనే నవ్వుకుంటూ అటూ ఇటూ వేగంగా పచార్లు చేసాను.

పచ్చగళ్ల చొక్కావాడు నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా నా వైపే చూస్తున్నాడు. నా ఆనందం కారణాన్ని వాడు పట్టేసాడేమో తెలీదు. నేను మాత్రం వాణ్ణి పట్టించుకోలేదు. ఆ పూట వాడు అంత బాగా రాసినట్టు కూడా లేదు.

★ ★ ★ ★

మూడో నాటి పరీక్షకి నేను మళ్లీ వెనక్కి ఒకటో నెంబరు గదికే వచ్చాను. చిత్రంగా, ఆ పచ్చగళ్ల చొక్కావాడు కూడా మళ్లీ ఆ గదికే చేరాడు! అయితే ఈసారి వాడు కందకం వైపున్న వరసలో చివ్వరివాడుగా తేలాడు. మొదట్లో నేను గదిలో కెళ్లేసరికి వాడు వాడి చోట్లోనే నుంచుని దిక్కులు చూస్తున్నాడు.

నేనెళ్లి టేబిలుమీద పుస్తకాలు పడేసి గదంతా కలియజూసేసరికి హడావిడిగా వాడు బయట కెళ్లిపోయాడు. నా గదికి వెనకవైపు వేపచెట్టుకింద పాయిఖానా లున్నాయి. అదే కాలేజీకి మూలవైపు. నేను జవాబుల పుస్తకాలు పంచుతుండగా వాడు వచ్చి సీట్లోకి చేరాడు. కాస్సేపటికి నేను అందరికీ ప్రశ్న ప్రత్రాలు కూడా ఇచ్చేసాను. నా పన్లో నేనుండిపోయాను. పది నిముషాలయ్యేసరికి వాడు నుంచుని, "పాస్ కెళ్లాలండీ" అన్నాడు. నేను, "సరే" నన్నాను. వాడెళ్లాడు. అయిదు నిముషాల తర్వాత చల్లగా వచ్చేసి తన సీట్లో కూర్చున్నాడు. వాణ్ణి నేను అనుమానించలేదు. నా పన్లో నేనుండిపోయాను.

'టుర్‌య, టుర్‌య, టుర్ర్రర్ర్ ర్ర్రర్రయ.... టుర్‌య, టుర్‌య, టుర్ర్రర్ర్ ర్ర్రర్రయ....'

ఈ శబ్దాన్ని మొదట్లో నేను పట్టించుకోలేదు.


ఇంకో అయిదు నిముషాలు గడిచాయి. మళ్లీ వినిపించింది అదే శబ్దం. అయినా నేను పట్టించుకోలేదు.


మూడోసారి పట్టించుకున్నాను. గది అంచుకెళ్లిచూసాను. ఏ పక్షీ లేదు వేపచెట్టుమీద. కానీ అక్కణ్ణించే నేలబారుగా వస్తోందా శబ్దం. చూసి చూసి వెనక్కి తిరిగాను. పచ్చగళ్ల చొక్కావాడెందుకో కొంచెం కంగారు పడ్డట్టు గమనించాను. కానీ నేను పట్టించుకోలేదు.

అయిదునిమిషాలాగి మళ్లీ వినిపించిందా శబ్దం. జాగర్తగా విన్నాను. అసలు, వింటినారి లాగి వదిలినట్టుండే 'టుర్‌య, శబ్దం, పెద్ద గద్ద తాలూకు కూత అని నాకు తెలుసు. అయితే ఇప్పుడి శబ్దం మాత్రం పొడుగూ పొట్టీ 'టుర్‌య'లు కలగాపులగమై ఒక లయ అనేది లేకుండా వస్తోంది. కనక ఇదొక కొత్త కూతనిపించింది. కనక ఇదొక కొత్త పక్షి అనిపించింది. పక్షుల్ని గురించిన సిద్ధాంతాల్ని అవలీలగా కనిపెట్టేస్తున్న నాకు. ఈ పక్షేదో తేల్చుకోకపోపటం మహా చెడ్డ అవమానమవ్వగలదనిపించింది. దాంతో, నేను చెయ్యకూడని పనొకటి అప్పుడు చేసాను. గది అంచు దిగి, వేపచెట్టు వైపొక పాతిక అడుగు లేసాను. ఆ శబ్దం ఆగింది. కానీ పక్షి కనిపించలేదు.

'ష్ష.... ష్షష్ష!' అన్న శబ్దమూ దాంతో పాటి ఏదో వస్తువు ఎగిరొచ్చి నా గదిలో పడిన శబ్దమూ వినబడి చటుక్కున వెనక్కి తిరిగిచూద్దునుగదా, నా వెనకాలే గది బయట కొచ్చిన పచ్చగళ్ల చొక్కావాడు పెద్ద కాగితం ఉండని నేలమించి అందుకొని గదిలోకి వడివడిగా వెళ్లిపోబోతున్నాడు!

అంతే! ఒక్క దూకులో పోయి వాడి దగ్గర పడ్డాను. ఆ ఉండని పట్టుకున్న వాడి గుప్పిటని నా గుప్పిటతో అట్లాగే మూసుంచేసాను "చెప్పు, ఎక్కడ్నించి పడింది ఉండ?"– నిప్పులు కక్కుతూ గద్దించాను. వాడు ఏడుపు మొహం పెట్టేస కందకంవైపు





చూపించాడు వాణ్ణిలాగే పట్టుకుని కందకం అంచుకు ఈడ్చుకెళ్లాను. కందకంలోకి చూద్దునుగదా, 'కిస్ మి' బనీను కుర్రా డొకడు, అవతలింట్లోకి దూకే ప్రయత్నంలో ఆదరా బాదరా ప్రహరిగో'డెక్కుతున్నాడు!

నేను వీడితో అన్నాను: "మర్యాదగా వాణ్ణి నా దగ్గిరకి రప్పిస్తావా, రెండేళ్లో మూడేళ్లో నిన్ను సమాధి చేసెయ్యమంటావా?"

"ఒరేయ్, రారా, వెళ్లొద్దురా, ప్లీజ్, వచ్చెయ్యిరా!" అన్నాడు వీడు.

గోడెక్కుతున్న వాడల్లా ఆగి, రెండు మూడు క్షణాలు వెనక్కి నన్ను తేరిపారచూసి, అయిష్టంగానే గోడ దిగి, అతికష్టంమీద కందకం ఎక్కి తలొంచుకుని నాదగ్గిరకొచ్చాడు వాడు.

"ఇప్పుడు శబ్దం చేసింది నువ్వేనా?"–నేనడిగాను.

'అవున'న్నట్టు తలూపాడు వాడు.

"దేంతో?"

తన జేబులోంచి వెడల్పాటి పంగల కర్ర తీసి చూపించాడు వాడు. దాని కొమ్ములకి సన్నని తీగె ఒకటి చాలా బిగుతుగా కట్టబడుంది. వాడు ఇంకో జేబులోంచి మేకు తీసి దాంతో ఆ తీగెను లాగి వదిలాడు. 'టుర్ర్ర్ర్ర్ర్ర్ర్ర్య' శబ్దం వచ్చింది.

నేను గుచ్చి గుచ్చి అడగ్గావాళ్లిద్దరూ కక్కిన వాళ్ల పథకం ఇది- పక్షులంటే నా కిష్టం కనక, అట్లాంటి శబ్దంతోనే నా దృష్టిని పక్కకి మళ్లించి కంపకంలోంచి గదిలోకి కావల్సిన కాపీ ముక్కల్ని సరఫరా చేసుకోవాలి!

ఇద్దరూ ఏడుపు మొహాల్తో నా ముందు నుంచునున్నారు ప్రిన్సిపాల్‌నో, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్నో పిలిచి వీళ్ళ నప్పగించి మాన్యాలు పట్టించెయ్యగల్ను. నా స్థితిలో ఇంకే లెక్చరరున్నా లోకసహజంగా జరిగేదిదే. అయితే 'సంస్కరించుకొని సంస్కరించు' అనేది నా వృత్తి దాంతో ఐక్యమయిపోయింది నా ప్రవృత్తి!

కనకనే అటూ ఇటూ చూసి ఈ విషయం ఇంకెవరి దృష్టిలోనూ పడలేదని నిశ్చయించుకొన్నాను.

చర్మ క్యాన్సరు విస్తరణను కనుగొనే కొత్త పద్ధతి

అత్యంత ప్రమాదకరమైన చర్మ క్యాన్సర్ **అయిన** మాలిగ్నెంట్ మెలనోమావల్ల మార్పు నొందిన శరీర ధాతు కణాలను కనుగొనేందుకు కనాగ్వా నగరంలోని కిటాసాటో విశ్వ విద్యాలయానికి చెందిన వైద్య నిపుణుడు కనుగొన్నాడు. మెలిగ్నెంట్ మెలనోమా **అత్యంత** ప్రమాదకారి. ఎందుకంటే **అది** శరీరంలోని యితర ప్రాంతాలకు **అంటే** సాధారణంగా జపానీయుల శరీరాలలో చర్మ కాన్సర్ కనిపించే వేళ్ళు, కాలి బొటన వ్రేలి ప్రాంతాలకు, మడమలకు **అతి త్వరితంగా** వ్యాపిస్తుంది. శరీరంలో **ఉత్పత్తి అయ్యే** ప్రత్యేక పదార్థాలలోకి యిచ్చే సూది మందుకు మెలిగ్నెంట్ మెలనోమా ప్రతిస్పందిస్తుంది. **అలా** జరిగిన 72 గంటల **తర్వాత తీయబడిన** ఎక్స్‌రే ఫిల్ములను కంప్యూటర్‌ల ద్వారా విశ్లేషణ జరిపినట్టయితే, **తొలి దశలలో** కాన్సర్ వ్యాధి శరీరంలోని ఒకస్థానం నుండి మరో చోటికి ఎలా వ్యాపిస్తుందో సులువుగా తెలుసుకోవచ్చు.

టుర్య, టుర్య ....

వాళ్ళని గోడ కిందగా నుంచోపెట్టాను. లోగొంతుకతో అన్నాను: "మీరు చేసింది ఎంతటి దౌర్భాగ్యపుపనో మీకు తెలుసు. నేనిప్పుడు తలుచుకుంటే మీరేమవుతారో కూడా మీకు తెలుసు. అవునా? కానీ, అబ్బాయ్, పక్షి శబ్దమనే భ్రమ నాకు కలిగే విధంగా ఒక కొత్త శబ్దాన్ని సృష్టించగలిగారు మీరు. అంటే సృష్టికి ప్రతి సృష్టి చెయ్యగల శక్తి మీకుందని నిరూపించుకున్నారు. కానీ ఏం లాభం, మీరు గొప్పవాళ్ళవ్వాలని ఆశించి భగవంతుడు ఒక నైపుణ్యాన్ని మీకు ప్రసాదిస్తే దాన్ని మీరీ విధంగా దుర్వినియోగం చేసుకున్నారు. ఇది ఎంతటి పాపం! ఇది ఆ దేవుణ్ణే అవమానించటమని మీకెందుకు తోచదు? అసలు మీ వంటికి పడని ఈ కాలేజీ చదువు మీ కెందుకు? ఏ పాలిటెక్నిక్‌లోనో, ఐ. టి. ఐ. లోనో చదవకూడదూ! మీ తెలివికి తగిన అవకాశమూ దొరుకుతుంది, లోకాని కుపకారమూ జరుగుతుంది గదా! ఆలోచించుకోండి!... ఈసారికి వదిలిపెడుతున్నాను జాగర్త!"– మరుక్షణంలో 'కిస్ మి', కందకం కిందికి జారి, గోడ దూకి మాయమయ్యాడు. పచ్చగళ్ల చొక్కావాడు గదిలో కెళ్లి తలొంచుకుని రాతలో మునిగిపోయాడు.

ఆ తర్వాతి రోజుల్లో పచ్చగళ్ల చొక్కావాడు ప్రశాంతంగా తన పరీక్షలేవో తను రాసుకు వెళ్లిపోయినట్టు గమనించాను. నేనింకో రెండు పిట్టకూత సూత్రాల్ని కనిపెట్టాను.


* * * *


ఇప్పుడు మేం కాఫీ తాగటం పూర్తయింది. శ్యాం అన్నాడు:


"అయిదేళ్లతర్వాత కలిసాం. మీ రస్సలేం మారలేదేంటి మాస్టారూ!.... అన్నట్టు నాకు పాలిటెక్నిక్‌లో ఫస్టుక్లాసొచ్చింది సార్! కుక్కర్ను తయారుచేసే కంపెనీలో పని చేస్తున్నాను. అన్నం ఉడికిపోంగానే దానంతటదే కట్టేసుకునే కుక్కర్‌ను చవగ్గా తయారు చెయ్యటం నా లక్ష్యంగా పెట్టుకున్నాను.... నా జీవితాని కొక అర్థాన్ని, లక్ష్యాన్ని చూపించిన అసలైన గురువులు మీరు! నా బ్రతుకును మంచికి మలుపు తిప్పిన మహానుభావులు మీరు! ఇప్పుడింకోసారి ఆశీర్వదించండిసార్, నాకు జయమవుతుంది!" ఇలా అంటూ చటుక్కున వంగి రెండు చేతుల్తోనూ నా పాదాలు ముట్టుకున్నాడు!

నా కళ్ళు చెమర్చాయి! గొంతు గద్గదికమయింది! మనస్సు ఆనందంతో అల్లల్లాడిపోయింది!

ఎన్ని లక్షల ధనం సంపాదిస్తే దీనికి సమానమౌను? ☐







డి. వి. ఆర్ – నెల్లూరు

మన శరీరానికి కావలసిన పోషకాహారములు వేటిని తీసుకొంటే లభ్యమవుతాయో తెలుపవలెను

పాలు, పప్పు, ఆకుకూరలు, పండ్లు, అన్నం మొదలయిన వాటిని క్రమపద్ధతిలో తీసుకొంటే అన్ని రకాల పోషక పదార్థాలు శరీరానికి లభిస్తాయి. మాంసాహారులు వారికి అలవాటైన మాంసాహారాన్ని తీసుకొంటే శాకాహారులకి లభించినంత పోషకాహారం లభిస్తుంది.

ఆహారానికి తగినంత వ్యాయామం చెయ్యటం చాలా అవసరం.

ఎస్. ఎం. ఆర్ – వదర్లపాడు

కరెంటు షాకు కొట్టి పడిపోయిన వ్యక్తికి ప్రథమ చికిత్స ఏమి చెయ్యాలి.

వ్యక్తిని కరెంటు తీగెల నుంచి విడిపించి (కరెంట్ ఆపు చేసి) బాగా గాలి ఆడే ప్రదేశంలో పడుకోబెట్టి, శరీరంలోని దుస్తుల బిగుతును సడలించాలి. ఊపిరి ఆడకపోవటం జరిగితే ఆర్టిఫీషియల్ (కృత్రిమంగా) శ్వాస ఆడటానికి ప్రయత్నాలు చెయ్యాలి.

నోటిలో నోరు ఉంచి (కర్చీఫ్‌తో రోగి నోరు మూసి) మన బుగ్గ నిండా గాలి తీసుకొని రోగి నోటిలో ఊదటం అనే చర్య నిముషానికి కనీసం 15 సార్లు చెయ్యవలసి ఉంటుంది. ఇలా ప్రథమ చికిత్స మొదలు పెట్టి వైద్యులకి కబురు పెట్టవలసి ఉంటుంది.

ఎస్. ఎ –కురిచేడు

నాకు ఎడమ ప్రక్క రొమ్ముకు క్రింద భాగములో 3 సం. క్రితము చిన్న సెగ్గడ్డ లాగ లేచింది అది మలాం పట్టి వేస్తే పగిలిపోయి మానిపోయింది ఆ తరువాత ఏ బాధా లేదు. కానీ ఇపుడు ఒక సం. నుండి ఆ మచ్చలో సన్నని పోటు లాగ వస్తుంది. డాక్టరుకు చూపించుకొన్నాను. మందులు కూడా వాడినాను. కాని తగ్గలేదు అది ఇపుడు రాను రాను పోటు పోయి ఎడమ రొమ్ము మొత్తము అదో రకమైన బాధగా, లోపల నొప్పిగా అనిపించుచున్నది. నాకు కాన్సరేమోనని భయముగా వుంది. ఇది వరకు రెండు ప్రక్కల వక్షోజాలు సమానముగా వుండేవి. కానీ ఈ పరిణామము తరువాత ఎడమ ప్రక్క కొంచము సైజు తగ్గింది.

మీరు నిపుణులైన శస్త్ర వైద్యుల సలహా పొందటం అవసరం. ప్రత్యక్షంగా పరిశీలించి గాని రోగ నిర్ణయం చెయ్యలేము. □

సహజ సౌందర్యంతో విలసిల్లే వాషింగ్‌టన్

అమెరికాను గురించి తెలుసుకోవట మంటే– ఒక మహాకవి రచించిన వచన కవితా సంపుటికి సంబంధించిన "విషయ సూచిక"ను చదవటం లాంటిది. ఈ పరిస్థితి ప్రతి దేశానికి వర్తిస్తుంది కానీ అగ్రదేశ వ్యవహారం కుశాగ్ర గణ్యంగానే ఉంటుంది. ఐనా– "విబుధ జనుల వలన విన్నంత, కన్నంత – తెలియ వచ్చినంత తేట పరతు!"

ఇటలీ దేశ వర్తకుడు "అమెరిగో వెస్పుచి" కనుగొన్న పశ్చిమార్థ భూగోళ భాగం – అతని పేరు మీదనే "అమెరికా" అయ్యింది. కొలంబస్, ఇండియాను కనిపెట్టాలని బయల్దేరి అమెరికాను చేరుకుని, అక్కడ తను చూసిన ప్రజలకు "రెడ్ ఇండియన్స్" అని పేరుపెట్టాడు.

కొందరు, ఆఫ్రికా, యూరప్– మరి కొన్ని తూర్పు దేశాల నుండి వలస వెళ్లి స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. వాళ్లందరూ ఇంగ్లిషు భాషే మాట్లాడే వారు. అదే అక్కడి అధికార భాష. వాళ్లు నిర్మించుకున్నదే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా. (అమెరికా సంయుక్త రాష్ట్రాలు). రాజధాని వాషింగ్‌టన్ డి. సి.

వాషింగ్‌టన్ విమానాశ్రయాన్ని "నేషనల్" ఎయిర్ పోర్ట్ అంటారు. ఆ విమానాశ్రయంలో ఉన్న కుర్చీలకి చిన్న, చిన్న టి. వి.లు అమర్చబడి ఉన్నాయి. కాలక్షేపానికి టి. వి. చూస్తూ కూర్చోవచ్చు. వాషింగ్‌టన్ సహజ సౌందర్యంతో ఎంతో అందంగా ఉంది. బరన్‌హాటం పర్వత పంక్తిలో, ఆ లోయల్లోని ప్రకృతి దృశ్యాలూ వర్ణనాతీతం.

ఆ కొండల్లోంచి "పటామక్" నది, ఒయ్యారంగా, అతి మనోహరంగా ప్రవహిస్తూ వుంది. దానికి ఆవలి తీరంలోని కొండ లోయల్లో "డెమాస్కస్" ఒక అందమైన పట్టణం. ఆ పట్టణ సౌందర్యాన్ని, ఆ లోయల్ని ఉదయం మంచు తెరల్లో చూడాలి అదొక మధురానుభూతి.

వాషింగ్‌టన్‌లో ప్రముఖంగా చూడవలసినవి - వైట్‌హౌస్, అబ్రహాం లింకన్ మెమోరియల్ హాల్, జాఫర్‌సన్ మెమోరియల్ హాల్, వాటర్‌గేట్ భవనం– ఇటీవల ప్రారంభించ బడిన ఫెస్టివల్ ఆఫ్ ఇండియా– వంటి వెన్నో ఉన్నాయి.


వైట్ హౌస్– అమెరికా అధ్యక్ష భవనం. అధ్యక్షుడు జార్జి వాషింగ్‌టన్ ఎంపిక చేసిన స్థలంలో అక్టోబర్ 13, 1792లో దీనికి శంఖు స్థాపన జరిగింది. ఐరిష్ శిల్పి జేమ్స్ హాబన్ దీనికి రూప కల్పన చేశాడు సున్నపురాళ్లతో దీని బయటి గోడలు నిర్మించబడటం చేత దీనికి "వైట్ హౌస్" అని పేరు వచ్చింది. 1800లో మిసెస్. జాన్ యాడమ్స్ "వైట్‌హౌస్"లో ప్రవేశించింది మొదలు నేటి వరకూ దీని నిర్మాణాభివృద్ధి సాగుతూనే వుంది. థామస్ జాఫర్ సన్, జేమ్స్ మేడిసన్ (1809– అధ్యక్షుడు), జేమ్స్ మన్రో (1817– అధ్యక్షుడు), ఆండ్రూ జాన్‌సన్, బెంజిమన్ హారిసన్, థియోడర్ రూజ్‌వెల్ట్ (1901) ఉడ్రో విల్సన్ మొదలైన వారంతా వారి వారి పాలనలో "వైట్‌హౌస్"కు ఎన్నెన్నో సదుపాయాలు కల్పించి, సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఆది, సోమ వారాల్లో తప్ప మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుండి 12 గంటల వరకు యాత్రికులు వైట్‌హౌస్‌ను చూడవచ్చు.

అమెరికాలోని చాలా చారిత్రక ఉద్యమాలకు ఆటపట్టు ఈ వైట్‌హౌస్. అనేక చారిత్ర కాంశాలు, ఘట్టాలు జరిగిన గదులు ఈ హౌస్‌లో ఉన్నాయి. అమెరికా ప్రజల ఆచార వ్యవహారాలకి, చరిత్రకి, కల్పనలకి, కళలకి, విజ్ఞానానికి సంబంధించిన సుమారు మూడు వేల పుస్తకాలతో కూడిన గ్రంథాలయం వైట్‌హౌస్‌కే ఒక దివ్యాభరణంలా వుంది. అలాగే "బంగారు గది"గా ప్రసిద్ధి కెక్కిన వెర్మెల్ రూం, చైనా రూం, డిప్లమేటిక్ రిసిప్షన్ రూం, స్టేట్ రూం, వివాహ వేదికగా ప్రసిద్ధి కెక్కిన ఈస్ట్‌రూం, గ్రీన్ రూం, అధ్యక్షుడు తన అతిథులను ఆహ్వానించి ఆతిథ్యమిచ్చే అత్యంత సుందరమైన "బ్లూ రూం" చిన్న చిన్న విందులు, సమావేశాలూ జరిగే "రెడ్ రూం", జి. పి. ఎ. హెలే చిత్రించిన అబ్రహాం లింకన్ చిత్రపటమున్న "స్టేట్ డైనింగ్ రూం", లాబీ అండ్ క్రాస్ హాల్, రెండవ, మూడవ అంతస్థు బాగాలతో వైట్‌హౌస్ నిత్యనూతనంగా కలకల్లాడి పోతూ వుంటుంది. పచ్చిక మైదానంతో, పూల తోటలతో, చారిత్రాత్మక మైన చెట్లతో, జాక్విలైన్ కెనెడి తోటతో, గులాబీ వనంతో ప్రకృతి శోభలతో వైట్‌హౌస్ అలరారుతూ వుంటుంది. ఆండ్రూ జాక్సన్ అధ్యక్షుడు నాటిన "మేగ్నోలియాస్" వృక్షం, జాన్‌క్విన్సీ యాడమ్స్ నాటిన "అమెరికన్ ఎమ్" వృక్షం– చారిత్ర కాంశాలకి ఉదాహరణలుగా నిలిచి పిల్లగాలులకి ఊగుతూ పిలుస్తూ వున్నాయి.

లింకన్ మెమోరియల్



వైట్‌హౌస్



ఇంక, ది లింకన్ మెమోరియల్:– అమెరికా సంయుక్త రాష్ట్రాలకు 16వ అధ్యక్షుడు, క్షమ, నిజాయితీలకు ప్రతిరూపమైన అబ్రహాం లింకన్ స్మారక మందిర మిది. ప్రజాస్వామ్యాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మి– "గవర్నమెంట్ ఆఫ్ ది పీపుల్, బై ది పీపుల్, ఫర్ ది పీపుల్ షల్ నాట్ పెరిష్ ఫ్రమ్ ది ఎర్త్" అన్న తారక మంత్రం లాంటి నిర్వచనాన్ని లోకానికి ప్రసాదించినమహామేధావి లింకన్, "హాడ్జెన్విల్లె"లో 1809 ఫిబ్రవరి 12న థామస్, నాన్సీహాక్స్‌లకు జన్మించాడు. అతి సామాన్యంగా పెరిగాడు. పెద్ద వాడయ్యాడు. న్యాయ శాస్త్రంలో ప్రవీణుడయ్యాడు. 1961–65 లలో అమెరికా అధ్యక్షు డయ్యాడు. రక్తపాతంతో కూడిన అంతర్యుద్ధాల్లో చివరికి ధర్మపక్షపాతి కావటం చేత 1865లో తుపాకీ గుండుకు బలైపోయాడు. లింకన్ స్మృతి చిహ్నంగా ఆతని మృతి తర్వాత 46 సంవత్సరాలకి "హెన్రీ బేకన్" అనే శిల్పి రూపకల్పనలో ఈ "ది లింకన్ మెమోరియల్" వెలిసింది, 1922 మే 30వ తేదీన జాతికి అంకితం చేయబడింది. దీని గోడల మీద ఆంగ్ల శాసనాలున్నాయి. అవి లింకన్ విజ్ఞాన విషయికాలు. అలాగే అమెరికాలోని ఆనాటి 36 రాష్ట్రాల పేర్లు చెక్కబడి వున్నాయి. ఈ మందిరంలో 19 అడుగుల ఎత్తున కూర్చున్నట్టుగా వున్న అబ్రహాం లింకన్ విగ్రహాన్ని డేనియల్ ఛస్టర్ ఫ్రెంచ్ అనే శిల్పి రూపొందించాడు. ఈ మందిరం పునాది మీద 80 అడుగుల ఎత్తుగా వుంది. ఇదంతా పాల రాతి కట్టడం. ఈ స్మృతి మందిరాన్ని ఉదయం 8 గంటల నుండి అర్ధరాత్రి వరకు చూడవచ్చు; ఒక్క డిసెంబర్ 25వ తేదీన తప్ప.

చుట్టూ ఎత్తైన స్థంభాలతో నిర్మించబడిన "ది జాఫర్‌సన్ మెమోరియల్" కూడా యింత చరిత్ర కలది. లింకన్ ప్రపంచనేతల్లో కృతార్థుడు, చరితార్థుడు.

"ఫెస్టివెల్ ఆఫ్ ఇండియా" అనే కానేక శిల్ప కళాఖండాలతో అమెరికా దేశస్థుల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతూ మనకి చాలా గర్వకారణంగా వుంది.

– ఆచార్య తిరుమల



"మన వూరు వచ్చిందమ్మా!" తండ్రి పిలుపు రైలు కుదుపు ఒకేసారి రాధని ఆలోచనల్లోంచి తట్టి లేపాయి.

దిగవల్సిన చోటు, చిననాట మమతలు ఎదలో ముడివేసుకున్న చోటు. చకచకా రైలు దిగుతుంటే గుండెల అంచులపై ఉద్వేగం తొణికింది. తనూలత చిత్రంగా వణికింది.

"నెమ్మది. నెమ్మది ..." అన్నాడు సుబ్బారావు.

రాధ నవ్వింది. "ఇంక నాకేం భయంలేదు నాన్నా!"

ఆమె చకచకా స్టేషను బయటకు నడుస్తుంటే సుబ్బారావు ఆశ్చర్యంగా చూసాడు. మూడు నెలలనాడు చావుబ్రతుకుల మధ్య వూగిసలాడుతూ వెల్లూరు హాస్పిటల్‌లో మంచాని కతుక్కుపోయిన ఆ అర్భకురాలికి - ఇప్పుడు మెఱుపు తీగలా కదలిపోయే ఈ చైతన్యమూర్తికి ఎంత తేడా?

"నాకేమిటో ఇదంతా కొత్త కొత్తగా వుంది నాన్నా!"

"నువ్వు మన వూరు చూసి పదేళ్ళు పైనే అయింది. మరి కొత్తగా వుండదూ?"

అబ్బ, పదేళ్ళు అయిందా? ఇన్నేళ్ళు ఇక్కడికి రాకుండా ఎలా వుండగలిగింది?

"అందులో పునర్జన్మ ఎత్తి నడుస్తున్నావు. నీకంతా కొత్తగా వుండటం సహజమే!"

నిజమే! పునర్జన్మ ఎత్తి రాగలిగింది కనుకనే తన వూరు రాగలుగుతోంది! గతంలో తనకిప్పుడున్నంత చొరవ, అవకాశం ఉండేవా అసలు?

సుబ్బారావు రిక్షామాట్లాడాడు.

"మా వూరిక ఒక్కసారి తీసుకువెళ్ళండి ... అని ఆయన్ని ఎన్నోసార్లడిగాను. ఒక్కటంటే ఒక్కసారి ఆయన నా కోరిక తీర్చలేదు. పుట్టి పెరిగిన వూరు చూడాలని ఎవరికుండదు?"

'నాది కూడా కొంతవరకూ తప్పేనమ్మా! తెల్సినా నీ కోరిక నేనూ తీర్చలేదు."

తండ్రి వైపు చిత్రంగా చూసింది రాధ. తన కోరిక తీర్చనందుకు తండ్రి ఇప్పుడు బాధపడుతున్నాడా? ఏ కోరిక? ఈ వూరికి తీసుకురాలేక పోయినందుకా? తన మనసుపడిన సుధాకర్‌కిచ్చి పెళ్ళి చెయ్యలేక పోయినందుకా?

'అసలీ దేశంలో ఆడపిల్లలకి కోరికలంటూ వుంటాయని పెద్దవాళ్ళు గుర్తించటమే ఒక వింత! అవి తీర్చటం మరింత వింత! ... నువ్వూ అందరిలాంటి తండ్రివే నాన్నా!' అని అందామనుకుంది రాధ. తండ్రి నొచ్చుకుంటాడని వూరుకుంది.

'ఈ మాటు మా వూరు వెళ్ళొస్తానంటే ఆయన అడ్డుపెట్టలేదు. బహుశ, నా మీద చచ్చి బతికానని జాలిపడ్డ కాబోలు!"

'ఎందుకమ్మా అంత మాటంటావు? నువ్వు జబ్బుచేసి మంచాన పడివుంటే ఆనంద్ ఎంత బాధపడ్డాడో .."

తండ్రి మాటలకి అడ్డు వచ్చింది రాధ. "ఆయన బాధపడలేదని నేనన్నానా నాన్నా ... ఆయనేమిటి ... మా అత్తగారు మామగారు, మరిది, ఆడపడుచులు అంతా బాధపడ్డారు. మా పక్కింటివాళ్ళు బాధపడ్డారు. ఆయన ఆఫీసులో వాళ్ళు బాధపడ్డారు. డాక్టర్లు బాధపడ్డారు. నర్సులు బాధపడ్డారు. చివరకి కిడ్నీలు రెండూ చెడిపోయి నా కూతురు మృత్యుముఖంలో వుంది - ఎవరయినా దయుంచి ఒక కిడ్నీ దానం చేయండి ... అని నువ్వు న్యూసుపేపరు అడ్వర్టయిజ్‌మెంటు యిస్తే - ఆ వార్త కంపోజ్ చేసినవాడూ బాధపడే వుంటాడు. ఆ వార్త చదివినవాళ్ళూ బాధపడే వుంటారు! ... లోకం కోసం బాధపడటం వేరు. లోకానికి భయపడి బాధపడటం వేరు. జాలితో బాధపడటం వేరు. ప్రేమాభిమానాలతో బాధపడటం వేరు. కాదంటావా నాన్నా!"

సుబ్బారావు నిరుత్తరుడయ్యాడు. "అంత మాటనకమ్మా! ఆనంద్ నీ కోసం చాలా బాధపడ్డాడు.'

తనకోసం తన భర్త నిజంగా అంత బాధపడ్డాడా? రోజుల తరబడి పేకాట క్లబ్బులో కాలక్షేపం, రాత్రిళ్ళు పొద్దుపోయి యింటికి రావటం, తన కిష్టమయినప్పుడు మీద చేయి వెయ్యటం - కోరిక తీరగానే ప్రాణంలేని బొమ్మని విసిరినట్టు విదలించి పారేయటమే కాని - తన భార్యా ఒక మనిషే, ఆమెకు ఒక వ్యక్తిత్వమూ, ఒక హృదయమూ - అందులో చిన్నవే అయినా కొన్ని తీపి తీపి కోరికలంటూ ఉంటాయని గ్రహించకపోవటం .. ఇవే కాని మరొక రకమయిన అనుభవాలు తన భర్తనుంచి తానెప్పుడూ ఎరుగదే! ... తను ఒంటరిగా ఉన్నప్పుడు ఇంకా సుధాకర్‌ని తల్చుకుంటోందంటే ... అతనితో గడిపిన చిన్ననాటి రోజుల్ని మర్చిపోలేక పోతోందంటే దానికి కారణం ఎవ్వరు? తన మొగుడు తనవాడు



ఆర్ముగం

విమలారామం

కాగలిగినప్పుడు కదా - సుధాకర్ తనకు పరాయి మగాడిగా అనిపించగలిగేది?" ...ఆయనకి నా మీద ఎంతో ప్రేమాభిమానాలున్నాయని నువ్వు చెప్పే వరకు నాకు తెలియకపోవటం నిజంగా నా దురదృష్టం నాన్నా!" అంది.



"నువ్వలాగంటే ఇంక నేనేం చెప్పగలనమ్మా!" అన్నాడు సుబ్బారావు నిరుత్సాహంగా.

తండ్రి చేతిమీద తన చేయి వేసింది రాధ. "వదిన నగలు అమ్మించావు. అన్నయ్య బ్యాంకు అక్కౌంట్లు ఖాళీ చేయించావు. చివరకు మనకంటూ మిగిలిన మన మామిడితోటని అమ్మటానిక్కూడా సిద్ధపడ్డావు. వేలకు వేలు నా వైద్యం కోసం ఖర్చుపెట్టావు ..."

"కన్నబిడ్డ కోసం చేయడంలో గొప్పేముందమ్మా!"

రాధ కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి. "ఆ మృత్యుముఖం ఘడియల్లో నాకింకా బ్రతకాలన్న కోరిక ఎందుకు మిగిలిందంటే అది నీ మూలంగానే! నాకేదయినా అయితే నువ్వెంత గుండె చెఱువు చేసుకొంటావో అన్న భయంచేతనే! కాని, ఒక్కటి చెప్పు నాన్నా -నేనూ నువ్వూ ఎంత కోరుకున్నా ... ఆర్ముగం అనే దేవుడు దిగిరాకపోతే, నేనీ క్షణంలో ఇంకా బ్రతికి వుండేదాన్నా?"

"అవునమ్మా! ఆర్ముగం నిజంగా దేవుడు ..."

కాని, అటువంటి ఆర్ముగం గురించి తన భర్త ... అత్తవారు ఎంత నీచంగా వూహించారు!

తన అన్నా, వదినలు తనకు కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడ్డారు. కాని, పరీక్షలుచేసి వాళ్ళవి సరిపోవటం లేదని నిర్ధారించారు డాక్టర్లు. తన తండ్రిది సరిపోయింది కాని - పెద్ద వయస్సులో ఆపరేషనుకు తట్టుకోలేడని డాక్టర్లు వద్దన్నారు. అదక్కముందే తన భర్త ... తన అత్తవారింట్లో ఎవరో ఒకరు ముందుకు రావల్సింది. తన తండ్రి నోరు తెరిచి అడిగితే కనీసం పరీక్షలు చేయించుకోటానిక్కూడా ఎవ్వరూ ముందుకు రాలేదు. ఏదో ఒక వంక పెట్టి అంతా తలొక వైపు తప్పించుకున్నారు. వాళ్ళు చేసిన, మహోపకారం ఒక్కటే - పత్రికల్లో ప్రకటన వేయండి - ఎవరయినా కిడ్నీ దానం చెయ్యవచ్చుని సలహా యివ్వటం!

తన తండ్రికి చివరి ఆశ ... తన పాలిట వరమూ అయింది! పత్రికల ద్వారా తన దీన పరిస్థితి దేశంలో ఎంతో మందికి తెల్సివచ్చింది. ఎన్నో జాలి గుండెల్ని కదలించి వేసింది. అపరిచితులయిన సహృదయులెందరో తన 'డయాలిసిస్' ఖర్చులు, విజయవాడకి - వెల్లూరురికి మధ్య దారి ఖర్చులు భరించి తనకు మరికొన్నాళ్ళు ఆయుష్షు పోసారు!

చివరికోనాడు తన ప్రాణదాత 'ఆర్ముగం' ప్రత్యక్షమయ్యాడు. తనకు స్పృహ వచ్చాక తనకు పునర్జన్మ ప్రసాదించిన ఆ మహోన్నత వ్యక్తిని గురించి తండ్రి మంచి మాటలు చెపుతున్నప్పుడు - ఆ మంచి మనిషిని తానొకసారి చూడాలని ఉత్సాహపడుతున్న వేళ "నేను చెప్పలేదూ - పేపర్లో ప్రకటన వేస్తే కిడ్నీ అమ్ముకునే వాళ్ళెవరో ఒకరు దొరుకుతార"ని - అదంతా తన గొప్పతనమేనన్నట్లు మాట్లాడారు తన మామగారు. తన మనస్సు అప్పుడెంత చివుక్కుమందో - కనీసం తన భర్తయినా గ్రహిస్తాడేమోనని అతని కళ్ళల్లోకి చూసింది. కాని, తన ఆశ నిరాశే అయింది.

అన్నాళ్ళుగా పడిన ఆవేదనకీక తట్టుకోలేక "పరాయివాడు పదివేలకే ఒప్పుకున్నాడు ముప్పయివేలు ఖరీదుచేసే మామిడితోట రాసిస్తామంటే అయినవాళ్ళల్లో ఒక్కళ్ళు కూడా ముందుకు రాలేదేమండీ!" అన్నాడు తన అన్నయ్య వ్యంగ్యంగా. 'మంచి మర్యాదా లేని మనుషులు' అని అత్తగారు తన పుట్టింటి వారినంతా దుమ్మెత్తిపోసింది.

"పేషెంటు ముందు మీరిలాంటి మాటలు మాట్లాడతారేమిటి?" అని నర్సు అందర్నీ కేకలేసింది. అక్కడ్నించి అంతా వెళ్ళిపోయాక 'వాళ్ళ మాటలకి బాధపడకమ్మా!' అని తండ్రి తన నోదార్చబోతే తనకు నవ్వు వచ్చింది.

"నేను దేవుడితో దెబ్బలాడి మళ్ళీ బ్రతికినదాన్ని. నాకివో లెక్కా నాన్నా!" అని కావాలనే పెద్దగా నవ్వింది.

తనకప్పుడూ - యిప్పుడూ ఉన్నది ఒక్కటే కోరిక - తన ప్రాణదాతని ఒక్కసారి చూడాలని - తన ధర్మంగా తన కృతజ్ఞత లందించాలని!

'అతనికి ఆపరేషనయింది కదమ్మా! అతనిప్పుడెలా రాగలడు?' అన్నాడు తండ్రి ఆవేళ. మరో వారం పోయాక.... తను లేచి కూర్చోగల శక్తిని పుంజుకున్నాక 'పోనీ, నేనే వచ్చి ఒకసారి ఆయన్ని చూస్తా న్నాన్నా' అని లేవబోయింది. అప్పుడే డాక్టరు రావటం. 'మీ ప్రాణదాత* థాంక్సు చెప్పటానికి ముందు ముందు చాల రోజులున్నాయి. కాని, ముందు మా ప్రాణాలు తీయకు తల్లీ!" అని తమిళ డాక్టరు తెలుగులోనే మందలించటం జరిగింది.

తనే మనసుండబట్ట లేక పలుమార్లు అతనేమంటున్నాడని అడిగింది. "ఏమంటాడమ్మా? నాది తెలుగుమాట. అతనిది తమిళం..... ఇద్దర్కీ యింగ్లీషు సరిగారాదు. మద్రాసు వాడుకదూ— నేను మాట్లాడే తెలుగు మాట మాత్రం అతని కర్థమవుతోందిట!" అని నవ్వాడు తండ్రి.

తన కెంతో సంతోషమయింది. అతను తన దగ్గరికి వచ్చినప్పుడు తన మాటలు అతని కర్థమవుతాయి— అది చాలని తృప్తిపడింది. కాని, మరో మూడు నాల్గు రోజులు గడిచినా అతను రాలేదు. ఓ రోజున నర్సుని పిల్చి 'మీకు తెలుగు చదవటం వచ్చా' అని తానడిగింది. కొద్దిగా తెల్సునంది నర్సు సిగ్గుపడుతూ. "ఆర్ముగం గారికి యింగ్లీషు రాదు. నాకు తమిళం రాదు. ఆయనకి థేంక్సు చెపుతూ తెలుగులో రాసాను. కాస్త ఈ చీటీ ఆయన దగ్గరకి తీసుకువెళ్ళి నేనేంరాసానో తమిళంలోకి తర్జుమా చేసి చెపుతారా?" అని అడిగింది. నర్సు తను కోరినట్టే చేసింది. తమిళంలో రాసినా ఏదోటి అతను రాసి పంపితే తనకి చాలని పించింది. కాని అతనేమి పంపించలేదు. తాను పంపించిన చీటీనిమాత్రం పదేపదే చదివాడట. తను ఆశ్చర్య పోయింది. " అదే, చదివినట్టు అటూ ఇటూ చూసాడు.' అని నర్సు నవ్వింది. 'ఇంకేమి అనలేదా' అని తానడిగింది. 'మీరు చెప్పమన్నది చెప్పాను.

రొంబ థేంక్సు – అని చెప్పమన్నాడు.' అంది నర్సు.

'చీటీ రాసిస్తాడేమోనని–అడక్కపోయారా' అని తనెలా అడుగుతుంది! నేడో రేపో అతనే తన దగ్గరకి వస్తాడని అప్పటికి సరిపెట్టుకుంది! .... కాని, తన మనస్సుకి చివుక్కు మనిపించేలా ఆ మర్నాడే ఎవరికీ చెప్పకుండా హాస్పటలు నుంచి అతను వెళ్ళిపోయాడు!

తన కేడుపొచ్చింది. "నేనేం తప్పు చేసానని నన్ను చూడకుండా ఆయనలా వెళ్ళిపోయారు నాన్నా!" అని తాను బాధపడింది.

'నువ్వేం తప్పు చేయలేదమ్మా! తప్పంటూ చేసుంటే అది నేనే చేసాను.' అని జరిగిందేదో తండ్రి చెప్పుకు వచ్చాడు. 'మీ మాట మీరు నిలబెట్టుకున్నారు. నాబిడ్డప్రాణం కాపాడారు. ఇక నామాట నేను నిలబెట్టుకోవాలి. మీకిస్తానన్న పది వేలు రేపిస్తాను. కేషు తెమ్మంటారా– డ్రాఫ్టు కావాలా' అని అంత క్రితం రాత్రి తండ్రి అర్ముగాన్ని అడిగాడట. అతను కన్నీళ్ళు పెట్టుకొని తల అడ్డంగా తిప్పితే అతని ఉద్దేశ్యం అర్థంకాలేదు తన తండ్రికి. పైగా అపార్థం చేసుకొని డాక్టరు గారి దగ్గరికి వెళ్ళి 'అతనింకా డబ్బుకి ఎక్కువ ఆశ పడుతున్నట్టున్నాడండి. నేనింతకంటే యింక యిచ్చుకోలేను. కొంచెం మీరు చెప్పండి.' అని చెప్పాడు. దాంతో డాక్టరుగారూ తప్పుగా అర్థం చేసుకొని తన తండ్రి మాటల్నే ఆయనా వల్లించి వేసివచ్చారు. 'నేను తోటి మనిషికదా అని నేనివ్వగలిగింది నేనిచ్చానే కాని అమ్ముకోటం లేదుసార్' అని డాక్టరుతో ఆవేశంగా అన్నాడట అర్ముగం. డాక్టరుగారు కూడ అతని మాటల్ని అపార్థం చేసుకున్నారు. ' సర్సరే, నువ్వివ్వగలిగింది

ఆర్ముగం

నువ్విచ్చావు. వాళ్ళివ్వగల్గింది వాళ్ళిస్తున్నారు. సంతోషంగా పుచ్చుకొని వెళ్ళు.' అని డాక్టరు గారు చెప్పి వెళ్ళిపోయారట!.... అంతే, ఆ రాత్రికి రాత్రే హాస్పటలు నుంచి ఎవరికీ తెలియకుండ వెళ్ళిపోయాడు ఆర్ముగం!

'దానమంటే నిజంగా దానమే చేసాడు. కాని, అతను కిడ్నీని అమ్ముకోలేదు.' అని తన తండ్రి ఎన్నిసార్లు చెప్పినా తన అత్తవారు ఆయన మాటల్ని నమ్మలేదు. తన తండ్రి చాటుగా డబ్బిచ్చి అతన్ని పంపించేసాడట. అత్తింటి వారిని పది మందిలో ఎద్దేవా చేయాలని – ఆ పరాయివాడెవరో దానం చేసాడని – అందరితోను చెప్పుకుంటున్నాడట! 'వింటున్నారా మీ వాళ్ళ మాటలు' ! అని తానంటే '.... కాళ్ళ దగ్గరికి వచ్చిన డబ్బుని కాదనే వాళ్ళుంటారా ఈ లోకంలో.' అని వ్యంగ్యంగా నవ్వాడు తన భర్త.

ఇదీ తన భర్త సంస్కారం! తను మృత్యు ముఖంలో ఉన్నప్పుడు అతనెంతో బాధపడి పోయాడని తన పిచ్చి తండ్రి ఇప్పటికీ నమ్ముతున్నాడు!

తన భర్తకి తన మీద ప్రేమ ఇదివరకు వుందా– ఇప్పుడు ఉంటోందా– ఇక ముందు ఉంటుందా– అన్న మీమాంసలో లేదిప్పుడు ఆమె మనస్సు.

'అర్ముగం' తనని చూడకుండ ఎందుకలా వెళ్ళి పోయాడు?– అదే ప్రశ్న పదే పదే ఆమె కెదురవుతోంది?

హాస్పటల్లోని అతని అడ్రసు సంపాదించి ఎవరో తమిళం తెల్సున్న వాళ్ళ చేత రెండుమూడు ఉత్తరాలు రాయించింది. అయినా అతన్నుంచి జవాబు లేదు. పైగా ఉత్తరాలు తిరిగి వెనక్కి వచ్చాయి.

'ఒక సారి నువ్వు వెళ్ళి చూసిరా అన్నయ్యా'అని తన అన్నగార్ని మద్రాసు పంపించింది. అలాంటి పేరున్న వాళ్ళు గాని– అలాంటి గుర్తులున్న వాళ్ళు కాని ఆ అడ్రసు వున్న చోట ఎవ్వరూ లేరుట! తను ఆశ్చర్యపోయింది– 'అర్ముగం' అన్న మనిషి లేనేలేడా? తనకు ప్రాణదానం చేసింది 'అర్ముగం' అన్నది అభూత కల్పనా? మరి తండ్రీ , అన్నా .... చివరకి తన భర్త అంతా అతన్ని చూసారే! నర్సు తను రాసిచ్చిన చీటీ తీసుకువెళ్ళి అతనికిచ్చి వచ్చిందే! మరి తానొక్కతే చూడకూడ నంత పాపం తానేం చేసిందని..... అతనలా వెళ్ళిపోయాడు?తప్పు చిరునామా యివ్వవచ్చిన అవసరం అతనికే మొచ్చింది? ఇంత గుప్తదానం చేయవల్సిన అగత్యం అతనికేం కలిగింది? తన ప్రాణదాతకి కృతజ్ఞత చెప్పుకోలేక పోవటం తనకు ప్రాణ సంకటంగా వుంది యిప్పుడు ! తన మనసులోని వేదన అతనికి తెలియజెప్పగల శక్తి ఈ లోకంలో ఎక్కడయినా వుందా?.....

రిక్షావాడు మువ్వలు మోయించటంతో ఆలోచనల్లోంచి బయటపడింది రాధ. "అప్పుడే వూళ్ళోకి వచ్చేసామా?" అంది.

"అవునమ్మా! ఇప్పుడూళ్ళోకి కంకర్రోడ్డు వేసారు. స్టేషన్నించి ప్రయాణం అరగంటకన్న ఎక్కువ పట్టదు." అన్నాడు సుబ్బారావు.

రిక్షా మువ్వల చప్పుడికి తోడు ఆమె గుండెలు లయబద్ధంగా జల్లుమంటున్నాయి. చిన్ననాటి స్మృతులు ఒక్కసారి ఉవ్వెత్తున లేచి వస్తున్నాయి.

"అది..... అది మనయిల్లు కదూ!" అంది రాధ.

"అవునమ్మా!" అన్నాడు సుబ్బారావు ముక్తసరిగా.

"నాపెళ్ళికోసం అమ్మేయక పోతే అది యిప్పటికీ మనిల్లుగానే వుండేది."

"అదేంమాటమ్మా! మనం పట్నంలో అన్నయ్య దగ్గరికి వెళ్ళి పోయాము కదాని......"


పట్నం వెళ్ళిపోయిన వాళ్ళంతా వున్నవూళ్ళోని యిళ్ళమ్మేసుకుంటున్నారా?..... ఆ మాట అంటే తండ్రి బాధపడతాడని వూరుకుంది రాధ. పుట్టి పెరిగిన వూరితో సంబంధాలు త్రెంచుకోవాలని తాననుకోలేదు. తన సుధాకర్ అనుకోలేదు. ఈ వూళ్ళోనే వుందా మనుకున్నారు.

అతనిది చదువూ పెద్దది కాదు. ఉద్యోగమూ పెద్దది కాదు. అయినా ఉన్న వూళ్ళో ఉద్యోగం దొరికింది కదాని ఎంతో సంబరపడి పోయారు. ఉన్నంతలో సంతృప్తిపడి బ్రతుకుదా మనుకున్నారు.

తమ అనుబంధానికి తన వాళ్ళ ఆదరణ లభించి వుంటే ఇప్పటికి తనూ, సుధా ఆ యింట్లో వుంటూవుండే వారేమో! అతని తలపులతో ఆమె గుండె జల్లుమంది. కళ్ళు చెమిరాయి.

వేణుగోపాలుడి గుడి దగ్గర తనే రిక్షాని ఆపమంది రాధ.

ఇటీవల హర్యానా రాష్ట్రంలోని అంబాలా కంటోన్మెంట్‌లో అంబాలా తెలుగు సాంస్కృతిక సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నాటక, పాటల, ఏకపాత్రాభినయ, మిమిక్రి, భరతనాట్యం పోటీలలో పాల్గొన్న తెలుగు కళాకారులని చిత్రంలో చూడవచ్చు.




కాలితే ఏం చేయాలో మా అమ్మకు బాగా తెలుసు.



తనకి అమ్మమ్మ నేర్పిందిట.

అబ్బ, అమ్మంటే మా అమ్మలా ఉండాలి. ఎంత బాగా చూసుకుంటుందని! అమ్మ మొన్న నా బుజ్జి బొమ్మ గౌను ఇస్త్రీ చేస్తుంటే పొరబాట్న నేను చెయ్యి పెట్టాను. వేళ్ళు కాలింది. గబగబా అమ్మ బర్నాల్ రాసింది. కాలితే అమ్మమ్మ కూడా అలాగే బర్నాల్ రాసేదిట.

నా బుజ్జి పాపా, నీకెప్పుడైనా కాలిందంటే నేనూ బర్నాల్ రాస్తాలే, బాగయిపోతుంది.
కదమ్మా! కదూ బర్నాల్!



బర్నాల్

ఇంటింటా విశ్వసింపబడినది.

BL 2078

గుప్తాగ్ని

-సోమసుందర్

పంజాబుకు నవోదయం
కలిగించిన బర్నాలా!
భారతీయ హృదయపూర్ణ
శుభాశంస లివే నీకు...
ఆగామికి రహదారి
సమకూర్చిన బర్నాలా!
అభినందన చందనాల
నందు కొనె మహోదయా!
కంటకాలు కీటకాలు
నిండిన ఈ బాట నడక. .
గుప్తాగ్నుల కొరవులతో
భయపెట్టే ప్రేత భూమి...
మైత్రీ హిత వాక్కులతో
హెచ్చరికల నంద చేతు–
సదా చేతన ధ్వజమై
సాగవలయు మునుముందుకు!
పరలో దాగిన కత్తులు
త్వరలో తల లెత్తునేమొ?
ఎరమింగిన మత్తులో ని
త్రాచులు పడగెత్తునేమొ?
సమరం లేకుండుట – అది
శాంతి కాదు ఎన్నటికీ!
శ్మశాన నిశ్శబ్దం – అది
శాంతి కాదు, భ్రాంతి తప్ప!
సామరస్య సౌహార్దం
సౌజన్యం సుమబంధం!
అదే నేటి నరుల నడుమ
వాంఛనీయ వాత్సల్యం!
ప్రక్కనె పొంచిన శత్రువు
ఘాతుకాల ప్రేరేపణ –
రక్తదాహ పిశువులకు
శాంతి ప్రాణసంకటమే!
హో షియార్ బర్నాలా!
నవచరణాంకిత పథమిది..
అహరహ జాగృతి, పురోగతి–
అజ్ఞానంపై ధ్వజమిది..
సర్వత్రా విష ఝుంఝులు
గర్వాంధ నిశాచ రాళి...
మానవతా పరమ శత్రు
సమూహాల వ్యూహకేళి..
నిశిత శాత పరీక్షతో
పరిమార్చక ప్రగతి లేదు
నరరూప పిశాచపాళి
కూల్చక చిరశాంతి రాదు!
ఆదిమత్వ కూట నీతి
గుప్తాగ్నులు సుప్తార్చులు
మానవ జాతి నిరోధులు
హోషియార్ బర్నాలా!

ఆర్ముగం

"మాస్టారింటికి వెళ్ళి మళ్ళీ వచ్చేవాళ్ళం కదమ్మా!" అన్నాడు సుబ్బారావు.

"ముందు దేవుడికి దండం పెట్టుకొని వెళ్ళాలని వుంది నాన్నా!"

సుబ్బారావు కొబ్బరికాయ తీసుకు రావటానికి కిరాణా కొట్టు వైపు వెళ్ళాడు.

గుళ్ళోకి నడిచింది రాధ. ధ్వజ స్తంభం మీద చేయివేసి అట్టే నిలబడి పోయింది. గాలి వీచింది. చిరు గంటలు మ్రోగాయి. రాధకి గుండె గొంతుకలోకి వచ్చినట్లయింది....

ఆ రాత్రి యిక్కడే నిలబడి సుధాకర్ తనకి మాట యిచ్చాడు.... "ఒక్క రెండేళ్ళు ఎలాగో ఓపిక పట్టు. నేను మంచి ఉద్యోగం సంపాదించుకు వస్తాను. మీ వాళ్ళని సంతృప్తి పరిచాకనే నిన్ను పెళ్ళి చేసుకుంటాను. మీ అమ్మగారు కోరినట్టు పట్నంలో నే కాపురం పెడదాము.... నన్ను నమ్ము."

తను నమ్మింది. వెళ్ళినవాడు వెళ్ళి వూరుకో లేదు. తన నింకా నమ్మించాలని గుడి దగ్గర చెప్పిన మాటలే ఉత్తరంలో రాసి పంపించాడు. అదే తనకు ప్రాణ సంకట మవుతుందని తెల్సుంటే సుధ అంత పని చేసివుండేవాడు కాదు!

తల్లి కళ్ళబడింది ఆ వుత్తరం. తండ్రితో పోరి యావత్తు కాపరాన్ని పట్నానికి తరలించింది. ఎలాగయినా సుధాకర్ పెట్టిన గడువు దాటాలని తన ఆరాటన. ఆలోగా పెళ్ళి చేసేయాలని తన తల్లి తొందర. చదువుకుంటాను ఇప్పుడప్పుడే పెళ్ళి వద్దని తను. చదివి వుద్యోగాలు చేయాలా పెళ్ళి చేసుకోమని తల్లి. అన్నగారి సహకారంతో చదువు వంకన ఆ రెండేళ్ళూ ఎలాగో గడప గలిగింది. ఆపైన సుధాకర్ కోరిన గడువుతీరి ఆర్నెల్లూ గడిచి పోయాయి. ఇంక తనకు తల్లిదండ్రుల్ని ప్రతిఘటించి పెళ్ళికి వాయిదా వేసే శక్తి పోయింది.... ఇచ్ఛా పోయింది!

ఆ తర్వాత తనకు ఆనంద్‌తో.... తల్లి కోరిన పట్నవాసపు టల్లుడితో పెళ్ళయి పోయింది. ఈ దేశంలో అనేక మంది ఆడపిల్లల్లాగునే తనకు జీవితంతో రాజీపడక తప్ప లేదు!

కాని, తర్వాత ఆనంద్‌తోటి దాంపత్యం సుధాకర్‌ని మరిపించటానికి బదులు అతన్ని నిత్యం గుర్తుంచుకునే దుస్థితికి తీసుకు వెళ్ళింది. సుధ యిలా చేసేవాడా– సుధ యిలా అనేవాడా– అని భర్తతో పోల్చుకోని రోజు లేకుండా పోయింది. చివరికి ఒక్కసారి సుధాకర్ వచ్చి తనతో నాల్గు మాటలు మాట్లాడి వెడితే చాలు మరికొన్నేళ్ళు బ్రతగ్గల శక్తి వస్తుందేమో– అని తాననుకునే పరిస్థితికి దిగజారి పోయింది తన జీవితం.

కాని, తనకా కోరికా తీరలేదు. గడువుదాటి రెండు కాదు.... పదేళ్ళు దాటిపోయినా సుధాకర్ తనని చూడటానికి రాలేదు! ఎందుకు రాలేదో, ఎక్కడ వున్నాడో, ఎలా వున్నాడో తనకు తెలియదు. తమ ప్రేమనిలా ఎందుకవహాస్యం కానిచ్చాడో తన కంతు పట్టటం లేదు. మగవాడు! తానే వచ్చి చూడకపోతే ఆడది– అస్వతంత్రురాలు తాను వెతుక్కుంటూ ఎక్కడికి వెళ్ళి చూడగలదు? ఇంకీ జీవితంలో మళ్ళీ అతన్ని చూడలేదేమో తను!....

నిరాశతో నిండిన జీవితంతో గడుపుతున్న తనకు అనారోగ్యం కూడ తోడయింది. అది చివరకి తనను మృత్యు ముఖం దాకా తీసుకు వెళ్ళింది. "ఆర్ముగం" అన్న వ్యక్తి తనని ఆదుకోక పోయివుంటే.... ఈ క్షణంలో సుధాకర్ స్మృతులతో ఇక్కడ యిలా నిలబడ గలిగి వుండేదా?....

"ఇదిగోనమ్మా కొబ్బరి కాయ." అన్నాడు సుబ్బారావు.

గుడివైపు నడిచింది రాధ. గుడి తలుపులు వేసి వున్నాయి.

"ఈవేళప్పుడు పూజారిగారుండడు!" అన్నాడు సుబ్బారావు.

ఈ జీవితంలో తనకు కావాలని పించినప్పుడు తన కేదేవుడు అందుతున్నాడు కనుక!" "ఫర్వాలేదు నాన్నా!...." అని గుడి గుమ్మంలోనే కొబ్బరికాయ కొట్టింది.

మరో పది నిమిషాల్లో గమ్యం చేరుకుంది రిక్షా.

"నమస్కారం మాస్టారూ!" అంది రిక్షాదిగిన రాధ.

"రామ్మారా!" అని ఎదురు వచ్చారు సుందరం మాష్టారు.

"పునర్జన్మ ఎత్తి వచ్చావుట. నిన్ను చూడాలని ప్రాణాలు కళ్ళల్లో పెట్టుకొని కూర్చున్నానే తల్లీ!" అంటూ శాంతమ్మగారు కావలించుకొని కన్నీళ్ళు పెట్టుకుంది.

"ప్రసాదం తీసుకోండి."

"అయ్యయ్యో, ఎంత చిక్కిపోయావే తల్లీ!"

"మిమ్మల్ని చూడాలని నాతో పట్టు పట్టి వచ్చింది." అన్నాడు సుబ్బారావు.

"మరి కొన్నాళ్ళు రెస్టు తీసుకున్నాక రాక పోయావామ్మా!" అన్నారు మాస్టారు.

"మిమ్మల్ని, పిన్నిగార్ని ఈవూర్ని చూసాక... ఇంకా నాకు రెస్టు అవసరమంటారా మాస్టారూ!" అని గలగల నవ్వింది రాధ.

ఆ తర్వాత ఆమె ఒక్కటే కబుర్లు.... రైలు దిగినప్పట్నించీ నిరుత్సాహంగా వున్నది అంత అధాత్తుగా ఆమె యిన్ని కబుర్లెలా చెప్పగలుగుతోంది? ఆమెకింత శక్తి ఎక్కడ్నించి వచ్చింది?.... సుబ్బారావు ఆశ్చర్యపోతున్నాడు.

"మీ అమ్మ యిప్పుడు బ్రతికి వుంటే నిన్ను చూసి ఎంత సంతోషపడి వుండేదో!" అంది శాంతమ్మ.

ఏరికోరి ఆనంద్‌తో సంబంధం చేసిన తన తల్లి తన కూతురి జీవితం ఎలా అవస్తలు పాలయిందో తెలియక ముందే ఇహలోకం విడిచి వెళ్ళి పోయింది. పరలోకంలో వుండి, సంతోష పడుతోందో ఇహలోకంలో వుంటే ఆనందపడి వుండేదో తానిప్పుడు చెప్ప లేదు. ఎట్టెదుట శాంతమ్మగారు తనను చూసి ఆనందపడుతోంది – అది చాలు తనకి. ఆ మాటేపైకి అంది రాధ.

"నీ అభిమానం.... నువ్వూ ఏమి మారలేదు." అంది ఆవిడ సంబరపడిపోతూ.


"కబుర్లేనా! కాస్త కాఫీలు సంగతి కూడా చూడు...." అన్నారు మాస్టారు.


"అరే, నా మతి మండిపోను." అంటూ ఆవిడ లేచింది రాధ ఆవిడ్ని వెన్నంటి వెళ్ళింది.

మాస్టారడిగాడు. వెల్లూరులో రాధ ఎలా పునర్జన్మ ఎత్తి వచ్చిందో చెప్పుకుంటూ వచ్చాడు సుబ్బారావు. ".... ఆ అర్భగం ఎవరోగాని మాస్టారూ! అతని ధర్మమా అని మామిడితోట అమ్మ వల్సిన అవసరం రాలేదు. బజానా డబ్బు తిరిగిచ్చేద్దామనే నేనిప్పుడు వచ్చాను."

మరి కాసేపటికి శాంతమ్మగారు రాధని వెంట బెట్టుకొని వంటింట్లోంచి బయటకు వచ్చింది. అంతవరకూ కబుర్లలో వుండి అట్టే గంభీరంగా వుండిపోయారేమిటా అని రాధ చిత్రంగా చూసింది.

"ఇదిగో వింటున్నారా? రాధ ఏదో అడుగుతోంది!"





అంది ఆవిడ.

"ఏమిటి?" మాస్టారడిగారు.

"బుచ్చిరాజుగారి సుధాకర్ యిప్పుడెక్కడున్నాడు – అతనికి పెళ్ళయిందా– పిల్లలెంత మంది.... ఆవటా అని అడుగుతోంది."

"ఏమని చెప్పను?" అన్నాడాయన సుబ్బారావు చూస్తూ.

రాధ గతుక్కు మంది. "అదేమిటి మాస్టారూ! అతనీ పదేళ్ళల్లోనూ మన వూరెప్పుడూ రాలేదా?"

"ఇది చదువమ్మా!...." తండ్రి గొంతు జీర పోయిందెందుకో.... అధాత్తుగా లేచి వీధి అరుగుమీద కెందుకు వెళ్ళిపోయాడో అర్థంకాక.... వెల వెల బోతూ ఆయన అందించిన కాగితం మడత నందుకుంది రాధ!

ఆమె గుండెల్ని గగుర్పాటుతో జల్లు జల్లుమని పిస్తుండగా ఆమె కళ్ళు ఆ కాగితంలోని అక్షరాల మీద వరవడి పెట్టాయి. అతి పరిచయమయిన ఆ అక్షరాలు ఆమె గుండె కుదుళ్ళని కదలిస్తుండగా ఆమె చదవ సాగింది.

మాస్టారూ!

మీ కిలాంటి ఉత్తరం రాయవల్సి వస్తుందని నేనీ జీవితంలో ఎప్పుడూ అనుకోలేదు. ఈ క్షణంలో నా సంతోషాన్ని పంచుకునే ఆత్మీయులు మీరు తప్ప నాకీ లోకంలో ఎవ్వరూ లేరు. అందుకే మీకిది రాస్తున్నా.

మన రాధకి గండం గడిచింది మాస్టారూ! ఆపరేషను సలక్షణంగా జరిగి పోయింది. ఇప్పుడు కులాసాగా వుంది. ఈ శుభ వార్త మీరు వింటే ఎంతో సంతోషిస్తారని నాకు తెల్సు. అందుకే ఇది రాస్తున్నా.

మాస్టారూ! ఒంటరివాడ్ని. ఈ జీవితంలో నాతో సుఖ దుఃఖాలు పంచుకొనే వాళ్ళెవరూ లేరు నాకు. అయినా, మీరు నాయందు చూపించిన ఆత్మీయత కొద్దీ నా గురించి మీతో ఎంతో చెప్పుకోవాలని వుంది. ఇప్పుడు రాలేని పరిస్థితిలో వున్నాను. అందాకా ఆపుకోలేక నా గురించి ఈ మాటలు రాస్తున్నా.

మీకు తెల్సునో తెలియదో రాధా నేనూ పదేళ్ళ క్రితమే పెళ్ళి చేసుకుందా మనుకున్నాము. వాళ్ళ వాళ్ళకి ఆ సంగతి తెల్సు. ఇందులో రహస్య మేమీలేదు. నా కయిన వాళ్ళెవరూ లేరు. పెద్ద ఉద్యోగం లేదు. అస్తిపాస్తులు లేవు. రాధని ఏం సుఖ పెట్టగలనని వాళ్ళ భయం. నాతో పెళ్ళి చేసి రాధని కష్టాలుపాలు చేయటం యిష్టం లేదన్నారు వాళ్ళు. లోకంలో ఏ తల్లి దండ్రు లయినా అదే మాట అంటారు. అది సహజం. కాని, రాధ తిన్నాకనే నేను తిందామను కున్నాను. రాధని సుఖపెట్టటానికి ప్రపంచంలో ఎటువంటి బరువు లెత్తటాని కయినా సిద్ధ పడదా మనుకున్నాను. రాధ నాకు ప్రాణం.... నా ప్రాణం కంటె ఎక్కువగా చూసుకుంటాను.... అని చెప్పాను. ఒక్క రెండేళ్ళు గడు వివ్వండి– ఒక మంచి ఉద్యోగం సంపాదించుకొని వస్తాను అని చెప్పి బయలు దేరి వెళ్ళాను. ఎక్కడెక్కడ ఎన్ని ప్రయత్నాలు చేసానో– ఎన్ని అవస్థలు పడ్డానో యిప్పుడు చెప్పనూలేను. చెప్పి ప్రయోజనమూ లేదు. కాని, అఫీసర్ని కాకపోయినా నాకంటూ ఒక మంచి ఉద్యోగం సంపాదించుకొనే సరికి రెండున్నర సంవత్సరాలు పట్టింది!....

కాని, నాదురదృష్ట వశాత్తు నేను వచ్చేటప్పటికి ఒక నెలముందే రాధకి పెళ్ళయిపోయిందట! నేను మాట నిలబెట్టుకో లేక పోయానని రాధ ఎంత నిరాశపడివుంటుందో– ఆ ఆలోచన భరించలేక పోయాను. ఆమె కొక్కసారి క్షమాపణ చెప్పుకుంటే కాని నాకు శాంతి కలుగదు. రాధ అడ్రసు తెల్సుకోటానికని వాళ్ళ వాళ్ళింటికి వెళ్ళాను.

"ఇప్పుడేం ముఖం పెట్టుకొని వచ్చావు? నీ కోసం ఎంతో ఎదురు చూసి పెళ్ళి చేసుకుంది రాధ. ఇప్పుడు రాధకి నువ్వంటే అసహ్యం!" అన్నారు వాళ్ళమ్మగారు. రాధ పెళ్ళిఫోటో తెచ్చి చూపించారు. వాళ్ళు సుఖంగా వున్నారు. ఇప్పుడు నువ్వక్కడికి వెళ్ళి లేనిపోని అనుమానాలు పుట్టిస్తావా! రాధ మీద నీకున్న ప్రేమయిదేనా' అన్నారావిడ. నిజమేననిపించింది. ప్రేమించిన వాళ్ళని యిబ్బందుల్లో పెడతారా ఎవరయినా! రాధ యిప్పుడు నాది కాదు. పరాయిసొత్తు. పలకరించటం కూడ తప్పేకావచ్చు.

అందుకని గుండె రాయి చేసుకొని తిరిగి వెళ్ళిపోయాను. తిరిగి మనవూరు రావాలని నా కనిపించలేదు. రాధ లేని చోటికి రావాలని పించలేదు. మళ్ళీ వస్తానని అనుకోనూ లేదు.

కాని, ఆ రేళ్ళ తర్వాత రాధ పేరు పేపర్లో చూసే సరికి నా గుండె గుభేల్మంది. నమ్మలేక పోయాను. అది నిజంకాకూడదని ఆశిస్తూ మన వూరు వచ్చాను. కాని, అది నిజమేనని మీరు చెప్పాక నా ప్రాణాలు

ఆర్మగం

గిలగిల లాడిపోయాయి.

రాధని పోగొట్టుకొని ఎలా యింత కాలం బ్రతగ్గలిగానా అని నాకప్పుడప్పుడూ అనిపించేది. ఈ వ్యర్థ మయిన బ్రతుక్కి ముగింపు పలుకుదామా అని కూడా అనిపించేది. ఏదో తెలియదు– ఏదో శక్తి నన్నిలా యింతకాలం బ్రతకనిచ్చింది.

ఇప్పుడు నాకెంతో ఆనందంగావుంది మాస్టారూ! వ్యర్థ మనుకున్న నాజీవితానికో అర్థం యిన్నాళ్ళకి కనిపించింది. రాధ కేమి చేయలేక పోయాననుకున్నాను ఇన్నాళ్ళూ! రాధ కావాలంటే నా ప్రాణాలన్నీ పట్టి పిండి యివ్వాలని పించేది. అటువంటి నారాధ ప్రాణాపాయ స్థితిలో వుంటే నేను భరించగలనా?

వెల్లూరు వెళ్ళాను. సుబ్బారావు గార్ని కలుసుకున్నాను. ఆయన్ని చూసే సరికి రాధ వాళ్ళమ్మగారన్న మాటలు గుర్తొచ్చాయి. రాధకి నేనంటే అసహ్యమన్నారావిడ. నిజమా? ఏమో– నిజమో కాదో కనుక్కునే అవకాశం నాకులేదు. అప్పుడవసరమూ అనిపించలేదు. రాధకి ఎవరు కిడ్నీ దానం చేస్తున్నారో తెలియవల్సిన అవసరం ఉందా? లేదు...... రాధ బ్రతకాలి. ఆక్షణంలో నా కోరికా అదే! అనిపించింది అదే! ..... అందుకే, నేను సిద్ధబడ్డాను.

నాగెడ్డమూ అది చూసి సుబ్బారావుగారు నన్ను గుర్తుపట్టక పోవటం మంచిదయింది. నా తమిళం మాట విని ఎవరో అరవ్వాడిననుకున్నారాయన.

కాని, రాధ నన్ను చూడాలని వుందని సుబ్బారావు చెప్పారు. రాధ స్వయంగా నాకుత్తరమే రాసి నర్సు ద్వారా పంపించింది..... పిచ్చి రాధ నాగురించి తెలియక తెలుగునుంచి తమిళంలోకి తర్జుమా చేయమని నర్సుతో చెప్పిందిట! అప్పుడు నర్సు పడిన అవస్థ చూస్తే ఇప్పటికి నాకు నవ్వాగదు!

అయితే, రాధ ఆశిస్తున్నట్టు నేనెదురుపడితే ఏమంటుంధి? అందరితో పాటు తనూ నన్ను గుర్తుపట్టదని భ్రమపడలేను నేను. ఎన్నేళ్ళు గడిచినా ఎన్ని వేషాలు వేసినా– భాష మార్చినా రాధ నన్నిట్టే గుర్తు పట్టేస్తుంది! కాని, నిజంగా వాళ్ళమ్మగారన్నట్టు– నా మీద రాధ కింకా అసహ్యమే ఉంటే నేను అందించింది అమృతం కాదు– విషమయిపోతుంది. అలాంటి బాధ నేనసలే భరించలేను

అంతకన్న అజ్ఞాతంగా ఆమె జీవితంలోంచి తప్పుకోవటమే మంచిదని నిన్ననే ఎవరికి తెలియకుండ హాస్పటలునించి వచ్చేసాను. రాత్రి వచ్చేసే ముందు రాధ గదిలోకి వెళ్ళి చూసి వచ్చాను. హాయిగా నిద్రపోతోంది. ఆమె తిరిగి ప్రపంచంలో పడింది. ఈ జీవితానికా తృప్తి చాలు.

అందుకే నిశ్శబ్దంగా తిరిగి వచ్చేసాను.

రాధ కులాసాగా వుందని శాంతమ్మగారికి చెప్పండి ఆవిడా ఆనందపడతారు. మీకూ– ఆవిడకి నా నమస్సులు

–సుధాకర్! □


పాఠశాలల్లో వీడియో విద్య
హైదరాబాద్, అక్టోబర్3
వచ్చే సంవత్సరం నుంచి వెయ్యిపాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తున్న దృశ్య శ్రవణ సాధనాల ద్వారావిద్యాబోధన కార్యక్రమాన్ను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని విద్యాశాఖమంత్రి శ్రీగాలిముద్దుకృష్ణమనాయుడు నేడు సచివాలయంలో విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు.
chaitanya ARUN
విద్యార్థులందరికీ వీడియో పాఠాలొద్దట సార్! వీడియో క్యాసెట్లు తీసుకొచ్చి సినిమాలు వేయమంటున్నారు......
HEAD MASTER
మా వాడు ఆరోగ్యం బాగోక వారం రోజులు క్లాసులకి రాలేదు....... ఆ పాఠాల తాలూకూ క్యాసెట్లు ఓసారిస్తే...! మా ఇంట్లో టి.వి; వి.సి.ఆర్ లు .. వున్నాయి.
HEAD MASTER
ఈ పిల్లగాళ్ళకి సినిమాలు చూసే అలవాటు కదా. ఒక్క సీను కూడా మిస్సు కాకుండా చూస్తున్నారు! ఏంటి సంగతులు.......
మన పనే బెస్ట్రా! మాష్టరు ప్రశ్నలేసి చెప్పకపోతే బెత్తము పట్టుకొని కొట్టేవాడు. కాని ఇప్పుడు ఈ వీడియో పాఠాలవల్ల ఆ బెడద తప్పింది.
ఏమండి గుర్నాధముగారూ! ఈ వీడియో పాఠాల వల్ల కొన్నాళ్ళకి మన మాష్టర్లఉద్యోగాలు అవసరముండదేమోనండీ!
బ్లూ ఫిల్ములు వేస్తున్నామని ఎవరండీ మీకు చెప్పింది... ...... అవి "శరీర శాస్త్రం" పాఠం తాలూకూ క్యాసెట్లండీ బాబు....
HEAD MASTER

సీరియల్

అంతరాలు-అంతర్యాలు

బోసుబాబు

(గతసంచిక తరువాయి)

మాధవరావు నాయుడుగారి ఇంటిలో డైనింగ్ హాలు. డైనింగ్ టేబిల్ చుట్టూ కుర్చీలు వున్నాయి. నాయుడు గారు, ఆయన చెల్లెలు శ్రీలక్ష్మి, శోభ, ఉష కూర్చున్నారు. వడ్డన జరుగుతోంది.

"అన్నయ్యా! ఆ విషయం ఏం చేశావు?"

"ఏ విషయం?"

"అదే.... గోపాలరావు గారబ్బాయి శేఖర్ విషయం."

"వాళ్ళకేమి అభ్యంతరం లేనట్టుగా విన్నాను."

"ఇక మనమే చొరవ తీసుకోవాలన్నమాట."

"అంతేమరి.... మనతో సరితూగే సంబంధమే అది. బిజినెస్ గోపాలరావు గారిదే అయినా, వ్యవహారాలన్నీ చూచేది వారబ్బాయి శేఖరేనట. హైదరాబాద్‌లో అతనిప్పుడు పెద్ద బిజినెస్ మాగ్నెట్‌గా వున్నాడట కూడా....." ఈ మాటలు చెబుతూనే, కూతురువైపు చూచారు నాయుడు గారు. ఆయన చెల్లెలు శ్రీలక్ష్మి కూడా శోభను చూచింది.

శోభ ఈ మాటలు వింటున్నదేగాని, తల వంచి భోంచేస్తూనే వుంది. గంభీరమైన ఆమె వదనంలో ఎలాంటి మార్పు లేదు.

"అన్నయ్యా, నాదో ఆలోచన...."

"చెప్పమ్మా ఏమిటో ...."

"నేను, శోభని హైదరాబాద్ తీసికెళ్ళి ఓ పది రోజులు....

నాయుడుగారు నవ్వారు. ఆ నవ్వులో సంతోషం వ్యక్తమైంది.

"నేనూ, అదేనమ్మా ఆలోచిస్తున్నాను."

జరిగిన కథ-14: సరోజ తన స్నేహితురాలు శోభతో కూడా శ్యామ్ సుందరావు ఇంటికి వెళ్తుంది. శోభ శ్యామ్‌ను ప్రేమిస్తుంది శ్యామ్‌కూడా తనకి శోభంటే ఇష్టమని ఆమెతో చెబుతాడు. సరోజ శ్యామ్ వైపు ఆకర్షితురాలవుతోందని తెల్సుకుంటుంది శోభ. శోభ, శ్యామ్‌ల ప్రేమకు అడ్డు గోడగా నిలుస్తాడు శోభ తండ్రి. సరోజ తల్లితండ్రులు సరోజని ముత్యాలరావు కిచ్చి పెళ్ళిచేయాలనుకుంటారు. కానీ సరోజ తానసలు పెళ్ళే చేసుకోనని చెపుతుంది. శ్యామ్ తల్లి వర్ధనమ్మగారికి సరోజని చూస్తే అభిమానం ఉంది కానీ ఆ అమ్మాయిని కోడలుగా చేసుకోడానికి మాత్రం ఆమె మనసు అంగీకరించదు. సరోజ తను శ్యామంను పెళ్ళి చేసుకుంటానని తల్లితో చెపుతుంది సరోజ తరచు శ్యామం ఇంటికి వెళుతోందని అలా వెళ్ళకుండా కూతుర్ని అదుపులో పెట్టుకోమని పరంధామయ్య సుబ్బారావుగారిని హెచ్చరించడంతో ఆయన ఉగ్రుడై కూతురిపై చేయి చేసుకుంటాడు. సుబ్బారావుగారు స్వంత ఇల్లుని అమ్మేసి సరోజ వివాహ ప్రయత్నాలు ప్రారంభించారు.

"స్థలం మారితేనైనా, మనసు కొంత కుదుట పడుతుందేమోనని. . "

"సరిగ్గా నా ఆలోచనే నీకూ వచ్చిందన్న మాట. ఏమైనా, నా చెల్లెలివి కదూ!"

శోభ మూగనోము. వీరి మాటలు విననట్టు, పట్టించుకోనట్టు, పరధ్యానంలో వున్నట్టు వ్యవహరిస్తోంది.

శ్రీలక్ష్మి, శోభ వైపు తిరిగి –

"శోభా! అన్నయ్య కూడా సరేనన్నాడు. నీ అభిప్రాయం చెప్పనే లేదు. అంటే, శేఖర్ విషయం కాదులే. హైదరాబాద్ నాతో వచ్చే విషయం... !"

శోభ పెదవి విప్పలేదు.

నాయుడుగారు కూడా కూతురు వైపు చూచారు.

"లక్ష్మి! దాన్నడిగితే ఏం చెబుతుంది. మీరు త్వరలోనే హైదరాబాద్ వెడుతున్నారు.... సరా...." నిర్ణయించేసినట్లే చెప్పారు నాయుడు గారు. మళ్ళీ ఆయనే శోభతో అన్నారు–

"అమ్మా! నువ్వు పాత సంగతులన్నీ మరచి పోవాలి. మనం, ప్రతి విషయాన్ని లాభ, నష్టాలు బేరీజు వేసి అంచనా వేసుకోవాలి. క్షణికమైన ఆవేశాలు మనబోటివాళ్ళకు అసలు తగవు. మన ఉన్నత స్థితిని ఎప్పుడూ మరచి పోకూడదు. వియ్యమైనా, కయ్యమైనా సమానమైన వారితోనే జరగాలి, తెలిసిందా.. .?"

శోభ ఒక్కసారి తలయెత్తి తండ్రిని చూచి మళ్ళీ తల దించుకుంది. అయితే ఆమె వదనంలో ఎలాంటి భావం వ్యక్తం కాలేదు.

భోజనం ముగించి, మేడమీద గదికి వెళ్ళిపోయింది. తలుపులు మూసుకుని పడుకుంది.

ఆ రోజు సాయంత్రం, కారులో కాకుండా రిక్షాలోనే బయలుదేరి శ్యామం ఇంటికి వెళ్ళింది. గేటు త్రోసుకుని లోపలికి అడుగుపెట్టగానే వర్ధనమ్మగారు కనిపించింది శ్యామం ఆఫీసు గది మాత్రం తాళం వేసి వుంది. శోభ నాలుగు అడుగులు వేసింది. శోభను గుర్తుపట్టింది వర్ధనమ్మ.

"రామ్మా, రా.... నీపేరు శోభారాణి కదూ. అదేంటమ్మా అలా చిక్కిపోయావు...." అంటూ లోపలికి దారి తీసింది.

శ్యామాన్ని కలుసుకుని, అన్ని విషయాలు మాట్లాడుదామనే ఉద్దేశంతో వచ్చింది.

శోభ ముందు గదిలో కూర్చుంది.

"శ్యామంగారు లేరాండి... ?"

"వాడు ప్రొద్దుటే, పని మీద కామోసు ఊరు వెళ్ళాడమ్మా, రేపు ఉదయానికి వస్తాడేమో. పని పూర్తి కాకపోతే ఆలస్యం పట్టవచ్చు. అయినా నేను మాత్రం ఖచ్చితంగా చెప్పలేను "

"సరేలెండి.... మీ అబ్బాయి గారొస్తే, నేను వచ్చి వెళ్ళానని చెప్పండి...." అంటూ లేచింది శోభ.

"వుండమ్మా, కాస్త కాఫీ తీసుకుని వెళుదువు గాని."

"క్షమించండి. నేనిప్పుడేమి తీసుకోను. వంట్లో కూడా బాగోలేదు."
వర్ధనమ్మ గేటు వరకు వచ్చి, శోభారాణిని సాగనంపింది....

గేటు బయట నిలబడి రిక్షా కోసం అటు ఇటు చూస్తుండగా, ఓ కారు దూసుకుంటూ పోయింది. దానిలో నాయుడు గారున్నారు ఆయన, శోభను చూడనే చూచారు. కాని శోభ ఇదేమి గమనించ లేదు. రిక్షా కనబడగానే పిలిచి, దానిలో కూర్చుని ఇంటికి వెళ్ళి పోయింది. గేటు దాటి లోపలకు వెళ్ళగానే, ముందు హాల్లో నాయుడుగారు నిలబడి వున్నారు.

శోభ ఓసారి తండ్రి ముఖం చూచి, తల వంచుకుని లోపలికి వెళ్ళ బోయింది.

"శోభా!" అది పిలుపులా వున్నా, పెద్ద కేకలా వినబడింది శోభకు.

"ఎక్కడ నించి వస్తున్నావు.... ఎక్కడి కెళ్ళావు?"

"ఇక్కడ నుంచే.... ఏం.... అలా అడుగుతున్నారే?"

"ఏమిటి నీ తల బిరుసు సమాధానం."

"నేను, మామూలుగానే చెప్పానుగా."

"అదేనా చెప్పడం. నేనడిగిన ప్రశ్న ఏమిటి.... నీవు చెప్పిన దేమిటి?"

శోభ మాట్లాడ లేదు.

"నీవు గుడ్డిగా ప్రవర్తిస్తున్నావని, అందరినీ గుడ్డి వాళ్లను కుంటున్నావా....?"

"ఏమిటి నాన్నా మీరనేది. నాకేమి అర్థం కావడం లేదు."

"నీకు ఎన్నిసార్లు చెప్పినా, ఎంతగా బుజ్జగించి చెప్పినా అర్థం కాలేదని, నాకిప్పుడు అర్థమవుతోంది. కన్న బిడ్డవన్న మమకారంతో ఇంతకాలం సహిస్తూ వచ్చాను...."

"నాన్నా, నేనిప్పుడు చేసిన నేరం ఏమిటి.... మీరెందు కలా ఆవేశపడతారు?"

"షటప్.... నీ తెలివితేటలు నా ముందు ప్రదర్శించకు.... ఎన్నాళ్ళుగా మళ్ళీ వెడుతున్నావ్ ఆ శ్యామం ఇంటికి....?"

శోభ నిశ్చేష్టురాలైంది. వణుకు ప్రారంభ మైంది. నోట మాట పెగలడం లేదు

"ఏదీ.... నా ప్రశ్నకు బదులేదీ....?"

మళ్ళీ శోభ మవునం. తల యెత్తలేక పోతోంది.

"అవును. కుటుంబ గౌరవాన్ని బజారుపాలు చేయదలచిన దానికి సమాధానం ఎలా వస్తుంది. సిగ్గు విడిచి సంచరిస్తూ నాకు ఆవేశం వచ్చిన దంటున్నావా?"


"నాన్నా, ఏమన్నా తిట్టండి సహిస్తాను. కాని అవమానకరంగా మాట్లాడకండి...." అంతటి భయంలోను, ఆత్మాభిమానం తొంగి చూచింది శోభ కళ్లల్లో.

"ఒక ప్రక్క నన్నూ, ఈ కుటుంబాన్ని నీవు అవమానపరుస్తూ, పైగా నేను నిన్ను అవమానిస్తున్నా నంటున్నావా. తల్లిలేని బిడ్డవని ఇప్పటికి సహిస్తున్నాను. మరొకళ్లనైతే....?"

"ఏం చేస్తారు.... చెప్పండి.... చంపేస్తారు. అంతేనా, ఆ పనే ఇప్పుడు నన్నూ చేయండి...." బావురుమన్నది శోభ. అంతలోనే మళ్ళీ ఆవేశం పొంగు కొచ్చింది.

"కన్న కూతురు మనసు గ్రహించలేని మీరు, ఇంతకన్నా ఏం చేయగలరు?"

"షటప్, అండ్ గెటవుట్.... నీకి ఇంట్లో స్థానం లేదు ... ఊఁ.... అంతే. ."



'అవును నాకు స్థానం లేదు... తెలుసు..... శిరిసంపదలకు దాసోహమన్న వారికే స్థానం.... మీ ఇష్ట ప్రకారమే వెడతాను.... 'అంటూ కాలు కదిపి ముందుకు అడుగు వేయబోయింది.

ఇంతలో ఈ అరుపులు, గందరగోళం విని శ్రీలక్ష్మి హాలులోకి వచ్చింది.

నాయుడుగారు ఉగ్రుడై, 'అగక్కడ..... ఇడియట్.... ''అంటూ ముందుకు వెళ్ళి కూతురు చెంప ఛెళ్ళుమనిపించారు. శోభ చెంపకు చేయి చేర్చుకుని, 'అమ్మా!' అని అరిచింది.

శ్రీలక్ష్మి శోభను సమీపించి, తన వెంట గబగబ మేడమీదకు తీసుకు పోయింది.

శోభ తన గదిలో మంచం మీద వాలిపోయింది. అంటి కాసేపు కూర్చుని, ఊరడింపు మాటలు చెప్పి క్రిందకు వెళ్ళిపోయింది. శోభ శూన్యంలోకి చూస్తోంది. ఆమె మస్తిష్కం వేడెక్కి పోయింది. తల పోటు. శరీరమంతా ముచ్చెమటలు. ఏదో ఊపిరి అందనట్లు బాధ. తెరిపిలేని ఆలోచనలు. పొంతన లేని ఆలోచనలు. క్రమం లేని అనుభూతులు..... వుండి వుండి నవ్వువస్తోంది. చెక్కిళ్ళ మీది కన్నీటి చారికలు ఎండిపోయినా, అవింకా తడిగానే వున్నట్లు తుడుచుకుంది. అప్పుడప్పుడు గట్టిగా కళ్ళు మూసుకుని, పిడికిళ్ళు బిగిస్తోంది. ఉబికి వస్తోన్న దుఃఖాన్ని ఆపుకుంటోంది.... ఆపుకునే ప్రయత్నంలో నవ్వు కుంటోంది... అనంతమైన ఆలోచనలు.....

'ఏమిటి జీవితం... వింతలలో వింత అంటేనే జీవితం కావచ్చు. శ్యామ్‌ని నేను ప్రేమిసు న్నానా.... ఆరాధిస్తున్నానా, మరైతే శ్యామ్.... మనసు తెలియని మనిషి... ఛీ.... నాదే పొరపాటు... మనసున్న మంచి మనిషి. తండ్రి అయినంత మాత్రాన ఇంతగా నన్ను చిత్రవధ చేస్తారా... శ్యామ్‌ని అవమానించ బట్టేగా.... నేనీదురవస్థ పాలైంది. ఇక్కడనుంచి పారిపోతే... తప్పుకాదా... మా వంశ ప్రతిష్ఠ ఏమవాలి.... శ్యామ్ దగ్గరకు పారిపోయి, శరణు వేడితే.... అతని హృదయంలో నన్ను దాచుకుంటాడా... అమ్మో, నాకే కాదు, శ్యామ్‌కి కూడా ప్రమాదమే. ఈ సమాజం, ఈ డబ్బు, ఈ సిరిసంపదలు అతన్ని బ్రతకనివ్వవు. నా కళ్ళ ముందు శ్యామ్ అంతాన్ని చూడలేను. నా స్వార్థానికి ఆ మంచి వ్యక్తిని బలిచేయలేను... నీ విక్కడికి ఎప్పుడూ రావద్దు శ్యామ్... రావద్దు... నేను నిన్ను మరచిపోతున్నాను. నిజంగానే మరచిపోతున్నాను. నన్ను మరచి పోతున్నానని మాట ఇవ్వవూ.... !నన్ను నీవు ప్రేమిస్తున్నావని తెలుసు. అందుకే చెబుతున్నాను, నన్ను మరచిపొమని. మరచిపోతావు కదూ.... అబ్బ, ఎవరో నాగుండెలకు మంట పెడుతున్నారు.. అబ్బా.... ఏమిటి బాధ. నేను అశక్తురాలిని... శ్యామ్! నువు సుఖంగా, సంతోషంగా వుండవూ?.... వుండాలని కోరుతున్నాను. వేడుకుంటున్నాను... నేను రాలేను. నిన్ను చేరుకోలేను... రాలేను... క్షమించు... క్షమించు......; శోభ మెలమెల్లగా నిద్రలోకి జారిపోయింధి.

అమాయకత్వానికి మించిన ఆకర్షణ లేదు.

మమతాను రాగాలకు మించిన ఆనందం లేదు.

ఇవి రెండూ మిళితమైనదే నిజమైన అందం– అదే సహజ సౌందర్యం.

చిక్కి శల్యమై వున్నా, మనోవ్యథతో కుమిలి పోతున్నా, ఆ మెత్తని పరుపు మీద పవ్వళించి, నిద్రలోకి జారిపోయిన శోభను చూస్తే పై అభిప్రాయమే కలుగవచ్చునేమో!

మరునాడు....

మేడమీద గదిలో పడుకుని వున్న శోభ ఇంకా నిద్రలేవలేదు. పని మనిషి వెళ్ళి, "అమ్మాయిగారూ!" అంటూ పిలిచింది. మరోసారి గట్టిగా పిలిచి తట్టింది. శోభ కొద్దిగా కదిలింది. తెరువలేకనే కళ్ళు మెల్లగా తెరచింది. శోభ శరీరం కాలిపోతోంది.... నిజానికి అది కాగిపోతోంది.

"అమ్మాయిగారూ! ఏమిటండీ ఇలా అయిపోయారు. మీరే కదండీ ఈ ఇంటికి కళ. ఎప్పుడూ నవ్వుతూ వుండే మీరు, ఇలా వుంటే నేను చూడలేనమ్మగారూ! అన్నీ మరిచి పోండి.... పెద్దమ్మగార్ని పిలుచ్చు కొస్తా నుందండి...." అంటూ వెళ్ళిపోయింది. వద్దని చెబుదామనుకుంది. కాని చెప్పే శక్తిలేక వూరుకుంది. చేయి యెత్తి పిలువబోయింది.... దానికి శక్తి చాల లేదు.

శ్రీలక్ష్మి గాభరాపడుతూ వచ్చింది. శోభ పరిస్థితి చూసి తల్లడిల్లి పోయింది. కన్నీళ్ళు పెట్టుకుంది. శోభ అలా చూస్తున్నదే గాని, ఆ కళ్ళలో జీవం లేదు. "నా పరిస్థితి చూచి జాలిపడుతున్నావా అంటీ....!" అన్నట్లుగా చిరునవ్వు మాత్రం చూపింది శోభ.

శ్రీలక్ష్మి ఏమీ మాట్లాడ లేదు. చరచర క్రిందకు వెళ్ళి అన్నయ్యతో చెప్పింది. ఆయన కూడా మేడమీదకు వెళ్ళారు. కూతురి పరిస్థితి చూచి వ్యథ చెందారు. వెంటనే ఫోను చేసి డాక్టర్‌ని పిలిపించారు. డాక్టరు వచ్చి శోభ ఆరోగ్యం పరీక్షించారు. ప్రశ్న లడిగితే ఒక్కదానికి సరిగా సమాధానం చెప్పలేక పోయింది.

ఇంజక్షన్ చేసి, ఏవో మందులు రాసిచ్చారు. నాయుడు గారితో పాటు డాక్టరు కూడా క్రిందకు వెళ్ళారు.

"ఎలావుంది" అనే ధోరణిలో డాక్టరు వైపు చూచారు నాయుడు గారు.

"నాయుడు గారూ! మీ అమ్మాయి మనసు బాగా దెబ్బ తిన్నది. విశ్రాంతే కాదు, అదమరచి నిద్ర పోవడం చాలా అవసరం. ఆమె సక్రమంగా నిద్రలేకపోతే పరిస్థితి ఇంకా విషమించ వచ్చు.... ముఖ్యంగా రాత్రివేళ సుఖంగా నిద్ర పోయేట్లు చూడాలి."

"మీరు ప్రతి రోజు, దయచేసి...."

"అలాగేనండీ.... తప్పకుండాను...." అని నాయుడు గారి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళి పోయారు డాక్టరు గారు. నాయుడు గారు ఎంతో కుమిలి పోయారు. మెల్లగా నడుస్తూ మేడ మీదకు వెళ్ళారు. కూతురును చూస్తున్నారే గాని ఏమీ మాట్లాడ లేకపోయారు. శ్రీలక్ష్మి శోభ ప్రక్కన కూర్చుంది. తండ్రిని, అంటీని అలా చూస్తూ, కళ్ళు మూసుకుంది. కిటికీల లోంచి వస్తున్న చల్లని గాలులు ఆ గదిలో వున్న ముగ్గురిలో ఏ ఒక్కరి హృదయానికి చల్లదనాన్నివ్వలేక పోయాయి. ఆ గదినంతా విషాద వాతావరణం ఆవహించింది. అయితేనేమి ఎవరి మనసు వారిది.... ఎవరి ఆలోచనలు వారివి.

నిమ్మళిస్తే తనతో పాటు హైదరాబాద్ తీసుకు వెడదామనుకుంది శ్రీలక్ష్మి.

ఆరోగ్యం కుదుటపడగానే, త్వరలో పెళ్ళి జరిపించేదామనుకున్నారు నాయుడు గారు–

మరి.... శోభ....?

11

రైలులో జనం కిటకిటలాడు తున్నారు. ఓ మూలగా ముడుచుకు కూర్చున్నారు సుబ్బారావు గారు. సీటు క్రింద ఆయన పెట్టె వుంది. పదిహేను రోజుల ప్రయాణంలో ఆయన బాగా అలసి పోయారు. పైగా దగ్గు ఈ మధ్య ఎక్కువైంది. ఇకాపైన ప్రయాణం విరమించుకుని ఇంటి ముఖం పట్టారు. రెండు మూడు రోజులుగా తలపోటుతో ఎంతో బాధ పడుతున్నారు. ఇప్పుడు మెడ నరాలన్నీ జివ్వు మంటున్నాయి. ఉడుకుదనం అధికమైంది కాబోలు కళ్ళు పుసులు కీడుతున్నాయి. గడ్డం బాగా పెరిగింది. ముఖం ఉబ్బరించింది.

చీకటిపడిన తర్వాత చలిగాలి జోరు ఎక్కువైంది. శరీరం కాలి పోతోంది. అయినా చలి పుట్టుకొచ్చింది. అది చలి జ్వరమే కావచ్చు. వణుకు ప్రారంభమైంది. మెల్లగా లేచి, పెట్టి తెరచి దుప్పటిపైకి తీశారు. వంటిమీద కోటు కూడా వుంది. దానికి అక్కడక్కడ చిల్లులు, వెడల్పాంటి ముద్ద కుట్లు వున్నాయి. నూనె మడ్డి కంపు కొడుతోంది. ఆయనతో పాటు, పాపం, దానిక్కూడా వృద్ధాప్యం వచ్చింది. సీటు మీద ముడుచుకుని దుప్పటి కప్పుకున్నారు. కొద్దిగా మూలుగు తున్నారు.

"తాతగారూ, ఒంట్లో బాగోలేదా.... ఏ ఊరు వెళ్ళాలి?".... ప్రక్క సీటులో కూర్చున్న వ్యక్తి అడిగాడు.

"దూరమే వెళ్ళాలి బాబు...." ఇంకా ముడుచుకోడానికి ప్రయత్నిస్తున్నారు సుబ్బారావు గారు.

"ఏమండోయ్, మీరు కాస్త లేచి మా బల్ల మీదకు రాకూడదూ. పాపం ఆ

తాతగారికి జ్వరం వచ్చినట్టుంది. పడుకుంటారేమో..." అని ఎదురు వరుసలో కూర్చున్న వ్యక్తి, సుబ్బారావు గారి ప్రక్కన వున్న వ్యక్తికి సలహాపూర్వకంగా చెప్పాడు.

"ఆ పనేదో, పాపం, మీరే చేయవచ్చుగా" అన్నాడా వ్యక్తి. ఇక అంతటితో మాటలు సాగ లేదు.

సుబ్బారావు గారికి ఈనాటి సమాజం పరిస్థితి తెలియక పోదు. ఎందుకోగాని, ఆ సమయంలో శ్యామసుందరరావు గుర్తు వచ్చాడు. కాని, ఆయన మరచి పోవడానికి ప్రయత్నించారు. శ్యామంతో, తమ పరిచయమంతా ఓ కలలా భావించారు.

రైలు శరవేగంతో పరుగిడి పోతోంది. ఆ రైలులో వున్న వారికి, తమ జీవితాలు కూడా ఇంతకంటే హెచ్చు వేగంతో పయనిస్తున్న విషయం తెలియదు. జీవితంలోని ప్రతి సంఘటన ఒక కొత్త అనుభవాన్ని వెల్లడిస్తుంది. ఈ అనుభవం– దీర్ఘకాల పరిణామాల ఫలితమే అయినా, దాన్నుంచి గుణపాఠాలు తెలుసుకోడానికి సాధారణంగా ఎవరూ ప్రయత్నించరు.

నిజానికి, పుంఖానుపుంఖమైన అనుభవాల సారాంశమే జీవిత సత్యం.

అయితే చాలా మంది వృద్ధాప్యంలో కలిగే అనుభవాలను బట్టి, జీవిత "సత్యాలు" ఇవేనంటూ కొన్ని నిర్ధారణలకు వస్తుంటారు. అవి సర్వసామాన్యంగా నిరాశతోను, నిస్పృహతోను కూడి వుంటాయి. ఒక సంపన్నుడు తన వృద్ధాప్యంలో చెప్పే "సత్యాల"కు, ఒక మధ్య తరగతి వ్యక్తి అదే స్థితిలో చెప్పే "సత్యాల"కు, అలాగే నిరుపేద వృద్ధాప్య దశలో చెప్పే జీవిత "సత్యాల"కు వ్యత్యాసం వుంటుంది. ఇవేవీ నిజానికి సామాజిక సత్యాలు కావు. సమాజంలో తమ, తమ ఉనికిని బట్టి మాత్రమే వారు, ఇటువంటి అవాస్తవిక, లేదా పాక్షిక, సత్యాలతో కూడిన నిర్ధారణలకు రావడం జరుగుతుంది.

ఇంతకూ అసలు విషయం, సుబ్బారావు గారి జీవితానికి సంబంధించినది. ఆయన జీవితం సక్సెస్ కాలేకపోయింది. వాస్తవ పరిస్థితులే ఇందుకు కారణం. సీటులో వున్న సుబ్బారావు గారు మూలుగుతూనే కునుకు తీశారు. తెల్లవారుతుండగా ఊరు చేరింది రైలు. రైలు దిగి ఇల్లు చేరుకున్నారు.

ఇంట్లోకి వెళ్లగానే భార్య ఎదురు వచ్చింది. భర్త పరిస్థితి చూచి కంగారు పడింది. కుర్చీలో కూర్చోలేక, మంచం మీద పడుకున్నారు.

ఆయన ఇక 'మంచం ఎక్కినట్లే'..... తండ్రిని చూచి సరోజ బిక్క మొగంతో నిలబడింది. పెళ్లి కాని పిల్లవున్న ఇంటిలో, అందునా పేదవారి ఇంటిలో పరిస్థితులు ఎంత దారుణంగా వుంటాయో సరోజ ఇప్పుడు గ్రహించింది.

అలసటగాను, జ్వరంగాను వున్నందున సుబ్బారావు గారు మాట్లాడలేక పోతున్నారు.

కొద్దిగా నిద్రపట్టింది. సరోజ డాక్టరు గారింటికి వెళ్లి, తండ్రి పరిస్థితి చెప్పి మందులు తీసుకొచ్చింది. నిద్రలేపి, మందు వేశారు. ఆయన మళ్లీ పడుకున్నారు.

మధ్యాహ్నానికి కొద్దిగా నిమ్మళించింది. అయినా ఆయాసం తగ్గలేదు. లేవలేక పోయారు. భార్య మంచం ప్రక్కనే, నేల మీద కూర్చుని భర్తతో అంది మెల్లగా.....

'ఏమండీ.... వెళ్ళిన పని....?' ఎంత సేపటి నుంచో దాచుకున్న ప్రశ్న అది. ఆ ప్రశ్నను కూడా పూర్తి చేయలేక పోయింది.

'ప్చ్.... కాలేదే.... ఇక కాకపోవచ్చునేమో. మన దగ్గరవున్న డబ్బు చాలదు. కట్నాల పరిస్థితి దారుణంగావుంది. మనిషి మీద అభిమానం, గౌరవం వుండే రోజులు గతించాయి. ఇప్పుడంతా డబ్బు మయం మనిషితో గాక, డబ్బుతోనే మాట్లాడుతున్నారని నేనిప్పుడు గ్రహించాను.' ఈ మాటలు చెప్పి ఆయన దీర్ఘమైన నిట్టూర్పు విడిచారు.

సుబ్బమ్మ గారికి మతిపోయింది. భ్రమించింది! మాటలు దొరకలేదు. డగ్గుత్తికతో అందిలా.....

'ఇక మన పిల్లగతి ఇంతేనా..... ?'

'నాకూ, ఏమీ తోచడం లేదు'!

'అన్నట్లు, అల్లుడి గారి విషయం ?'

'అల్లుడు, నే వెళ్లేసరికి ఊళ్లో లేడు. మూడు మాసాలైనదట. సెలవు పెట్టి వాళ్ల ఊరు వెళ్లాడుట. ప్రక్కింటి వారు చెప్పారు.'

' అందుకే కాబోలు మనకు జాబు రానిది. ఆ భగవంతుడు, ఆ శ్రీమన్నారాయణ మూర్తి చల్లగా చూస్తే మన అల్లుడుగారు అంగికరిస్తారన్న నమ్మకం నాకుందండీ. అమ్మాయి కూడా సరేనంది.'

'ఆఁ... నిజమా.... అమ్మాయి కూడా ఇష్టపడిందా. మరో జాబు, వాళ్ల వూరికి రాద్దాము. ఈ సారైనా సమాధానం వస్తుందేమో?'

ఇంతలో పోస్ట్ అంటూ పోస్టుమన్ వచ్చి గుమ్మంలోకి ఓ కవరు విసిరి వెళ్లిపోయాడు. అది కూడా పాత అడ్రసువుంటే, ఇక్కడకు డైవర్టు చేయబడింది. ఆ కవరు తీసుకుంది సుబ్బమ్మగారు. శ్యామసుందరరావు వ్రాశాడేమోనని ఆమె భయం.

శ్యామం వ్రాసిన ఉత్తరం సంగతి భర్తతో చెప్పలేదు. చెప్పగూడదనే చెప్పలేదు.


'ఎవరమ్మా, రాసింది?' సరోజ అడిగింది. తల్లి సమాధానం చెప్పలేదు. సుబ్బారావుగారు అడిగితే, ఆయన చేతికే ఇచ్చింది చేసేది లేక. అది అల్లుడు వ్రాసిన ఉత్తరం.

'అల్లుడు రాశాడే..... ' అన్నారు భర్త.

'చూశారా, మన అల్లుడిగారి మనసు నాకు తెలుసు. చదవండి త్వరగా.'

గుడ్డి దీపం వెలుతురులో చదవడం ప్రారంభించారు. సరోజ గుండె చిక్కబట్టుకుని కూర్చుంది. వదనంలో విచారరేఖలు తొంగిచూశాయి.

'పూజ్యులైన మామగారికి, మీ అల్లుడు ముత్యాలరావు నమస్కరించి వ్రాయు లేఖాంశములు– మీ జాబు అందింది. నేనీరోజే ఊరునించి వచ్చాను. మీరు వచ్చినట్లు తెలిసింది. సమయానికి ఇంటివద్ద లేనందుకు



అంతరాలు – ఆంతర్యాలు

విహారిస్తున్నాను. నాకు, మా ఊరు బదిలీ అయినది. పిల్లల బాధ్యత మా అమ్మ గాళ్ళకు అప్పగిస్తున్నాను.'

'ఇంతకూ అసలు విషయం ఏమిటో రాశారా ?' భార్య అడిగింది పుంతఒట్టలేక.

'చదువు తున్నాగా....'

'ఆఁ..... కానివ్వండి!'

'మీ జాబులో మరదలు , సరోజ పెళ్ళి విషయం ప్రస్తావించారు. చాలా సంతోషం. నా అభిప్రాయం అడిగారు. మీ అభిప్రాయంతో, నా అభిప్రాయం ఏకీభవించదని మనవి చేయడానికి విచారపడుతున్నాను. క్షమించ వలసిందని కూడా కోరుతున్నాను. పునర్వివాహం నాకు ఇష్టం లేదు. శాంత నాభార్య. ఆమె గతించింది. ఇక, అంతటితో నావైవాహిక జీవితం సమాప్తమైనదని భావించాను.

సరోజకు , ఎక్కడైనా మంచి సంబంధం చూచి వివాహం చేస్తే చాలా సంతోషిస్తాను. పెళ్ళి ఖర్చు విషయంలో పొదుపుగా వుండాలన్నది నా అభిప్రాయం. సరోజ వివాహానికి మేమంతా తప్పక రాగలము. అత్తయ్య గారికి నా వందనాలు, మరదలుకు నా ఆశీర్వాదాలు తెలుపండి.

సెలవు

భవదీయుడు

ముత్యాలరావు.

చదవడం పూర్తి చేసి, సుబ్బారావుగారు దిగాలుపడి భార్య ముఖంలోకి చూచారు. ఆమె ఈ లోకంలో వున్నట్లు లేదు. పమిట కొంగుతో కళ్ళు తుడుచుకుంటోంది. ఉత్తరం లోని విషయాలన్నీ సరోజ కూడా విన్నది. ఆమె గుండె వేగంగా కొట్టుకో నారంభించింది.

'అమ్మా!'.... పిలిచింది సరోజ మెల్లగా. తల్లి పలకలేదు.

'అమ్మా!'... మళ్ళీ పిలిచింది. ఈ సారి స్వరాన్ని కొద్దిగా పెంచింది. తల్లి కళ్ళు ఎర్రబడినాయి. రెప్పలు వాచ్చాయి. మాట్లాడకుండానే లేచి కూతురు పక్కకు వచ్చింది. సరోజ అన్నది మళ్ళీ మెల్లగానే-

'అమ్మా, నాగురించేగా మీకు దిగులు...'

ఈ మాటలో ఎంత లోతైన అర్థం వున్నదో తల్లికి బోధపడలేదు. ఇదెంతటి ప్రమాదకరమైన మాటో కూడా ఆ తల్లి గ్రహించలేదు.

'అవునమ్మా అవును. నీ గురించే.... ఆ మూడుముళ్ళు పడితే, గంజి త్రాగయినా బ్రతకవచ్చుని, ఆ రోజు కోసం క్షణమొక యుగంగా ఎదురు చూస్తున్నాము.'

'ఏమేవ్, నువు నోరుముయ్. ఎప్పుడెలామాట్లాడాలో నీకు తెలియదే....' భర్త మందలింపు ధోరణిలో అన్నారు.

'అందుకే మన ఖర్మ ఇలా కాలిందండి... అప్ప ...' ఇల్లు తెగనమ్మి డబ్బు తెచ్చినా కూడా ఏ సంబంధమూ కుదిరిచావలేదంటే ఏమనుకోవాలి. అయినా, దాని నుదుటి వ్రాత ఎలావుందో .... మనమేం చేయగలం.'

సరోజ రెండు చేతులతోను చెవులు గట్టిగామూసుకుంది.

'అమ్మా! నేనీ మాటలు వినలేనే. ఏం చేయమంటావో చెప్పు. అలా చేస్తాను. మీకు భారం తీరిపోయే మార్గమేదో చెప్పమ్మా...' ఈ మాటలన్న తర్వాత గుండె నీరైబావురుమంది.

సుబ్బారావుగారికి ఎక్కడలేని కోపం వచ్చింది. భార్యను కొడదామన్నంత కోపం అది. కాని లేవలేకపోయారు. ఇంకెవ్వరైన ఎవరూ మాట్లాడలేదు. కొంతసేపు నిశ్శబ్దం.


సుబ్బమ్మగారు లేచి ఎంగిలిపడి, మళ్ళీ భర్త మంచం దగ్గరకువచ్చి కూర్చుంది. భార్య రెండుసార్లు పలకరించింది. ఆయన పలకలేదు. దగ్గుతెర వచ్చినప్పుడు మాత్రం 'మంచినీళ్ళు' అంటున్నారు.

భార్య గ్లాసు అందివ్వడం, ఆయన ఓ గుటకవేసి తిరిగి ఇవ్వడం, ఇలా నాలుగైదుసార్లు జరిగింది.

మళ్ళీ జ్వరం మొదలైంది. దాహంకూడా అధికమైంది. ఆయన కళ్ళు మూసుకుని పడుకున్నా, వుండి, వుండి.... 'చేయలేను కాదు... కాదు...' అంటున్నారు.

'ఏమండి... నిద్రపోండి.... జ్వరం తగ్గాక మాట్లాడుకుందాం...' అని భార్య అంటున్న మాటలు ఆయనకు వినిపించటంలేదు

గుండె నొప్పిగా వున్నదని, ఒసారి కళ్ళు తెరచి గుండెమీద చేయివేసుకుని



అదుముకుంటూ, సైగతో తెలిపి మళ్ళీ కళ్ళు మూసుకున్నారు.

తల్లిదండ్రుల పరిస్థితి చూస్తోంటే సరోజకు ఎందుకనో భయంవేసింది. తల్లిని, తండ్రిని చూడాలంటేనే భయపడుతోంది. ఇంటిని, ఆ ఇంటిలోని ప్రతివస్తువును వెర్రిగా చూస్తోంది.

'నీ జీవితం వృధా... నీకిక బ్రతుకుబాటలేదు..' అన్నట్లుగా ప్రతి వస్తువు తనను వెక్కిరిస్తున్నట్లుగా సరోజ భావిస్తోంది

కనురెప్ప లల్లార్చుతూ, పెదవులు తడుపుకుంటూ బిక్కమొహంతో దిక్కుతోచనట్లు కూర్చుంది.

సుబ్బారావుగారు వుండుండి ఒక్కసారిగా పెద్దకేకపెట్టారు. కూర్చుని కునుకు తీస్తున్న భార్య, దిగాలుపడి కూర్చున్న సరోజ ఉలిక్కిపడ్డారు. సరోజ కదలలేదు. తల్లిమాత్రం 'అమ్మాయ్' అని పెద్దగా పిలిచింది. అలా పిలిచినప్పుడు ఆమె వదనంలో భయాందోళనలు ముప్పిరిగొన్నాయి.

సుబ్బారావుగారు ఈసారి గావుకేక పెట్టారు. భార్య గజగజలాడిపోయింది. ఏమిటో, ఎందుకలా కేకలువేస్తున్నారో అర్థం కావడంలేదు

ఆయన కేకకు అర్థంలేదు .. అదొక వెర్రికేక.

'ఎక్కడ చచ్చావే భ్రష్టముండ.. రావే త్వరగా...' తల్లి అరచింది. చివరి మాటలు తడబడ్డాయి.

సరోజ ఒక్క గంతువేసినట్లు, తల్లి దగ్గరకు వెళ్ళింది. మాట్లాడకుండా నిలబడింది.

'అలా గుడ్లు మిటకరిస్తూ నిలబడతావేమే. వెళ్ళి డాక్టరుగార్ని తీసుకురా... పో... చావు ..'

'వెళుతున్నానమ్మా...' అని మెల్లగా సమాధానం చెప్పింది కూతురు. వెంటనే వెళ్ళింది. వెళ్ళి పావుగంటలో డాక్టరుగారితో సహా తిరిగివచ్చింది.

డాక్టరుగారు సుబ్బారావుగారిని పరీక్షించారు. మందులు రాసిచ్చి ఇలా చెప్పారు–

'వీరికి ఎప్పటినుంచి ఇలా...'

'ఈ రోజే ఊరునించి తిరిగివచ్చారండి. జ్వరంతోనే వచ్చారు...' సుబ్బమ్మగారు ఆందోళనపడుతూ చెప్పింది.

'నేనిచ్చిన మందులు తెల్లవారేలోగా వేయండి. ఉదయం వస్తాను... ఏమీ ఆందోళన పడద్దు..'

డాక్టరుగారు వెళ్ళిపోయారు.

మరో పావుగంట గడిచింది. సుబ్బారావుగారు మూలుగుతూనే వున్నారు. అయినా క్రమంగా మత్తు ఆవహించింది.

సరోజ తల్లిని ఆనుకుని కూర్చుంది. సుబ్బమ్మగారు మంచంపట్టె మీదనే చేయి ఆనించి, ఆ చేతిమీదనే తలవాల్చింది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

'అమ్మా!' సరోజ పిలుపు.

'ఊఁ'

'నీవు నిద్రపోవే. నేను మేలుకొని నాన్నకు మందువేస్తాను.'

తల్లి చివాల్న తలయెత్తి ఈసడింపుగా అంది–

'నీ చేతిమాత్రదేనికమ్మా... ఏదో సామెత చెప్పినట్లు...'

సరోజ మనసు చివుక్కుమంది. ఎవరో వెన్నులో బాకుపెట్టి పొడిచినట్లనిపించింది. కాసేపు మాట్లాడలేదు. దుఃఖం పొరలివస్తున్నా, కన్నీళ్ళు మాత్రం రాలేనంటున్నాయి. అవి కళ్ళలోనే ఇంకిపోతున్నాయి కాబోలు. నిస్తేజంగా చూస్తోంది శూన్యంలోకి.

మళ్ళీ అంది–

'అమ్మా, నేనేం పాపం చేశానే. దీనంతటికి నేనే కారణమంటావా?'

'నన్ను విసిగించకే తల్లీ, నీకు పుణ్యముంటుంది. ఏ జన్మలో చేసుకున్నపాప ఫలితమోగాని, ఈ జన్మలో అనుభవిస్తున్నాము'

'అమ్మా! నన్నెందుకే ఇలా హింస పెడతారు. నేను భరించలేనే.' ఈసారిమాత్రం కన్నీళ్ళు ఆగలేకపోయాయి. అయోమయస్థితిలో తల పైకెత్తింది. కళ్ళు మూసుకుంది. రెండు చేతులు జోడించి ఇలా అనుకుంది మనసులో –

'ఓ భగవంతుడా... మా నాన్నకు జ్వరం త్వరగా నయంచేయవా. ఆయన్ని బ్రతికించు. నేనిక ఎన్నాళ్ళో వుండను. నీకైనా నామీద దయలేదా. ఆడపిల్లను... నేనేం చేయగలను...? నీవైనా కరుణించవా...?'

మెల్లగా నడిచివెళ్ళి గోడకు ఆనుకుంది.

రెండు నిముషాల తర్వాత ఏదో చప్పుడు వినబడితే, తల్లి చూచి...' ఏమేవ్, భ్రష్టురాలా; ఊరుకోవే. మమ్మల్నిలాకూడా బ్రతకనివ్వవా. చచ్చికూడా సాధిద్దామనుకున్నావా...' అంటూలేచి కూతురు దగ్గరకువచ్చి చెయిగుంజుతూ లాగింది.

సరోజ తనచేయి విదిలించుకుని, తలను, గోడకేసి నాలుగైదుసార్లు కొట్టుకుంది. నుదుటిపై బొప్పికట్టింది. ఆ గోడకు జారగిలపడి, అలాగే కుప్పలా కూలిపోయింది.

'భగవంతుడా, ఈ కష్టాలన్నీ అనుభవించమనే, నన్నింకా బ్రతికి వుంచావా నాయనా...' సుబ్బమ్మగారు ఆవేదన ఆపుకోలేక పోతోంది.

మూడు గంటలు గడిచింది. అప్పుడు తెల్లవారుఝామున మూడుగంటలైంది. సరోజ, ఆ గోడ అంచునే, నేలమీద పడుకుని నిద్రపోయింది. ముంజేయి తలక్రిందవుంది. కాళ్ళు ముడుచుకుంది. డొక్కలు లోతుకుపోయి వున్నాయి. జుత్తుముడి వూడిపోయింది. చింపిరి జుత్తు నేలమీద చిమ్ముకుని దీరాడుతోంది తలప్రక్కకు వాలివుంది కన్నీటిక, శ్వేదానికి తడిసిపోయిన చెంపలకు, చెదరిన కేశాలు ముద్దకట్టి చారలుగా అతుక్కున్నాయి నిద్రలో కూడా ఆ అమాయకురాలి వదనంలో దైన్యం కొట్టవచ్చినట్టు కనబడుతోంది.

సుబ్బమ్మగారు మెల్లగా లేచింది కూతురును చూచింది. హృదయం కలుక్కుమంది. కరిగింది. ఆవేదనలో, ఆవేశంలో అన్నమాటలు తలపుకొచ్చాయి. భర్త పరిస్థితి ఆమెనలా అనిపించింది. తొందర పడ్డానని బాధపడింది. కూతురును సమీపించి ప్రక్కనే కూర్చుని చెంపలు, తల నిమిరింది. చెక్కిళ్ళకు అంటుకునివున్న కేశాలను తొలగించింది. ఆ నేలమీదనే ఆమెకూడా పడుకుని గతాన్ని స్మరిస్తూ కళ్ళు మూసుకుంది.

(ఇంకా ఉంది)

భర్తల్ని తన్నే భార్యలున్నారు

ఆడది అబలగానే మన సమాజంలో యిప్పటికి మనుగడ సాగిస్తున్నా, సబల కావాలని కోరుకొంటున్నా– మేం సబలయే కాదు, మగాళ్ళను మించి వున్నాం అంటున్నారు అమెరికన్ స్త్రీలు.

అమెరికా దేశంలోని స్త్రీలు, పురుషుల్ని చితక బాదుతారనే విషయం మన భారత దేశంలో చాల తక్కువ మందికి తెలుసు. చెప్పుకోవడానికి సిగ్గనిపించి, మూగజీవు లవుతున్నారు, అక్కడి మగవారు. ప్రపంచ మొత్తంలో అతి ఐశ్వర్య దేశంగా వున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మగవారిని వారి భార్యలు కొట్టడం అనేది తీవ్ర సమస్య అయినప్పటికీ చడీ– చప్పుడు లేని సమస్యగా అది మిగిలి వుంది. తమ భార్యలు, తమని హింసిస్తున్నారనే విషయం, ప్రచారం చేసుకోవడం యిష్టం లేని భర్తలు మూగనోము వహించడం వల్లనే యిలాంటి విషయాలు వెలుగులోనికి రాకుండా పోతున్నాయి.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సరాసరిన ప్రతి సంవత్సరం, రెండు లక్షల యాభయి వేల మంది భర్తలు, తమ తమ భార్యల చేత చావు దెబ్బలు తింటున్నారనే విషయం యీ మధ్యనే వెలుగులోకి వచ్చింది. భార్యలపై విపరీతమైన ప్రేమను కలిగివున్న భర్తలకు, పెద్ద పెద్ద గాయాలు తగలడంగాని, పళ్ళు రాలిపోవడం గాని జరుగుతున్నది. భార్యలపై వుండే విపరీతమైన అనురాగానికి వారు ఎదురు యిచ్చిన బహుమతు లివి!


మన దేశంలోలా, మగవారి కోపాగ్నికి, గురియై, కట్నాల గురించి, కానుకల గురించి, కిరోసిన్ పోసుకొనో, పురి తీసుకొనో చనిపోయే ఆడపడుచులకు, వ్యతిరేక పద్ధతిలో అమెరికన్ మహిళలు తమకున్న స్త్రీ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగ పరచుకొంటున్నారు. అందుచేతనే అనుభవం గల అక్కడి చాల మంది వ్యాపారవేత్తలు, యితర హోదాగల ఉద్యోగులు, తమ అఫీసుల్లో పని చేసే అందాలరాసుల సాఖ్యాన్ని, ఆఫీసు పని వేళల తరువాతి సమయాల్లో, అదనపు వేతనాలిచ్చి, పొందుతూ కాలక్షేపం చేస్తుంటారు

ప్రముఖ- సోషియాలజిష్టుల, పరిశీలనల ఆధారంగా చాల మంది భార్యలు, తమ భర్తలపై వేడి వేడి నీళ్ళు పోసి బాధిస్తున్నట్లు, కాళ్ళు చేతులు కట్టిపడేసి విపరీతంగా బాదుతున్నట్లు, చెప్పులతోను, బరువైన "ఆష్ట్రే"లతోను పొత్తికడుపులో తన్నుతున్నట్లు తెలింది ఇందులోని వింత యేమిటంటే, యీ విపరీత కృత్యాలు మామూలు జనానికి ఏమాత్రం తెలీడం లేదు. కొంత మంది భర్తలు వారి భార్యల హింసలను భరించలేక, భార్యలను హత్య చేసిన సంఘటనలు కూడ లేకపోలేదని, ఫ్లారిడా రాష్ట్రానికి చెందిన "ఎడ్డీకింగ్" యిలాంటి పనే చేయాల్సి వచ్చింది. అతని నాలుగేళ్ళ వైవాహిక జీవితంలోను కింగ్ భార్య అతనిని అదేపనిగ కొట్టడం, ముఖంమీద ప్లాస్టిక్ కత్తితో రక్కడం, పాతవడం వంటివి చేస్తుండేదట ఒకసారి అతని భార్య విపరీతంగా మద్యాన్ని సేవించి తను ఏం చేస్తున్నదో తెలుసుకోలేని పరిస్థితిలో, అదుపుతప్పి, భర్త నిద్రపోతున్నాడనే యింగిత జ్ఞానం కూడ లేకుండా, అతని ముఖం మీద ప్లాస్టిక్ కత్తితో చెక్కడం మొదలు పెట్టిందిట పాపం ఆ అభాగ్యుడి కన్ను లొట్టపోయినంత పని అయిందిట!

తరువాత మరోసారి, భర్త నిద్రలో వున్న సమయంలోనే శరీరాన్ని హరించే గుణం గల క్లీనింగ్ పదార్థాన్ని చిమ్మిందిట దీనివల్ల ఆ అభాగ్యుడి ముఖం ఆకృతి మారిపోయి, శరీరం మీద శాశ్వతమైన కాలిన మచ్చలు స్థిర పడిపోయాయట. ఈవిధంగా ఆ భర్త కనీసం నాలుగు సార్లయినా ఆసుపత్రి పాలయినట్లు తేలింది. అతనిపై అత్యాచారానికి పూనుకొన్నందుకు గాను రెండుసార్లు శ్రీమతి కింగ్ అరెస్టు అయింది అయితే, న్యాయస్థానంలో అతడు భార్యపై నిందలు మోపడాన్ని నిరాకరించాడు. భార్యపై వుండే అమితమైన ప్రేమే దీనికి ముఖ్యకారణంగా తేలింది.

ఇంకొక విషయం యేమిటంటే, 1975 వ సంవత్సరంలో, వివాహం చేసుకొన్న శ్రీమతి అండ్ శ్రీ ఎడ్డీకింగ్‌ల మధ్య వయస్సు తేడా పదకొండు సంవత్సరాలట దీనిని బట్టి మానసిక శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం భార్యభర్తల మధ్య అధిక వయోభేదం వుండడం మూలాన్నే తరచు వారిలో జగడాలకు ఆస్కారం వుందన్న విషయం రూఢి అయింది.

ఎడ్డీకింగ్ నాలుగు సంవత్సరాల హింసాత్మక వైవాహిక జీవితం 1980 జూన్‌లో అంతమయింది. భార్య పెడుతున్న హింసల నుండి తప్పించుకోవడానికి ఎడ్డీకింగ్, ఆత్మరక్షణగా కాల్పులు జరిపినప్పుడు, అతని తుపాకి దెబ్బకు భార్య గురికాక తప్పలేదు ఆమె మరణం ఎడ్డీని





ంతో క్షమించింది

అసలిది ఎలా జరిగిందంటే – ఒకరోజు ప్రక్కింటి వారి వరండాలో యీ భార్యభర్తలకు చిన్న కొట్లాట జరిగింది. భార్య చిరాకుతో కోపోద్రేకురాలై, ఆతృతగా తన పర్సును వెదకడం మొదలు పెట్టింది. అయితే ఆమె అలా వెతకడాన్ని మిస్టర్ ఎడ్మి, ఆమె పిస్టల్ కోసమే వెతుకుతున్నదని భావించి (ఆమె పర్సులో ఎప్పుడూ పిస్టల్ వుంటుందిట!) ఆమె నుండి తప్పించుకోవడానికి గాను ఆమెపై కాల్పులు జరిపాడు. అయితే, ఆ తుపాకి గుళ్ళు ఆమె ప్రాణాన్ని బలిగొంటాయని ఆలోచించలేకపోయాడు. ఆశ్చర్యకరమైన విషయం యేమిటంటే, చెక్కపెట్టిలో వున్న తన భార్య శవాన్ని చూచి విలపిస్తూ, తాను చంపాలని చంపలేదు. తనపై అతనికి యింకా ప్రేమ ఏమాత్రం సడలలేదని, తన్ను క్షమించవలసిందని వేడుకొన్నాడు

కావాలని చేయని నేరానికిగాను, ఎడ్మికంగ్ అరెస్ట్ అయినప్పటికి, తరువాత కేసు కొట్టి వేయబడింది

అయితే, అమెరికాలో స్త్రీలు మగవారిని ఎలా హింసిస్తున్నారో మనదేశంలోని పురుషులు ఆడవారిని అలా హింసిస్తున్నారు. ప్రముఖ సోషియాలజిస్టుల విశ్లేషణల వల్ల, హింస ప్రతిహింసలకు కారణం 'త్రాగుడు'గా తేలింది. జరిగిన పెక్కు వుదాంతాల్లో భర్త భార్యని కొట్టినా, భార్య భర్తని కొట్టినా దినికి మద్యం ముఖ్యకారణంగా కన్పిస్తోంది. భార్యలు, భర్తలను తన్నాలనిపించే సంఘటనలు సాధారణంగా, భార్యలు తప్ప త్రాగడం వల్లే జరుగుతున్నది.

హద్దు మీరితే...

జీవితంలో –
సంతోషమైనా
విషాదమైనా
మితిమీరితే
వచ్చేవి – కన్నీరు
సంఘంలో –
ప్రేమైనా
ద్వేషమైనా
హద్దు మీరితే
కలిగేవి – ఉన్మాదం
ప్రపంచంలో –
విజ్ఞానమైనా
అజ్ఞానమైనా
అవధి దాటితే
జరిగేవి – వినాశం

–సత్యశ్రీ

ఎక్కువగా శరీరధారుఢ్యం గల స్త్రీలకు, ఇలి వుండే భర్తలు యింట్లో 'ఎర'లుగా మిగులుతున్నారు. అంతేకాకుండా అధిక ధనవంతులైన భార్యలు, వారి కుటుంబాలకుఆర్థికంగా మరింత ఎక్కువగా ఉపయోగపడ్డం వల్ల, భర్తలు వారి చిన్నచూపును గురికాక తప్పడం లేదు. అందుచేత భర్తలు తమ తమ భార్యలపై ఎంతటి ప్రేమను కురిపిస్తారో, దినికి మరింతగా వారు తమ భర్తలను అసహ్యించుకొంటున్నారు.

ఇదేవిధంగా, మనదేశపు వనితలు కూడ ఆర్థికంగా పూర్తిగా భర్తల పైననే ఆధారపడి వుండడం మూలాన, భర్తల చేతుల్లో కీలుబొమ్మల్లా చిన్నచూపుకు గురి అవుతున్నారు. మన భారత నారి, భర్త తన మార్గాన్ని ఎక్కడ మార్చుకుంటాడోననే భయంతో తన్నినా, తిట్టినా, మనఃస్ఫూర్తిగా భర్తను ప్రేమిస్తూనే వుంటుంది.

అనాదిగా స్త్రీ అబలగా అనేక కష్టనష్టాలను ఓర్చుకొంటుందన్న విషయం అందరికి తెలుసు. వారికి పురుషులతో సమాన హక్కులు కావాలన్నది కూడ సబబైన విషయమే. అయితే ఉన్న హక్కులను సద్వినియోగ పరచుకొంటే, యిక వేరే హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం రాకపోవచ్చు!

— డాక్టర్ కె.ఎల్.వి. ప్రసాద్

అగ్గిబుగ్గ

లవలి

ఇదిగో!

ఇదే గోదావరి!

ఇది అనాది నుండీ ఎన్నెన్నో కథలు తన కన్నుల ముందే జరిగిపోతూ వుంటే చూడలేక నిలువెల్లా కరిగి నీరయి పోయింది.

అవిగో!

అవే పాపి కొండలు!

అవి గోదావరి అలలు చెప్పే కథలకు వూ(కొట్టలేక మండే గుండెలను భరించలేక చల్లని మబ్బుల్లోకి దూసుకు పోతున్నాయి.

ఈ గోదావరి చూపులు ప్రసరించే చోట– ఆ పాపికొండల నీడలు పరుచుకొనే చోట– కారడవి కాపురం చేస్తోంది.

అందులో వున్నది వక చిన్న గుడిస. ఆ గుడిస లోపల పొయ్యి మండుతోంది. దాని మీద కందిపప్పు వుడుకుతోంది.

ఆ పప్పు పొంగి పొరలి గిన్నె అంచులు దాటి పొయ్యిలో పడిపోతోంది.

అక్కడే ఆ పొయ్యికి దగ్గరగా నులక మంచం మీద కూర్చొని వున్నాడు మూర్తి.

అతని కళ్ళు ఆ పొయ్యిలాగే మండుతున్నాయి. నిన్న రాత్రి నుండీ మనస్సు మనస్సులో లేదు మూర్తికి.

పప్పునీళ్ళు పొంగి చుయ్ మనే శబ్దంతో పొయ్యి చల్లారి పోతూ వుంటే– అప్రయత్నంగా లేచి కట్టెలు కదిపి మళ్ళీ మంట చేశాడు. మళ్ళీ పొంగుతూ వుంటే గిన్నెలో ఇన్ని నీళ్ళు పోసి వచ్చి కూర్చున్నాడు అదే నులక మంచం మీద తడికకి జార్లాపడి.

మూర్తి యీ అడవిలో రెండు నెలల నుండీ వుద్యోగం చేస్తున్నాడు. కాలేజీ జులాయి తిరుగుడు విడిచి పెట్టి అయిదారేళ్ళయినా ఆ వాసనలు ఇంకా పూర్తిగా వదల లేదు మూర్తిని.

ఇక్కడ యీ వుద్యోగం చేస్తూ ఈ అడవి బతుకు బతకడం కన్నా చావడం మేలనుకున్నాడు చాలా సార్లు. అయినా ఇంతకన్నా గత్యంతరం లేదు మరి తనకి. అందుకే బతికి వుండీ చచ్చిన వాడిలాగే బతికేస్తున్నాడు.

తను డిగ్రీ చదువులు వెలగబెట్టే రోజుల్లో ఆడింది ఆటగా పాడింది పాటగా గడిచి పోయింది కాలం.

మగపిల్లలే కాదు. ఆడపిల్లలు కూడా తన చుట్టూ ముసురుకునే వారు. తనని వక హీరోని చేసి ఆరాధించేవారు.

వాళ్ళతో ఎన్ని రకాలుగా ఆడుకునే వాడు తను!

ఫ్రెండ్సు గురించి తను పెదవి విప్పితే చాలు మంత్ర ముగ్ధులైపోయి తన వెంట పడి రంగు రంగుల ఊహాలోకాల్లో విహరించే వాళ్ళు.

ఆ రోజుల్లో తనే తనకి గుర్తుండేవాడు కాదు. ఇంక ఇంటి సంగతి చెప్పనే అక్కర్లేదు!

అసలు ఇంటి పట్టునే వుండేవాడు కాదు తను. ఒకవేళ వున్నా ఆ కొద్ది క్షణాల్లో తన తల్లి కన్నీళ్ళు తనకి వినబడేవికావు. వాళ్ళు తన ముందు పెదవి విప్పి మాట్లాడటానికే భయపడే వాళ్ళు– ఆ కాసేపయినా తను వాళ్ళ కళ్ళ ముందు వుండకుండా వెళ్ళి పోతాడేమోనని.

బి.ఎ. పట్టా చేతొ పట్టుకొని నిరుద్యోగ పర్వంలో అడుగు పెట్టిన తర్వాత తెలిసింది– తను చదువు పేరుమీద చేసిన అప్పు ఎంతో? అదిపోగా ఇంక మిగిలిన తన బతుకేవిటో?

మిత్రుడు సూర్యం ఈ అడవిలో కూపు కాంట్రాక్టు తీసుకోవడం వల్లా, వాడికి తన మీద జాలి కలగడం వల్లా ఈ ఉద్యోగం దక్కింది.

ఆ రోజు సూర్యం తొలిసారిగా తనని ఇక్కడికి తీసుకు వచ్చినప్పుడు ఈ అడవీ– ఇక్కడ దిక్కూ దిక్కూ మంటూ ఈ గుట్ట పక్కన పడివున్న ఈ రెండు గుడిసెలూ చూసి అందులో వక గుడిసలో తను గడపబోయే వంటరి జీవితం తలుచుకుని ఎంత భయపడ్డాడని! ఎంత యేడ్చాడని!

అయితే సూర్యం తనకి చాలా ధైర్యం చెప్పాడు. భవిష్యత్తు మీద ఆశపెట్టాడు.

"వరే మూర్తీ! నీకు వూరికే డబ్బు లెవరిస్తార్రా? నాకు మాత్రం అంత వుదార గుణం లేదు. ఇప్పుడు కష్టపడ్డావో ముందు ముందు సుఖపడతావు. ఈ వుద్యోగం చేస్తూ ఈ వ్యాపారంలో అనుభవం సంపాదించు. అదే నీ భవిష్యత్తును బాగు చేస్తుంది. ఎప్పుడూ ఇల్లాగే వుండి పోతాననేమో! ఈ కూలీలకి మస్టరు వేసుకుంటూ ఈ కలప నరికిస్తూ ఈ వుద్యోగంలోనే ముసలాడ్నయి పోతానేమో అని అనుకోకు...."

సూర్యం ఎన్ని చెప్పినా పులిగాడు లేకపోతే తనసలు ఈ అడవిలో వక్క క్షణం వుండలేక పోయేవాడు.

పులిగాడు పాపం మూగవాడు. సైగలతో వాడికన్నీ చెప్పవచ్చు. వాడి సైగలూ అర్థం చేసుకోవచ్చు.

వాడు ఈ అడవిలోనే పుట్టాడు. ఈ అడవిలోనే పెరిగాడు. ఈ అడివంతా వాడికి పరిచయమే!

వకసారి వాడు పెద్దపులితో ముఖాముఖీ పోరాడి దాన్ని చంపేశాడట!

వాడు మన పక్కన వుంటే మనల్ని చూసి పులులే భయపడతాయి. అసలే ఈ అడివిలో పులు లెక్కువ. ఎక్కడ ఏ పొదలో పులి నక్కి వుందో తెలియదు. అందుకే పులిగాడు లేకుండా వంటరిగా తను ఎక్కడికి వెళ్ళడు.

పులిగాడు నల్లగా పోత పోసిన ఉక్కు విగ్రహంలా వుంటాడు. ఎప్పుడూ బుజం మీద గొడ్డలి వేసుకుని తిరుగుతూ వుంటాడు.

పులిగాడికి ఈ మధ్యే పెళ్ళయింది ముత్తితో వీళ్ళిద్దరూ మూర్తి వున్నదానికి పక్కన వున్న గుడిసలో వుంటున్నారు.

ముత్తి వానా కాలంలో కొండవాగులా వురికుంది. పెడకొప్పు పెట్టి ఆ కొప్పులో అడివి మల్లెలు తురిమి విప్పపూవులు ఏరుతూ వుంటే దాని నడుము చూడాలి!

నదురూ బెదురూ లేకుండా చెట్టెక్కి జుంటి తేనె పిడతలోకి పిండుతూ వుంటే దాని కళ్ళు చూడాలి!

వాగులో స్నానం చేసి ఎదమీద ఏదీ లేకుండా నీళ్ళ కడవ నెత్తిన పెట్టుకొని వస్తూ వుంటే దాని నీలిమేని నిగనిగలు చూడాలి!

"ఇలావర్ర" (ఇటురా) అని కొండ వాగులా అది భర్తని పిలిచేటప్పుడు దాని గొంతు వినాలి!

అడివిలో పళ్ళు ఏరుకొచ్చి తనకిస్తూ "నన్న నిమ్మ చుట్టామే" (నేనూ నీవూ చుట్టాలమే) అని పలికేటప్పుడు దాని చిరునవ్వులోని నిర్మలత్వం గుర్తుంచుకోవాలి!

ఈ అడివిలో రకరకాల పువ్వులు పూస్తున్నాయి. మత్తెక్కించే పరిమళాలు వెదజల్లుతున్నాయి. కానీ ఆ పూల తీగలు– నింగిని తాకుతూ భయం గొలిపే చెట్టుకు పాకి వుంటాయి. ముత్తి కూడా ఆ పువ్వులలో వక పువ్వే! దానికి ఆశపడ కూడదు అని అనుకున్నాడు తను నిన్నటిదాకా.

కానీ నిన్న రాత్రి నుండీ తన మనస్సు మనస్సులో లేదు.

అది తలుచుకో కూడదని ఏవేవో తలచుకుంటున్నా సరే అదే తలపుకు వస్తోంది.

అది తలపుకు రాగానే తన మెదడులో భూకంపం పుడుతుంది. తన గుండెల్లో సముద్రాలు పొంగుతాయి. తన ఆలోచనల్లో పెను తుఫాన్లు చెలరేగుతాయి. తన రక్తనాళాల్లో బడబాగ్ని ప్రవహిస్తోంది.

అదే అది....

నిన్న రాత్రి విప్పచెట్టు కింద వత్తుగా రాలిపడివున్న విప్పపూల పాన్పు మీద ముత్తీ– పులిగాడూ దిగంబరంగా జరిపే శృంగారకేళి....

వాళ్ళ మీద పైనుండి రాలిపడే విప్పపూవులూ కొమ్మల సందుల్లో నుండి వాళ్ళ మీద జారిపడే వెన్నెల తీగలూ కలిసి పెన వేసుకు పోయేయి.


ముత్తి అరమోడ్పు కళ్ళూ– ఆమె నుదుటి మీది స్వేద బిందువులూ– పులిగాడి వీపుమీద విచలితములయ్యే ఆమె చేతి వేళ్ళూ....

కళ్ళు మూసినా కళ్ళు తెరిచినా తనకి ప్రత్యక్షమై

తన ప్రాణాలు తోడేస్తున్నాయి.

"ఒరే! మూర్తీ ఒక్క విషయం బాగా గుర్తుంచుకో! కలలో కూడా పులిగాడిని మోసం చేయకు. వాడికి రవ్వంత అనుమానం నీమీద వచ్చిందో ఇంక నువ్వుండవ్!"

సూర్యం తన నిక్కడ వదిలి వెడుతూ మళ్ళీ మళ్ళీ



చేసిన హెచ్చరిక పోలీసు సైరన్లా తన చెవుల్లో మారుమోగుతోంది.

రాత్రి తెల్లవార్లూ నిద్ర లేదు తనికి. తెల్లారినా రాత్రీ పగలూ ఒకలాగే వుంది తనకి.

ముత్తీ పులిగాడూ పొద్దున్న కూపుకిపోతూ తనని పిలిచారు. వాళ్ళకేం తెలుసు తన ఇప్పటి మానసిక స్థితి? తను రావడం లేదని వాళ్ళని పంపేశాడు. అప్పుడు పులిగాడి మొహంలోకి చూడలేక పోయాడు తను.

తను మామూలు మనిషి అయ్యేది యెట్లా? ఇదే ఆలోచనతో పొద్దు గుంకిపోయింది.

ఈ పూటేనా ఇంత తిందామని అన్నం వండి పప్పు పడేశాడు పొయ్యిమీద.

పప్పు మాడు వాసన వేస్తోంది. ముందు ఈ ఆకలి తీర్చుకోవాలని లేచి పప్పు దింపుకున్నాడు పొయ్యిమీంచి మూర్తి.

మాడి – కాటోయిన ఆ కందిపప్పుతోటే తిన్నాడు.

అప్పటికి చీకట్లు ముసురుకుంటున్నాయి. అడవి మేలుకొనేవేళ అవుతోంది.

ముత్తీ పులిగాడూ కూపునుండి తిరిగి వచ్చేశారు.

అగ్గిబుగ్గ

వాళ్ళ అలికిడి విని మూర్తి గుడిసలోంచి బయటకు వచ్చాడు.

పులిగాడు ఏవేవో సైగలు చేస్తూ ఆ రోజు కూలీలు ఎంత మంది మానేశారో లెక్కలు చెప్పి తన గుడిశలోకి వెళ్ళి పోయాడు.

మూర్తి వక్కడే బయట మిగిలాడు.

గుడిశ ముందు నిలబడి చూస్తూ వుంటే అల్లంత దూరంలో వున్న ఇప్ప చెట్టు కింద నిన్న రాత్రి దృశ్యమే సజీవచిత్రంలా ఇంకా కనబడుతోంది మూర్తికి. అందులో పులిగాడి రూపానికి తన వేషం వేసుకుంటున్నాడు మూర్తి.

ఇప్ప చెట్టుకి పక్కనే వున్న గుట్టమీద పెద్దపులి గాండ్రించింది. మూర్తి వక్కసారి ఉలిక్కిపడి మళ్ళీ సర్దుకున్నాడు. ఆ అడివిలో రాత్రివేళ పులి-గాండ్రింపులు మామూలే అయినా ఆ పులి గాండ్రింపు మామూలుగా అనిపించడం లేదు మూర్తికి. అందుకే పులిగాడి గుడిశలోకి చూశాడు వాడ్ని పిలుద్దామని.

పులిగాడు ఇప్పసారా రోజూకంటే కొంచెం ఎక్కువ పట్టించి నట్టుంది. వాడు వంటిమీద సోయి లేకుండా పడి వున్నాడు. ముత్తి వాడిచేత అంబలి తాగించడానికి విఫల ప్రయత్నం చేస్తోంది.

"ముత్తి!"

సన్నగా వణుకుతోంది మూర్తి గొంతు.

"య్యేంది దొర!" అంబలి బుర్ర చూరుకి తగిలించి గుడిశ బయటకు వచ్చింది ముత్తి.

"ఇలావర్ర" ("ఇటురా") కొంచెం ధైర్యం చేశాడు మూర్తి.

"వాతాను" ("వస్తున్నా") అంటూ ముత్తి మూర్తి దగ్గరకి వచ్చింది. మూర్తి నవ్వేడు ఆమెని గుచ్చి గుచ్చి చూస్తూ. ముత్తి కూడా నవ్వింది బదులుగా. మెల్లగా ఇప్ప చెట్టు దగ్గరికి దారి తీశాడు మూర్తి అతని వెనకనే వెళ్ళింది ముత్తి.

జల్లెడలో నుండి జారిపడే ముత్యాల్లా వుంది అక్కడి వెన్నెల.

మూర్తి మొహంలోకి చూస్తూ "ఎందుకు" అని కళ్ళతోటే ప్రశ్నించింది ముత్తి.

అతను ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు ఆమె అయోమయంగా చూసింది. ఆమె వళ్ళంతా తన రెండు చేతులతోనూ నిమిరాడు. ఆమె మొహంలో అర్థంకాని నవ్వు.

గభాలున ఆమెని గుండెలకు హత్తుకొని తన బాహువుల్లో ఆమెని బంధించాడు.

అతని వంట్లోంచి వచ్చే సెగల పొగలు ఆమెకు అర్థమయ్యాయి అంతే! "మావో" అంటూ పాపి-కొండల్లో మారుమోగేలా కేకపెట్టింది.

ఆ కేక ఇప్పసారా మైకంలో వున్న పులిగాడి గుండెల్లోంచి దూసుకు పోయింది. వాడి మైకం దిగజారి పోయింది.

ఏ క్రూర మృగమో ముత్తిని పట్టిందని– చేతి కందిన గొడ్డలి తీసుకొని బయల్దేరాడు.

ఎదురుగా మూర్తి– అతని కౌగిలిలోంచి విడిపించుకుందుకు ప్రయత్నిస్తున్న ముత్తి– ఈ దృశ్యం చూసి ప్రళయకాల రుద్రుడయి పోయాడు పులిగాడు. పులి లాగ గాండ్రించాడు. అదే సమయంలో గుట్టమీద పెద్ద పులి కూడా గాండ్రించింది.

గొడ్డలి ఎత్తిపెట్టి మీద పడబోతూ వున్న పులిగాడ్ని చూశాడు మూర్తి.

అతని కళ్ళ పొరలు డుల్లి పోయేయి. వళ్ళంతా మంచు ముద్దలా అయిపోయింది.

తన చెల్లీ, తన తల్లీ కళ్ళ ముందు మెదిలారు. తనని నీచాతి నీచంగా అసహ్యంచు కుంటున్న-ట్టున్నాయి వాళ్ళ మొహాలు.

అప్పటికే అతని చేతుల్లోంచి విడివడి పులిగాడి వెనక చేరింది ముత్తి. గొడ్డలి ఎత్తిపెట్టిన వాడి కుడిచేయి బుజంమీద తన చేయివేసి వాడ్ని ఆపడానికి ప్రయత్నం చేస్తోంది ఆమె

పులిగాడు మూర్తి కళ్ళల్లో కన్నీటి పొరలు చూస్తున్నాడు. వాడు మెలి తిరిగిన తన చేతుల కండలు చూసుకుంటున్నాడు. తల విదిలించి గొడ్డలి ఎడం చేతిలోకి మార్చుకున్నాడు. తన కుడిచేయి చూపుడు వేలూ, దాని పక్క వేలూ రెండూ మూర్తికి చూపిస్తూ– ఆ రెండు వేళ్ళనూ వక దానితో వకటి తాడించి ఒక వేలు ముడిచి వేసి మిగిలిన వేలితో తన వెనుక నున్న ముత్తిని తాకి చూపించాడు.

మూర్తి యీ సైగలు అర్థం చేసుకునే స్థితిలో లేడు

అదే సమయంలో మూర్తికి పులిగాడికి మధ్యన వక లేడి చెంగున దూకి దూరంగా పొదల్లోకి పారి పోయింది

లేడి వచ్చిన దిక్కుగా గుట్టమీద పొదలు ఒక్కసారిగా కదిలాయి. అటు చూసింది ముత్తి

వెంటనే పులిగాడి చూపులు గుట్టమీదికి మళ్ళించడానికి వాడి కళ్ళముందు తన చూపుడు వేలు ఆడించి గుట్టకేసి తిప్పింది.

అంతే!....

భూనభోంతరాళాలు దద్దరిల్లి పోయేలా పెద్ద పులి గాండ్రించడం– పిడుగు పడినట్లు పులిగాడు అరవడం– ఎడమ చేతిలోని గొడ్డలి కుడి చేతిలోకి మార్చుకోవాలని అనుకుంటూనే పులిగాడు ఒక్క ఎగురు ఎగిరి మూర్తిని మెడపట్టి పక్కకి తోసేయడం– ఇవన్నీ ఒకేసారి జరిగి పోయేయి.

కిందపడి తన ఆఖరి క్షణాలు లెక్కపెట్టు-కుంటున్నాడు మూర్తి

ఆ మరుక్షణం మెరుపులా వచ్చి పులిగాడి మీద దూకింది పులి. దూకడం దూకడం వాడి రెండు బుజాలమీదా పంజా దెబ్బలు కొట్టి మెడలో తన కోరలు దించింది

దానికి వాడి మీద చాలా కసిగా వుంది. తన నోటికి చిక్కాల్సిన లేడి వాడి మూలానే చిక్కకుండా పోయిందని. అసలు కారణం ఎవరో దానికేం తెలుసు?

పులి పంజాదెబ్బ తనమీద పడటానికి ముందే తన ఎడం చేతిలోని గొడ్డలితో పులి వెనక కాళ్ళు రెండూ నరికేశాడు.

ఈ బాధకి తాళలేక పులి పంజా విప్పి పులిగాడి గుండెలమీద వేసింది.

పులిగాడు తనని ఏ వుద్దేశ్యంతో కిందకు తోసేశాడో ఇప్పు డర్థమయ్యింది మూర్తికి. ఆ పులి తనమీదే దూకినట్లు తలుచుకొని వణికి పోతున్నాడు.

తన గుండెల మీద పడిన పంజాదెబ్బకి చిమ్మిన రక్తం చిమ్ముతూ వుంటే మహావేగంతో గిర్రున విష్ణుచక్రంలా తిరిగాడు పులిగాడు.


ఆ వేగానికి తన పట్టు తప్పి కింద పడిపోయింది పులి.

చేతిలో గొడ్డలి పులిమీదకి విసిరేసి నేల కొరిగిపోయాడు పులిగాడు.

పులి తల ఎగిరి వెళ్ళి ముత్తి ముందు పడింది. తన తలే ఎగిరి నేలమీద పడినట్లుగా అనిపించింది మూర్తికి. రాత్రంతా గోదావరి ఏడుస్తూనే వుంది.

పాపికొండల గుండెలు మండుతూనే వున్నాయి.

తూర్పు కొండ కడుపు చీల్చుకొని అగ్గిబుగ్గ పుడుతోంది. □



ఆరోగ్యానికి పరమౌషధం ముద్దు!

గాఢ, అతి గాఢ, ప్రగాఢ చుంబనాల వల్ల దంత క్షయాన్ని అరికట్టుకోవచ్చునని ఇంగ్లండ్‌లో వో డాక్టరుగారన్నారట. దంత ఆరోగ్యానికి, తద్వారా దేహ ఆరోగ్యానికి ముద్దులే పరమౌషధమన్నారట మరికొందరు డాక్టర్లు. తరచుగా ముద్దు పెట్టుకోవడం వల్ల వొంట్లోని అధిక శక్తి తగ్గి, ఒళ్ళు ఎంచక్కా సన్నబడి, ఛలాకీగా వుండ వీలవుతుందని డాక్టర్లు శలవిచ్చారట. ముప్పొద్దులా ముద్దులెట్టుకొనే వారు ముచ్చటగా, చూడ ముచ్చటగా వుంటారట. కానీ .. పరాంగనలను ముద్దెట్టుకున్నా, పరపురుషుని ముద్దెట్టుకున్నా, వారిలో తమకు, వారికి తెలీని రోగాలుంటే ... ప్రస్తుత సెక్సు భయంకర వ్యాధి ఎయిడ్స్ రావచ్చుని అమెరికా అంటోంది.

హత్యా? ఆత్మహత్యా?

సేలంకు చెందిన మెట్టూరులోని రోనాక్ ఇండస్ట్రీస్‌లో అసిస్టెంట్ ఫోర్మన్‌గా పనిచేస్తున్న దివాకర్ మిశ్రా అనే ఆయన భార్య 28 ఏళ్ల శకుంతల తనమీద కిరసనాయిలు పోసుకు నిప్పంటించుకు ఆత్మహత్య చేసుకున్నదట. 77లో వివాహమైనా, ఇంకా పిల్లలు పుట్టలేదని, ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు ఆమె భర్త పోలీసులకు చెప్పాడట. కానీ ఆమె తండ్రి తనకామె రాసిన వో ఉత్తరాన్ని పోలీసులకు చూపాడట. అందులో కట్నం బాకీ 16 వేలు ఇవ్వమని తనను తన భర్త వేధించుకు తింటున్నాడనీ, చంపేస్తాడేమోనని భయంగా వుందనీ, కట్నం బాకీ యివ్వకపోతే కనీసం తనను యీ చరనుంచి విడిపించి తీసుకు వెళ్లమనీ ఆమె రాసిందట. ఈ కేసు పోలీసు విచారిస్తోందట.

కాపలాకెళ్లి శవాలుగా మారిన ఇద్దరు వ్యక్తులు

తిర్మలాపూరుకు చెందిన 40 ఏళ్ళ గుండం మల్లయ్య, 50 ఏళ్ల బద్దనేని వెంకటి అనే యిద్దరు వ్యక్తులు వరి నూర్పిడి కళ్ళంకు కాపలాకు మొన్న ఎనిమిదో తేదీ వెళ్లారట. ఆ మర్నాడు వారిరువురి శవాలూ పోలీసులు కనుగొన్నారు. కళ్ళం నుంచి కొంచెం దూరంలోని వో రోడ్డు డొంకలో మల్లయ్య శవం, అక్కడికొంచెం దూరంలో వున్న వో చెరువులో వెంకటి శవమూ దొరికాయట. ఇద్దర్నీ ఎవరో రాళ్ళు పెట్టి తల పగులకొట్టి చంపేశారట.

రైల్లోంచి క్రింద పడి అమ్మాయి దుర్మరణం!

మద్రాసుకు చెందిన కట్టాంకుళత్తూరులోని యూనియన్ కార్బయిడ్‌లో వుద్యోగం చేస్తున్న 17 ఏళ్ల మంజుల అనే ఆమె తన ప్రియుడూ, తనతో అదే కంపెనీలో పనిచేస్తున్నవాడూ, కొన్నాళ్ళలో తన భర్త అవబోతున్న రాజాతో పోయిన్నెల (అక్టోబర్) 30 సాయంత్రం కాస్సేపు పిచ్చాపాటీ కాలక్షేపం చేసి, ఆనక కట్టాంకుళత్తూరులో రైలెక్కి మద్రాసుకు (లోకల్ రైలు) బయలుదేరిందట రైలు క్రిక్కిరిసి ఉండడం వల్ల గుమ్మం పద్దే నిలబడిందట. రైలు పుదుపెరుం కుళత్తూరు - వండిలూరు మధ్యలో పోతుండగా ఆమె జారి రైల్లోంచి క్రింద పడిపోయిందట. లోకల్ రైళ్లకు రైలాపే గొలుసులు తీసేసి వుండటం వల్ల ఎవరూ రైలుని ఆపలేకపోయారట. రాత్రి 8 గంటల వేళ పడిన ఆమెను వుదయం నాలుగున్నరకు వో. పాలవాడు చూశాడట. చావుబ్రతుకుల మధ్య మూలుగుతున్న ఆమెను క్రోంపేట ఆసుపత్రిలో చేరుస్తే, ఆమె చనిపోయిందిట. ఆ ఎనిమిది గంటలూ వృథా కాకుండా వైద్యం అందివుంటే బ్రతికుండేదట పాపం.

మహాభారతానికి ప్రపంచ గుర్తింపు!


మహాభారతాన్ని ప్రపంచంలోని పెద్ద పద్యంగా గుర్తించారట. 2,20,000 పంక్తుల పద్యాలతో, 5400 పేజిలతో 18 వాల్యూములతో వున్న యీ మహత్ బృహత్ కావ్యాన్ని ప్రపంచం అంగికరించిందట

ప్రేయసీ ప్రియుల ఆత్మహత్య!


మద్రాసు అగరమ్ పార్థసారథి వీధికి చెందిన 21 ఏళ్ల మునుసామి అనే అతను బి. కామ్. ఆఖరి సంవత్సరం చదువుతున్నాడట. వాళ్ళ పక్కింట్లో వో కుటుంబం అద్దెకు వచ్చిందట. అతను టైలరింగ్ చేసేవాడట. అతని భార్య 28 ఏళ్ల శెల్వి రూపసిట. ఆమెను చూడ్డానికి కాలేజీ కుర్రాళ్ళు బట్టలు కుట్టించుకొనే వంకన వెళ్ళేవారట. మునుసామి కూడా ఆ మైకంలో పడి, ఆ యింటిని కేంద్రంగా పెట్టుకుని వారి స్నేహం సంపాదించి, పని సాయం, మాట సాయం, ధనసాయం చేయనారంభించాడట. టైలర్ మోహన్ ఇంటిలో లేనప్పుడీ మునుసామి నెమ్మదిగా ఆమెను సాగుతూ క్రమంగా వలలో వేసుకున్నాడట. శెల్వికి ముగ్గురు పిల్లలట. వీరి ప్రేమాయణం పోలీసుల వరకూ వెళితే మోహన్ భోరున ఏడ్చి దాన్ని ఎవడితోనైనా పోనివ్వండి. నా పిల్లలు నాకు చాలు. అన్నాడట. ఆనక మునుసామి, శెల్వి కలిసి వూరొదిలిపోయారట. ఆనక్కొన్నాళ్ళకు మునుసామి చెల్లెలి పెళ్ళి వచ్చిందట. అతనెళ్ళి తండ్రిని కలిస్తే నీతో వున్న పరాయివాడి పెళ్లాన్ని వదలి, వస్తే రా ... లేకపోతే లేదు అన్నాట్ట ఆయన. ఆ రాత్రి ప్రేమికులిద్దరూ ఒకర్ని పుచ్చుకునొకరు ఏడ్చి, ఆ తర్వాత విషం త్రాగి, ఆత్మహత్య చేసుకున్నారట.

తల్లిని చంపిన నిరుద్యోగి!


బొంబాయికి చెందిన విజయ్ గద్వాల్ అనే వో నిరుద్యోగి తన నిరుద్యోగ బాధతో పాటు తన తల్లి పెట్టే నిందావాక్య బాధలు పడలేక, మొదటి దానికి విముక్తి దొరికితే తప్ప రెండోది తగ్గే సూచనలు లేనందువల్లా ఆవేశంతో ఒక రోజు తన తల్లి పార్వతి గద్వాల్‌ను కత్తితో పీక కోసి మాతృ హంతకుడై పోలీసుల చేతికి చిక్కాడట. □



సీరియల్



ప్రతిభ



డాక్టర్ ముదిగొండ శివప్రసాద్

(గతసంచిక తరువాయి)

14

గురుపాదస్వామి కిచ్చిన మాట ప్రకారం ఒక మంచి నృత్యరూపకాన్ని రచించి సమర్పించాలని భవభూతి నిశ్చయించాడు. అందుకు కాకతీయుల కథను ఇతివృత్తంగా నేపథ్యంగా తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. కాకతీయులు గొప్ప కళాపోషకులు, ధర్మ ప్రభువులు. ప్రపంచ చరిత్రలోనే చెరగని చెదరని స్థానాన్ని ఆక్రమించుకున్నవారు వారి సాహిత్య కళాపోషణలకు రావలసినంత ప్రచారం రాలేదని భవభూతి విశ్వాసం. చెరువులు త్రవ్వించి, వ్యవసాయం చేసుకోవడానికి యోగ్యమైన పరిస్థితులు కల్పించిన వారు కాకతీయులు. నిజానికి వారు త్రవ్వించినవి సహజ సరస్సుల వలె ఉంటాయి. అందుకే వాటికి సముద్రములనే పేరు. భవభూతి ఎవరితోను చెప్పకుండా ఒంటరిగా పాలంపేట వెళ్ళాడు. అక్కడ రామప్ప దేవాలయం ఉంది. అది అసంపూర్ణమైన ఒక శివాలయం. అందులోని ప్రతి బొమ్మ ఎవరో ఒక నర్తకిని సూచిస్తూ వుంటుంది. ప్రతిభతో తాను కలిసి టూరు వేస్తున్నపుడు ఆమెకు రైల్లో రుద్రమదేవి ప్రణయ వృత్తాంతాన్ని చెప్పిన సంఘటన, సద్దర్లో కూడ నర్తిస్తున్న ప్రతిభ పాదాలు గుర్తు కొచ్చాయి. పాలంపేట వద్ద భవభూతి ఏకాంతంగా కూర్చున్నాడు. క్రమంగా చీకటి పడింది. నర సంచారం తగ్గడం మొదలెట్టింది. చెరువు గట్టు మీద ఎవరో నడిచి తన వైపు వస్తున్నట్లు భవభూతికి అనిపించింది.

"ఎవరు?" అని ప్రశ్నించాడు భవభూతి.

చీకట్లో ప్రతిభ తన వైపు నడచి వస్తున్నది. నిజానికి ఆమె ప్రతిభ కాదు. రామప్ప గుడిలో నున్న నాగినియే. నాగిని మాత్రమే కాదు జాయపసేనాని రచించిన నృత్త రత్నాకరంలోని ప్రతి భంగిమకు లక్ష్యాన్ని అందించే ఒక దివ్యమూర్తి. రామప్ప గుడిలోని శిల్పములన్నీ రెక్కలు తొడిగి వెన్నెల వెలుగులతో నర్తించడం మొదలెట్టాయి. ఎందరెందరో సుందరీమణులు ఎన్నెన్నో భంగిమలు జాగర్తగా పరిశీలిస్తే అందరూ ప్రతిభ మాదిరే మారిపోయారు: ఒక్క ప్రతిభయే ఇన్ని రూపాలుగా మారి నర్తిస్తున్నది. భవభూతికి ఈ భావం మహాద్భుతంగా కనిపించింది. తెల్లవార్లు ఇలా రామప్ప గుడి సజీవంగా ప్రాణం పోసుకొని భవభూతి కన్నుల ముందు సంచరిస్తూనే వుంది. అక్కడ స్థావర జంగమ భేదాలు లేవు. శిలలు లేవు. అన్నీ సజీవ నృత్యమూర్తులే. భవభూతికి దీన్నే ఇతివృత్తంగా తీసుకోవాలనే దృష్టి కలిగింది. కాకతీయుల కాలంలో రెండవ ప్రతాపరుద్రుని సమకాలికుడైన పాల్కురికి సోమనాథ కవి జీవితం కూడ కేంద్ర బిందువు చేసుకొని ఒక మంచి నృత్యరూపకం వ్రాయాలి. నిజానికి పాల్కురికి కవిత్రయాని కేమాత్రం తీసిపోడు. పైగా ఆయన మొట్టమొదటి జాను తెనుగు కవి. ప్రజా కవి. ప్రజల భాషలో, ఛందస్సులో ఇతివృత్తంలో రచనలు సాగించిన వాడాయన. ఇలా ఊహిస్తూ భవభూతి తన క్రొత్త నృత్య రూపకానికి కావలసిన నేపథ్యాన్నంతా భావాత్మకంగా సేకరించు కొన్నాడు. మర్నాడు తిరుగు ప్రయాణం కట్టాడు. ఆ సమీపంలోనే ఒక చిన్న పల్లెటూరుంది. అక్కడ ఆగి వారికి ఈ చుట్టుపక్కల విశేషాల గూర్చి ఏమైన ప్రత్యేక సమాచారం తెలుసునేమో సేకరిద్దామని ఆగాడు. "ఇక్కడ ఎవరైనా పండితులున్నారా?" అని స్థానికులను ప్రశ్నించాడు. ఆ ఊళ్ళో ములుగు మల్లేశం గారనే ఆరాధ్యుడున్నట్లు తెలిసింది. భవభూతి ఆయన వద్దకు వెళ్ళాడు. మల్లేశంగారు బాగా వృద్ధుడు. పళ్ళు కూడ ఊడిపోయాయి. మంచం నుండి కూడ క్రిందికి దిగడం లేదు. ఆయన కొడుకుకు సంచారం ఉంది. అదే వారి జీవనోపాధి. సంచారం వల్ల ఇటు ఉపాధి, అటు ధర్మ ప్రచారం రెండు సిద్ధిస్తాయి. పూర్వం తెలంగాణాలోని ఆరాధ్యులంతా సంచారాలు చేసేవారు. నాగరికత బలిసిన కొద్ది ఈ ఆచారాలు మానుకొని ఉద్యోగాల్లో చేరి నెల జీతాలతో తృప్తి పడడం ప్రారంభించారు.

మల్లేశంగారి వద్ద భవభూతి వినమ్రంగా కూర్చుని తానెవరో, ఏం పని మీద వచ్చాడో చెప్పాడు కాకతీయులను, కథావృత్తంగా తీసుకొని తానొక నృత్యరూపకం రచించి దానిని భారతదేశంలోనే గాక అమెరికా లండన్ లాంటి చోట్ల గూడ ప్రదర్శించే ఏర్పాట్లు చేయగలనని చెప్పాడు. అది విని ములుగు మల్లేశం ఎగతాళిగా నవ్వాడు. నాట్యం గురించి మీ తరం వారికి ఏం తెలుసు? అంతో ఇంతో మా తరం వారికి తెలుసు. మేము తెలంగాణా అంత తిరిగి ఎన్నో తాళపత్ర గ్రంథాలు సేకరించాము. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర, బసవ పురాణము, వృషాధిప శతకము, చతుర్వేదసారము, చెన్నమల్లు సీసములు సోమనాథ భాష్యము వంటి తాళపత్ర గ్రంథాలన్నీ నా వద్ద ఉన్నాయి.


జరిగిన కథ-17: భవభూతి, ప్రతిభ వివాహం చేసుకుంటారనే పుకారు బయలుదేరుతుంది తన గూర్చి అతని అభిప్రాయమేమని ప్రతిభ భవభూతిని అడుగుతుంది ప్రతిభ స్త్రీ రూపంలో నున్న నటరాజస్వామి అయితే తానొక భక్తుడిని మాత్రమే అని భవభూతి చెపుతాడు. అది విన్న ప్రతిభ చివాలున లేచి వెళ్ళిపోతుంది. భవభూతి ప్రతిభ దగ్గరికి ఇక వెళ్ళకూడదని అనుకుంటాడు. అరంగేట్రం అయ్యాక భవభూతికి; ప్రతిభకి అక్రమసంబంధం ఉందని ప్రచారం చేస్తుంది. భవభూతి గిరిజ తన కూతురని గిరిజ ఉండే స్కూలువాళ్ళతో చెప్పి ఆ అమ్మాయిని తనతో పంపించమని అడుగుతాడు. ప్రిన్సిపాల్ అంగీకరిస్తాడు. గిరిజకు గురుపాదస్వామి వద్ద నాట్యం చెప్పించాలనుకుంటాడు భవభూతి. గిరిజకు నాట్యం చెప్పడానికి గురుపాదస్వామి అంగీకరించాడు. గురుపాదస్వామి వలన ప్రతిభకి ఒక సోదరి ఉందని తెలుసుకున్న భవభూతి ఈ విషయం పూర్తిగా తెలుసుకోవాలనే ఉత్సాహంతో హైదరాబాదు బండి ఎక్కాడు

ఇంతేకాదు ఇంతవరకు బయటి ప్రపంచానికి తెలియని గ్రంథాలు కూడ నా వద్ద ఉన్నాయి. అయితే వాటిని వెలుగులోకి తీసుకరావడం నా కిష్టం లేదు. నా వద్ద బసవరాజీయం ఉండేది. దాన్ని హైదరాబాదు నుండి వచ్చిన ఒక పండితుడు తీసుకొని వెళ్ళేడు. ఆయన తనకు తెలిసిన మంత్రితో చెప్పి ప్రభుత్వపు ప్రాచ్యలిఖిత భాండాగారానికి అమ్మించి నాకు చాల పెద్ద మొత్తం వచ్చేట్టు చేస్తానని మాట ఇచ్చాడు. నేనాయనను నమ్మి పుస్తకం చేతికిచ్చాను. డబ్బు రాలేదు సరిగదా. కొన్నాళ్ళయ్యాక పుస్తకం పోయిందని చెప్పాడు. అప్పటి నుండి నాకు మనుషుల మీదనే నమ్మకం పోయిందన్నాడు మల్లేశం. భవభూతి మల్లేశం పట్ల చాల సానుభూతి చూపాడు. ఆ తర్వాత వారిరువురు నాట్యశాస్త్రాన్ని గురించి, రస సిద్ధాంతాన్ని గూర్చి ముచ్చటించుకున్నారు.

"హైదరాబాదులో ప్రతిభ అని ఒక నర్తకీమణి ఉన్నట్టు విన్నాను. ఆమె దైవాంశసంభూతురాలని నాట్యం చేస్తుంటే దేవతలు దిగివచ్చినట్టు కనిపిస్తుందని చెప్తారు. నేనొకసారి ఆమెను కలుసుకోవాలనుకున్నాను. కాని వయస్సులో ఎక్కడికి కదలలేక ఊరుకున్నాను. పైగా నేనో పల్లెటూరి మనిషిని. నాకా పెద్దవారు వెంటనే ఇంటర్వ్యూ ఇస్తారో ఇవ్వరో తెలియదు. నా విద్వత్తు... తాళపత్ర గ్రంథాలు ఎవరికి కావాలి? ఈ నాటి సమాజానికి డబ్బు కావాలి. ధనవంతుడే గుణవంతుడు. అందుకని ఇలాంటి ప్రయత్నాలు నేను మానుకున్నాను. నా వద్ద కాకతీయుల కాలం నాటి ఒక అపూర్వ నాట్యశాస్త్రం ఉంది. దాని పేరు నాట్యామృతం. దీని సహాయంతో ఎన్నో రోగాలు నయం చేయవచ్చు. ఇందులో మంత్రాలు, వాటికి అభినయ భంగిమలు చెప్పబడియున్నాయి. కష్టపడి రోజూ సాధన చేస్తే పోలియో పక్షవాతం వంటి రోగాలు వచ్చిన వారి శరీరాలు కూడ స్వస్థత చిక్కుతాయి. అంతేకాదు ఇందులోని కొన్ని మంత్రాలకు శాస్త్రకారుడు నిర్దేశించిన భంగిమలను అభినయిస్తే అది చూచిన వారికి ఎన్నో రోగాలు ముఖ్యంగా మానసిక వ్యాధులు నయమవుతాయి. ఇలాంటి పుస్తకాలు నా వద్ద చాల ఉన్నాయి. వీటిని ఎవరికైనా ఇస్తే అంతే చెల్లు. పుస్తకంతో సహా పరారి అవుతున్నారు. నాకు ప్రతిఫలం మాట అటుంచి విలువైన ఆ పుస్తకమే మానవాళికి అందకుండా శాశ్వతంగా నశించిపోతున్నది. పోనీలే! అని వీటిని పబ్లిష్ చేసి ప్రచారంలోకి తీసుక వద్దామంటే నా కంత ఆర్థిక స్తోమతు లేదు. అందువల్ల ఈ పుస్తకాలు ఇలాగే ఉండిపోయాయి. నాట్యంతో పోలియో, పక్షవాతం నయం చేయవచ్చునంటే విన్నవాడు ఈ నాడు నవ్వుతున్నాడు. ఈ తరం వారికి శాస్త్రాలు తెలియవు. సంప్రదాయాలు తెలియవు. ప్రాచీనుల మహత్తు చెప్పినా అర్థం కాదు. నమ్మరు.

తెలంగాణాలో నేటికీ ఇలాంటి శాస్త్రగ్రంథాలు ఆ మూల ఈ మూల అజ్ఞాతంగా ఉన్నాయని భవభూతి లోగడ విని వున్నాడు. కాని వెతకబోయిన తీగ ఇలా కాలికి తగులుతుందని కలలో కూడ ఊహించలేదు. మల్లేశం మాటలలోని నిజానిజాలను గూడ పరిశీలించాలనుకున్నాడు.

"అయ్యా! మల్లేశారాధ్యుల వారు! నాకు ప్రతిభ తెలుసు. అండాళ్ తెలుసు.



బెంగుళూరులోని నాట్యాచార్య గురుపాదస్వామి తెలుసు. నాట్య విద్య మీద అంతో ఇంతో పరిశోధన చేసిన వాణ్ణి. మీ కభ్యంతరం లేకపోతే మీరు నాకొక్కసారి ఆ నాట్యామృతాన్ని చూపించండి."

"చూపించను గాక! చూపించను. మీరు తీసుకొని పారిపోతె అప్పుడు నేనేం చేయాలి?"

"మీ పాదాల మీద ఆన. మీ ఎదురుగా కూర్చుని ఒక్కసారి తాటాకులు తిరుగవేస్తాను."

మల్లేశానికి భవభూతి మీద దయగలిగింది. మెల్లగా అతికష్టం మీద మంచం మీది నుండి లేచి లోనికి వెళ్లాడు. ఒక పాత చెక్కపెట్టెలో నుండి తాటాకు పుస్తకాలు బయటకి తీసాడు. వాటి మధ్యలో నుండి ఒక పుస్తకాన్ని తీసి మిగిలిన వాటిని మళ్లీ చెక్కపెట్టెలో పెట్టాడు. ఆ చిన్న తాటాకుల పుస్తకం చేతికి తీసుకొని మెల్లగా వంగిన నడుం మీద చేయి వేసుకొని నడుచుకుంటూ వచ్చాడు. మల్లేశంగారి ఇంట్లోని వారు ఒకసారి వచ్చి భవభూతిని చూచి మళ్లీ తమ పనిలోకి వెళ్ళిపోయారు. మల్లేశం భవభూతి చేతికి చిన్న తాటాకుల పుస్తకం ఇచ్చాడు. భవభూతి దాని సూత్రాన్ని విప్పాడు. చెక్కలు తీసి పరిశీలించి చూచాడు. అది కాకతీయ గణపతి దేవుని కాలంలోని విశ్వేశ్వర శివాచార్య అయ్యవారు వ్రాసిన 'నాట్యామృతము' అనే వైద్యశాస్త్ర గ్రంథం. నాట్యంతో వైద్యం చేయడం దీనిలోని సారాంశం. ఈ శివాచార్య అయ్యవార్లుంగారి పేర్లు కాకతీయుల శాసనాలలో కనపడుతాయి. భవభూతి అందలి శ్లోకాలను వాటి తాత్పర్యాలను పరిశీలించాడు. అవి కొన్ని రుగ్వేద మంత్రాలు. ఆయా మంత్రాలకు నాట్యశాస్త్ర పరంగా అపూర్వమైన అభినయం గూడ నిర్దేశింపబడి వుంది. ఏ మంత్రం అభినయిస్తే ఏ రోగం నయం చేయవచ్చో కూడ క్రింద స్పష్టంగా వ్రాయబడి వుంది. భవభూతి ఆయా మంత్రాలను తన ధారణాశక్తితో మనసులోనే గుర్తు పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. కొంత సేపైన తర్వాత మల్లేశం భవభూతిని చూచి ఇక పుస్తకం ఇచ్చి వేయి నాయన. ఎక్కువ సేపు ఉంటే అటే రోడ్డెక్కి పారిపోతావు అన్నాడు సీరియస్‌గానే. భవభూతి నవ్వి ఆయన పుస్తకం ఆయన చేతికిచ్చాడు. "మంచిది మల్లేశంగారు నేనిక సెలవు తీసుకొంటాను. అనుకోకుండా మీ వంటి పుణ్యపురుషుల దర్శనం లభించింది అంతే చాలు" అన్నాడు భవభూతి, ఆయన పాదాలకు నమస్కరించి లేచి నిలబడ్డాడు.

ఇదేమిటి మధ్యాహ్న వేళ వచ్చిన అతిథిని నేను ఊరకేనే పంపుతానా ఏమిటి? నేను ధనానికి లేని వాణ్ణేమో కాని గుణానికి లేని వాణ్ణి కాను. భోజనం చేసిపో.

భవభూతి మాట్లాడకుండా కొన్ని క్షణాలు పాటు ఉండిపోయాడు. మల్లేశంతో పాటు భవభూతికి భోజనం వడ్డించారు. ఇరువురు నాట్యశాస్త్రం గురించి చర్చిస్తూ భుజించారు. భోజనానంతరం భవభూతి ఆ గ్రామం విడిచి బయల్దేరాడు. అతడు తన డైరిని పెన్నును తీసుకొని నాట్యామృతంలోని శ్లోకాలు గుర్తున్నంత వరకు ఒక క్రమంలో వ్రాసుకొన్నాడు. వానిలో ఎక్కువ భాగం వేదమంత్రాలే ఉన్నాయి.

"సంగచ్ఛధ్వం, సంవదధ్వం, సంవే మనాంసి జానతాం తేవా భావం యథా పూర్వే సంజానానా వాస్తే" మనమంతా కలిసి ఒకే బాటలో నడుద్దాం. ఒకే మాటపై నిలుద్దాం. మనలో ఒకే అభిప్రాయం, ఉత్తమమైన సంస్కారంతో ఉండుగాక. సనాతనులైన మన పుణ్యపురుషులు ఏవిధంగా వ్యవహరించారో అదే విధంగా వారి కర్తవ్యాన్ని వదలక అనుసరించాలి. ఓం సమానో మంత్రః సమితే సమానీ సమానం మనః సః చిత్తరేషాం సమానం మంత్ర మపి ఏవః సమానేన ఓం అభిషాజాహోమి – మన ఆలోచనలు; మన సమాజము, మన మనస్సు ఎట్టి భేదాభిప్రాయము లేక ఏకీభవించును గాక! మనలో ఎటువంటి హెచ్చు తగ్గులును లేకుండ సమానముగా నైవేద్యమును ఇచ్చుచున్నాను. ఓం సమానీవ ఆహూతిః సమానా హృదయా నివ సమాన మస్తు ఓ మనో యథావః సు సహాసతీ మన ఆధ్యాత్మిక ఆదర్శం ఒకటే యగుగాక! మన

హృదయములన్నీ ఏకమగుగాక! మన భావనలు ఏకోన్ముఖంగా ఉండును గాక! అని ఈ మంత్రాల కర్థం. అలాగే ఇందులో అగ్నిమీళే పురోహితం మొదలగు మంత్రాలకు ఎలా అభినయం పట్టాలో కొన్ని ముద్రలతో సూచింపబడివుంది. ఉషలు, నిశీధిని ఇంద్రవరుణ అగ్నులను వర్ణించే మంత్రాలు కూడ అభినయ ముద్రలతో ఇందులో వర్ణింపబడ్డాయి. భవభూతి గుర్తున్నంతవరకు నోట్సు వ్రాసుకున్నాడు. మల్లేశానికి మానవులపైన విశ్వాసం పోయింది. నిజానికది మల్లేశం తప్పుకాదు. ఈ మానవ సమాజమే అతనిని అలా మార్చింది. గ్రామాలలో మల్లేశంలాంటివారు చాలామంది ఉన్నారు. వారి తాళపత్ర గ్రంథాలు వెలుగులోకి రాకపోతే విద్యాలోకం, నాగరిక లోకమే అందుకు బాధ్యత వహించవలసి ఉంటుంది. మల్లేశంనుండి తాను వ్రాసుకున్న నాట్యామృతానికి భవభూతి "డ్యాన్స్ థెరపి" అని పేరుపెట్టాడు. ఇలాంటి వైద్యం ఒకటి ఉందని ఆధునికు లెవ్వరూ ఊహించి ఉండరు. దీన్ని ఇప్పుడు శాస్త్రీయంగా ప్రజలమీద ప్రయోగించి చూడాలి. దాని జయాపజయాలమీద నాట్యశాస్త్రం ఆధారపడి వుంటుంది. శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచేది, మనస్సును ఆహ్లాద పరిచేది. ఆత్మను వికసింపజేసేది నాట్యం అని నిర్వచనం ఇప్పుడు యథాతథంగా నిరూపింపబడాలి. అందుకు ప్రతిభ ఆలంబనం కావాలి. అప్పుడే నాట్యం ఒక యోగం కాగలుగుతుంది. అలా లేనప్పుడు ఈ అంగాంగ ప్రదర్శనలన్నీ వెకిలి చేష్టలవుతాయి. ఇంద్రియోద్రేకాన్ని రెచ్చగొట్టే అసభ్య భంగిమలు అవుతాయి.

భవభూతి ఒక నోటుబుక్‌లో వివరంగా నాట్యామృతాన్ని రాశాడు. అగ్నిమీళే పురోహితమ్ యజ్ఞస్య. దేవవృత్విజమ్ హోతారం రత్న ధాతమమ్ అనే రుగ్వేదంలోని ప్రప్రథమ మంత్రంతో నాట్యామృతం ప్రారంభమైంది. సఃనః ఇతేవ సూనవేగ్ని సూపాయనో భవ సచస్వానః స్వస్తయే రుగ్వేదం మండలం సూక్తం మంత్రం ఇలా తాను జ్ఞాపక ముంచుకొన్న అన్ని మంత్రాలను యథాతథంగా వ్రాసిపెట్టారు. వాటికిప్పటివరకు మూడు అర్థాలే ఉన్నాయి. యాస్కుడు తన నిరుక్తంలో చెప్పినవి అవి. ఆధిభౌతిక ఆధిదైవిక, ఆధ్యాత్మికార్థాలు. ఇప్పుడు దీనికి అభినయ పరమైన చతుర్థార్థం మల్లేశం పుణ్యమా అని భవభూతికి స్ఫురించింది. దాన్నంతా అందులో రాశాడు. మల్లేశం ఆ పుస్తకం ఎవరికీ ఇస్తాడని నమ్మకంలేదు. లోగడ ఓసారి దెబ్బతిన్నవాడు గావడంతో అతడెవరినీ నమ్మడంలేదు. అంత ఉదాత్తమైన తాళపత్ర గ్రంథం కాలగర్భంలో కలసి పోవలసిందేనా? ప్రాచ్య లిఖిత భాండాగారం వారికి ఈ సమాచారం తెలియజేసినా వెంటనే ప్రయోజనం ఉండకపోవచ్చు. ఇలా భవభూతి ఆలోచిస్తూ వున్నాడు. ఆయనకు పోస్ట్‌మ్యాన్ బెంగుళూరునుండి వచ్చిన ఉత్తరాన్ని అందించాడు. శ్రీయుతులు భవభూతిగారికి గురుపాదస్వామి కళాభినందనలతో వ్రాయునది. ఉభయ కుశలోపరి. మీ కుమార్తె కుమారి నీరజ శ్రద్ధగా క్లాసులకు హాజరవుతున్నది. ఆమెకు మంచి లయజ్ఞానం ఉంది. త్వరలోనే నా సంస్థకు పేరు ప్రఖ్యాతులు తీసుకు రాగలదని భావిస్తున్నాను. ఆమెను నా అభిమాన శిష్యురాలిగా స్వీకరించి ఈనాటి ప్రముఖ నర్తకీ మణులందరిని నాట్య విద్యలో జయింపచేసి నాకు నా కళకు ఆమె ద్వార అజరామరత్వాన్ని సాధింప జేయాలని నా వాంఛ. వివరాలు వెంటనే వ్రాయండి. ఇట్లు మీ గురుపాదస్వామి.

భవభూతి ఉత్తరం చదువుతూ ఆలోచనా నిమగ్నుడయినాడు. గిరిజ పేరును గురుపాదస్వామి నీరజగా మార్చాడు. ఉభయ తారకంగా ఉంటుందని ఆయన ఉద్దేశం. నాట్య తారలకు, సినీ నటీమణులకు పేరు మారిస్తే తప్ప అదృష్టం పట్టదు కాబోలు. పేరులోన ఏం పెన్నిధి ఉన్నది అని ఎవరో అన్నారు. కాని నిజానికి అదృష్టమో దురదృష్టమో పేరులోనే ఉంటుంది. మల్లిని ఉల్లి

అన్నా మల్లె వాసన పోకపోవచ్చు. శిరిషము చందనం వంటి అందమైన పేర్లను తీసివేసి శిఖండి, దృషగ్వ వంటి పేర్లను బెడితే ఆ శబ్దోచ్చారణ ఆ వస్తు సౌందర్యాన్ని సూచింపజాలదు. భవభూతి ఇలా ఆలోచిస్తూ వుండగా వాత్స్యాయన శర్మ వచ్చాడు.

"ఒరే నాయన! మరి నల్లపూసవైపోయావు. ఎక్కడో ఊళ్ల వెంబడి దిరుగుతున్నావు. మా రామకథ నృత్య రూపకం ఎంతవరకు వచ్చింది. నీతో చాల విషయాలు మాట్లాడాలి."

"వాత్స్యాయన శర్మా! నేను కూడ నీతో కొన్ని విషయాలు చెప్పాలి. అవి తర్వాత చెప్తాను. ముందు ఈ నోటుబుక్కును తీసుకొని వెళ్లి ప్రతిభ కివ్వు. దీని పేరు నాట్యామృతం. ఇందులో "డ్యాన్స్ తెరఫీ" అని కొత్త వైద్య విధానం ఉంది. దీన్ని ఆమె సాధనచేసి ప్రపంచానికి అందివ్వాలని వుంటుంది. శర్మా! నీ దగ్గర నాకు దాపరిక మేమిటి? విభూతి గజ్జెల గుర్రం అన్న అపవాదులకు మేం లోనయిన తర్వాత ఇక ఏ నర్తకి వద్దకు 'వెళ్లకూడదని నిశ్చయించుకొన్నాను. ముఖ్యంగా ప్రతిభ. వద్దకు నీవు అన్యధా భావించక నేను ఇవ్వమన్నానని చెప్పి ఇచ్చిరా."

"ఒరే నాయనా! ఇరుగు పొరుగుల మాటలు పట్టించుకుంటే మనం ఒక్క అడుగు ముందుకు వేయలేం. రచనను ఒక యోగంగా సాధన జేయదలిచిన నీవు నిందాస్తుతులకు అతీతంగా ఉండవలసిన అవసరం లేదా?"

"ఉంది. నాకుంది. కాని ఆమెకు లేదు. నేను చేసే పనివల్ల ఇతరులు కష్టనష్టాలకు గురి కాకూడదు. నా పరిచయంవల్ల ప్రతిభ ఎందుకు అవమానాలకు గురి కావాలి. అందాళు ప్రతిభమీద - తన పగను తీర్చుకోదలిచినపుడు నా స్థానంలో నేను గాక మరొకరున్న ఇలాగే అయివుండేదని నీవు అనవచ్చు. అప్పుడు తప్పు మొత్తం అందాళ్‌దే అవుతుంది తప్ప నా బాధ్యత ఉండదు. ఏది ఎప్పుడు ఎలా కావాలో అలాగే అవుతుంది. అనవసరంగా నీవు నేను బాధపడి ప్రయోజనం లేదు. నేను చెప్పినట్లు చేయి."

భవభూతి కళ్లను చూచి వాత్స్యాయన శర్మ మరింకేమీ మాట్లాడలేదు. మాట్లాడకుండా నాట్యామృతాన్ని తీసుకెళ్లి ప్రతిభ కిచ్చాడు. ఆ సాయంత్రం" ఒరే నాయన! నిన్నర్జెంటుగా ఒకసారి ఆమె రమ్మంటుంది.

"ఎందుకుట?"

"ఏమో నాతో చెప్పలేదు. తనమాట ఏమాత్రం అలక్ష్యం చేయకుండా దయతో ఒక్కసారి వచ్చి పొ"మ్మని చెప్పింది.

భవభూతి ఆలోచనలో పడ్డాడు. వెళ్లడమా మానడమా, సరే వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. మర్నాడు ఉదయం నాట్య శిక్షణా తరగతులు ప్రారంభం కావడానికి ముందే భవభూతి వెళ్లి ప్రతిభను కలుసుకున్నాడు. ఆమె అతనిని లోనికి ఆహ్వానించింది. అందులో ఆహ్వానంగాని తిరస్కారం కాని రెండు కనిపించలేదు. భవభూతికి ఎదురుగా ప్రతిభ కూర్చున్నది. నిశ్శబ్దం. సంభాషణ ఎలా మొదలు పెట్టాలని భవభూతి ఆలోచిస్తున్నాడు. కొన్ని క్షణాలాగాక, గొంతు సవరించుకొని భవభూతి ఇలా అన్నాడు.

"ఈ నాట్యామృతం అనేది కాకతీయుల నాటి ఒక అపూర్వ శాస్త్ర గ్రంథం. ఇందులో ప్రపంచం ఇంతవరకు కనివిని ఎరగని నాట్య వైద్య ప్రక్రియ (డ్యాన్స్ తెరఫీ) ఉంది. దీనిని మీ కందించాలని నేను పడ్డ ప్రయత్నం ఫలించింది. దీనిని సాధనచేసి లోక కళ్యాణార్థం వినియోగించండి."

"డ్యాన్స్ తెరఫీ" గురించి తర్వాత మాట్లాడదాం. మీరు ఇటీవల పూర్తిగా రావడం మానేశారేం. నామీద కోపం కల్గిందా? లేక అసహ్యం వచ్చిందా?"
"అలాంటిదేమీ లేదు. మీమీద కోపగించే అర్హత నాకులేదు. అవసరమూ నాకు లేదు. అయినా మీరేం చేశారని నాకు కోపం రావాలి."

"ఏమో! ఎవరికి తెలుసు. ఎప్పుడు ఎవరిమీద ఎందుకు ఎలా రాగద్వేషాలు కల్గుతాయో ఎవరు చెప్పగలరు. మీ అమాయకత్వం చూచి మీ హృదయం ఒక తెరిచి పెట్టిన పుస్తకం అని గీతలు పడని తెల్ల కాగితం అనుకున్నాను."

"ఇప్పుడు కాదని నిరూపణ అయిందా?"

"మీకు నీరజ అనే కుమార్తె ఉన్నట్లు నాతో చెప్పనే లేదే. అఫ్‌కోర్స్. నేను మీకు ఏమంత కావలసిన దానినని నాతో చెప్తారు. ఎంత ప్రసిద్ధురాలైనా నేనొక నాట్యగత్తెను. అంతే." అన్నది ప్రతిభ.

(ఇంకా ఉంది)

"అమ్మాయ్ ! తొమ్మిదయిపోయి నట్టుంది.... అల్లుడు ఇంకా రాలేదు... ?"

"వస్తారులే నాన్నా! నువ్ పడుకో!"

"తలుపు వేసుకోడం మరిచి పోకుసుమా.... నాకు తెలియకుండానే మాగన్ను పట్టేస్తుంది."

"ఫరవాలేదులే.... ఈ వీధిలో అల్లాంటి భయాల్లేవు!"

బయట వరండాలోకి చాపతెచ్చి వేసుకుని గాజుగ్లాసులో పక్కన నీళ్ళు పెట్టుకుని నీళ్ల మీద పోస్టుకార్డు మూతగా పెట్టుకుని నిద్రకు ఉపక్రమించాడు నిరంజన శర్మ.

అదేమి ఖర్మమో కాని కష్టపడితేనే కాని నిద్రరాదు. ఎందుకు నిద్రరావడం లేదా అని ఆలోచిస్తున్న కొద్దీ ఆలోచనయితే పదునవుతుందే కాని నిద్రమాత్రం రాదు.

కష్టపడితే కదా నిద్రవచ్చేది. కాయకష్టం తనని చెయ్యగలిగిన వైనా చెయ్యనియ్యరు.

"నీకేం, మహరాజులా ఉండక!" అంటాడు పెద్దవాడు.

"బోల్డు పుస్తకాలున్నాయి నాన్నా!.... ఉపనిషత్తులు కనపడ్డవన్నీ కొని పడేశాను... కాలు మీద కాలు వేసుకుని చదువుకుంటూ కూచోక బూజులు దులుపుతూ, దొడ్డి కడుగుతా నంటావేం?" అంటాడు చిన్నవాడు. వట్టి వెర్రి బాగులాడు!

అయినా ఆడది లేని బతుకులో వెలితి మరొకరికి అర్థమయ్యేలా ఎలా చెప్పడం?

కాలం మీద పడి కాబళించడానికి సమీపిస్తున్న కొద్దీ ఆడదాని అవసరం రోజు రోజుకీ హెచ్చుతూనే ఉంటుంది.

కాని కాలం తనకోసం తనకి కావాల్సిన దాన్ని నిలిపి ఉంచుతుందా?

నేవచ్చిన పనిఅయిపోయిందిలే అన్నట్టు సీతాలు కనీసం నిట్టూర్పైనా విడవ కుండా దిగ్గున లేచి మటుమాయమైపోయింది.

—"మీరు చాపమీద పడుకోలేరండి!" అనేది సీతాలు వెర్రి సీతాలు!

—"గబ్బిలం చీకటినే వెదుక్కుంటూ పోతుంది!"

ఈ మాటలు చెవిని బడడంతో చటుక్కున నిరంజన శర్మకి పడబోతున్న మాన్ను చెదిరిపోయింది.

—"నా పరువు తియ్యడానికి కాకపోతే ఇంత ఇల్లూ వదలి బయట వరండాలో పడుకునే అవసరం ఏమొచ్చింది?"

అల్లుడికి కోపం, ఏదో ఆవేశం.

గబ్బిలం? ఎవరు? తనే? ఈ మాట అన్నదెవరూ? తనబిడ్డే!

—"నాన్నా! నాన్నా!..... పట్టు పావడాకుట్టించు-నాన్నా! అమ్మా, పూలజడకుట్టవే.... " అన్న తన ముద్దుల పాపాయే?

కట్నం వద్దు నాన్నా కట్నం ఇచ్చే పద్ధతిలో నేను అసలు పెళ్ళే చేసుకోనునాన్నా! అన్నయ్య లిద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యాయికదా! నువ్వు వాళ్లదగ్గరకి



ఒంటరి

వి.వి.బి. రామారావు

వెళ్లకు.. నాదగ్గరే ఉండిపో.... నా జీతం మన ఇద్దరికీ చాలక పోదు.... ఇంత చదువు చదివించావ్.... ఉద్యోగం చేసుకుంటున్నాను.... నాకు కట్నం కూడా ఎందుకిచ్చి పెళ్లి చెయ్యాలి నాన్నా!"

వెర్రి తల్లి..... ఈ రోజుల్లో కట్నం లేకుండా పెళ్ళిళ్ళు జరిగేనా? జరిగినా ఎంత కాలమో సాఫీగా వెళ్లేనా?

చేసింది చిన్న ఉద్యోగమే అయినా రిటయిరు మెంటు తరువాత ఏవో కొన్ని డబ్బు లొచ్చాయి... పిల్లలూ వచ్చారు. సీతాలు లేని లోటు కనపడ-నియ్యకుండా వదినలిద్దరూ తమ ఆడబడుచు పెళ్లి చేయించేశారు.

తల్లి లేని లోటు కనపడనియ్యలేదని కూతురు అన్నప్పుడు ఎంతో సంతోషం వేసింది ఆరోజు! కాని

మరో టి అనిపించింది... .. ఈ ఒక్క సంవత్సరం సీతాలుని మృత్యువు తీసుకెళ్ళిపోకుండా ఉంటే ఎంత బావుండేది అని

మృత్యువు తనమీద నేరం ఉంచుకోదు... అయ్యో గుండెపోటనో – కారుకిందపడ్డాడనో – కేన్సర్ వచ్చిందనో... ఏవో లా మనచేత నమ్మిస్తుంది...

ఒకరు కోరితే వచ్చేదా? ఒకరు వారిస్తే ఆగేదా? దానిలక్షణం అది - పోవాలంటే తను పోవాలంటి తను పొగలుగుతున్నాడా? సీతాలుకి పోవాలని ఏకోశాన్నయినా ఉందేదా?

పిల్ల పెళ్ళికి పట్టుచీర కొనుక్కుంటానని అంటూనే ఉంది. పెళ్ళికి సంవత్సరంముందే ఉన్న చీరలే వదలి వెళ్ళిపోయింది.

మనిషి ఎలాగయినా ఒంటరివాడే... ఎవరితోనూ కలసి రాడు – కలసి వెళ్ళడు... ఇక ఈ బతుక్కి గమ్యమా? అది ఎవరికి వారు వెదుక్కోవలసిందే !?

ఇంతకీ పిల్ల రమ్మందంటూ అల్లుడు కార్డు రాస్తేనేగా తను ఇక్కడికి వచ్చాడు!

గాజు గ్లాసుమీద పెట్టుకున్న పోస్టు కార్డు అల్లుడు రాసిందే. మరి గబ్బిలంలా చీకటిని వెతుక్కుంటూ వచ్చాననుకుంటుందేవిటి వెర్రి మొహం!

"నాన్నా, వెల్లాయి రమ్మంటోందట... ఈ వంద ఖర్చులకి ఉంచు.." అన్నాడు చిన్నాడు.

ఇప్పుడు తను తను కనుక్కున్న వాళ్ళందరినీ పుస్తకం చదివేసినట్టు చదివెయ్యగలడు. వాళ్ళు మాటాడనక్కరలేదు. వాళ్ల మెదడులోని ఆలోచనలు వాళ్ల కళ్ళలోంచి ముఖం రంగుల్లోంచి, పాచ చర్మకమైన అద్దంలోంచి కనపడే వస్తువులాగే స్పష్టంగా కనపడిపోతాయి.

అయినా తనెందుకు బ్రతికి ఉండాలి?

ఏమో! తనకయితే నిజంగా బ్రతకాలని లేదు. కాని చావంటే ఏదో భయం! ఎంత తెలిసినా, ఎంత తెలుసుకున్నా ఇంకా భయమే! ఇంకా చిన్నతనమే! ఇంకా అజ్ఞానమే

తనని తాను తెలుసుకోడానికా ఈ ఒంటరితనం" నాది నాది అన్నది నీదుకాదురా బాబూ అని ఎన్నోసార్లు ఎంతోమంది చెప్పారు. మరి తనదికాదని తెలిసినా పిల్లని చూడడానికి ఎందుకొచ్చాడు?

తన కడుపున పుట్టిన పిల్ల తనని గబ్బిలం అని ఎందుకందని"

పిల్లలందరూ తనని అసహ్యించుకుంటున్నారు. తను ఎవరికి అక్కరలేదు వాళ్ళకిదూరంగా తను ఉండలేడు. కాని తను ఎక్కడకయినా వెళిపోతే బాగుంటుందనుకుంటారు వాళ్ళు.

తను పొరపడుతున్నాడా? కన్నతండ్రిమీద ద్వేషం ఎందుకుంటుంది? తనేసరిగా పిల్లల్ని అర్థంచేసుకోలేక పోతున్నాడా?

చిన్న దానికి జబ్బు చేసింది. డాక్టరు రాత్రి గడవడం కష్టమని చెప్పేశాడు. కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరాడు.

సీతాలు కంగారుగా ఉంది. సాయంకాలమే మిగతా పిల్లలందరికి ఇంతచారూ అన్నం వండి పడేసింది.

సీతాలూ, తనూ బిడ్డ వంకే చూస్తూ కూచున్నారు. దీపం వెలుగుతుంది.

"ఫరవాలేదుటండి పక్కింటి బామ్మగారి కొడుకు డాక్టరు... ఆవిడ గంపెడు పిల్లలతల్లి... ఆవిడ వచ్చి చూశారు.... దేవుడికి మొక్కుకున్నాను కూడా! వెనక వీధిలో శరభయ్యగారు ఏవో తాయెత్తు లిస్తారట... మహాలక్ష్మమ్మ వెళ్ళి కట్టించి పట్టుకొచ్చింది.

సీతాలు ఉత్సాహంగా చెబుతోంది.

నిజమే! బ్రతుకుతుందేమో! డాక్టరు మాత్రం దైవజ్ఞుడా, గతా గతాలు చెప్పడానికి... మందు వేస్తూనే ఉన్నారుగా! పిల్ల బ్రతుకుతుందేమో!... దేనికయినా నమ్మకమే ప్రధానం... నమ్మకమని బొత్తిగా గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారం అని తను అనడంలేదే?

నమ్మకంతో కొండలు కదల్చగలమని పెద్దవాళ్ళు చెబుతారు. పెద్దవాళ్ల మాటలు ఊరికేపోతాయా?

అనలేదు.


ఇంటెడు చాకిరిచేసి తను వచ్చేసరికి నవ్వుతూ నిండుకుండలా ఉండేదే? కోడళ్ల నెవరినీ ఏమీ అని ఎరగదే?

అందుకేనా కోడళ్లకి తనంటే కోపం?

ఇక తనపాపమా అంటే తనుచేసే తాలూకాఫీసులో చిన్న ఉద్యోగంలో పాపం చెయ్యగలిగిన స్థితి తనకుందా? పూట బత్తెం, పుల్ల వెలుగూ బ్రతుకుల్లో పాపాలు చెయ్యడానికి ఆస్కార మొకటా?

పెద్దవాడు కాదన్నప్పుడు చిన్నవాడి దగ్గరకో, చిన్నవాడు వెళ్ళనాన్న అంటే పెద్దవాడి దగ్గరకే, ఇంకా పరిస్థితి బాగులేకపోతే – పిల్లని చూడాలనిపించినపుడు ఆడపిల్ల దగ్గరకో అలా తిరుగుతూ కాలం వెళ్ళ మార్చుకుంటూనే ఉన్నాడు తను.

ఏమిటో ఈ మమతలు? ఈ బంధాలు?



రాత్రంతా మృత్యుంజయ జపం చేస్తూనే ఉన్నాడు. ఎప్పుడు పడిందో ఏమో మాగన్ను పడిపోయింది.

తెలివి వచ్చేసరికి ఇదేమిటండి ఇంకా దీపం వదిలేశారు!" అంటూ పెద్దవాడు వచ్చి దీపం ఆర్పేశాడు.

సీతాలు ఘొల్లుమంది. బిడ్డ నిద్రలో మూసిన కళ్ళు విడిపోయాయి.

రాత్రి డాక్టరు చెప్పినమాట సీతాలుకి చెప్పి ఉంటే? అది నమ్మకంతో నే ఉంది... తనలోనే నా నమ్మకం లోపించింది.

తల్లితండ్రుల పాపాలు బిడ్డలని కట్టి కుడుపుతాయంటారు.

పాపం సీతాలు ఏం పాపం చేసింది?ఇంటిల్లిపాదికి చాకిరీ చేసింది. అత్తగారికి ఆడబడుచులకి చేసి చేసి ఒళ్ళు గుల్ల చేసుకుంది. శతవిధాల చేసినా ఎప్పుడూ ఎవరిని పల్లెత్తుమాట

నావికాదని తెలియనున్నా తెగెనేనాప్పు. ఒక్కొక్కసారి ఇంటకాకుల మీద కోపమూ వస్తుంది. కాని అది తాటాకు మంట, నిలబడదు.

కుదురుగా ఒక దగ్గర ఉండడని తనమీద అపప్రధ. నింద... కాని ఎలా?

తనంటే బరువు అనిపిస్తున్నప్పుడు మరొక దగ్గరికి వెళ్ళక ఏం చెయాలి? బయటికి పొమ్మంటుంటే చూరుపట్టుకొని వేళ్లాడడం ఎలా?

అల్లుడి వ్యవహారం బాగున్నట్టులేదు.... ఉదయం తొమ్మిదికి లేచి ఒక్క అరగంటలో వెళ్ళిపోతాడు. రాత్రి పదకొండు, పన్నెండో.. అతని దయ.. పిల్ల ఇటు ఉద్యోగమూ, అటు సంసారమూ.

బయటికి ఏమీ చెప్పదు. గుంభన! కాని తనకి తెలిసిపోయింది.

తండ్రిని తిడితే మొగుడు మెచ్చుకుంటాడనో,

తండ్రి మీద విసుక్కుంటే మొగుడు మెత్తపడతాడనో అనుకుంటున్నట్టుంది. వెర్రికోన!

కాని సరియైన సమయంలో ఆడది మేలుకోకపోతే ఇల్లూ ఒల్లూ అంతా గుల్లే.... ఇంకేమయినా ఉందా? కాని ఈ మాటలు దానికి చెప్పడం ఎలా? నీ బోడి సలహా ఎవడిక్కావాలి అని ముఖం మీద అనేసినా అనేస్తుంది.

నాలుగున్నరకే తెలివి వచ్చింది.

కాని ఏం ప్రయోజనం? తలుపు లోపలికి గడియవేసి ఉంది. తలుపు కొట్టడానికి మొగమాటం!

నిద్ర లేకుండా అలా చాపమీద దొర్లుతూనే ఉన్నాడు.

ఏడవుతూంటే పనిమనిషి వచ్చి తలుపుకొట్టింది. ఆమె గుమ్మం కడుగుతూ ఉంటే తను లోపల కెళ్లాడు.

అల్లుడు గురకపెట్టి నిద్రపోతున్నాడు. పిల్ల లేచి పెరట్లోకి వెళ్ళినట్టుంది.

మెల్లగా దంత ధావనాదులు ముగించుకొని వీధి గుమ్మంలో కూచుని పేపరు చదివి ఎనిమిది దాటిన తరువాత అన్నాడు

"ఆ సంచీ ఇలా పడేయమ్మా! కూర తెచ్చి పడేస్తాను.."

సంచి చిన్నగా మడిచిపెట్టి పట్టుకుని కూరకి బయలుదేరాడు నిరంజనశర్మ

పెద్దవాడి దగ్గరనుంచి ఉత్తరమేలేదు. చిన్నవాడి కూతురికి జలుబు తగ్గిందో లేదో! తాత, తాత! అని ఒక్క నిముషం వదలదు - చంటమ్మ.

ఆసుపత్రి దిగువ రోడ్డులో జనం చిక్కపడుతున్నారు వచ్చేవాళ్ళూ, వెళ్ళే వాళ్ళూ - డాక్టర్లు, నర్సులు - రోగులు - ఉద్యోగులు, వ్యాపారులు - ఎవరి హడావుడి వాళ్ళది.

జార్జిరాజా ఆసుపత్రి పెద్ద గేటు దగ్గరకొచ్చాడు నిరంజనశర్మ

గేటులో నుంచి బయటికి నాలుగు సైకిలు చక్రాలు అమర్చబడ్డ తోపుడు బండి వచ్చి దిగువ రోడ్డు వంక మళ్లింది.

ఒంటరి

ఒకే ఒక ఊదొత్తి వెలుగుతోంది. తెల్లటి మురికి బట్ట ఒకటి కప్పి ఉంది. లోపల ఉన్నదేమిటో వెంటనే అర్థమైపోయింది. ఎవరిదో శవం.

ఎవరో పాపం! అనామకుడన్న మాట ... పేరు తెలియని గమ్యానికి బయలుదేరడం కోసం చావుల మయం దగ్గరికి వెళుతున్నట్టున్నాడు ...

అక్కడ బయలుదేరితే ఎక్కడికెళతాడు?

బొత్తిగా బండి వాడు తప్ప మరో మనిషే లేనంత దీనుడా? ఏ ప్రేమ సమాజం వాళ్లో - దివ్య సమాజంవాళ్లో దహనం చేస్తారేమో!

లేకపోతే శవాల వ్యాపారం ... ఎక్కడో చదివాడు. ఇంత బాహాటంగా ఇలాగా ... నిరంజనశర్మకి మతిపోయింది. ఉదయం 9 గంటల వేళ -ఇంతమంది చూస్తూ ఉండగా ఎంత దిక్కులేని వాడయితే మాత్రం .

పాపం చనిపోయిన మనిషి - ఆడో? మగో? ఎక్కడి మనిషో?

బండి జోరుగా సాగిపోతోంది .. దాన్ని వెనక్కి లాగి పట్టుకోడం బండి నడుపుతున్న మనిషికి కష్టమైపోతోంది.


ఖస్సుమని బ్రేకుల చప్పుడు.

కళ్ల ముందు తెల్లటి తెర ...

"షాక్! ఏమిటేమిటో మాటలు ... ఏదో వాసన ... పెట్రోలా? .. కాదు ఏదో తియ్యటి వాసన ... డెలీరియమ్ .. ఏమిటో అది ... తనూ మాటాడుతూనే ఉన్నాడే ... ఆ మాటలు ఎవరికి వినపడటంలేదు ... డెలీరియమ్ అంటే .. ప్రేలాపన ... జ్వర తీవ్రతవల్ల వచ్చే వాగుడు ... వెర్రివాడు, తన సంచి ఏమయింది?ఎక్కడ పడేశాడో? ... తన కళ్ల ముందు ఇంత వెలుగు ఇలా జిగ్గున మెరిసిపోతూ వుంటే తను వెలుగుపుంతలోకి ముందుకు రివ్వున సాగిపోతూ వుంటే అతన్ని చూసి ఎవరూ ఇంతలా జాలిపడుతున్నారు?

ఇంతకీ తను ఎక్కడ ఉన్నాడు?

"పేరు ఎలా తెలుస్తుంది? ..."



"గుర్తు తెలిపే కాగితాలు ... జేబుల్లో ..."

"జేబులో పర్సులో ఎనిమిది రూపాయల దెబ్బై పైసలున్నాయి ..."

"మరెలా తెలుస్తుంది?"

-"తనెవరో వీళ్లకి తెలియడంలేదూ? నా పేరు నిరంజనశర్మ ... నన్ను మీరెరుగరూ ... భలేవాళ్లే? ... తనని మాటాడనివ్వరేం? వినిపించుకోరేం? ... తనెవరో తనకే తెలియని క్షణాలు జీవితం ఎదుర్కొనక పోలేదు. కాని ఇప్పుడు తనెవరో తనకి ఖచ్చితంగా... క్షుణ్ణంగా తెలుసు ..

మరి వీళ్లెవరూ? మాటలంటే వినపడుతున్నాయి కాని మనుషులు కనపడరేం? తన కళ్లజోడు ఏమయింది! పెద్దాడి కొడుకు వెధవ నాగన్న దాచేశాడు? .. అంతర్ కుసుమల్లె సోడాబుడ్డి అద్దాలొచ్చాయి ... వాడికి ఆట ... తనకి ప్రాణం పోకట ... ఇవ్వరా వెధవకానా - నా కళ్లద్దాలతో నీకు ఆటేమిటి?

-"పాపం ఎవరో ఒంటరి వాడేమో! . దిక్కు లేని వాడులా ఉన్నాడు!"

"ఇదేమిటి, తనకి దిక్కు లేక పోవడమేమిటి? చెబితే వినిపించుకోరేం? .. ఒరేయ్ వెధవాయిలూ, నాకు ఇద్దరు మగపిల్లలు - మహరాజుల్లా ఉద్యోగాలు చేసుకుంటున్నారు . కూతురు హాయిగా సంసారం చేసుకుంటోంది. దిక్కులేనివాణ్ణని నన్ను ఈసడించుకోకండి...

ఎక్కడి నుంచి చెప్మా సీతాలు గొంతు వినపడుతున్నట్టుంది! వస్తున్నానే సీతాలూ! నీ దగ్గరికే బయలుదేరాను దోవలో మల్లెపూలూ కొన్నాను .. అయితే సంచి ఏది . సంచిలో ఉన్నాయిలే . ఇదేమిటి, ఈ చీకటి? . ఇంత వెలుగు . ఎక్కడికి పోయింది?

చీకటిలో తను ఎలా చూడగలుగుతున్నాడు? చీకటిని వెతుక్కుంటూ గబ్బిలం వెళ్లగలదా? చీకటిలోకి వెళ్లడమూ అంటే వెలుగులోంచే కదా? మరి గబ్బిలానికి వెలుగులో కళ్లు కనపడతాయా?

ఎవరి గబ్బిలం? అసహ్యంగా పెద్ద రెక్కలు - అదో రకం వాసన ... చిన్న ముఖం .

ఎవరు గబ్బిలం? తనో?

కాదు ... అల్లుడేమో! లేకపోతే తనని తనే గబ్బిలం అనుకుందా పిల్ల?

ఏమిటి పొగ? ఏమిటి వాసన! . చిన్న కాంతి కిరణం. చుట్టూ చిమ్మచీకటి. కాంతి వైపు వెడుతున్నాడు తను చిన్న సందుల్లో నుంచి సందు గోడలు అటూ ఇటూ తగులుతూనే ఉన్నాయి ఇంకెంత దూరం నడవాలి? ... సందుక త్తరుగూ ఎరుగూ కనపడడంలేదు . అదిగో వెలుగు .. సొరంగం అయిపోయింది. తను వెలుగులోక వచ్చేశాడు. . వెలుగు . వెలుగు .. వె.. లు ..."

-"శివ, శివ! ఎవరో ఒంటరి మనిషి! గుర్తు తెలుసుకోడానికి ఆచూకీ కూడా లేదు . . కారు కింద పడ్డాడు .."

తెల్లటి బట్ట ముఖం మీద నుంచి కప్పేస్తూ తెల్ల దుస్తులావిడ నిట్టూర్చింది □

హైదరాబాదు నోట్‌బుక్

కూచిపూడి ఆర్ట్స్ ఎకాడెమీ:-

కూచిపూడి ఆర్ట్స్ ఎకాడెమి హైదరాబాద్‌లో 1980లో అవతరించింది కూచిపూడి నృత్య వ్యాప్తికి తన జీవితాన్ని మీదుకట్టిన డాక్టర్ వెంపటి చినసత్యం చినిక మొదటి దర్శకులు. చండాలిక పాత్రతో సహృదయులను తన్మయులను చేసిన నాట్య విదుషి కుమారి శోభానాయుడు ప్రిన్సిపాలు రాష్ట్ర మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ మాధవరెడ్డి అధ్యక్షులు, న్యాయమూర్తి గంగాధరరావు ఉపాధ్యక్షులు. శ్రీ వై. వి. చలపతిరావు కార్యదర్శి కూచిపూడి నృత్యానికి జాతియాంతర్జాతియ రంగంలో ప్రముఖస్థానం కల్పించాలని డాక్టర్ సత్యం చేసిన నిరంతర కృషి ఫలితంగా ఎంతోమంది ఆ నృత్యంలో విశారదులయ్యారు. చంద్రకళ, వైజయంతీమాల, శోభానాయుడు, హేమమాలిని, కామ్‌దేవ్, మంజుభార్గవి, సోదార్‌మాన్‌సింగ్ మొదలైన వారందరూ ఈయన వద్ద కూచిపూడి నృత్యం నేర్చుకున్నవారే. హైదరాబాదులోని ఈ అకాడెమి కుమారి శోభానాయుడు అధ్వర్యంలో దినదిన ప్రవర్ధమానమవుతూ, దోమల్‌గూడాలో సొంత భవనాన్ని ఏర్పరుచుకుని, నవంబర్ 8వ తేదీన జరుపుకున్న పంచమ వార్షికోత్సవోత్సవంలో నాలుగేళ్ళు కూచిపూడి నృత్యాన్ని సశాస్త్రీయంగా అభ్యసించి ఉత్తీర్ణులైన ఏడుగురిని 'నాట్య విశారద' బిరుదంతో పట్టభద్రులను చేసింది. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ శంకర్‌దయాళ్‌శర్మ ఆనాడు రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన స్నాతకోత్సవంలో ఈ బిరుద ప్రదానం చేశారు బిరుదం పొందిన పట్టభద్రులలో కుమారి జొన్నలగడ్డ అనూరాధ ఒకరు నేను ఆంధ్రప్రదేశ్ బాలల అకాడెమి కార్యదర్శిగా 1979లో ఈమెకు రాష్ట్రస్థాయి ప్రతిభా పాటవ పోటీలలో కూచిపూడి నృత్యంలో రాష్ట్ర ప్రథమ బహుమతి అందజేశాను. అప్పటికే ఈమె, తన వయస్సుకు మించిన "భావయామి రఘు రామం" వంటి సుదీర్ఘాంశాలను చాల గొప్పగా అభినయించింది. రవీంద్రభారతిలో నాటి సభాధ్యక్షులు న్యాయమూర్తి శ్రీ గంగాధరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ వి. మాలకొండారెడ్డి గవర్నరును ఆహ్వానించారు శ్రీ చలపతిరావు సంస్థ భవన నిర్మాణ చరిత్రను తెలియజేశారు కుమారి శోభానాయుడు ప్రసంగిస్తూ, అకాడెమిలో ప్రస్తుతం 130 మంది విద్యార్థులున్నారని, వారు తనతోపాటు అమెరికా మున్నగు విదేశాలలో ప్రదర్శనలిచ్చారని, ముందు ముందు ఈ సంస్థ విస్తరిస్తుందని అన్నారు. గవర్నరు తమ ప్రసంగంలో కూచిపూడి నృత్యాన్ని ముక్తకంఠంతో ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు సాంస్కృతికంగా ఎంతో ముందంజ వేశారని, రాష్ట్రంలో సామాన్య ప్రజలకు కూడ మహాభారతం గురించి విస్తృతంగా తెలుసునని, మరే రాష్ట్రంలోను ఇది కనపడదని అన్నారు. కూచిపూడికి ప్రత్యేకత ఉందని, సాంఘిక నైతికాధ్యాత్మిక మూల్యాల ప్రచారం దీని ఆదర్శమని, భారతదేశ సంస్కృతిలో కూచిపూడి విశిష్టమైనదని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూచిపూడి ఒక మహా వరం వంటిదని, దీని ప్రచారం చాల అవసరమని ఆయన నొక్కి చెప్పారు తాను కేంద్రప్రభుత్వం కమ్యూనికేషన్స్ మంత్రిగా వున్నప్పుడు వివిధ భారతీయ నృత్య రీతులపై తపాలా బిళ్లలు విడుదల చేశానని, అప్పుడు కూచిపూడిని గురించి అంతగా తెలియదని అన్నారు. తదనంతరం పట్టభద్రులైన విద్యార్థులు నృత్యం ప్రదర్శించారు. కుమారి ఉషారాణి, తదితరులు జయము జయము, కుమారి జొన్నలగడ్డ అనూరాధ శ్రీ భుజంగరాయశర్మ రచించి కుమారి శోభానాయుడు అభినయ కల్పన చేసిన నవరసహేల, కుమారి ఉమాపద్మజతో కుమారి పద్మహేమమాలిని తాండవం, కుమారి ఐ. పద్మ బాలకనకమయచేల, కుమారులు సమలత,వసంత, రాగిణి, స్వరజిడి, కుమారి పద్మజారెడ్డి, కొమ్మరోవాని సంత బిగువే కన్నుల విందుగా ప్రదర్శించారు కుమారి అనూరాధ ప్రదర్శించిన నవరసహేల పండితులను ఆకట్టుకుంది పట్టభద్రులను ప్రిన్సిపాలి శోభానాయుడు మనసారా అభినందిస్తూ, గవర్నర్ హాతవును తెలుగు ప్రభుత్వం, ప్రజయా మనస్సులో పట్టుకోవాలన్నారు శ్రీ భాస్కరరావు. భలోక్తులు శ్రోతలను గిలిగింతలు పెట్టాయి

శాసన సంపుటాల ఆవిష్కరణ:-


ప్రముఖ శాసన పరిశోధకులు శ్రీ టి. ఎన్ శాస్త్రి సంకలనం చేసి ప్రచురించిన ముఖలింగ దేవాలయ చరిత్ర - శాసనములు, బెజవాడ దుర్గామల్లేశ్వర ఆలయ శాసనములు అనే రెండు శాసన సంపుటాల ఆవిష్కరణ, అంకితోత్సవం నవంబరు 1వ తేదీన నల్లకుంట శంకరమఠంలో జరిగింది మొదటి గ్రంథం శృంగేరి పీఠాధిపతులు శ్రీ భారతీ తీర్థస్వాములకు, రెండవది శ్రీ దేవులపల్లి రామానుజరావుకు అంకితాలు రాష్ట్ర పురాతత్త్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ వి వి. కృష్ణశాస్త్రి అధ్యక్షత వహించారు. డాక్టర్ రఘురాజు గ్రంథాలను ఆవిష్కరించారు శ్రీయుతులు పిమ్మకుర్తి శేషగిరిరావు, శ్రీ తిరుమల రామచంద్ర ప్రసంగించారు శ్రీ టి. ఎన్ శాస్త్రి వక్తలను, అధ్యక్షులను, ఆవిష్కర్తలను కాశ్మీరు శాలువలతో, నూటపదహారులతో సత్కరించారు. చివరలో శృంగేరి పీఠాధిపతులు అనుగ్రహభాషణ చేశారు. ప్రారంభంలో శ్రీ పేర్వాల యాదగిరిరావు స్వాగతం చెప్పారు.


ఉపశ్రుతి:-

తాతా, తాతా, ఏ యెండకా గొడుగు సినిమా చూచావా? - అని అడిగాడు మనుమడు ఉదయనుడు నాయనా, మీ తాతగారు చేస్తున్న పనే అది, ఇక సినిమా చూడడం ఎందుకూ? - అని భలోక్తి విసిరారు. మా సంభాషణ వింటున్న ఒక మిత్రుడు.

-తిరుమల రామచంద్ర

హైదరాబాద్ కూచిపూడి ఆర్ట్స్ అకాడెమీ ప్రిన్సిపాల్ కుమారి శోభానాయుడు, ఉపాధ్యక్షులు జస్టిస్ ఎ. గంగాధరరావు, గవర్నర్ డా. శంకర్‌దయాళ్‌శర్మ, ఆంధ్రా బాంక్ అసిస్టెంట్ జనరల్ మానేజర్ శ్రీ కె.వి భాస్కరరావు, కార్యదర్శి శ్రీ చలపతిరావు, కార్యనిర్వాహక కార్యదర్శి డా వి. మాలకొండారెడ్డి గవర్నర్ డా శంకర్ దయాళ్‌శర్మగారి నించి నాట్య విశారద పట్టం అందుకొంటున్న కుమారి జొన్నలగడ్డ అనూరాధ.






[illegible]

తెలుగు నాటిక పోటీలు

శ్రీ రామకృష్ణ స్మారక నాటక కళా సమితి (రాయగడ) వారు 1986 మార్చిలో అఖిలభారత స్థాయిలో తెలుగు నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి రు. 1501/- నగదు మరియు రోలింగ్ షీల్డులు, రెండవ బహుమతి రు. 1001/-నగదు మరియు రోలింగ్ షీల్డులు ఉంటాయి. ఎన్నిక కాబడి ప్రదర్శింపబడిన ప్రతినాటికకు రు. 401/- నుంచి రు. 501 వరకూ పారితోషికం ఉంటుంది. వివరాలకు: కార్యదర్శి, మహాత్మాగాంధీ యువజన సాంస్కృతిక సమితి, [illegible] రాయగడ-765001 (ఒరిస్సా) వారికి వ్రాయాలి. □



సినీతారలు

1986 సినీతారల అడ్రసుల లిస్ట్ తో ముగ్గురి తారల కలర్ కార్డ్ బొమ్మలు రు. 5/- లు. అడ్రసుల లిస్ట్ తో నలుగురి తారల శృంగార ఫోటోలు రు. 10/- లు. కేవలం అడ్రసుల లిస్ట్ రు. 2/- లు.

కావాల్సినవారు ఎం.ఓ. చేయండి.

వై. వి. మూర్తి,
దాసరివారివీధి, విజయవాడ-2.

ఉత్తరాలు....

(గత వారం తరువాయి)


జాతీయత - మతం

డా. [illegible] గారు ఒక తమ ప్రసంగంలో 'మనం హిందువులం' అనే పదాన్ని ఉపయోగించటం సరిగా లేదంటూ శ్రీ [illegible] [illegible] ఉత్తరం చదివిన తర్వాత ఈ ఉత్తరం వ్రాయకుండా ఉండలేకపోయాను.

సింధు అనే పదం విదేశీయుల నోటిలో హిందూ అయిందంటూ చెప్పినది అదే 'ఇండియా' అయింది. బ్రిటిష్ వాళ్ళ ఇండియా వచ్చేనాటికి, అంతకు ముందర ముస్లిములు ఇండియాకి రాకముందు అలెగ్జాండరు దండయాత్రలు చేయక పూర్వంనుండి కూడా ఈ దేశాన్ని హిందూ దేశంగా పిలవటం జరిగింది. [illegible] నాగరికతలు ప్రభవించిన నాటికే 'ఉత్తరాన హిమాలయాలు, దక్షిణాన హిందూ మహాసముద్రం, తూర్పున బంగాళాఖాతం, పడమట అరేబియా సముద్రం' ఎల్లల మధ్య గల ఈ సువిశాల భారతావని ఇండియా, హిందూ దేశంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఈ ప్రాంతంలో నివసించే వారిని హిందూ జాతీయులని పిలిచే వారు. 1958 పూర్వం మన స్కూల్లో [illegible] మాప్ వాడినప్పుడు కూడా ముద్రించిన మ్యాపులలో 'హిందూ దేశంగా' పేర్కొన బడింది. మహాత్మా గాంధీ తాను హిందూ జాతీయుడనని, క్రైస్తవ మతాభిమానినని చెప్పుకొన్నారు. శ్రీ చాగ్లా (కేంద్ర మాజీ విద్యాశాఖామంత్రి) ముందుగా తాను హిందువుడనని, తర్వాతే తాను ముస్లిము మతస్థుడినని చెప్పుకొన్నారు. "భారత్ జ్యోతి" ఆగస్టు 27- సెప్టెంబరు-2, 1978లో "యస్ వి ఆర్ ఆల్ హిందూస్ టుడే" అనే వ్యాసంలో శ్రీ ఎం. సి. చాగ్లా 'హిందూయిజాన్ని మతంగా పేర్కొనటం తప్పన్నారు. నా పూర్వులు ఆర్యులు కాబట్టి నేను హిందువుడను. వారు తరతరాలుగా సంక్రమింప చేసిన ఈ ఫిలాసఫీ, ఈ సంస్కృతిని నేను వర్ధిల్ల చేస్తున్నాను' శ్రీ చాగ్లా. అంతేగాక ఇట్టి ప్రతిపాదనను ఒప్పుకొని మనం మనం హిందూ జాతీయులుగా పిలువుకొనుట సెక్యులరిజం యొక్క మూల సిద్ధాంతం అన్నారు. భిన్న మతాల్ని అవలంబించినప్పటికీ మనందరం హిందువులమే అన్నారు. డా. అంబేద్కర్ క్రైస్తవుడు కాదు, ముస్లిము కాడు. ఆయన బౌద్ధమతం స్వీకరించారు తన జీవిత చివరి భాగంలో. మహాత్మా గాంధీని, డా. అంబేద్కర్ ను, వారిని క్రైస్తవులుగా మార్చాలని శతవిధాల ప్రయత్నించి భగ్న మనోరథులైయ్యారు అప్పటి క్రైస్తవ మత ప్రచారకులు. మూన్ సెటుంగ్, [illegible] ఒకరు ముస్లిం, మరొకరు క్రైస్తవ మతస్థుడు. మూన్ సెటుంగ్ అరకకట్టిన నాగరికి గల కొరియాలో ఒక ఎర్రగా ఆను పని చేసినప్పటికి తను జాతీయతను కోల్పోలేదు. డా. సుకర్నో ఇండోనేషియా ప్రసిడెంటు. ముస్లిం మతస్థుడు.

రామాయణం, మహాభారత ఇతిహాసాలు అక్కడి ముస్లిములకు నిత్యపారాయణ గ్రంధాలు. నిత్యం వాటిని చదవటం వల్ల స్ఫూర్తిని పొంది మంచి పౌరులుగా వృద్ధిపొందుతారని ఆ దేశ ప్రజల నమ్మకం. జాతీయతకు, మతానికి గల తేడాను గమనించకుండా స్వార్థపర రాజకీయవాదులు, విదేశీ, సామ్రాజ్య శక్తులు, ఈ దేశంలో అంతర్యుద్ధం సంభవింప చేసి ఈ జాతిని, సంస్కృతిని నాశనము చేయాలనే కుయుక్తులతో ఆడుతున్న చదరంగమే ఇట్టి ప్రచారాలకు కారణం. శ్రీ చాగ్లా చెప్పినట్లు ఈ దేశస్థుడు ఏ విధమైన మతాన్ని, ఆరాధనా విధానాన్ని అనుసరించినప్పటికి అతడు హిందువు. హిందూ జాతీయుడే. హిందూ ధర్మంలో వచ్చిన భ్రష్టాచారాలను, శ్రీ దయానంద సరస్వతి, అరవింద ఘోష్, వివేకానంద, మహాత్మాగాంధీ, ఆది శంకరాచార్య, గురు గోవింద్ సింగ్ ఇత్యాది ప్రఖ్యాత పురుషులు, అనిబిసెంట్, సిస్టర్ నివేదిత, శారదాదేవి లాంటి ప్రముఖ స్త్రీలు- ఖండించి హిందూ సమాజానికి మార్గదర్శకులైనారు. డా. [illegible] "మనం హిందువులం" అని అంటే అది హిందూ జాతీయతన పేర్కొన్నట్లు.

[illegible] నూజివీడు □



"కొండవీటి రాజా"లో



రాధ, చిరంజీవి

చిరంజీవి, రాఘవేంద్రరావులతో దేవీవరప్రసాద్ నిర్మించే "కొండవీటి రాజా"


దేవీ ఫిలిమ్ ప్రొడక్షన్స్ సంస్థకు ప్రేక్షకలోకంలో మంచి ఇమేజ్ ఉంది. ప్రజానురంజకంగా చిత్రాలు రూపొందించడంలో కె రాఘవేంద్రరావు దిట్ట. ఇక చిరంజీవికున్న ఫాలోయింగ్ అందరికీ తెలిసిందే. వీళ్ళ కాంబినేషన్‌లో తయారవుతున్న చిత్రం "కొండవీటి రాజా". ఇదొక ట్రయాంగిల్ లవ్ స్టోరీ. సెంటిమెంట్‌తో పాటు యాక్షన్ కూడా ఉంటుంది హైదరాబాద్‌కు రెండు వందల కిలో మీటర్ల దూరంలో కృష్ణానది మధ్యలో అలనాటి

సినిమా

విశేషాలు

— జి.వి.జి.

వైభవానికి ప్రతీకగా నిలచిన గద్వాల్ కోటలో షూటింగ్ జరిగిన తొలిచిత్రమిదే. "అక్కడ అక్టోబరులో వారం రోజులపాటు, నవంబర్ 1 నుంచి పదిహేను రోజుల పాటు జరిగిన షెడ్యూల్స్‌లో రెండు పాటలు, క్లైమాక్స్ చిత్రీకరించాం. డిసెంబర్ 1 నుంచి మద్రాసులో జరిగే ఆఖరి షెడ్యూల్‌లో నాలుగు రకాల భారీ సెట్సు వేసి, సిల్క్‌స్మిత మీద ఓ పాటను, చిరంజీవి-రాధల మీద మరో పాటను పిక్చరైజ్ చేస్తాం", అన్నారు డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు. చిరంజీవి సరసన విజయశాంతి, రాధ నాయికలు. సత్యనారాయణ, రావుగోపాలరావు, నూతన్ ప్రసాద్, అల్లు రామలింగయ్య, రాళ్ళపల్లి, పి. ఎల్. నారాయణ, చలపతిరావు వై విజయ, సిల్క్‌స్మిత తదితరులు పాత్రధారులు. పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకల్పన. కె. ఎస్. ప్రకాష్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, సలీం నృత్యాలు. ఆనంద్ సహకార దర్శకత్వం. కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో ఈ చిత్రాన్ని నిర్మి... దేవీవరప్రసాద్ సంక్రాంతి కానుకగా విడుదల చేస్తు... ...న్నారు.



"మా ఇంటి మహాలక్ష్మి"లో సుమలత, శోభన్‌బాబు

"మా ఇంటి మహాలక్ష్మి"లో ఓ జంట రహస్యం

లక్ష్మి (రాధ) 'నాగరాజు రక్ష' రాస్తూ కూర్చొనుంది. పి. కె. మూర్తి (గొల్లపూడి) ఆవేశంతో వచ్చాడు.

"రండి సార్ రండి. కూర్చోండి," అంటూ లేచింది లక్ష్మి.

"నేను కూర్చోడానికి రాలేదు. నిన్ను నిలదీసి అడగడానికొచ్చాను. నువ్వు రాస్తున్నదేమిటి? కట్టుకున్న భర్తకు ఇల్లాలుగా న్యాయం చెయ్యలేని నీకు ఆ నాగరాజు రక్షగా ఉంటాడనుకోవడం కేవలం బుద్ధి తక్కువ.. మీ భార్యాభర్తల రహస్యం నాకెలా తెలిసిపోయిందని ఆశ్చర్యపోతున్నావా? నా పేరు పి. కె. మూర్తి. అంటే పాతాళంలో దాక్కున్న రహస్యాన్నైనా పీకి పాకం పెట్టేసే మూర్తి అని నీకింకా తెలియదు. నీ పెళ్ళి కాక ముందు నువ్వొక అబ్బాయిని ప్రేమించావ్!"

"సార్!" లక్ష్మి దిగ్భ్రమతో అంది.


"అతన్ని నువ్వు మర్చిపోలేక పోతున్నావు కాబట్టి నీ భర్తతో నువ్వు కాపురం చెయ్యలేకపోతున్నావ్."

"మీరు చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు."

"ఆధారాలతో సహా అన్ని వివరాలూ నా దగ్గరున్నాయి. ఆ అబ్బాయి పేరు కూడా మీ నాన్నగారి పేరే - నాగరాజు. కాబట్టే వాడ్ని మర్చిపోలేక రోజూకి వెయ్యి సార్లు నాగరాజు రక్ష అని పుస్తకంలో రాస్తున్నావ్."

"ఆపండి, సార్ ఆపండి! మీరు మీ ఊహాగానాలతో నన్ను శంకిస్తున్నారు, శోధిస్తున్నారు తప్ప నేనాయనకు ఏ ద్రోహమూ

స్క్రిప్టు మీద ఇంత సేపు కూర్చుంటే ఎలానయ్యా! నేను ఈలోపు ప్రొడక్షన్ నెం 2 పూర్తి చేసి, విడుదల చేసి వస్తున్నా!



చెయ్యలేదు," అంది లక్ష్మి విలపిస్తూ.

"చేశావో లేదో మీ నాన్నగారి ముందే తేలుస్తాను పద!" అంటూ పి. కె మూర్తి, లక్ష్మి చెయ్యి పట్టుకుని బరబర లాక్కెళ్ళాడు.

తాతినేని ప్రసాద్ దర్శకత్వంలో విజయలక్ష్మి సమర్పించే ద్వారకా క్రియేషన్స్ "మా ఇంటి మహాలక్ష్మి" చిత్రానికి ద్వారకానాథ్‌బాబు నిర్మాత.

"మేనమామ"లో కె. ఆర్. విజయ, గొల్లపూడి



దాసరి, శోభన్‌లతో కేశవరావు నిర్మించే "ధర్మపీఠం దద్దరిల్లింది"

"విప్లవాత్మక ధోరణిలో సాగే చక్కని కుటుంబగాథ," అన్నారు దాసరి నారాయణరావు. కథలో ఆదర్శాన్ని, కథనంలో అభ్యుదయాన్ని సమపాళ్ళలో మేళవించి చిత్రాలను రూపొందించడంలో ఈయన సిద్ధహస్తుడు.

ఈయన కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వంలో కోగంటి కేశవరావు నిర్మించే శ్రీ భ్రమరాంబికా ఫిలిమ్స్ "ధర్మపీఠం దద్దరిల్లింది" చిత్రం నవంబర్ 20 నుంచి డిసెంబర్ 20 వరకు ఒకే షెడ్యూల్లో పూర్తవుతుంది. శోభన్‌బాబు, జయసుధ, సత్యనారాయణ, గొల్లపూడి, అల్లురామలింగయ్య, సుధాకర్, రాజేవ్, రజని, రమాప్రభ వగైరా తారాగణం. జె. వి. రాఘవులు సంగీతం, మోహన శిల్పం, ఎస్. రాధాకృష్ణ సహాదర్శకత్వం, డివిప్రావ్ సహకారదర్శకత్వం, జి. జి. కృష్ణారావు కూర్పు, కె. ఎల్. ఎన్. శాస్త్రి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. "ఈ చిత్రంలో హీరో పాటలన్నీ రాజ్ సీతారామ్ పాడారు. మా హీరో జన్మదిన కానుకగా జనవరి 14న విడుదలవుతుంది." అని నిర్మాత తెలిపారు.


భానుమతి నటించే

"అత్తగారూ! స్వాగతం!"

"చెక్కముక్కలైన ఓ కుటుంబంలో పెద్ద దిక్కు అయిన అత్తగారు చేసిన త్యాగ ఫలితంగా కోడళ్ళతో వచ్చిన మార్పుతో చక్కబడుతుందా కుటుంబం. వినోదం అంతర్లీనంగా ఉంటుంది. అత్తగారికి తోడ్పడుతూ, కథనాన్ని నడిపే పాత్రలను నేనూ, మా డైలాగ్ రైటర్ ఎం. వి. ఎస్. హరనాధరావు నిర్వహిస్తాం. కల్యాణ చక్రవర్తి, సుధాకర్, బాలాజీ సరసన ముగ్గురు కొత్త అమ్మాయిలను పరిచయం చేస్తాం. డిసెంబర్ 10న పాటల రికార్డింగ్‌కు ప్రారంభోత్సవం జరుగుతుంది. డిసెంబర్ 25 నుంచి జనవరి 10, ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు షెడ్యూల్స్ ప్లాన్ చేశాం,"అన్నారు కోడి రామకృష్ణ. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో వాకాడ అప్పారావు, దాట్ల కృష్ణంరాజు నిర్మించే శ్రీ లలిత కళాంజలి వారి చిత్రానికి సి. నారాయణ రెడ్డి గీతాలు, కె. వి. మహదేవన్ సంగీతం, పి. లక్ష్మణ్ ఛాయ, కె. ఎల్. ధర్ శిల్పం,శివ సుబ్రహ్మణ్యం నృత్యాలు, రావు శ్రీ సహ దర్శకత్వం, తాతాసురేష్ కూర్పుతో సూర్యకిరణ్ సమర్పిస్తారు.



"శ్రీ షిర్డీ సాయిబాబా మహాత్మ్యం"లో జె. వి. సోమయాజులు, విజయచందర్



"రాక్షస ప్రేమ"లో రాధిక, మోహన్

రాధిక సమర్పించే "రాక్షస ప్రేమ"

తారను అభిమానించడం తారస్థాయిని అందుకుంటే, తడబాట్లు తప్పదు. ఆమె ఓ ప్రముఖ తార. ఆమెను ఆరాధించే యువకుడు సుబ్రహ్మణ్యం. అతనామెను ప్రేయసిగా, భార్యగా, దేవతగా ఆరాధించాడు. తెరమీద కనిపించే ఆమెను అతను ప్రత్యక్షంగా చూసేసరికి ఈ వినూత్నమైన కథ ఎన్నో వింత మలుపులు తిరుగుతుంది. గుత్తా వెంకట నాగేశ్వరరావు నిర్మించిన అమరావతీ మూవీస్ "రాక్షస ప్రేమ" చిత్రం నవంబర్ ఆఖరి వారంలో విడుదలవుతుంది. సినిమాతారగా రాధిక, ఆమె అభిమానిగా మోహన్, చెల్లెలుగా నళిని, గెస్టుగా ఒక ప్రముఖ హీరో పాల్గొన్న ఈ సర్వజనరంజకమైన

సినిమా

చిత్రానికి ఇళయరాజా సోదరుడు గంగై అమరన్ సంగీతం సమకూర్చారు. రాజ్‌ప్రీత్ ఛాయ, సూపర్ సుబ్బరాయన్ సాహసాలతో మనోబాల దర్శకుడు.

దాసరి, కృష్ణంరాజుల "ఉగ్ర నరసింహం" 70 ఎం. ఎం. స్టీరియోఫోనిక్ సౌండ్‌చిత్రం

"దుష్ట శిక్షణ శిష్టరక్షణ జరక్కపోతే అసలీ విశ్వం ఎప్పుడు ఉండేదో ! ఒక్కో రాక్షసుణ్ని అంతమొందించడానికి పూర్వం భగవంతుడు ఒక్కో అవతారం ఎత్తేవాడు. అసంఖ్యాక రాక్షస ప్రవృత్తి గల దుష్టులతో నిండిన ప్రస్తుత సమాజంలో వారి ఆటలు, ఆగడాలు అరికట్టడానికి అవతారం ఎత్తిన దేవుడులాంటి మనిషిగా కృష్ణంరాజు నటన పరాకాష్ఠ నందుకుంది. జర్నలిస్టుగా జయప్రద పాత్ర సరికొత్తది, " అన్నారు దాసరి నారాయణరావు. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలతో స్వీయ దర్శకత్వంలో నిర్మించిన తారక ప్రభు ఫిలిమ్స్ "ఉగ్ర నరసింహం" 70 ఎం. ఎం. స్టీరియోఫోనిక్ సౌండ్ చిత్రం జనవరి 1న విడుదలవుతుంది. జగ్గయ్య , మాదాల రంగారావు, జె. వి. సోమయాజులు, గిరిబాబు, జె. వి. రమణమూర్తి, త్యాగరాజు, ఈశ్వరరావు, మాడా, చిట్టిబాబు, చలపతి, ప్రభ, జయమాలినితో పాటు దాసరి ఒక విశిష్టమైన పాత్రను ధరించారు. సత్యం సంగీతం, కె. ఎస్. మణి ఛాయ, బి. చలం శిల్పం, సి. వి. రమణబాబు సహదర్శకత్వం, శ్రీనివాస్ ప్రొడక్షన్, సత్యనారాయణ సహకార దర్శకత్వం, కె. బసవయ్య నిర్వహణతో దాసరి పద్మ సమర్పిస్తున్నారీ చిత్రాన్ని.

"పెళ్ళీళ్ళోయ్ పెళ్ళిళ్ళు"లో
బేబీ అనూరాధ




"డాకు"లో మాధవి



"సీతారామ కల్యాణం"లో రజని బాలకృష్ణ

సినిమా

యువచిత్ర "సీతారామకళ్యాణం"

"అలనాడు రామాయణంలో సీతారాములు 14 సంవత్సరాల ఎడబాటులో ఎన్నో కష్టాలకు గురయి కలిశారు. ఈ నాటి ఈ ప్రేమాయణ సాంఘిక చిత్రంలో హీరో, హీరోయిన్‌లు చిన్నవయసులో ఉండగానే వారిద్దరికి పెళ్ళి చేయాలని ఇరుగు పొరుగు గ్రామాలకు చెందిన రెండు కుటుంబాల పెద్దలు అనుకుంటారు. అయితే ఆ కుటుంబాల మధ్య తలెత్తిన తగాదాల వల్ల ఒకరి మొహం మరొకరు చూసుకోకుండా 14 ఏళ్ళు గడచిన తరువాత పెళ్ళి జరగడం, అంతా ఆనందం పంచుకోవడం ఈ చిత్ర కధాంశం" అని కె. నరశింహం నాయుడు సమర్పణలో, యువచిత్ర పతాకంపై కె. మురారి నిర్మిస్తున్న "సీతారామ కళ్యాణం" దర్శకుడు జంధ్యాల రాజమండ్రి వెళ్ళిన పాత్రికేయులతో చెప్పారు. "ఈ చిత్రం సీరియస్ డ్రామాతో కూడిన ప్రేమ కథ. ఇన్నాళ్ళూ దర్శకత్వం వైపే ఎక్కువగా శ్రద్ధ చూపుతున్న నేను, ఈ చిత్రానికి పూర్తి సంభాషణలు వ్రాశాను. బాలకృష్ణ డైలాగులు వ్రాస్తున్నపుడు ఎన్టీఆర్‌కు అడవిరాముడు, కొండవీటి సింహం, చిత్రాలకు వ్రాసిన డైలాగులు గుర్తుకు రావటంతో అంత స్థాయిలోను బాలకృష్ణ సంభాషణలు వ్రాశానని" జంధ్యాల చెపుతూ బాలకృష్ణ ఒక చోట తన ప్రియురాలు రజనితో, "ప్రేయసీ ప్రియుల మధ్య కాలానికి కొత్త కొలత కావాలన్న చలం మాటలు ఎంత నిజం లక్ష్మీ"? అంటాడు. మరొక చోట బాలకృష్ణ రజనితో "ప్రేమకు నిర్వచనం చెప్పిన కృష్ణుడు పుట్టిన అష్టమి నాడు నేను నిన్ను కలుస్తాను. పెళ్ళికి భాష్యం చెప్పిన రాముడి పెళ్ళి రోజున మన మిద్దరం కలిసి ఒకటవుతాం". ఇలాంటి సంభాషణలు చిత్రంలో ఎన్నో వ్రాశానని జంధ్యాల చెప్పారు.

కొవ్వూరుకు సమీపానగల 'పట్టిసం' వీరభద్ర స్వామి ఆలయంకు ఎదురుగా గల రేవు- రేవును అనుకుని పంట్లు, లాంచీ. పంట్లపై జీపు. జీపులో తన ప్రియురాలును తీసుకుని నది దాటుతున్న

ప్రత్యర్థులను **హీరో బాలకృష్ణ మోటార్ సైకిల్ పై** గోదావరి గట్టుపై నుంచి **నదిలో పంట్లు పై ఉన్న** జీపు పైకి దూకే దృశ్యాన్ని **చిత్రీకరించారు. డూప్‌లు** లేకుండా హీరో చేసిన **ఈ సాహసకృత్యం చాలా** సహజంగా వచ్చిందని, **చిత్రంలోని ఫైట్లు** పదకొండు రోజులపాటు చిత్రీకరణ చేసున్నామని, ఈ ఫైట్లు చిత్రీకరణకే 3 లక్షల పైగా వ్యయం అయిందని నిర్మాత కె మురారి తెలిపారు. ఇంకా ఆ రోజ హీరోకు, ప్రత్యర్థులకు మధ్య గోదావరి నీటిలో జరిగిన పోరాటం హీరో రాజు ఒక నావలో వెడుతుండగా, విరోధులు వెంటాడి నావపై బాంబును విసరటంతో నావ తగలబడిన దృశ్యాలను స్టంట్ మాస్టర్ రాజు దర్శకత్వంలో సహజత్వానికి సన్నిహితంగా చిత్రీకరించారు.

గ్రామీణ–పట్టణ వాతావరణానికి సంబంధించిన కథ కావటం, సహజత్వానికి చేరువగా ఉండాలనే దృష్టితో రాజమండ్రి పరిసర ప్రాంతాలను షూటింగ్ జరుపుటకు ఎంపిక చేసుకున్నామని, త్రిశూలం–గోరింటాకు చిత్రాలు ఈ ప్రాంతంలోనే చిత్రీకరించామని నిర్మాత మురారి చెప్పారు. చిత్రంలో కల ఆరు పాటల్లోను నాలుగింటిని ఆత్రేయ, రెండు పాటలు ఆరుద్ర వ్రాశారని చెపుతూ ఆగష్టు 11 నుంచి 20 వరకు మొదటి షెడ్యూలు అయిందని, అక్టోబరు 14 నుంచి నవంబరు 9వ తేదీ వరకు జరిగే ఈ రెండవ షెడ్యూల్‌లో ఒకపాట, సంభాషణలు, పోరాట దృశ్యాలు చిత్రీకరించటంతో 70 శాతం చిత్రం పూర్తి చేశామని, డిసెంబరు, జనవరి మాసాల్లో మిగతా పాటలను ఊటీ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించి, మార్చిలో ఈ చిత్రాన్ని విడుదల చేయ నిశ్చయించామని ఆయన అన్నారు

ఈ చిత్రంలోని పాటలకు మధురమైన సంగీతాన్ని అందించిన మహదేవన్‌ను మురారి ప్రశంసించారు. మురారి నిర్మించిన చిత్రాలన్నిటిలోను సంగీతానికి ప్రాధాన్యత ఉంది. పాటలు పది మంది పాడుకునేలా పసందుగా ఉంటాయి పాటలు వింటూంటే మైకంలో పడి తన్మయులయేలా ఈ చిత్రానికి కూడ మహదేవన్ స్వర కల్పన చేశారు. మహదేవన్ సంగీత దర్శకత్వం వహించిన 551వ చిత్రం ఇది నా చిత్రాల్లో మ్యూజిక్‌కు ప్రాధాన్యత ఇస్తాను అన్నారు నిర్మాత

ఆరుద్ర వ్రాసిన "సరిగమ పదనీ – సనిదప మగరి పసుపు కెంపూ ఆకుపచ్చ నారింజ నీలాంబరి నేరేడు గురివింజ" పాటను బాలకృష్ణ, రజనిలపై చిత్రీకరించారు పాటలన్నీ ఎస్ పి బాలు, సుశీల పాడగా, వాటిని రజని–బాలకృష్ణలపై చిత్రీకరిస్తారు

బాలకృష్ణ– రజనిల కాంబినేషన్‌లో 'భార్యాభర్తల బంధం' ఘన విజయం సాధించిన దృష్ట్యానే ఈ జంటను ఎంపిక చేశామని చిత్రీకరణలో రాజీకి ఆస్కారం లేదని, చిత్రీకరించే దృశ్యం తృప్తిగా వచ్చే వరకు తీయటమేకాని కాల్షీట్ కంగారులేదన్నారు.


జంధ్యాల సంభాషణలు, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మహదేవన్ సంగీతాన్ని మొదటి సారిగా సమకూర్చారు అలాగే ఆత్రేయ, ఆరుద్ర పాటలు వ్రాయడం, మరొక సంభాషణల రచయిత నటుడు అయిన గొల్లపూడి మారుతీరావు, జగ్గయ్య కూడ మొదటి సారిగా జంధ్యాల దర్శకత్వంలో నటిస్తున్నారు

నిన్నటి హీరో రామకృష్ణ చాలాకాలం తరువాత హీరో బాలకృష్ణ అన్నగా ఒక చక్కని పాత్రను పోషిస్తున్నారు

కె నరశింహం నాయుడు సమర్పించే ఈ చిత్రంలో



"దాగుడు మూతలు" లో శోభన



'నాగదేవత'లో విజయశాంతి, బేబీప్రియ

బాలకృష్ణ, జగ్గయ్య, మారుతీరావు, రామకృష్ణ, రాజేష్, జీవా, సప్తపది గిరిష్, శుభలేఖ సుధాకర్, శ్రీదర్, పి హెచ్ కృష్ణమూర్తి, సి రామమోహనరావు రజని సంగీత, రమాప్రభ ముచ్చర్ల అరుణ ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు

ఈ చిత్రానికి కెమెరా నందమూరి మోహన కృష్ణ, సెట్టు రాజా, సహదర్శకులు యు వి పాటి, జి వి వి సత్యనారాయణ, సంభాషణలు, దర్శకత్వం–జంధ్యాల, నృత్యాలు–తార, ఎడిటింగ్ నాగబాబు నిర్మాత కె మురారి సంగీతం కె వి మహదేవన్

అనిల్ కుమార్ దర్శకత్వంలో వెంకన్నబాబు చిత్రం "బంగారు చిలక" నవంబర్‌లో

ప్రణాళికా బద్ధంగా చిత్రాలు నిర్మించే యువకుడు ఎస్ వి వెంకన్నబాబు ఆహ్లాదపరుస్తూ, ఆలోచింపజేసే చిత్రాలు రూపొందించే యువకుడు అనిల్‌కుమార్ వీరి సృష్టి మహేశ్వరి మూవీస్ బంగారు చిలక నవరస

సినిమా

భరితంగా తయారై త్వరలో విడుదలవబోతోంది రెండు లక్షల వ్యయంతో అరకులోయలో ఒక బ్రహ్మాండమైన సెట్‌ను వేయించాం అక్కడి అందాలను మేం కొత్తగా పరిచయం చేస్తున్న కెమెరామన్ శరత్ అద్భుతంగా సెల్యులాయిడ్ పైకి ఎక్కించాడు, అన్నారు వెంకన్నబాబు ఈ చిత్రంలో అర్జున్, భానుప్రియ, గుమ్మడి, గిరిబాబు, అల్లు రామలింగయ్య నూతన్‌ప్రసాద్, శుభలేఖ సుధాకర్, రాళ్ళపల్లి, కాకరాల టింకు, అంజలీదేవి, కృష్ణవేణి పాల్గొన్నారు సి వి రమణ కథకు సత్యానంద్ సంభాషణకర్త ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం సంగీత దర్శకుడు నాగేశ్వరరావు, సత్యనారాయణ సంకలనకర్తలు

డి. రామానాయుడు "ప్రతిధ్వని"

డిసెంబర్‌లో చిత్రీకరణ ముగిసే తమ 21 వ చిత్రానికి ప్రతిధ్వని అని నామకరణం చేసినట్లు సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డి రామానాయుడు తెలిపారు ఈయన ఈ చిత్రం ద్వారా బి గోపాల్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు సాంసారిక జీవితానికి వృత్తి ధర్మానికి మధ్య జరిగే సంఘర్షణను ప్రతిబింబించే ఈ చిత్రం నేటి సమాజంలో జరిగే అరాచకాలను ప్రతిధ్వనిస్తుంది అన్నారు నిర్మాత వృత్తి ధర్మానికి కట్టుబడి ఉండే

పోలీసు అధికారిణిగా శారద, ఆమె సరసన శరత్‌బాబు, అర్జున్ సరసన రజని, ఇంకా గుమ్మడి, గొల్లపూడి నూతన్‌ప్రసాద్, అల్లు రామలింగయ్య,

రాజేష్ బాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, వేలు రాళ్ళపల్లి, పి ఎల్ నారాయణ, చలపతిరావు, నిర్మల, అనూరాధ, శ్రీలక్ష్మి పాల్గొంటున్నారు

పరుచూరి సోదరులు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు రాశారు వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త ఎస్ గోపాల్‌రెడ్డి ఛాయ, జూడో రత్నం సాహసాలు రఘు నృత్యాలు, ముత్యాల సుబ్బయ్య సహదర్శకత్వం పొన్నుస్వామి ప్రొడక్షన్, వై నాగేశ్వరరావు సహకార దర్శకత్వం, మార్తాండ్ కూర్పు వగైరా సాంకేతిక వర్గం ☐

'Printed and Published for Nageswara Rao Estates Private Ltd , by S Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada 3, Editor S Radhakrishna
Phones Business 61247, 61248, Editorial 75667



"దాగుడు మూతలు" లో శోభన



"నాగదేవత"లో విజయశాంతి, బేబీప్రియ

సినిమా

బాలకృష్ణ, జగ్గయ్య, మారుతీరావు, రామకృష్ణ, రాజేష్, జీవా, సప్తపది గిరిష్, శుభలేఖ సుధాకర్, శ్రీధర్, పి. హెచ్. కృష్ణమూర్తి, సి. రామమోహనరావు, రజని, సంగీత, రమాప్రభ, ముచ్చర్ల అరుణ ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు.

ఈ చిత్రానికి కెమెరా నందమూరి మోహన కృష్ణ, షెట్టి రాజు, సహదర్శకులు యు. పి. పాణి, ఇ. వి. వి. సత్యనారాయణ, సంభాషణలు, దర్శకత్వం–జంధ్యాల, నృత్యాలు–తార, ఎడిటింగ్ నాగబాబు. నిర్మాత కె. మురారి. సంగీతం కె. వి. మహదేవన్.

అనిల్ కుమార్ దర్శకత్వంలో వెంకన్నబాబు చిత్రం "బంగారు చిలక" నవంబర్‌లో

ప్రణాళికా బద్ధంగా చిత్రాలు నిర్మించే యువకుడు ఎస్. వి. వెంకన్నబాబు. ఆహ్లాదపరుస్తూ, ఆలోచింపజేసే చిత్రాలు రూపొందించే యువకుడు అనిల్‌కుమార్. వీరి సృష్టి మహేశ్వరి మూవీస్ "బంగారు చిలక" నవరస భరితంగా తయారై త్వరలో విడుదలవబోతోంది.

"రెండు లక్షల వ్యయంతో అరకులోయలో ఒక బ్రహ్మాండమైన సెట్‌ను వేయించాం. అక్కడి అందాలను మేం కొత్తగా పరిచయం చేస్తున్న కెమెరామన్ శరత్ అద్భుతంగా సెల్యులాయిడ్ పైకి ఎక్కించాడు," అన్నారు వెంకన్నబాబు. ఈ చిత్రంలో అర్జున్, భానుప్రియ, గుమ్మడి, గిరిబాబు, అల్లు రామలింగయ్య, నూతన్‌ప్రసాద్, శుభలేఖ సుధాకర్, రాళ్ళపల్లి, కాకరాల, టింకు, అంజలీదేవి, కృష్ణవేణి పాల్గొన్నారు. సి. వి. రమణ కథకు సత్యానంద్ సంభాషణకర్త. ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం సంగీత దర్శకుడు. నాగేశ్వరరావు, సత్యనారాయణ సంకలనకర్తలు.

డి. రామానాయుడు "ప్రతిధ్వని"

డిసెంబర్‌లో చిత్రీకరణ ముగిసే తమ 21 వ చిత్రానికి "ప్రతిధ్వని" అని నామకరణం చేసినట్టు సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డి. రామానాయుడు తెలిపారు. ఆయన ఈ చిత్రం ద్వారా బి. గోపాల్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. "సాంసారిక జీవితానికి, వృత్తి ధర్మానికి మధ్య జరిగే సంఘర్షణను ప్రతిబింబించే ఈ చిత్రం నేటి సమాజంలో జరిగే అరాచకాలను ప్రతిధ్వనిస్తుంది," అన్నారు నిర్మాత. వృత్తి ధర్మానికి కట్టుబడి ఉండే పోలీసు అధికారిణిగా శారద, ఆమె సరసన శరత్‌బాబు, అర్జున్ సరసన రజని, ఇంకా గుమ్మడి, గొల్లపూడి, నూతన్‌ప్రసాద్, అల్లు రామలింగయ్య, రాజేష్, బాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, వేలు, రాళ్ళపల్లి, పి. ఎల్. నారాయణ, చలపతిరావు, నిర్మల, అనూరాధ, శ్రీలక్ష్మి పాల్గొంటున్నారు.

పరుచూరి సోదరులు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు రాశారు. వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త. ఎస్. గోపాల్‌రెడ్డి ఛాయ, జూడో రత్నం సాహసాలు, రఘు నృత్యాలు, ముత్యాల సుబ్బయ్య సహదర్శకత్వం, పొన్నుస్వామి ప్రొడక్షన్, వై. నాగేశ్వరరావు సహకార దర్శకత్వం, మార్తాండ్ కూర్పు వగైరా సాంకేతిక వర్గం. □

*Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at
the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor: S. Radhakrishna
Phones :- Business : 61247, 61248, Editorial : 75667

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA
6-12, DECEMBAR, 85

అందంగా ఉండే యిళ్ళ కోసం
నెరోలాక్ ఆయిల్ బౌండ్ డిస్టెంపర్
పెయింట్ టెక్నాలజీ తెలిసిన కంపెనీ నుండి.

వాతావరణం, కాలం ఈ రెండూ కలిగించే నష్టాన్నుండి ఏ యిల్లూ తప్పించుకోలేదు.

అందుకని మీ యింటికి కావలసింది ఒక ఉత్తమమైన పెయింట్ యిచ్చే రక్షణ. నెరోలాక్ ఆయిల్ బౌండ్ డిస్టెంపర్. ఈ రంగుల యొక్క ఆకర్షణీయమైన ఛాయలు మీ యింటి గోడలలో కొత్త అందాలను నింపుతాయి. వీటి యొక్క ఉత్తమ లక్షణాలు మీ గోడలకు చిరకాలపు రక్షణ నిస్తాయి. నెరోలాక్ ఆయిల్ బౌండ్ డిస్టెంపర్, నెరోలాక్ సింథటిక్ ఎనామిల్, నెరోలాక్ ఏక్రలిక్ ఎమల్షన్ యివన్నీ పెయింట్ టెక్నాలజీని తెలుసుకొని అర్థం చేసుకున్న కంపెనీ వారిచే తయారు చేయబడ్డాయి. కాన్‌సాయీ పెయింట్స్, జపాన్‌వారితో, మా సహకారంతో భారత దేశంలోకి, మారుతీ కోసం, ఆధునిక పెయింట్ టెక్నాలజీ వచ్చింది.
గుడ్‌లాస్ నెరోలాక్ పెయింట్స్— ఉత్తమమైన టెక్నాలజీ మీకు ఉత్తమమైన పెయింట్స్ అందిచ్చేందుకు.

అందమైన రక్షణ





నెరోలాక్ పెయింట్స్
ప్రతి రూపం, ప్రతి రంగూ, మరెంతో మేలుగా!



ULKA-GNP-3-85 TEL